# మధుబాబు



# టు ఇన్ వన్

# మధుబాబు

# టు ఇన్ ఒన్

Ph : 2438659

సత్యవాణి పబ్లికేషన్స్

మాచవరం, విజయవాడ - 520 004

# TWO IN ONE

(Direct Novel)

By
**Madhu Baabu**

Published by :
**SATYAVANI PUBLICATIONS**
Machavaram, Vijayawada - 520 004
Phone : 0866 - 2438659

Edition :
**2012**

Price :
**Rs. 70-00**

Cover Design :
**Durgarao**

Printers :
**SRI CHAITANYA OFFSET PRINTERS**
Vijayawada - 2

## మా వద్ద లభించు మధుబాబు నవలలు

1. హెచ్చరిక
2. టు ఇన్ ఒన్
3. నందిని
4. పులి మడుగు
5. వెన్నెల మడుగు
6. క్రైం కార్నర్
7. డెత్ వారెంట్
8. ఆర్తి
9. స్పందన
10. రెడ్ సిల్వర్
11. రుద్రభూమి

# టు ఇన్ ఒన్

పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఉదయపూర్ స్టేషన్ లోని ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారానికి వచ్చి చేరేసరికి రాత్రి పదకొండు గంటలు దాటింది సమయం. అంతవరకూ వున్న కొద్దిపాటి ప్రశాంతత అదృశ్యం అయి ఫ్లాట్‌ఫారం మీద వెంటనే మొదలయింది విపరీతమయిన  సందడి.

పాన్‌పరాగ్ పలుకులని నోట్లో వేసుకుని పటుకు పటుకు మని నములుతూ ఆ ప్లాట్‌ఫారం ఎంట్రన్స్‌లో వున్న ఒక సిమ్మెంట్ బెంచ్‌మీద కూర్చుని వున్నాడు యూసఫ్ ఆలీఖాన్. గమ్యం చేరిన ఉత్సాహంతో గబగబా అడుగులు వేస్తూ ఎంట్రన్స్ వేపు వస్తున్న ప్రయాణీకులను ఓరకంట గమనిస్తూ లేచి ముందుకు కదిలాడు.

అల్లంత దూరాన ప్లాట్‌ఫారానికి ఆధారంగా వున్న కాంక్రీట్ స్థంభాల వెనకనుండి యివతలికి వచ్చారు కరోడాలవంటి యూసఫ్ ఆలీ అనుచరులు. ట్రెయిన్ ఆగుతుండగానే పోర్టర్లకంటే వేగంగా ముందుకు పోయి కంపార్ట్‌మెంట్‌లను సమీపించారు.

తన వృత్తిలో ఆ రోజే కొత్తగా టెన్షన్ ఫీలవుతున్నాడు యూసఫ్ ఆలీ. మనసును ఆసహనానికి గురిచేస్తున్న ఆలోచనలను అదుపులో వుంచుకోటానికి ప్రయత్నిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నాడు.

పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ నుంచి వస్తున్నాడట అల్లర్లూ, అలజడులు సృష్టించే అసాంఘిక శక్తుల ఆట కట్టించటంలో ఆరితేరిన సెక్యూరిటీ ఆఫీసర్ ఒకతను. పకడ్బందీగా రూపొందించబడిన ఎటువంటి పథకాలనయినా ఇట్టే పసిగట్టి పటాపంచలు చేయగల అసాధారణమయిన నేర్పు అతనికి వుందట.

అంతటి సమర్దుడయిన సెక్యూరిటీ ఆఫీసర్.....ఉదయపూర్‌లో అడుగుపెట్టకుండా చేసే బాధ్యత క్రిందటిరోజే అప్పగించబడింది యూసఫ్ ఆలీకి. అందుకుగాను ఎదురుచూడనంత పారితోషికం కూడా అతనికి ఆల్‌రెడీ అందచేయబడింది.

చేయబోతున్న పని ఎంత కష్టమయినదయినా.... ఒప్పుకున్న తరువాత ఒళ్ళు దాచుకోవటం చేతకాదు యూసఫ్ ఆలీకి. మొదలుపెట్టిన పనిని ముగించ కుండా.... అర్థాంతరంగా వదిలివేయటం అలవాటులేదు అతనికి.

ఆ చేత్తో పేమెంట్ అందుకుంటూనే... ఈ చేత్తో చకచకా చేసేశాడు అవసరమయిన అరేంజ్‌మెంట్స్. ఢిల్లీ నుండి దిగుమతి అవుతున్న సెక్యూరిటీ ఆఫీసర్ ఉదయపూర్ చేరకముందే వుసురు తీసేందుకు వేశాడు ఒక పథకాన్ని.

యూసఫ్ ఆలీ ఆజ్ఞాపిస్తే తడుముకోకుండా తన తల నరుక్కోటానికయినా వెనకాడని.... కసాయి హంతకుడు ఖలీల్‌పాషా ఆరోజు ఉదయమే పిలిపించ బడ్డాడు. వేసిన పథకం ప్రకారం.... అదను చూసుకుని సెక్యూరిటీ ఆఫీసర్‌ని వధించటానికి చిత్తార్‌గడ్ జంక్షన్‌కి అర్జంటుగా పంపించబడ్డాడు.

పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్ రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆ జంక్షన్‌లో ఆగుతుంది. అక్కడనుండి మరో మూడుగంటలు నాన్‌స్టాప్‌గా ప్రయాణించి ఉదయపూర్ స్టేషన్‌కి చేరుకుంటుంది.

పోర్టర్‌గానో, ప్లాట్‌ఫారం బెగ్గర్‌గానో.... వేషం వేసుకుని చిత్తార్‌గఢ్ జంక్షన్‌లో ట్రైన్ ఎక్కాలి ఖలీల్ పాషా. ట్రైన్ ఉదయపూర్ చేరేలోగా సెక్యూరిటీ ఆఫీసర్‌ని సింపుల్‌గా హతమార్చి, చేతులు దులుపుకుని రావాలి.

అదే....యూసఫ్ ఆలీ పథకం!

ఒకవేళ ఫెయిల్ అయితే?

అదృష్టం కల్సిరాకనో, ఖలీల్‌పాషా ఓవర్ కాన్ఫిడెన్స్‌తో కూడిన అజాగ్రత్తవల్లనో తన పథకం ఫెయిల్ అవటం అంటూ జరిగితే... ఆ తరువాత అమలుపరచవలసిన మరో పథకాన్ని కూడా అప్పటికే రెడీచేసి వుంచాడు యూసఫ్ ఆలీ. అవసరం అన్పించిన అన్ని జాగ్రత్తలూ స్వయంగా తీసుకున్నాడు.

ఒకరితో ఒకరు సంబంధం లేనట్టు ఒకటవ నంబర్ ప్లాట్‌ఫారాన్ని వదలకుండా వుండేలా నియమించబడ్డారు అతని అనుచరులు కొంతమంది. అదృష్టం కల్సిరాక ఆ సెక్యూరిటీ ఆఫీసర్ వాళ్ళ కళ్ళల్లో కారంకొట్టి ప్రాణాలతో అవతలికి వెళ్ళగలిగితే....అతన్ని హతమార్చేందుకు సిద్ధంగా ఆటో డ్రయివర్స్‌గా అవతారాలు ఎత్తి, స్టేషన్ బయట కాచుకునివున్నారు మరికొంతమంది.

అతను ఎంత మొనగాడయితే మాత్రం...అంతమందిని దాటుకుని ప్రాణాలతో బయటకి ఎలా వెళ్ళగలడు? అందరి కళ్ళల్లో కారంకొట్టి ఎలా మాయం అవుతాడు?

తిరుగులేని తన పథకాలను గురించి తీరుబడిగా మననం చేసుకుంటూ.... రద్దీగా వున్న ప్రయాణీకుల మధ్యగా పోయి ఒక ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌ను సమీపించాడు యూసఫ్ ఆలీ. ఇద్దరు అనుచరులతో పాటు లోపలికెళ్ళి...ఎంట్రన్స్‌కి దగ్గరగా వున్న 'కూపే'లోకి తొంగిచూసి అదిరిపడ్డాడు.

యూసఫ్ ఆలీ అనుమానించినట్టే అయింది. అతని మొదటి పథకం దారుణంగా ఫెయిలయింది.

కసాయి హంతకుడిగా పేరుపొందిన ఖలీల్‌పాషా స్పృహలేని స్థితిలో మూటగట్టిపడేసినట్టు సీటుక్రింద పడుకోబెట్టబడి వున్నాడు. అతనికి ఆ గతి పట్టించిన సెక్యూరిటీ ఆఫీసర్ అప్పటికే కంపార్ట్‌మెంట్‌లోంచి అదృశ్యమయి పోయాడు.

తన పథకం ఫ్లాప్ అయిందన్న విషయాన్ని గ్రహిస్తూనే అవమానంతో రగులుకుపోవటం ప్రారంభించింది యూసఫ్ ఆలీ మనసు. ఆందోళనగా పరుగులుదీయసాగాయి అతని ఆలోచనలు.

మనుషుల ప్రాణాలను మంచినీళ్ళప్రాయంగా తీయగల కసాయి హంతకుడు ఖలీల్‌పాషా. అంతటివాడ్ని మట్టికరిపించి, మన్నుతిన్న పాములా కదలకుండా చేసిన సెక్యూరిటీ ఆఫీసర్ సామాన్యుడు కాడన్నది నిజమేనని నిస్సందేహంగా అర్థమైందతనికి. అటువంటి ప్రమాదకరమయిన వ్యక్తిని ఉదయపూర్‌లో తిరగనిస్తే తన ఉనికికే ముప్పువాటిల్లక తప్పదన్న సంగతి కూడా అరటిపండు వలిచి చేతిలో పెట్టినంత క్లియర్‌గా తెలిసిపోయింది.

వెంటనే మస్తిష్కానికి పదునుపెట్టి ఆలోచించాడు యూసఫ్ ఆలీ. అమితవేగంతో ఆలోచిస్తూ అప్పటికప్పుడే రూపకల్పన చేశాడు మరో కొత్త పథకానికి.

వదలకూడదు అతడ్ని. ఎట్టి పరిస్థితుల్లోనూ అతన్ని స్టేషన్ బయటకి పోనీయకూడదని మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాడు యూసఫ్ ఆలీ. అరిచేత్తో అదేపనిగా నుదురు రుద్దుకుంటూ ఇరవైనాలుగు గంటల క్రిందట తనకు తెలియచేయబడిన ఆ సెక్యూరిటీ ఆఫీసర్‌కి సంబంధించిన వివరాలను గబగబా గుర్తుచేసుకోవటం ప్రారంభించాడు.

ఎర్రగా, ఎత్తుగా వుండే ఆజానుబాహుడట అతను. బెంగాల్ టైగర్‌ని కూడా బెంబేలెత్తించేలా వుంటుందట అతని నడక. మెరుపుతో పోటీ పడుతుందట అతని కదలిక...బ్లాక్ ఫాంటూ, లైట్ బ్లూ కలర్ షర్టు ధరించాడట. ఎరుపు చారలున్న ఎయిర్‌బేగ్ ను వెంట తెచ్చుకుంటున్నాడట.

పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ నుండి బయలుదేరిన తరువాత తన కందిన సమాచారాన్నీ, ఆ సెక్యూరిటీ ఆఫీసర్ వివరాలనూ గుర్తుచేసుకుని హడావుడిగా తన అనుచరులకు వినిపించాడు యూసఫ్ ఆలీ.

"వెళ్ళండి...వెంటనే వెళ్ళి వెదకండి. అతను ఇంకా స్టేషన్‌లోనే వుండి వుంటాడు. ఒక్కటి కూడా వదలకుండా అన్ని ప్లాట్‌ఫారాలు గాలించండి. కంటపడగానే ఖతం చేసిపారేయండి..." అని గొంతు చించుకుని అరుస్తూ ఆదేశించాడు.

అతను ఆదేశించటమే ఆలస్యం అన్నట్టు తమ సహచరుల్ని హుషారు చేస్తూ తలోపక్కా బయలుదేరారు యూసఫ్ ఆలీ అనుచరులు. ఎర్రచారల ఎయిర్‌బేగ్‌తో వున్న పర్సనాలిటీ కోసం పట్టుదలగా వెదకడం ప్రారంభించారు ఫ్లాట్‌ఫారాలమీద.

యూసఫ్ ఆలీ చెప్పినట్టు అప్పటికి ఇంకా స్టేషన్‌లోంచి బయటకి పోలేదు ఎర్రచారల ఎయిర్‌బేగ్‌ను భుజానికి తగిలించుకున్న డైనమిక్ సిటీ సెక్యూరిటీ సర్వీసెస్ పార్టనర్ శ్యామ్‌సుందర్. పట్టుదలగా ఫ్లాట్‌ఫారాలను పట్టుకు తిరుగుతున్న రఫ్ కారెక్టర్స్ కదలికలను శ్రద్ధగా గమనిస్తూ ఓ ఫ్రూట్ స్టాల్ పక్కన నిలబడి వున్నాడు.

పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్ చత్తార్‌గఢ్ జంక్షన్‌ని వదిలిపెట్టిన పది నిమిషాలకే పల్లీల హాకర్ రూపంలో ప్రత్యక్షం అయిన ప్రమాదాన్ని యిట్టే పసిగట్టేశాడు శ్యామ్‌సుందర్. అదను చూసి అదరగొట్టే రెండు ముష్టిఘాతాలతో పల్లీల హాకర్‌ని స్పృహ తప్పించి సీటు క్రిందికి దొర్లించి చేతులు దులుపుకున్నాడు.

అనుకోని విధంగా ఎదురైన ఆ ప్రమాదాన్ని త్రిప్పికొట్టగలిగినా ఆ తరువాత అతని మనసులో చోటుచేసుకున్నాయి అనేకరకాల అనుమానాలు. ఉదయపూర్ స్టేషన్‌లో పొంచివుండే ప్రాబ్లమ్స్‌ని అంచనాకట్టి జాగ్రత్తపడమంటూ అతన్ని ప్రాంప్ట్‌గా హెచ్చరించాయి.

అందుకే ట్రెయిన్ ఉదయపూర్ ప్లాట్‌ఫారానికి చేరగానే కంపార్టు మెంట్ రెండో వైపునుండి దూకేశాడు శ్యామ్‌సుందర్. అటువైపున ట్రాక్‌ను క్రాస్‌చేసి ఫ్రూట్‌స్టాల్ పక్కకిపోయి నిలుచున్నాడు.

ఖాళీ అవుతున్న ప్లాట్‌ఫారం మీద కలియతిరుగుతూ, తమకు కావాల్సిన వ్యక్తిని గురించి టెన్షన్‌గా వెదుకుతున్నారు యూసప్ ఆలీ అనుచరులు. అతను మారువేషంలో వచ్చినా రావచ్చునన్న అనుమానంతో మగవాళ్ళనే కాకుండా, ఆడవాళ్ళను కూడా పరిశీలనగా చూడసాగారు.

వాళ్ళు వెదుకుతున్నది తనకోసమేనని తెలుస్తూనే వుంది శ్యామ్‌సుందర్‌కి. కంటపడితే ఖతం చేయటానికి సిద్ధంగా వున్నారన్న విషయం అర్థం అవుతూనే వుంది.

ఆ సమయంలో వాళ్ళ కంటపడటం అంత మంచిదికాదు. గమ్యం చేరిన సంతోషంతో బైటికి పోతున్న ప్రయాణీకులను భయాందోళనకు గురి చేయటం బాగుండదు. ఎలాగోలా అక్కడ్నించి తప్పుకోవాలి తను. ఏదో విధంగా వాళ్ళ కళ్ళల్లో కారం కొట్టి ఎస్కేప్ అవ్వాలని తనలో తానే అనుకున్నాడు శ్యామ్‌సుందర్.

అనుకోవటం వరకూ బాగానే వుంది. అనుకున్నది ఆచరణలో పెట్టే మార్గం కనిపించటంలేదు.

ఎలా? పట్టువదలని విక్రమార్కుల్లా ఫోజులుపెట్టి తనకోసం వెదుకుతున్న వాళ్ళ కంటపడకుండా తప్పించుకోవటం ఎలా?

ఎలా అనే అతని సమస్యకు సొల్యేషన్ లభించకముందే అయిపోయింది ఆలస్యం.

“అదిగో....ఎర్రచారల ఎయిర్‌బేగ్! అతనే....మనం వెదుకుతున్నది అతన్నే! ఉన్నట్టుండి ఖంగ్‌మంటూ వినిపించింది ఒక అరుపు.

ఉలికిపడుతూ పక్కకి తిరిగి చూశాడు శ్యామ్‌సుందర్.

వందగజాల దూరంనుండి పరుగుపరుగున అటే వస్తూ కనిపించారు ఇద్దరు వ్యక్తులు. మిగతావాళ్ళకు కూడా తన ఉనికిని తెలియచేస్తూ గొంతులు చించుకుని అరుస్తున్నారు.

ఆలస్యం చేయకుండా ఫ్రూట్‌స్టాల్ వెనక్కి పోయాడు శ్యామ్‌సుందర్. ట్రాక్‌మీదుగా ఆ ప్లాట్‌ఫారాన్ని క్రాస్‌చేసి, మరో ప్లాట్‌ఫారం మీదుగా ముందుకు పరుగుదీయటం ప్రారంభించాడు.

“చంపండి.....చంపండి అతన్ని...! మార్‌డాలో బద్మాష్‌కో....! గోలీ ఛలావ్” అని గొంతులు చించుకుని అరుస్తూ ఒకరినొకరు హెచ్చరించు కుంటూ అతని వెంటపడ్డారు యూసఫ్ ఆలీ అనుచరులు.

వారి అరుపుల్ని వింటూనే అదిరిపడ్డారు ప్రయాణీకులు. జరగకూడని దారుణం ఏదో అక్కడ జరగబోతున్నదని తలపోసి భయభ్రాంతులవుతూ సురక్షితమయిన ప్రదేశాలకు పరుగులుదీయటం ప్రారంభించారు.

ఏదయితే జరగకూడదని శ్యామ్‌సుందర్ అనుకున్నాడో అదే జరిగింది. చూస్తుండగానే స్టేషన్ అంతా గందరగోళంగా మారిపోయింది.

మిగతా ప్లాట్‌ఫారాలమీద తిరుగుతున్న యూసఫ్ ఆలీ మిగతా అనుచరులకి కూడా క్షణాలమీద తెలిసిపోయింది తమ సహచరులు ఎర్రచారల ఎయిర్‌బేగ్ పర్సనాలిటిని పసిగట్టేశారన్న సంగతి. ఖలీల్‌పాషాలాంటి కసాయి హంతకుడ్ని ఖంగు తినిపించిన ఆ పెద్దమనిషిని ఓకంట చూడాలని వురుకుల పరుగులమీద బయలుదేరారు అరుపులు వినిపిస్తున్న వైపు.

అదేసమయంలో....ఆందోళన నిండిన మనసులతో అటూ ఇటూ పరుగులుదీస్తున్న జనం మధ్యనుంచి అవతలికి పోతున్న శ్యామ్‌సుందర్ వైపు రివాల్వర్‌లు ప్రయోగించటం ప్రారంభించారు యూసఫ్ ఆలీ అనుచరులు.

ధన్...ధన్...ధన్.....మంటూ గర్జించటం ప్రారంభించాయి రివాల్వర్‌లు. శ్యామ్‌సుందర్ శరీరానికి తల వెంట్రుకవాసిలో అటూ ఇటూ దూసుకుపోయాయి బుల్లెట్‌లు. కాంక్రీట్ గోడల్ని తాకి ఖణేల్...ఖణేల్‌మంటూ సృష్టించటం మొదలుపెట్టాయి వికృతమయిన శబ్దాలను.

అడ్డ వస్తున్న ప్రయాణీకులను తప్పించుకుంటూ ముందుకు పరుగుదీస్తున్నాడు శ్యామ్‌సుందర్. జరగకూడనిదేదయినా జరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నాడు.

తనకోసం కాదు అతని ఆందోళన. బుల్లెట్‌ల బారిన పడతానేమోనన్న భయం కూడా అతనికి లేదు.

గమ్యం చేరినవాళ్ళూ......ప్రయాణానికి సిద్ధపడి వచ్చి, రైళ్ళ రాకకోసం నిరీక్షిస్తున్నవాళ్ళూ వందలసంఖ్యలో వున్నారు అక్కడ. తనవైపు దూసుకొస్తున్న బుల్లెట్‌లు పొరపాటున ఎవరినయినా బలితీసుకుంటే? అన్నెం పున్నెం ఎరుగని అమాయకులెవరయినా ప్రాణాలు పోగొట్టుకుంటే?

అటువంటి ఆలోచన రాగానే పరమ చేదుగా వుండే పచ్చి వేపకాయలు నములుతున్నట్టు తయారయింది నోరు. మైళ్ళ దూరం నుండి మండుటెండలో నడిచివచ్చినట్టు చిమచిమలాడిపోయింది అతని శరీరం.

ఎవరికీ ఎటువంటి హానీ జరగకుండా వుండాలంటే తను పట్టుబడటం ఒక్కటే మార్గం అనుకున్నా...తన ప్రాణాలు తీయాలన్న ఆలోచన తప్ప, బంధించే ఉద్దేశ్యం ఎంతమాత్రం కనిపించటంలేదు వెంట తరుముతున్నవారిలో.

అటువంటి పరిస్థితులలో పట్టుబడాలనుకోవటం ఎంత పొరపాటో గ్రహించి పరుగుదీయటానికే ప్రాధాన్యతనిచ్చాడు శ్యామ్‌సుందర్. "తప్పుకోండి.... దయచేసి అందరూ పక్కకి తప్పుకోండి!" అని పెద్ద గొంతుతో ప్రయాణీకులను హెచ్చరిస్తూ ఎంట్రన్స్‌కేసి దూసుకుపోయాడు.

ఎంట్రన్స్‌ను సమీపిస్తుండగా అతనికి ఎదురయ్యారు ఇద్దరు హీరోలు. ఇంతింతలావున వున్న ఇనుపరాడ్‌లను ఎత్తిపట్టుకుని– "ఆగు....అక్కడే ఆగు!" అని ఖంగ్‌మంటున్న కంఠాలతో కమాండ్‌చేస్తూ మరింత ముందుకు వచ్చేశారు.

ఆగలేదు శ్యామ్‌సుందర్....మరోవైపు డైవర్ట్ అయ్యే అవకాశం లేదని తెలిసినవాడు కావటంవల్ల ముందుకు పరుగుతీయటానికే ప్రాధాన్యతను యిస్తూ, భుజానికి వ్రేలాడుతున్న ఎర్రచారల ఎయిర్‌బేగ్‌ను చేతులలోకి తీసుకున్నాడు. ఎదురుపడ్డ హీరోలను సమీపిస్తూనే ఎయిర్‌బేగ్‌ను గిరగిరా త్రిప్పి బలంగా బాదాడు వారి ముఖాలమీద.

దబ్...దబ్...మన్న శబ్దాలను సృష్టిస్తూ బరువుగా, బలంగా వారి ముఖాలను తాకింది ఎయిర్‌బేగ్. ఒక్కసారిగా వారి ముక్కూ ముఖాలు ఏకం అయిపోయేటట్టు చేసింది.

చెవులు చిల్లులు పడిపోయేటట్లు అరిచి వెనక్కి తూలిపోయారు ఆ ఇద్దరు హీరోలు. కళ్ళు బైర్లు క్రమ్ముతున్నట్టు అనిపిస్తుండగా....ఇనుపరాడ్‌లను వదిలేసి, ముఖాలను చేతులతో కప్పుకుంటూ చెవి కోసిన మేకల్లా కేకలు వేయటం ప్రారంభించారు.

అటుఇటూ పరుగులుదీస్తున్న ప్రయాణీకులు అడ్డుపడుతూ వుండటంవల్ల తాత్కాలికంగా ఆగిపోయింది వెనకనుండి ప్రయోగిస్తున్న రివాల్వర్‌ల గర్జన...రద్దీని దాటి ముందుకు రాగానే వెంటనే మొదలయింది.

'ధన్.....ధన్...ధనా....ధనా...' మంటూ వికృతంగా గర్జించాయి రివాల్వర్‌లు.

తుమ్మెదలమాదిరి ఝంకారం చేస్తూ దూసుకువచ్చాయి బుల్లెట్‌లు. ముఖాలు అదిరిపోయేటట్టు కొట్టి ఆ ఇద్దరు హీరోలను రఫ్‌గా అవతలికినెట్టి ముందుకు పోబోతున్న శ్యామ్‌సుందర్ ఎడంకాలి పిక్కలోకి చొచ్చుకుపోయింది

ఒక బుల్లెట్. అతనికి మరింత ప్రమాదాన్ని తలపెట్టకుండా చెవి పక్కనుండి అవతలికిపోయింది రెండోది.

ఎర్రగా కాల్చిన ఇనుపచువ్వతో పొడిచినట్టు భగ్గుమంది శ్యామ్‌సుందర్ ఎడమ కాలు. ఎర్రటి రక్తం సుడులు తిరుగుతూ తన్నుకురావటం ప్రారంభించింది గాయం నుండి. నరాలను బిగలాగుతూ మొదలయింది విపరీతమయిన బాధ.

ఆ అదటుకు ముందుకు తూలి రెండు పల్టీలుకొట్టి క్రింద పడ్డాడు శ్యామ్‌సుందర్. బాధను పంటిబిగువున భరిస్తూ లేచి సాధ్యమయినంత వేగంగా అడుగులు వేయటానికి ప్రయత్నిస్తూ, స్టేషన్ ముందున్న ఆటో పార్కింగ్ దగ్గరకి పోయాడు.

వెంటనే కదిలి రెండు అడుగులు ముందుకు వేశాడు. ఆటో డ్రయివర్ "రండి సాబ్! రండి! ఆటో ఎక్కండి! నిముషాలమీద చేరుస్తాను మీరు చేరవలసిన చోటుకి" అంటూ శ్యామ్‌సుందర్ మరింత దగ్గరకిరాగానే అమితవేగంతో బయటికి తీశాడు మూరెడు పొడవున్న కైజారును.

ఆందోళనపడిపోయాడు శ్యామ్‌సుందర్. ఆటోడ్రయివర్ కైజారును బయటికి లాగటం గమనిస్తూనే వేగంగా కదిలి పక్కకిదూకి కైజారు పోటునుండి ఎస్కేప్ అవ్వాలని ప్రయత్నించాడు.

నెరవేరలేదు అతడి ప్రయత్నం!

గాయపడిన కారణంగా కదలటంలో రెప్పపాటు కాలంలో జరిగిపోయింది ఆలస్యం. అందుకు తగిన మూల్యం చెల్లించటం తప్పనిసరి అయింది.

ఆటోడ్రయివర్ చేతిలోని కైజారు సూటిగా దిగింది శ్యామ్‌సుందర్ భుజంలో. ఎర్రటి రక్తాన్ని వేగంగా వెలుపలికి వచ్చేట్టు చేసింది.

చివ్వున ఎగజిమ్ముకు వస్తున్న రక్తాన్నిగానీ, నరాలను మెలిపెడుతున్న బాధనుగాని పట్టించుకోలేదు శ్యామ్‌సుందర్. బిగ్గరగా అరుస్తూ లాగిపెట్టి కొట్టాడు ఆటో డ్రయివర్ ముఖం మీద.

కీచుగా అరుస్తూ వెనక్కి తూలిపోయాడు ఆ డ్రయివర్. వెనుకవున్న మరో ఆటోను గుద్దుకుని క్రిందపడి, స్ప్రింగ్‌లా వెంటనే లేచి నిల్చున్నాడు.

భుజంలో దిగబడిన కైజారును బలవంతంగా బయటికి లాగి, చేత్తో బిగించి పట్టుకున్నాడు శ్యామ్‌సుందర్. డ్రయివర్ పైకి లేచి నిలబడుతుండగానే బలంగా పొడిచి గాయపరిచాడు అతన్ని తీవ్రంగా.

పార్కింగ్ ప్లేస్ అదిరిపోయేలా అరిచాడు ఆ ఆటో డ్రయివర్.

ఎర్రటి నెత్తురు గాయాల నుండి ఎగజిమ్ముకు వస్తుండగా నిలుచున్న చోటునే విరుచుకుపడి... విల విల తన్నుకోవటం ప్రారంభించాడు.

"బాప్‌రే బాప్...! చంపేశాడు....ఆ బద్మాష్ మనవాడిని చంపేశాడు!" అని గొంతులు చించుకుని అరుస్తూ ముందుకు దూకారు ఆటోడ్రయివర్‌ల వేషాలలో వున్న మరో ముగ్గురు యూసఫ్ ఆలీ అనుచరులు.

అరవటంతో సరిపెట్టుకోకుండా, రకరకాల ఆయుధాలు పుచ్చుకుని వేగంగా ముందుకు రావటం ప్రారంభించారు.

ప్లాట్‌ఫారాల మీద నుండి బయటికి వచ్చినవాళ్ళు కూడా వాళ్ళకి తోడయ్యారు. అంత దూరం నుండే రివాల్వర్స్‌కు పని కల్పిస్తూ, శ్యామ్‌సుందర్‌ని అంతం చేయటానికి ప్రయత్నించారు.

"ధన్....ధన్...మంటూ గుళ్ళ వర్షాన్ని కురిపించటం ప్రారంభించాయి రివాల్వర్‌లు.

అప్పటికే అమితంగా ఆందోళన పడుతున్న జనాన్ని మరింత బెంబేలెత్తించి అటూ ఇటూ పరుగులు తీయించారు.

దూసుకువస్తున్న బుల్లెట్స్ బారి నుండి తప్పించుకుంటూ లాంగ్‌డైవ్ కొట్టి, పదడుగుల దూరంలో పడ్డాడు శ్యామ్‌సుందర్. చాపచుట్టలా దొర్లుకుంటూ పోయి స్టేషన్ ఆవరణలో వున్న ఒక టాక్సీని కవర్ చేసుకున్నాడు.

శ్యామ్‌సుందర్ ఒంటిమీద ఏర్పడిన గాయాల నుండి యింకా స్రవిస్తూనే వుంది ఎర్రటి రక్తం. భరించలేని బాధను అతని శరీరం వెలువరిస్తూనే వుంది.

ఆ బాధను గురించి పట్టించుకునే వ్యవధి లేదు శ్యామ్‌సుందర్‌కి. పబ్లిక్‌లో ఆయుధం ప్రయోగించకూడదన్న ఆలోచనను కూడా పక్కన పెట్టి వెంటనే బయటికి తీశాడు తన రివాల్వర్‌ని.

"అడుగో....అక్కడ ....ఆ టాక్సీ పక్కన వున్నాడు అతను!"

"పదండి....! అటు కదలండి!"

యూసఫ్ ఆలీ అనుచరులు ఒకరినొకరు హుషారు చేసుకుంటూ అరుస్తున్న అరుపులను వింటూ టాక్సీ చాటునుండి కొద్దిగా ముందుకు జరిగాడు శ్యామ్ సుందర్. ఛాతీలు విరుచుకుంటూ అటే వస్తున్న వారికేసి గురిపెట్టి ప్రయోగించాడు రివాల్వర్‌ని.

ధన్...ధన్ మంటూ నిప్పులను కక్కింది అతని రివాల్వర్.

వెచ్చటి పొగలను వెలువరిస్తూపోయి బోరవిరుచుకుంటూ ముందుకు వస్తున్న వారిలో యిద్దరిని గాయపరిచాయి బుల్లెట్‌లు.

కెవ్వుమన్నారు ఆ యిద్దరూ....గాయపడి రక్తం వెలువరిస్తున్న చోట చేతులతో అదుముకుంటూ నేలమీదకి జారిపోయారు.

కంగారుపడ్డారు మిగతావాళ్ళు. ముందుకు వచ్చే ఆలోచనను వెంటనే విరమించుకుని సమీపంలో వున్న టాక్సీలచాటుకీ, ఆటోలచాటుకీ చేరుకుని రివాల్వర్స్ ప్రయోగించటం ప్రారంభించారు.

ధన్....ధన్....ధనాధన్ మంటున్న రివాల్వర్ గర్జనలతో దద్దరిల్లి పోవటం ప్రారంభించింది స్టేషన్ ముందున్న ఆవరణ. శ్యామ్‌సుందర్ దాక్కొని వున్న టాక్సీమీద వర్షపు చినుకుల్లా వచ్చి పడసాగాయి బుల్లెట్‌లు.

టాక్సీచాటున ఒదిగి కూర్చున్నాడు శ్యామ్‌సుందర్. ఆ సిచ్యుయేషన్‌నుండి బయటపడే వుపాయాన్ని గురించి ఆలోచిస్తూ, అవకాశం చిక్కినప్పుడల్లా రివాల్వర్ ప్రయోగించి ప్రత్యర్థులను గాయపరుస్తూనే వున్నాడు.

ఆ పరిస్థితులలో కూడా అతని మస్తిష్కాన్ని ఆక్రమించుకొని పరుగులుదీస్తూనే వున్నాయి ఆలోచనలు.....సమాధానాలు లభించని అనేక ప్రశ్నలను అతని ముందుంచుతున్నాయి.

దుండగులు తనమీద దాడిచేయటం మొదలుపెట్టి పావుగంట దాటింది. దాడి యింకా కొనసాగుతూనే వుంది.

అయినా ఇంతవరకు పోలీసులు రంగంలోకి ఎందుకు దిగలేదూ? రైల్వే సెక్యూరిటీ పోలీసులు ఏమయినట్లు?

ఉదయపూర్‌లో విజృంభించి అరాచకాలను సృష్టిస్తున్నాయట అసాంఘిక శక్తులు. వారికి అక్కడ పోలీసుల అండదండలు కూడా లభిస్తున్నాయట. ఎక్కడ

ఎటువంటి నేరాలు జరిగినా....దారినపోయే సామాన్యులను తప్ప అసలు నేరస్తులను అరెస్టు చేయటంలో పోలీసు డిపార్టుమెంట్ విఫలం అవుతున్నదట.

ఇంత గొడవ జరుగుతున్నా పోలీసులు కల్పించుకోకపోవటానికి కారణం అదేనేమో?

తను ఉదయపూర్ బయలుదేరటానికి కొద్ది నిముషాల ముందు తెలిసిన విషయాలు గుర్తువచ్చేసరికి...మస్తిష్కంలో తల ఎత్తుతున్న ప్రశ్నలను గురించి ఆలోచించటం మానేశాడు శ్యామ్‌సుందర్. వెనుకనుండి ఏదో శబ్దం వినిపించగానే ఉలికిపడుతూ వేగంగా పక్కకి దూకాడు.

అలా దూకటంవల్లనే మరింత తీవ్రంగా గాయపడే ప్రమాదంనుండి అతను తప్పించుకోగలిగాడు.

అతనికి వంద అడుగుల దూరంలో వున్న టాక్సీ వెనుకనుండి విసరబడింది ఒక కైజార్. గాలిలో వికృతమయిన శబ్దాన్ని పుట్టిస్తూ దూసుకువచ్చి... శ్యామ్‌సుందర్ పక్కకి తప్పుకోవటంతో టాక్సీడోర్‌ను తాకి ఖంగ్‌మని శబ్దంచేస్తూ క్రిందపడిపోయింది.

పక్కకు తప్పుకుంటూనే మోకాళ్ళమీద స్టడీ అవుతూ అటుచూశాడు శ్యామ్‌సుందర్.

కైజార్ విసిరిన వ్యక్తి యింకా అక్కడే వున్నాడు. తన ప్రయత్నం వృధా అవటం, శ్యామ్‌సుందర్ తనవైపు చూడటం గమనించి కంగారుపడుతూ తప్పుకోబోయాడు టాక్సీ వెనక్కి.

అతనికి ఆ అవకాశం లభించలేదు.

క్రిందపడిన కైజారును అప్పటికే చేతిలోకి తీసుకున్నాడు శ్యామ్‌సుందర్.... బలంగా విసిరాడు ఆ వ్యక్తికేసి.

అతని గురి తప్పలేదు.

గాలిని చీల్చుకుంటూ దూసుకుపోయి ఆ వ్యక్తి తొడలో దిగబడింది కైజారు. బాధగా అరుస్తూ ఆ టాక్సీచాటున పడిపోయాడతను.

అదే సమయంలో పెద్ద పెద్ద అంగలువేస్తూ స్టేషన్‌లోంచి బయటికి వచ్చాడు యూసఫ్ ఆలీ. తన అనుచరులు గాయపడిన సంగతి తెలుసుకుని అగ్గిమీద గుగ్గిలం అయిపోయాడు.

"రివాల్వర్‌తో పని జరక్కపోతే బాంబులు విసరండి. ఎక్కడున్నా ఆ బద్మాష్‌ని ముక్కలు ముక్కలు చేసేయండి" అంటూ హాట్‌హాట్‌గా ఆర్డర్ జారీ చేశాడు.

అప్పటికే చాలావరకూ క్లియర్ అయిపోయింది స్టేషన్ ముందున్న ప్రదేశం బాంబింగ్ జరగబోతున్నట్లు తెలుస్తూనే....మరింత దూరంగా పారిపోయారు జనం.

యూసఫ్ ఆలీ గొంతు చించుకుంటూ వేసిన ఆర్డర్స్‌ని అందరితో పాటు శ్యామ్‌సుందర్ కూడా విన్నాడు. విన్న తరువాత యింకా అక్కడే వుండటం అంత తెలివితక్కువతనం మరొకటిలేదని తెలుసుకుంటూనే డోర్ తెరుచుకుని టాక్సీ ఎక్కేశాడు.

ఎక్స్‌పెక్ట్ చేయని విధంగా అతను టాక్సీ ఎక్కటం చూడనే చూశారు యూసఫ్ ఆలీ అనుచరులు. అతని ఉద్దేశ్యం ఏమిటో గ్రహిస్తూనే 'విసరండి! బాంబులు విసరండి! పారిపోకముందే అతని ప్రాణాలుతీయండి. కారుతోపాటే కాల్చి బూడిద చేసేయండి!' అని ఒకరినొకరు హెచ్చరించుకుంటూ ముందుకు దూకి నాటుబాంబులను టాక్సీమీదకు విసరటం ప్రారంభించారు.

అప్పటికే టాక్సీని స్టార్టు చేశాడు శ్యామ్‌సుందర్. గేర్‌వేసి ముందుకు వురికిస్తుండగానే పిచ్చుకలా గాలిలోకి ఎగురుతూ, వచ్చి టాక్సీ పక్కన పడింది ఒక నాటుబాంబు.

పరిసరాలు ప్రతిధ్వనించేట్టు పెద్ద శబ్దంతో ప్రేలిపోయిందా నాటు బాంబు. ఎర్రటి కాంతులను విరజిమ్ముతూ సమీపంలో వున్న వాహనాలను తలక్రిందులు చేసింది.

ఆ అదటుకు మెలికలు తిరిగిపోతున్న టాక్సీని అతి ప్రయత్నం మీద కంట్రోల్ చేసి ముందుకు పరుగులు దీయించటం ప్రారంభించాడు శ్యామ్‌సుందర్.

టాక్సీ వెనకనే నేలను తాకి వికృతమైన శబ్దాలు వెలువరిస్తూ, పేలిపోవటం ప్రారంభించాయి నాటుబాంబులు, ప్రేలినచోట పెద్ద పెద్ద గోతులను ప్రత్యక్షం గావించసాగాయి.

తట్టలతో ఎత్తి ఎగరేసినట్లు చెల్లాచెదురుగా విరజిమ్మింది మట్టి. స్టేషన్ ముందున్న ప్రదేశాన్ని ఆక్రమించుకున్నాయి దట్టమైన పొగలు.

అసహనం నిండిన మనసుతో ఆ దృశ్యాన్ని చూస్తూనే ఉన్నాడు యూసఫ్ ఆలీ. అంతమంది తన అనుచరులూ, వారి దగ్గరున్న రకరకాల ఆయుధాలూ... ఎందుకూ కొరగాకుండా పోయినందుకు పళ్ళు పటపట కొరుకుతూ ఆవేశంతో వూగిపోయాడు.

“అరేయ్ బద్మాష్‌ల్లారా! పనికిమాలిన చచ్చుదద్దమ్మల్లారా! వెళ్ళండిరా! అతన్ని వెంటాడండి....ఎలాగయినా హతమార్చి రండి! అతను ప్రాణాలతో వుంటే మన పరువు మంటగలిసిపోతుంది...ఉదయపూర్‌లో వున్న మన పరపతి మంటగలిసిపోతుంది” అని పిచ్చి పట్టినట్లు అరవటం ప్రారంభించాడు.

అతను అరవటం పూర్తికాకముందే స్టేషన్ ముందున్న నాలుగు కార్లలో ఎక్కేశారు అతని అనుచరులు. శ్యామ్‌సుందర్ టాక్సీని వెంటాడుతూ పరుగులు దీయించటం ప్రారంభించారు తమ కార్లను.

# 2

**తన** అనుచరులందరూ ఆ ప్రదేశంనుండి నిష్క్రమించేవరకూ అక్కడ నిలబడ్డాడు యూసిఫ్ ఆలీ.

ఆ తరువాత అసహనంగా తల విదిలిస్తూ బయలుదేరాడు అక్కడికి కొంచెం దూరంలో వున్న తన కారువైపు.

అదే సమయంలో సైరన్ మ్రోతలను వెలువరిస్తూ వేగంగా దూసుకొచ్చి ఆ ప్రదేశంలో ఆగింది ఒక పోలీస్ జీప్. అదే వేగంతో దానిని అనుసరిస్తూ వచ్చాయి రెండు వేన్‌లు.

జీప్ వెనుక ఆగిన వేన్‌లోంచి గబగబా క్రిందికి దూకటం ప్రారంభించారు సాయుధులయిన కానిస్టేబుల్స్. ఓ ఇన్స్‌పెక్టర్ లీడ్ చేస్తుండగా.... కొంతమంది అక్కడే నిలబడి మిగతావాళ్ళు స్టేషన్‌లోకి పోయారు.

కానిస్టేబిల్స్‌కంటే ముందుగానే జీపులోంచి క్రిందికి దిగాడు డి.ఎస్పీ బిల్వారీలాల్. తన కారువైపు కదులుతూ షడన్‌గా ఆగి వెనుతిరిగి చూసిన యూసఫ్ ఆలీని గమనించి ఇబ్బందిగా ముఖంపెట్టి విష్‌చేశాడు.

గంభీరంగా తల పంకించాడు యూసఫ్ ఆలీ. పెదవులు కదపకుండా కళ్ళతోనే ఏవో మంతనాలు జరిపాడు.

"ఇంత జరిగిన తరువాత కూడా మీరు ఇంకా ఇక్కడే వుంటారని అనుకోలేదు. పబ్లిక్ పలురకాలుగా అనుకోకముందే మీరు బయలుదేరితే బాగుంటుంది" అంటూ మెల్లగా అభ్యర్థించాడు.

"అచ్చాసాబ్! మీరుచెప్పినా, చెప్పకపోయినా ఇక్కడే వుండాలన్న ఆలోచన నాకులేదు. నేను వెళుతున్నాను. ఇక్కడ మీ పని పూర్తికాగానే వచ్చి నన్ను కలుసుకోండి" అంటూ అతని సమాధానం కోసం ఎదురుచూడకుండా చివ్వున వెనుదిరిగి కారుకేసి వెళ్ళిపోయాడు.

అతని కారు స్టేషన్ పరిసరాలనుండి దూరం అయ్యేదాకా అక్కడే నిలబడ్డాడు డి.ఎస్పీ. బిల్వారీలాల్. ఆ తరువాత గాఢంగా నిట్టూరుస్తూ స్టేషన్‌లోకి వెళ్ళాడు ఫార్మాలిటీగా ఎంక్వయిరీ ప్రారంభించటానికి.

అప్పటికే ఆ ప్రదేశానికి అయిదు కిలోమీటర్ల దూరంలో వున్న వీధులలో తన కారును రౌండ్లు కొట్టిస్తున్నాడు శ్యామ్‌సుందర్. వదలకుండా వెంటాడుతూ వస్తున్న కార్లలోని యూసఫ్ అనుచరులకు సైడ్ ఇచ్చేందుకు అనువయిన మార్గాన్ని గురించి శరవేగంతో ఆలోచిస్తున్నాడు.

అతని కారును వెంటాడుతున్న యూసఫ్ ఆలీ అనుచరులు అవకాశం చిక్కినప్పుడల్లా ముందుకుపోతున్న శ్యామ్‌సుందర్‌కేసి గురిపెట్టి రివాల్వర్‌లు ప్రయోగిస్తూనే వున్నారు. మధ్య మధ్య బాంబులు కూడా విసురుతున్నారు.

ధన్...దన్...ధన్...మంటూ గర్జిస్తున్న రివాల్వర్‌ల గర్జనల తోనూ, పరిసరాలను అదరగొడుతూ ప్రేలిపోతున్న బాంబు ప్రేలుళ్ళతోను మారుమ్రోగిపోతున్నాయి ఉదయపూర్ వీధులు.

తమ తమ ఇళ్ళల్లో ఆదమరచి నిద్రపోతున్న పౌరులు అదిరిపడి నిద్రలేచి....భయంతో బిగుసుకుపోయేట్టు చేస్తున్నాయి.

తప్పించుకోవాలన్న శ్యామ్‌సుందర్ ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి అతని ఒంటిమీద గాయాలు. విపరీతంగా సలుపుతూ అతని శక్తిని కొంచెం కొంచెంగా హరించివేస్తున్నాయి. క్రమ క్రమంగా కళ్ళు బైర్లు క్రమ్ముతున్నాయి. స్టీరింగ్ మీద చేతులు పట్టు తప్పుతున్నాయి.

పట్టుబడితే ప్రాణాలు దక్కవన్న ఒకే ఒక ఆలోచన పంటిబిగువున బాధను అదుపుచేసుకునేట్టు చేస్తోంది. తెలివి తప్పకుండా వుండేందుకు ఓపికను ప్రసాదిస్తున్నది.

వెంటపడి తరుముతున్న వారిని ముప్పతిప్పలు పెడుతూ తన కారును మరో పది నిముషాలపాటు వీధులవెంట, ఇరుకు సందులగుండా పరుగులు దీయించాడు శ్యామ్‌సుందర్. ఇక తను పట్టుబడక తప్పదేమో అన్న సందేహం తలెత్తుతున్న సమయంలో గాలిలో గిరగిరా తిరుగుతూ వచ్చి అతని కారుమీద పడ్డాయి యూసఫ్ ఆలీ అనుచరులు విసిరిన నాటుబాంబులు. భయంకరమైన శబ్దాలను వెలువరిస్తూ ఒకదాని తరువాత ఒకటి ప్రేలిపోయాయి.

ఆ ప్రదేశాన్ని కంపింప చేసిన బాంబుల అదటుకు అంతెత్తున గాలిలోకి ఎగిరింది శ్యామ్‌సుందర్ డ్రయివ్ చేస్తున్న కారు. నేలను తాకుతూనే మెలికలు తిరుగుతూ పోయి ఒక గోడను గుద్దుకుని తలక్రిందులయింది.

చెప్పలేనంతగా తుక్కుతుక్కయిపోయింది కారు. ఆయిల్ టాంకర్ బ్రద్దలవటంతో భగ్గున లేచాయి ఎర్రటి మంటలు. చటపట శబ్దాలతో కారును ఆక్రమించుకుని దగ్ధం చేయటం ప్రారంభించాయి.

మంటల మధ్య చిక్కి కాలిపోతున్న టాక్సీని సమీపించి ఆగాయి యూసఫ్ ఆలీ అనుచరుల కార్లు.

కార్లలోంచి క్రిందికి దిగుతూనే చిరునవ్వులు ప్రత్యక్షం అయినాయి వారి పెదవులమీద. కారు కాలిపోవటం కళ్ళారా చూస్తూనే... సెక్యూరిటీ ఆఫీసర్ ఖతం అయిపోయాడని కన్ఫర్మ్ చేసుకుంటూ ఒకరితో ఒకరు కరచాలనలు చేసుకున్నారు.

"ఖతం అయిపోయాడు ఆ సెక్యూరిటీ అధికారి! మనల్ని ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళు త్రాగించిన బద్మాష్ కాలి బూడిదయి పోతున్నాడు" అని గొంతులు చించుకుని ఉత్సాహంగా అరవటం ప్రారంభించారు.

అదే సమయంలో ఆ ప్రదేశాన్ని సమీపించి ఆగిన కారులోనుంచి క్రిందికి దిగాడు యూసఫ్ ఆలీ. సిగరెట్ వెలిగించుకుని దమ్ము లాగుతూ తీరుబడిగా వచ్చాడు తన అనుచరుల దగ్గిరికి.

మంటల మధ్య చిక్కుబడి తగలబడిపోతున్న కారువేపు చూపిస్తూ జరిగిందాన్ని గురించి అతనికి క్లుప్తంగా వివరించాడు ఒక అనుచరుడు. కారుతోపాటే శత్రువు కాలి బూడిదయిపోతున్నాడని ఇన్ఫర్మేషన్ ఇస్తూ ఖుషీగా నవ్వాడు.

వింటూనే మండిపడ్డాడు యూసఫ్ ఆలీ. "యూ బ్లడీఫూల్! అతను మంటల్లో చిక్కుకోవటం నువ్వు కళ్ళారా చూశావా? కాలిపోతూ అతను వేసిన కేకలను మీలో ఎవరయినా విన్నారా....?" అని సూటిగా ప్రశ్నించాడు.

తెల్లబోయారు ఆ ప్రశ్న విని అక్కడున్న వారందరూ. అతను నిజంగా కారుతోపాటే కాలిపోతుంటే ఖచ్చితంగా అరిచితీరాలని గ్రహిస్తూనే తప్పుచేసిన వాళ్ళలా తలలు దించుకున్నారు.

వాళ్ళ మౌనాన్ని గమనించి మరింతగా మండిపడ్డాడు యూసఫ్ ఆలీ,

"సిగ్గుపడటానికో...చింతించటానికో ఇది సమయం కాదు. కారులోంచి బయటపడినవాడు కాలినడకన ఎంతో దూరం పోయే అవకాశం లేదు... వెళ్ళండి... వెళ్ళి వెదకండి. అతను...కంటపడిన తర్వాత కామ్‌గా ఖతంచేసి.... ఆ చావు కబురును చల్లగా నా చెవిన వేయండి. అంతవరకూ మీ ముఖాలు నాకు చూపించకండి" అంటూ విరుచుకుపడ్డాడు.

ఆ మరుక్షణంలోనే నేల అదిరిపోయేలా బూట్లు శబ్దం చేసుకుంటూ సమీపంలో వున్న చీకటి సందుల్లోంచి ఆ వీధికి ఇరువైపులావున్న వీధులలోకి పరుగుదీసారు యూసఫ్ ఆలీ అనుచరులు. శ్యామ్‌సుందర్ కోసం జల్లెడవేసి గాలించినట్టు వెదకటం ప్రారంభించారు వీధులన్నీ.

* * * * *

మండుటెండలో.... దాహంతో తపించిపోతూ ఇసుక ఎడారిలో తను పడరానిపాట్లు పడుతున్నట్టు కలగన్నాడు శ్యామ్‌సుందర్. వల్చర్స్ గుంపు ఒకటి హఠాత్తుగా తనమీద దాడిచేయబోతున్నట్టు ఆందోళన చెందుతూ కంగారుగా కళ్ళుతెరిచి, చివ్వున లేచి కూర్చున్నాడు.

అలా హడావుడిగా కదలటంవల్ల కందిరీగలు కుట్టినట్లు చురుక్కు మన్నాయి గాయపడిన అతని శరీర భాగాలు.... తెరిచిన అతని కళ్ళను బైర్లు క్రమ్మేటట్టు చేశాయి.

పంటిబిగువున బాధను భరించటానికి ప్రయత్నిస్తూ కళ్ళు మూసుకున్నాడు శ్యామ్‌సుందర్. గాయాల బాధ కొద్దిగా ఉపశమించాక కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు.

అప్పుడు అర్థం అయింది అతనికి అది ఇసుక ఎడారి కాదనీ....తనమీద దాడిచేయటానికి అక్కడ ఎడారి రాబందుల గుంపు లేదని.

ఖరీదయిన ఫర్నిచర్‌తో కళాత్మకంగా అలంకరించబడి వుంది ఆ బెడ్‌రూం. అందమయిన సీనరీలకు సంబంధించిన పేపర్స్ అతికించబడి వున్నాయి గోడలకు.

ఇంతకు తను అక్కడికి ఎలా వచ్చాడు? అసలు ఏం జరిగింది?

ఎంతోసేపు ఆలోచించాల్సిన అవసరం లేకుండానే గుర్తొచ్చాయి అతనికి జరిగిపోయిన సంఘటనలు.

తనను వెంటాడుతున్న దుండగులు తను ప్రయాణిస్తున్న కారుమీద బాంబుల వర్షం కురిపించటం...ఆ ప్రేలుళ్ళ అదటుకు ఇంతెత్తున గాలిలోకి ఎగిరిన కారు డోర్ తెరుచుకున్నప్పుడు...ఎత్తి విసిరేసిన ఇసుకమూటలా విసురుగాపోయి చీకటిగా వున్న ఒక సందు మొదట్లో పడ్డం లీలగా అతని కళ్ళముందు కదిలాయి.

నేలకు పొడుచుకుని ఫట్‌మంటూ శబ్దం చేసింది అతని తల. కళ్ళు బైర్లు క్రమ్ముతున్నట్టు అనిపించింది. గాయాల సలుపుకి తలపోటు తోడవటంతో పడినచోట నుండి వెంటనే లేవలేకపోయాడు శ్యామ్‌సుందర్.

సరిగ్గా అయిదు నిముషాల తర్వాత ఉన్నట్టుండి అతనికి వినిపించాయి ఎవరో ఎవరినో కసురుకుంటూ అంటున్న మాటలు. అవి తనను వెదకటం గురించేనని అర్థం అవుతూనే కలవరపడిపోయాడు శ్యామ్‌సుందర్.

తనను వెంట తరుముతున్న ప్రమాదం ఇంకా ముగిసిపోలేదని గ్రహించేసరికి గాయాల బాధకంటే గాబరా ఎక్కువయిపోయింది అతనికి. ఈసారి దుండగుల కంటపడితే ప్రాణాలతో బయటపడటం అసంభవమని తెలిసిపోయింది.

ఆ వెంటనే శరీరంలోని శక్తినంతా కూడదీసుకుంటూ లేచి నిలుచున్న శ్యామ్‌సుందర్ తలను విదిలించి తనను తాను అదుపులో వుంచుకోటానికి తెగ

అవస్థ పడిపోతూ తడబడుతున్న అడుగులతో అక్కడ్నించి కదిలి, ఆ సందు చివరికి చేరుకున్నాడు.

ఒంటిమీద బలమయిన గాయాల కారణంగా అప్పటికే చాలావరకు పోయింది అతని రక్తం. విపరీతమయిన నీరసం అతన్ని వివశుడ్ని చేయటానికి ప్రయత్నిస్తున్నది.

స్పృహ తప్పకముందే సురక్షితమయిన చోటుకి చేరుకోవాలన్న ఆలోచనలతో పట్టుదలగా అడుగులు వేస్తూ ఆ సందుకి అటువైపున వున్న వీధిని క్రాస్ చేయబోయాడు శ్యామ్‌సుందర్.

అదే సమయంలో వీధి మలుపుతిరిగి వేగంగా అటు దూసుకువచ్చింది ఒక కారు. తప్పతాగినవాడిలా తడబడుతున్న అడుగులతో వీధిని క్రాస్ చేయబోతున్న శ్యామ్‌సుందర్‌ని గమనించి ఆఖరి క్షణంలో బ్రేకును గట్టిగా అదిమాడు డ్రయివర్.

టైర్లు కీచుధ్వనులు సృష్టిస్తుండగా శ్యామ్‌సుందర్‌కి అతిదగ్గరగా వచ్చి ఆగింది ఆ కారు. తాకీతాకనట్టు అతని శరీరాన్ని తాకింది.

అతి చిన్నదయిన ఆ తాకిడికే తట్టుకోలేని బలహీనుడిలా వెనక్కి తూలి క్రిందపడిపోయాడు శ్యామ్‌సుందర్. బాధగా నొసలు విరుస్తూ లేచి నిలబడేందుకు ప్రయత్నించి నేలమీద చతికిలబడిపోయాడు.

"యా అల్లా! పెద్ద ప్రమాదమే తప్పిపోయినట్టుంది" అని ఆందోళనగా అరుస్తూ కారులోంచి క్రిందికి ఒక్క పరుగున తనను సమీపించిన ఆ ఆకారాన్ని స్పష్టంగా చూశాడు శ్యామ్‌సుందర్.

ఆ పరిస్థితులలో కూడా తనను తరుముకొస్తున్న ప్రమాదాన్ని గుర్తుంచుకుని "వెళ్ళిపోండి! వెంటనే ఇక్కడ్నుంచి పారిపోండి! నన్ను రక్షించబోయి ఆపదల్లో పడకండి...ప్లీజ్...వెళ్ళండి!" అని గొంతు చించుకుని అరుస్తూ ఆ ఆకారాన్ని హెచ్చరించాడు శ్యామ్‌సుందర్.

హెచ్చరించానని అతను అనుకున్నాడు.

హెచ్చరిస్తూ అనాలనుకున్న మాటలు శబ్దంగా మారి గొంతులోంచి బయటికి రాకముందే పూర్తిగా హరించుకుపోయింది అతని శక్తి. కనులముందు చీకట్లు క్రమ్ముతున్నట్టు అనుభూతి చెందుతూ స్పృహ తప్పి పోయాడు అతను. ఆ తరువాత ఏం జరిగిందో తెలియని అన్‌కాన్షస్‌లో మునిగిపోయాడు.

ఉన్నట్టుండి ఖరీదయిన సెంట్ వాసన గాలిలో విహరిస్తూ గదిలోకి దూసుకువచ్చేసరికి ఆలోచనలనుండి బయటపడుతూ తలతిప్పి చూశాడు శ్యామ్‌సుందర్. మెరుపు తీగతో పోటీపడగల ఒక అందగత్తె వయ్యారంగా అడుగులు వేస్తూ చిరునవ్వుతో గదిలోకి రావటం గమనించి కనుబొమలు ఆశ్చర్యంగా ముడివేశాడు.

"అచ్చా! స్పృహలోకి వచ్చారన్నమాట. ఇక భయపడవలసిందేమీ లేదన్నమాట" అంటూ అతన్ని సమీపించి ఓ కుర్చీని దగ్గరగా లాక్కుని కూర్చుంది.

ఆమె ఆ మాటలను తనను అడిగిందో, తనలో తానే అనుకుంటున్నదో అర్థంకాక....సమాధానం చెప్పకుండా పక్కకి చూశాడు శ్యామ్‌సుందర్. పక్కనున్న టీపాయ్‌మీద సిగరెట్ పాకెట్ కనిపించేసరికి ప్రాణం లేచివచ్చినట్లు అనిపించింది.

పేకెట్ అందుకుని అందులోంచి ఒక సిగరెట్ తీసి వెలిగించుకుంటూ, ఆమెవంక ప్రశ్నార్థకంగా చూశాడు శ్యామ్‌సుందర్.

అతని కళ్ళలో ప్రతిఫలించిన ప్రశ్నలను అర్థం చేసుకున్నట్లు చిన్నగా నవ్విందామె.

"ప్రాణాపాయం తప్పిపోయింది మీకు. మిమ్మల్ని వెదుక్కుంటూ ఇక్కడికి వచ్చే ప్రమాదం కూడా యించుమించు ఏమీ లేనట్టే! ముందు వేడివేడి చాయ్ త్రాగి ఆ తరువాత మిగతా విషయాలు తెలుసుకోండి" అంది.

ఆమె అంటుండగానే సెగలు వెలువరుస్తున్న చాయ్‌తో వున్న రెడు కప్పులను ట్రేలో పెట్టుకుని లోపలికి వచ్చాడు ఓ నౌఖరు. ఆ యిద్దరికీ చెరొక కప్పు అందించి, అవతలికి వెళ్ళిపోయాడు.

వేడివేడి చాయ్‌ని నాలుగు గుక్కలలో లాగించేసి కప్పును టీపాయ్ మీద పెట్టేసాడు శ్యామ్‌సుందర్. సిగరెట్ దమ్ములాగి పొగను గాలిలోకి వదులుతూ ఆమె చెప్పబోయే వివరాల కోసం ఎదురుచూడసాగాడు.

"నా పేరు చాందినీ! రాత్రి ఓ హోటల్‌లో పార్టీకి అటెండయి తిరిగి వస్తుండగా, తీవ్రంగా గాయపడిన మీరు....నడవలేని స్థితిలో నా కారుకి డాష్ యిచ్చి పడిపోయారు. ఆ స్థితిలో వున్న మిమ్మల్ని వదిలిపెట్టి రావటానికి నా మనసు అంగీకరించలేదు. డ్రయివర్ సాయంతో కారులోకి ఎక్కించి ఇంటికి తీసుకువచ్చాను. రక్తం విపరీతంగా పోవటంవల్ల మీ పరిస్థితి ఆందోళనకరంగా

వుందని డాక్టర్ చెప్పాడు. ఆ తరువాత ఆయనే రక్తం ఎక్కించి మీకు ట్రీట్‌మెంట్ యిచ్చి వెళ్ళాడు. మీరు ఇంత త్వరగా స్పృహలోకి వస్తారని నేను అనుకోలేదు" అంది చాందిని.

"థాంక్స్" అన్నాడు శ్యామ్‌సుందర్ ఆమెవంక చూస్తూ.

"మీరెవరు? మీ పేరేమిటి? ఆ రౌడీలు మిమ్మల్ని ఎందుకు ఈ విధంగా గాయపరిచారు?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది చాందినీ.

తడుముకోకుండా సమాధానం చెప్పటానికి గబగబా మాటలు వెదుక్కున్నాడు శ్యామ్‌సుందర్. నేనొక స్వదేశీ టూరిస్ట్‌ని... అనుకోకుండా ఆటో డ్రయివర్లతో జరిగిన చిన్న తగాదా చిలికిచిలికి గాలివాన అయింది. పంతాలనూ, పట్టుదలను పెంచి నా పీకలమీదికి తెచ్చింది" వచ్చీరాని రాజస్థానీ భాషకు హిందీ పదాల్ని జతచేస్తూ చెప్పాడు.

అతను చెప్పింది శ్రద్ధగా ఆలకించి తలవూపింది చాందినీ. ఎటువంటి భావాలనూ వ్యక్తం చేయకుండా లేచి నిలబడింది.

"అచ్ఛా! ఇక మీరు విశ్రాంతి తీసుకోండి. అతిగా ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకోకండి" అంటూ అవతలికి వెళ్ళిపోయింది.

తేలిగ్గా నిట్టూర్చాడు శ్యామ్‌సుందర్. పూర్తిగా కాలిన సిగరెట్‌ను యాష్‌ట్రేలో వేసి ఇంకో సిగరెట్ వెలిగించాడు. గట్టిగా దమ్ములాగి పొగను గాలిలోకి వదులుతుండగా అతని కనులముందు కదలాడింది అసహనం, ఆందోళన గూడుకట్టుకున్న హోంమినిస్టర్ గారి వదనం..

# 3

**ఉదయం** పదిగంటలకు ఫారమ్‌హౌస్‌నుండి బయలుదేరబోతుండగా ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తిన శ్యామ్‌సుందర్‌కి వెంటనే వినిపించింది వాసంతి కంఠం.

"హలో వాసంతీ! ఏమిటి విశేషాలు? సింగపూర్ నుంచి వాత్సవ ఏమయినా మెసేజ్ పంపాడా? నేను కూడా సింగపూర్ వెళ్ళాల్సివుంటుందా? అనడిగాడు హుషారుగా.

"ప్రస్తుతానికి ఇండియా బోర్డర్ దాటేటంత సీన్ నీకు లేదుగానీ.... అర్జంటుగా బయలుదేరి రాజీవ్ ఎయిర్‌పోర్ట్‌కిరా. వచ్చేటప్పుడు నీ ఎయిర్ బేగ్‌ను కూడా తెచ్చుకో" అంది వాసంతి.

'ఎందుకు' అని అడగబోయి....ఆమెతో మాటలు పెంచుకోవటం యిష్టంలేక "అలాగే! బయలుదేరుతున్నాను" అని ఫోన్ పెట్టేశాడు శ్యామ్‌సుందర్.

అరగంట తరువాత ఫారమ్‌హౌస్‌కి సంబంధించిన ఒక జీపులో ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని లోపలికి వెళ్తున్న అతనికి ఎదురువచ్చింది వాసంతి.

"ఇదిగో నీ ఎయిర్ టికెట్! ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో హోంమినిస్టర్ గారిని కలుసుకోవాల్సి వుంటుంది నువ్వు" అంది వాసంతి... ఎయిర్ టికెట్‌ని అతని చేతిలో వుంచుతూ.

వాసంతి మాటలకు హుషారుగా విజిల్ వేయబోయి ఆఖరి క్షణంలో ఆ ప్రయత్నాన్ని అదుపు చేసుకున్నాడు శ్యామ్‌సుందర్.

వాత్సవతో కలిసి అతను డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రారంభించిన తరువాత...గతంలో ఒకసారి హోం మినిస్టర్ గారే వాత్సవను పిలిపించి స్వయంగా ఒక బాధ్యతను అప్పగించారు. తన ప్రతిభను కూడా గుర్తించి రెండో అవకాశం తనకి ఇస్తున్నారన్నమాట! 'ఇంతకీ ఏమిటి ప్రాబ్లమ్?' అనుకున్నాడు మనసులో.

"సింగపూర్ వెళ్ళిన వాత్సవ గురించి రెండు రోజులుగా ప్రయత్నించినా ఫలితం లేకపోయిందట. వాత్సవ హెడ్‌క్వార్టర్స్‌కి కూడా ఫోన్ చేయలేదని చెప్పటంతో...అర్జంటుగా నిన్ను పంపమని ఒక గంటక్రితం హోంమినిస్టర్ గారి సెక్రటరీ నాతో ఫోన్‌లో చెప్పాడు.

శ్యామ్‌సుందర్ ముఖంలోని ఉత్సాహాన్ని గమనిస్తూ చెప్పింది వాసంతి...వాత్సవ అందుబాటులో లేకపోవటంవల్లనే నీకు అవకాశం వచ్చింది అన్న అర్థం ధ్వనించేలా.

"ఇట్సాల్ రైట్ వాసంతీ! నన్ను మరీ కుర్రాడ్ని చేసి మాట్లాడటం నీకు ఈ మధ్యన బాగా అలవాటు అయిపోయింది...నువ్వు చూస్తూవుండు. అనతి కాలంలోనే డైనమిక్ సిటీ సెక్యూరిటీ సర్వీసెస్ పేరుప్రతిష్టలు ప్రపంచం అంతటా

మారుమ్రోగిపోయేట్టు చేస్తాను...” అన్నాడు శ్యామ్ సుందర్ గంభీరంగా ఫోజు పెట్టి.

“అంత ఫోజు వద్దు. అనవసరం అయిన విషయాలలో జోక్యం చేసుకోకుండా అప్పగించిన పనిని పూర్తిచేసుకుని గుట్టుగా గూటికి చేరుకుంటే చాలు, అదే పదివేలు. ఇక బయలుదేరు” అంది వాసంతి.

ఆమెతో వాదించి ఎటువంటి ప్రయోజనం వుండదని గ్రహించి, జీపు తాళాలు ఆమె చేతిలో పెట్టి ఎయిర్‌పోర్ట్‌లోకి వెళ్ళిపోయాడు శ్యామ్‌సుందర్. “వెళ్ళగానే ఫోన్ చెయ్యి” అని వెనుకనుండి ఆమె అరుస్తూ చెప్పిన మాటకు తలవూపుతూ వెళ్ళి విమానంలో కూర్చున్నాడు.

ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగి, బయటికి రాగానే చిరునవ్వుతో అతన్ని రిసీవ్ చేసుకున్నాడు హోంమినిస్టర్‌గారి పర్సనల్ సెక్రటరి.

“మిమ్మల్ని డైరెక్ట్‌గా చూడటం ఇదే మొదటిసారి! నాకు వాత్సవగారు బాగా తెలుసు. మిమ్మల్ని చూస్తుంటే ఆయనను చూస్తున్నట్లుగానే వుంది” అన్నాడు అతను శ్యామ్‌సుందర్‌తో కరచాలనం చేస్తూ.

చిన్నగా నవ్వుతూ అతన్ని అనుసరిస్తూ వెళ్ళి కారులో కూర్చున్నాడు శ్యామ్‌సుందర్. సెక్రటరీ కూడా ఎక్కగానే కారును స్టార్ట్‌చేసి ముందుకు పరుగులు తీయించటం ప్రారంభించాడు డ్రయివర్.

నలభై నిముషాల తర్వాత సిటీకి దూరంగా ఒక తోటలో వున్న హోంమినిస్టర్‌గారి ప్రయివేట్ బంగళా ఆవరణలోకి ప్రవేశించి ఆగింది కారు.

సెక్రటరీతో పాటుగా కారు దిగి బంగ్లాలోకి పోయిన శ్యామ్‌సుందర్‌కి.... విశాలమయిన ఒక ఎయిర్‌కండిషన్ గదిలో కనిపించారు ఒంటరిగా కూర్చుని వున్న హోంమినిస్టర్‌గారు.

“కమాన్ మిస్టర్ శ్యామ్‌సుందర్! వాత్సవ నీ గురించి చాలా విషయాలు చెప్పాడు. నీలాంటి చురుకయిన యువకుల శక్తిసామార్థ్యాలతో దేశానికి ఇప్పుడెంతో అవసరం వుంది. నిన్ను కలుసుకునే అవకాశం వచ్చినందుకు నాకు చాలా సంతోషంగా వుంది. కమాన్...టేక్ యువర్ సీట్!” అంటూ తనకెదురుగా వున్న కుషన్ ఛైర్ చూపించారు.

"థాంక్యూసర్!" అంటూ హోంమినిస్టర్ గారు చూపించిన కుర్చీలో కూర్చున్నాడు శ్యామ్‌సుందర్.

"ఇటీవల రాజస్థాన్ లో జరిగిన కొన్ని దారుణ సంఘటనలను గురించి మా సెక్రటరీ నీకు వివరిస్తాడు. శ్రద్ధగా ఆలకించు!" అన్నారు హోంమినిస్టరుగారు.

వెంటనే ఒక ఫైలు అందుకుని తెరిచి, అందులో పొందుపరిచిన వివరాలను చదవటం ప్రారంభించాడు సెక్రటరీ.

రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ సిటీలో ఇరువర్గాలవారి మధ్య చెలరేగిన ఘర్షణలు ఎదురుచూడని దారుణాలకు దారితీశాయి...ఆ ఘర్షణలను అవకాశంగా తీసుకున్న సంఘ విద్రోహశక్తులు చెలరేగి వందలాది అమాయకులను వూచకోత కోయటం జరిగింది...రక్తం వరదలయి ప్రవహించింది. దిక్కుతోచని పోలీస్ డిపార్ట్‌మెంట్ ప్రేక్షకపాత్ర వహించటంతో ఉదయపూర్, ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో వుండే ప్రజలు భీతావహులయి, ప్రాణాలు అరిచేత బుచ్చుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు.

వారంరోజులపాటు నిర్విరామంగా కర్ఫ్యూ విధించబడిన ఆ ప్రాంతంలో... దిగిజారిపోయిన ప్రజల ఆత్మస్థయిర్యాన్ని పెంపొందించటానికి... దారుణాలు జరిగిన వూళ్ళల్లో మన ప్రధాని ప్రత్యేక పర్యటన జరిపారు.

ఆ సమయంలో ఉదయపూర్‌లోని ఒక ప్రాంతంలో పర్యటిస్తున్న ప్రధానిమీద హత్యాప్రయత్నం జరగటం, ఆయన వెంట్రుకవాసిలో ప్రాణాపాయం నుండి బయటపడటం జరిగింది. అయితే ఈ హత్యాప్రయత్నానికి సంబంధించిన దోషులు ఎవరూ ఇంతవరకూ పట్టుబడకపోవటం.... ఈ విషయమై పరిశోధన జరపటానికి ఉదయపూర్ పంపించిన స్పెషల్ బ్రాంచ్ సి.ఐ.డి. ఉదయపూర్ క్లాక్‌టవర్ సెంటర్‌లో జరిగిన బాంబు ప్రేలుళ్ళలో ముక్కలు ముక్కలుగా అయి హతమారిపోవటం తీవ్రమయిన ఆందోళనను కలిగిస్తున్నాయి. విక్రమ్ హత్యకు సంబంధించి పోలీస్‌డిపార్ట్‌మెంట్ ఎవరో కొంతమంది అనామకుల్ని అరెస్ట్ చేయటం తప్ప, అసలు నేరస్తులు ఎవరో... హత్యకు కారణం ఏమిటో తెలుసుకోలేకపోయింది" అంటూ చదవటం ముగించి, ఫైల్‌ను క్లోజ్‌చేసి హోంమినిస్టర్‌గారి ముఖం లోకి చూస్తూ మౌనంగా వుండిపోయాడు సెక్రటరీ.

అతను చదివి వినిపించిందంతా శ్రద్ధగా ఆలకించిన తరువాత ఆశ్చర్యం వేసింది శ్యామ్‌సుందర్‌కి. కేవలం ఆ విషయంగానే తనను పిలిపించటం జరిగిందా అన్న అనుమానం కూడా కలిగింది.

"సి.ఐ.డి. విక్రమ్ హత్య వెనక ఏదో కుట్ర దాగి వున్నదని అనుమానించ బడుతోంది మిస్టర్ శ్యామ్‌సుందర్! ప్రధానిపై హత్యాప్రయత్నం చేసిన విద్రోహులు ఇంతవరకూ పట్టుబడకపోవటం ఆ అనుమానానికి మరింత బలాన్ని చేకూరుస్తోంది!" శ్యామ్‌సుందర్ మస్తిష్కంలో తల ఎత్తిన అనుమానాన్ని పసి కట్టినట్టు మెల్లగా అన్నారు హోమ్‌మినిస్టర్.

చిన్నగా తలవూపి–"నేను చేయాల్సిందేమిటో చెప్పండి సర్!" అన్నాడు శ్యామ్‌సుందర్.

"యస్...కమింగ్ ది టు పాయింట్! హత్యాప్రయత్నం జరిగిన రాజస్థాన్ రాష్ట్రంలో ఎడారి పట్నంగా పేరుపొందిన జైశల్మీర్ పట్టణంలోని ఓ మల్టీ పర్పస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి హాజరయి, ఆ సాయంత్రం హాస్పిటల్ వెనుక వున్న మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించాల్సి వుంది. మరో పదిహేను రోజులలో జరగబోయే కార్యక్రమానికి ప్రధాని హాజరవటం తప్పనిసరి కాబట్టి పెద్ద ఎత్తున సెక్యూరిటీ ఏర్పాట్లు చేయాల్సి వుంది. అందుకే నిన్ను పిలిపించటం జరిగింది" అన్నారు హోంమినిస్టర్.

కనుబొమలు విశాలం చేస్తూ హోంమినిస్టర్ గారి ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

ప్రధాని రక్షణకోసం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన రకరకాల సెక్యూరిటీ వింగ్స్ నిర్విరామంగా పనిచేస్తుంటాయి. అవన్నీ కాకుండా తమ ప్రాణాలను అర్పించటానికి సిద్ధంగా, ఆయనను కంటికి రెప్పలా కాపాడే పర్సనల్ సెక్యూరిటీ ఫోర్స్...వంతులవారిగా ఇరవై నాలుగ్గంటలూ ఆయనకు రక్షణ కల్పిస్తూ వుంటుంది. ఇకపోతే ఆయన రాష్ట్ర పర్యటనలకు వెళ్ళినప్పుడు రక్షణ విషయంలో అదనపు బాధ్యతలను చేపడుతుంది ఆయా రాష్ట్రాలకు సంబంధించిన పోలీస్ డిపార్ట్‌మెంట్.

ఇంతమంది ఇన్ని విధాలుగా పటిష్టమయిన, దుర్భేద్యమయిన రక్షణ కల్పించేవాళ్ళు వుండగా, ప్రత్యేకించి తనను పిలిపించాల్సిన అవసరం ఏమొచ్చింది?

అదే సందేహాన్ని క్లుప్తంగా, పొదుపయిన పదజాలంతో హోంమినిస్టర్‌గారి ముందుంచాడు శ్యామ్‌సుందర్.

అతడు వెలువరించిన సందేహాలను ఆలకించి గాఢంగా నిట్టూర్చారు హోంమినిస్టర్.

"నీకు అటువంటి అనుమానాలు కలగటం సమంజసమే మిస్టర్ శ్యామ్‌సుందర్! ప్రధాని జైశల్మీర్ లో అడుగుపెట్టటానికి ముందే అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి...విద్రోహుల కుట్రను కనిపెట్టి, భగ్నం చేసేందుకు ఇప్పటికే స్పెషల్ బ్రాంచ్ తమ అధికారులను రంగం లోకి దించింది. ఇంకా మరికొన్ని ప్రభుత్వరంగ నేరపరిశోధనా విభాగాలు సంయుక్తంగా ఈ పరిశోధనలో తలమునకలవుతున్నాయి. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పరిసరప్రాంతాలలోనూ, ఆ తరువాత జరిగే బహిరంగ సభాప్రాంతంలోనూ అసాధారణమయిన సెక్యూరిటీ ఏర్పాట్లు చేసేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం కూడా రూపొందించబడింది.

అయితే...విద్రోహుల కుట్రను భగ్నం చేయలేకపోతే ఎన్ని సెక్యూరిటీ ఏర్పాట్లు చేసినా ప్రయోజనం వుంటుందని అనుకోటానికిలేదు. ఎందుకంటే స్పెషల్ బ్రాంచ్ ఏజంట్లూ తదితరులు రంగంలో వున్న సంగతి తెలిసే అవకాశం వుంది కాబట్టి...అందుకు అవసరమయిన జాగ్రత్తలను కుట్రదారులు ఎప్పటికప్పుడు తీసుకునే అవకాశం వుంది. అదీగాక ప్రధాని పర్యటన తేదీ దగ్గర పడేకొద్దీ ఇన్‌సైడ్ సెక్యూరిటీ అందరూ ప్రాధాన్యతను యిస్తారు. ఆయన చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నంలో తలమునకలు అయిపోతారు.

మరి అందరి అంచనాలకూ అతీతంగా కంటికి కనిపించని విధంగా పొంచివుండే ప్రమాదం మాట ఏమిటి? ఈ సందర్భంగా గతంలో జరిగిన ఒక మాజీ ప్రధాని దారుణహత్యను దృష్టిలో వుంచుకుని నువ్వు పని చేయాల్సి వుంటుంది" అన్నారు హోంమినిస్టర్.

చిన్నగా తలవూపాడు శ్యామ్‌సుందర్.

"మరో ముఖ్యవిషయం! గతంలో వాత్సవ మా స్పెషల్ బ్రాంచ్ వారికి సహకరించినా ఓ ప్రైవేటు సెక్యూరిటీ సంస్థను రిక్వెస్ట్ చేయటం... తమ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేయటమే అన్నట్లు వాళ్ళు ఫీలవటం...దాంతో వారి ఉత్సాహం నీరుగారిపోయే అవకాశం వుంది....నువ్వు ఏ సందర్భంలోనయినా పోలీసుల్నిగానీ, స్పెషల్‌బ్రాంచ్ అధికారులనుగానీ కాంటాక్టు చేయడమంటూ జరిగితే నీ ఉనికి బయటపడే ప్రమాదం కూడా వుంది. అందుకే నా ప్రయివేట్ బంగ్లాకి పిలిపించి నీతో ఒంటరిగా మాట్లాడవలసి వచ్చింది. కాబట్టి ఈ పరిశోధనలో నువ్వు ఒంటరిగా పనిచేయాల్సి వుంటుందన్న సంగతి మరిచిపోవద్దు...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరంగా ఎలాంటి సహాయమూ లభించదు. అలాగని నిన్ను ప్రమాదాలలోకి నెట్టి చేతులు కట్టుకుని కూర్చుంటానని అనుకోవద్దు. అత్యవసరం అనుకున్నప్పుడూ, పరిస్థితులు నీ చేయి దాటి పోతున్నాయని నీకనిపించినప్పుడూ.... ఈ నెంబరుకి కాంటాక్టు చెయ్యి! నువ్వు కోరిన వెంటనే నీకు సహాయం అందుతుంది" అంటూ ఒక ఫోన్ నెంబరు అతనికిచ్చారు.

ఆయన అందించిన ఫోన్ నెంబరువున్న కార్డు అందుకుని జేబులో పెట్టుకుంటూ "థాంక్యూ సర్! అన్నాడు శ్యామ్‌సుందర్.

ప్రధాని మీద హత్యాప్రయత్నం జరిగిన ఉదయపూర్ నుండే నీ పరిశోధన ప్రారంభిస్తే బాగుంటుందనుకుంటాను. ఐ విష్ యూ ఆల్ సక్సెస్" అంటూ లేచి చేతిని ముందుకు జాచారు హోంమినిస్టర్.

మౌనంగా లేచి నిలబడి ఆయనతో కరచాలనం చేసి ఆ బంగ్లాలోంచి బయల్దేరాడు శ్యామ్‌సుందర్.

# 4

**ఢిల్లీ** సెంట్రల్ స్టేషన్‌లో పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కేముందు వాసంతికి ఫోన్‌చేసి వివరాలను తెలియచేసాడు శ్యామ్‌సుందర్.

అంతా శ్రద్ధగా ఆలకించి ఆమె ఆట పట్టిస్తుందనుకున్నాడు అతను.

"జాగ్రత్త! ఇది మన సెక్యూరిటీ సర్వీసెస్ వ్యవహారాలకు పూర్తిగా విరుద్ధం అయిన పని. అక్కడికి వెళ్ళిన తరువాత ఫేస్ చేయటానికి అసాధ్యమయిన ప్రమాదాలు ఎదురయితే మొండితనం ప్రదర్శించకుండా, మొహమాటపడకుండా

వెనక్కి వచ్చెయ్" అంది వాసంతి.

ఆమె గొంతులో ధ్వనించిన అస్పష్టమయిన ఆందోళనను గుర్తించి తనలో తానే నవ్వుకున్నాడు శ్యామ్‌సుందర్. "డోంట్ వర్రీ వాసంతీ! పని పూర్తి చేసుకుని వీలయినంత త్వరలో వచ్చేస్తాను" అన్నాడు.

"జాగ్రత్త! రోజుకోసారయినా ఫోన్ చేయాలన్న సంగతి మరిచి పోకు' అంటూ మరోసారి జాగ్రత్త చెప్పింది వాసంతి.

"అలాగే....' అంటూ ఫోన్ డిస్‌కనెక్ట్ చేశాడు శ్యామ్‌సుందర్.

తను అక్కడికి రావటానికి దారితీసిన పరిస్థితులనూ, వచ్చిన తరువాత జరిగిన సంఘటనలను గుర్తు చేసుకుంటూ తనకు తెలీకుండానే నేల మీద పాదం మోపి లేచి నిలబడిపోయాడు శ్యామ్‌సుందర్.

పచ్చిగా వున్న గాయాలు రెచ్చిపోతూ సలుపును వెలువరించేసరికి జివ్వుమన్నాయి శ్యామ్‌సుందర్ నరాలు. పాదాన్ని నేలమీద బేలన్స్ చేయటం సాధ్యంకాక పక్కకి తూలి నేలమీద చతికిలబడిపోయాడు.

ఒక్కసారిగా కళ్ళు గిర్రున తిరుగుతున్నట్టు అనిపించింది. విపరీతమయిన పెయిన్ శరీరం అంతటినీ ఆక్రమించుకుంది.

"పరమ మొండివాళ్ళు కూడా చేయలేని పనులంటూ కొన్ని వుంటాయి! కదలాలంటే పట్టుదలమాత్రమే సరిపోదు! ఒంట్లో కాస్తంత శక్తి కూడా కావాల్సి వుంటుంది" మరోసారి లోపలికి వస్తూ మృదువుగా మందలించింది చాందినీ.

మరోసారి అటువంటి మాటలు అనిపించుకోవటం యిష్టంలేనట్టు మంచాన్ని ఆసరా చేసకుంటూ లేచి పక్కమీదికి చేరాడు శ్యామ్‌సుందర్. మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తున్న ఆమె అందాన్ని అదేపనిగా చూసస్తూ మనసు పాడుచేసుకోవటం మంచిది కాదనుకుంటూ బలవంతంగా కళ్ళు మూసుకుని కదలకుండా వుండిపోయాడు.

ఆ రోజు సాయంత్రం మరోసారి డాక్టర్‌ని వెంటబెట్టుకుని వచ్చింది చాందినీ.

శ్యామ్‌సుందర్ గాయాలకు కట్టిన బాండేజ్ రక్తంతో తడిసి వుండటం గమనించి కనుబొమలు సీరియస్‌గా ముడివేశాడు.

"తన రక్తం యిచ్చి నీ ప్రాణాలు నిలబెట్టింది చాందినీ. నీ ఖర్మానికి

నిన్ను నడివీధిలో వదిలిపెట్టకుండా ఇంటికి తీసుకొచ్చి ట్రీట్‌మెంటు ఇప్పిస్తోంది. నీ ఆరోగ్యం కాపాడుకోవటం ఇక నీ చేతులలోనే వుంది" అంటూ వార్నింగ్‌లాంటి సలహా ఇచ్చి కట్లు మార్చి వెళ్ళిపోయాడు.

"నేనెవరినో తెలీకపోయినా....రక్తం ఇచ్చి కాపాడావు.... నీ మేలు మరచిపోనిది" చాందినీ ముఖంలోకి చూస్తూ కృతజ్ఞతగా అన్నాడు శ్యామ్‌సుందర్.

చిన్నగా, అందంగా నవ్వింది చాందినీ. వెన్నెల కురిసినట్టుందా నవ్వు.

"ఇవ్వగలిగింది ఇచ్చి ఎదుటివారికి సహాయపడటం గొప్పకాదు. ఒంటిమీది గాయాలతో నువ్వు నా కంటపడినప్పుడు....నిన్ను గురించి ఆలోచించుకోకుండా ప్రమాదం తరుముకు వస్తుందనీ, పారిపోయి నా ప్రాణాలు కాపాడుకోమని హెచ్చరించటానికి ఆరాటపడ్డావు. ఆ క్షణంలోనే నీ మీద గౌరవం పుట్టుకువచ్చింది. నీకు ఎలాగైనా సహాయపడాలన్పించింది" అంది.

చిన్నగా తల వూపుతూ ఏదో చెప్పబోయాడు శ్యామ్‌సుందర్.

డాక్టర్ ఇచ్చిన మత్తు ఇంజక్షన్ కారణంగా ఉన్నట్టుండి మొదలైనాయి ఆవులింతలు...కనురెప్పలు వాటంతటవే బరువుగా మూతలుపడసాగాయి.

మరోసారి ఆమెకు కృతజ్ఞతలు తెలియచేయాలన్న ఆలోచన కార్యరూపం దాల్చకముందే మత్తులో మునిగిపోయాడు శ్యామ్‌సుందర్. ఒళ్ళు తెలియనంత గాఢ నిద్రలోకి జారిపోయాడు.

మరికొద్దిసేపు అక్కడే కూర్చున్న చాందినీ విప్పారిత నేత్రాలతో తదేకంగా తన ముఖంలోకి చూడటం కానీ.... ఆ తర్వాత మృదువుగా తన నుదిటిమీద ముద్దుపెట్టుకుని అవతలికి వెళ్ళటంగానీ అతనికి తెలీదు.

ఒక రాత్రివేళ ఉన్నట్టుండి మెలకువ వచ్చింది శ్యామ్‌సుందర్‌కి. గది బయటనుండి నవ్వులు విన్పించటంతో వింతగా ముడిపడ్డాయి అతని కనుబొమలు.

మెల్లగా లేచి.... బలవంతంగా అడుగులేస్తూ ద్వారాన్ని సమీపించి మూసివున్న తలుపు సందులోంచి బయటకి చూశాడు.

సిల్కులాల్చీ ధరించిన ఓ బట్టబుర్ర ఆజానుబాహుడితో పాటు బయట

హాల్లో వున్న సోఫాలో కూర్చుని వుంది చాందినీ. అతనితో పాటు విస్కీ సేవిస్తూ....మధ్య మధ్య మగరాయుడిలా సిగరెట్ దమ్ము కొడుతోంది.

అతను విస్కీ సిప్ చేస్తుండటంతోపాటు మీగడ తరగలాంటి మృదువయిన చాందినీ శరీరంతో ఆడుకుంటున్నాడు. ఆమె బుగ్గల్ని చిదుముతూ పెదవులను ముద్దాడటానికి తెగ ఆరాటపడిపోతున్నాడు.

ఆ దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన శ్యామ్‌సుందర్ ఎందుకనో అనీజీగా ఫీలయ్యాడు. ఎంత వద్దనుకున్నా చాందినీ కారెక్టర్ మంచిది కాదని అనుకోకుండా వుండలేకపోయాడు.

అయినా...ఆమె ఎలాంటిదయితే తనకెందుకూ...? అనుకుంటూ వెనక్కి జరగబోతుండగా బయటనుండి వినిపించిన మాటలు కొద్దిక్షణాల పాటు అతన్ని కదలకుండా చేశాయి.

"ఎంతకాలం ఇలా వేశ్యలా జీవిస్తావు చాందినీ! అడ్డమయిన వారి చేతులలో పడి నీ అందం నలిగిపోయేటట్టు ఎందుకు చేసుకుంటున్నావు? నువ్వు వూ అంటే నిన్ను పెళ్ళాడటానికి సిద్ధంగా వున్నాను" అన్నాడు బట్టతల వ్యక్తి.

చిన్నగా నవ్వింది చాందినీ.

"ఏ సమయంలో మీరు పెళ్ళిమాట ఎత్తటం మొదలుపెట్టారో గానీ, ఇప్పటికి పెళ్ళిమీద నిజంగానే గాలిమళ్ళింది నాకు. మనసుకు నచ్చినవాడ్ని కట్టుకుని కష్టసుఖాలను పంచుకుంటూ కాపురం చేయమని నన్ను తొందర పెడుతోంది" అంది.

ఆ మాటలకు చింపిచేటంత అయింది అతని ముఖం. ట్యూబ్ లైట్‌లా వెలిగిపోయింది.

"అయితే తెల్లవారగానే మన పెళ్ళికి ఏర్పాట్లు చేయమంటావా?" అనడిగాడు ఆత్రుతగా.

"మన పెళ్ళికి కాదు...నా పెళ్ళికి..." అంది చాందినీ నవ్వుతూ.

"అంటే....అంటే ఏమిటి నీ ఉద్దేశ్యం?" అనుమానంగా చూస్తూ అడిగాడు ఆ బట్టతల వ్యక్తి.

"నాకు నచ్చినవాడ్ని, నేను మెచ్చినవాడ్ని చేసుకుంటానని అర్థం" అంది.

వింటూనే నల్లబడిపోయింది అతని ముఖం. ఉత్సాహం నీరు గారిపోయింది.

"నీకు నచ్చినవాడా? ఎవరతను....? ఎక్కడున్నాడు?" అనడిగాడు ఈర్ష్యగా.

"ఉన్నాడు. నాకు నచ్చినవాడు నా హృదయంలోనే పదిలంగా వున్నాడు" అంది చాందినీ.

అంటూనే నిషా నిండిన కళ్ళతో తను వున్న గదివైపు ఆశగా చూడటం గమనించి కలవరపడ్డాడు శ్యామ్‌సుందర్. అంతకుమించి వారి మాటలు ఆలకించటం అనవసరం అనిపించి, మెల్లగా వెనక్కి వచ్చేసి మంచం మీద వాలిపోయాడు.

చాందినీ ఒక ఖరీదయిన వేశ్య అన్న విషయం స్పష్టం అవుతూనే వికలమయిపోయింది అతని మనసు. ఆమె తనను గురించి ఏదో వూహించుకుని అమితంగా ఉత్సాహపడటం గ్రహిస్తూనే ఆందోళన కూడా జనించింది.

ఆ విషయం అంత స్పష్టంగా తెలిసిన తరువాత కూడా ఇక తను అక్కడే వుండటం అనవసరం అనిపించింది శ్యామ్‌సుందర్‌కి. మరికాస్త శక్తిని పుంజుకోగానే అక్కడ్నించి జెండా పీకెయ్యాలన్న ఆలోచన కూడా వచ్చింది.

బట్టతల వ్యక్తిని రెచ్చగొడుతూ బయటనుండి చాందినీ నవ్వుతున్న నవ్వులు అతనికి వినిపిస్తూనే వున్నాయి. అందంతోపాటు అందమయిన మనసు కూడా వున్న ఆమె అసలయిన అదృష్టం దూరం అయినందుకు మనసులోనే బాధపడుతూ గట్టిగా కళ్ళు మూసుకుని మరోసారి నిద్రలోకి జారిపోయాడు శ్యామ్‌సుందర్.

మరో ఇరవై నాలుగు గంటల తరువాత గాయాల బాధ చాలావరకు ఉపశమించింది శ్యామ్‌సుందర్‌కి. తడబడకుండా అడుగులు వేయగలిగేటంత ఓపిక కూడా చిక్కింది.

ఉదయాన్నే మంచు కడిగిన మల్లెపువ్వులా గదిలోకి వచ్చి తన వివరాలు తెలుసుకోవటానికి ప్రయత్నించిన చాందినీకి కట్టుకథలు వినిపించాడు శ్యామ్ సుందర్. ఆమె బయటకు వెళ్ళిన తరువాత చల్లగా అక్కడ్నించి జారుకోవాలని కూడా నిర్ణయించుకున్నాడు.

ఆ మధ్యాహ్నం ఏదో పనుందని చెప్పి చాందినీ బయటకు వెళ్ళినపుడు

జారుకోవటానికి అతనికి దొరికింది ఒక అవకాశం. దానిని వదులుకోకూడదన్న ఉద్దేశ్యంతో ఎలా వున్నవాడు అలాగే ఎయిర్ బేగ్‌ను భుజానికి తగిలించుకుని బయటికి వచ్చాడు ఆ గదిలోంచి. నౌఖర్లు కూడా కంటికి కనిపించకపోయేసరికి తేలికగా వూపిరి పీల్చుకుంటూ విశాలమయిన హాల్లో నుంచి ముందుకు నడిచాడు.

హాలును దాటి ఎంట్రన్స్ సమీపిస్తుండగా సడన్‌గా అతని ఎదుట ప్రత్యక్షం అయ్యాడు ఆరున్నర అడుగుల ఎత్తున్న కింగ్‌కాంగ్‌లా వున్న భారీకాయుడు ఒకతను. శ్యామ్‌సుందర్‌ను చూసి చిరునవ్వు నవ్వుతూ వంగి సలాములు చేశాడు అతనికి.

భేతాళుడి బ్రదర్‌లాంటి ఆ భూతాకారుడ్ని చూసి కనుబొమలు వింతగా ముడివేశాడు శ్యామ్‌సుందర్. అంత అకస్మాత్తుగా అతను ఎక్కడ్నించి వూడిపడ్డాడో...తన దారికి ఎందుకు అడ్డు వస్తున్నాడో అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ బలవంతపు చిరునవ్వును పెదవులమీదికి తెచ్చుకున్నాడు.

హలో బ్రదర్! ఎవరు నువ్వు...కింగ్‌కాంగ్ మనవడివా? దారాసింగ్ దత్తపుత్రుడివా?" అనడిగాడు.

సమాధానం చెప్పలేదు భారీకాయుడు. వెనక్కి పదమన్నట్లు శ్యామ్ సుందర్‌కి కళ్ళతోనే సూచించి... మరోసారి వంగి వంగి సలాములు చేశాడు.

"అడిగినదానికి సమాధానం చెప్పకుండా ఆ అతి వినయం ఏమిటి బాబూ! కొంపదీసి నీకు చెవుడూ, మూగలాంటి అవలక్షణాలు ఏమీ లేవు కదా?" అనడిగాడు శ్యామ్‌సుందర్.

అప్పటికీ పెదవి విప్పలేదు ఆ భారీకాయుడు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు.

"ఆల్‌రైట్ బ్రదర్! నీకు బ్రహ్మచెముడే గనక వున్నట్లయితే నీకు వినిపించేటంత గట్టిగా గొంతు చించుకుని అరిచి చెప్పేటంత ఓపిక నాకు లేదు.... అడ్డు తప్పుకో, నేను వెళ్ళాలి" అంటూ అడుగు ముందుకు వేశాడు శ్యామ్‌సుందర్.

ఆ ఒక్కమాటా అర్థం అయినట్లు వెంటనే కదిలాడు ఆ భారీకాయుడు.

మర్రి మొదళ్ళ మాదిరి అగుపిస్తున్న చేతులలో ఒక దానిని ఎత్తి అతని షర్టును వడిసి పట్టుకున్నాడు.

"ఏయ్...వాటీజ్ దిస్! మనకి మనకీ ఎలాంటి గొడవలు లేవు.... నావంటి పెద్దమనిషిపట్ల ఇలా అమర్యాదగా ప్రవర్తించటం మంచిదికాదు వదులు... అర్జంటుగా నా షర్టు వదిలెయ్" అంటూ సీరియస్‌గా అరవటం ప్రారంభించాడు శ్యామ్‌సుందర్.

అతని అరుపులను కొంచెంకూడా పట్టించుకోలేదు ఆ భారీకాయుడు. శ్యామ్‌సుందర్‌ని బాతును ఎత్తినట్టుగా గాలిలోకి ఎత్తిపట్టుకుని వదలకుండా అలాగే అతని గదిలోకి తీసుకువచ్చి మంచం మీదికి విసిరాడు.

ఎత్తి విసిరేసిన గడ్డిబొమ్మలా వెళ్ళి ఎయిర్‌బేగ్‌తో సహా మంచం మీద పడ్డాడు శ్యామ్‌సుందర్. వెంటనే లేచి స్టడీగా కూర్చుంటూ ఉక్రోషంగా చూశాడు అతని ముఖంలోకి.

"నా మీదనే దౌర్జన్యానికి పూనుకుంటావా? ఆయ్..." అన్నాడు దబాయింపుగా.

చేతులు కట్టుకుంటూ మరోసారి చిన్నగా నవ్వేడు ఆ భారీకాయుడు. చేతలు తప్ప మాటలు తనకు చేతకావన్నట్లు మౌనం వహించాడు.

శ్యామ్‌సుందర్ ఏదో అనబోతుండగా వడివడిగా అడుగులు వేస్తూ గదిలోకి వచ్చింది, తెల్లటి గౌను ధరించి పావురంలా కనిపిస్తున్న చాందినీ. ఆ భారీకాయుడు అక్కడ వుండటం చూసి విషయం ఏమిటో అర్థం అయినట్టు చిన్నగా తల వూపింది.

"బయటికి పోవాలన్న నీ అతి ఉత్సాహాన్ని పసిగట్టి నేనే యితన్ని నియమించాను శ్యామ్‌సుందర్! నిన్ను అడుగు కదలనీయకుండా చేయమని ఆదేశించాను. ఆడినమాట తప్పని రాజ్‌పుట్ వంశంలో పుట్టినవాడు ఈ బల్బీర్‌సింగ్! చెప్పింది తూ.చ. తప్పకుండా చేయగల మహాబలుడు" అంది.

పట్టుదలలో మహాగట్టివాళ్ళు రాజపుట్ వంశానికి చెందినవాళ్ళు. ఎలాంటి తేడా వచ్చినా అటో ఇటో తేల్చివేయగల పౌరుషవంతులు.

అటువంటివాడ్ని తనపై నిఘా వుంచవలసిన అవసరం ఏమొచ్చింది

చాందినీకి? తను జెండా పీకేస్తాడన్న అనుమానం ఎలా కలిగింది?

"ఓపిక చిక్కిన తరువాత ఒక్క నిముషం కూడా నువ్వు ఇక్కడ వుండవని నేను వూహించాను! నా కళ్ళల్లో సులువుగా కారం కొట్టగలవాడివని అర్థం చేసుకున్నాను" అతని ఆలోచనలను పసిగట్టినట్టు మెల్లగా అంది చాందినీ.

"ఇక నాకొచ్చిన భయమేమీలేదు చాందినీ! నేను బాగానే వున్నాను. నన్ను వెళ్ళనీ...ప్లీజ్!"అన్నాడు శ్యామ్‌సుందర్.

"సారీ! ఇప్పుడు నేను భయపడుతున్నది నీ ఆరోగ్యాన్ని గురించి కాదు. నిన్ను దక్కించుకోవటం గురించి...." అంది చాందినీ.

అంటుండగానే ఆమె కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరగటం ప్రారంభించాయి.

అది గమనించి ఉలిక్కిపడ్డాడు శ్యామ్‌సుందర్.

"ఎందుకూ? ఎందుకా కన్నీళ్ళు? ఇప్పుడు నేను ఏమన్నాననీ?" అనడిగాడు.

"నిజం చెబుతున్నాను శ్యామ్‌సుందర్! నీ దగ్గర ఏదీ దాచాలని నేను అనుకోవడంలేదు. ఇంతవరకూ ఉదయపూర్ ధనవంతులను నా అందంతో ఉర్రూతలూగించిన ఖరీదయిన వేశ్యను నేను. నిన్ను చూడగానే ఒక్కసారిగా నా మనసు మారిపోయింది. నిన్ను పెళ్ళాడి జీవితంలో సెటిల్ అవ్వాలనుకుంటున్నాను. నీ దగ్గర పనిమనిషిగా వుండేందుకయినా వెనకాడకూడదని నిశ్చయించుకున్నాను... నన్ను కాదనకు" అంటూ అర్థించింది జీరబోయిన కంఠంతో.

ఇరకాటంలో పెడుతున్న ఆమె మాటలు విని గాఢంగా నిట్టూర్చాడు శ్యామ్‌సుందర్. 'సారీ చాందిని! అయాం వెరీసారీ! నాకు యిదివరకే పెళ్ళయింది. ఒకరికి ఇద్దరు పెళ్ళాలు కూడా వున్నారు. అటువంటి నా మీద నువ్వు ఆశలు పెంచుకోవటం మంచిదికాదు" అంటూ అప్పటికప్పుడు ఒక కహానీ వినిపించాడు.

తల అడ్డంగా తిప్పింది చాందినీ.

"ఇద్దర్ని కట్టుకుని ఏలుకుంటున్నవాడికి మూడోదానిగా నన్ను భరించటం

పెద్ద కష్టం ఏమీకాదు. కాదనిపించేలా నాకున్నదంతా నీకు ఇచ్చేస్తాను....ఈ రోజునుంచే నా వేశ్యావృత్తికి స్వస్తి చెబుతున్నాను. నువ్వు ఎన్ని చెప్పినా నేను వినను. నన్ను వదిలించుకోవాలన్న ఆలోచన మానుకోవటం నీకే మంచిది" అంటూ అక్కడే వున్న బల్బీర్‌కి చెప్పవలసిన జాగ్రత్తలు చెప్పి ఆ గదిలోంచి అవతలికి వెళ్ళిపోయింది చాందినీ.

గాఢంగా నిట్టూరుస్తూ బల్బీర్‌వంక చూశాడు శ్యామ్‌సుందర్.

"ఆడవాళ్ళు అలాగే అంటుంటారు బ్రదర్! వాళ్ళ మాటల్ని పట్టించుకోవటం మంచిదికాదు...ఎంతయినా మనం మగవాళ్ళం కాబట్టి ఇద్దరం ఆలోచించి ఒక ఒప్పందానికి రావటం మంచిది. వాట్ డూ యూ సే?" అంటూ లేచి అతన్ని సమీపించాడు.

మాట్లాడలేదు బల్బీర్. మౌనవ్రతం పట్టినవాడిలా అలాగే నిలుచున్నాడు.

"ఆల్‌రైట్! నువ్వేం మాట్లాడవద్దు. మనం కుదుర్చుకోబోయే ఒప్పందం ఏమిటో నేను చెబుతాను. నేను బయటికి వెళ్ళటానికి అనుమతి యిచ్చావంటే నీకు బోలెడన్ని బహుమతులు యిస్తాను. చాందినీకి ఈ విషయం తెలీకముందే వచ్చేస్తాను" అంటూ రిక్వెస్ట్ చేశాడు శ్యామ్‌సుందర్.

షరా మామూలే అన్నట్టు సమాధానం చెప్పలేదు బల్బీర్. తన దగ్గరకి వచ్చిన శ్యామ్‌సుందర్‌ని రబ్బరుబొమ్మను ఎత్తినట్టు ఎత్తి మంచంమీదికి విసిరేసాడు.

మంచం మీద పడి గాయాలు రేగటంతో ఒళ్ళు మండిపోయింది శ్యామ్‌సుందర్‌కి. విపరీతమయిన కోపం ముంచుకువచ్చింది.

"నన్నొక బస్తానో, బంతినో అనుకుని అస్తమానూ అలా ఎత్తి విసిరేయటంలో ఏమిటి నీ ఉద్దేశం? ఎత్తి విసరటం నాకు మాత్రం చేత కాదనుకుంటున్నావా...? నన్ను మించిన బలవంతుడవని విర్రవీగుతున్నావా?" అని స్టడీ అవుతూ చివ్వున మంచంమీంచి క్రిందికి దిగాడు శ్యామ్‌సుందర్.

వినటానికి బల్బీర్ అక్కడ వుంటేకదా?

శ్యామ్‌సుందర్‌ని ఎత్తివిసిరేసే కార్యక్రమం పూర్తి అవుతూనే చేతులు

దులుపుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు అతను. పెద్ద శబ్దంతో తలుపులు మూసేశాడు.

అసహనంగా తల విదిలించాడు శ్యామ్‌సుందర్. సిగరెట్ దమ్ములాగుతూ తన పొజిషన్‌ని అంచనా వేసుకోవటం ప్రారంభించాడు.

ఉదయపూర్‌లో అడుగుపెట్టి మూడురోజులు కావస్తున్నా....అప్పగించిన పనిలో ఆవగింజంతయినా ప్రోగ్రెస్ సాధించలేదు తను... వాసంతికి ఫోన్ కూడా చేయలేదు.

ఇప్పుడు తను వున్న స్థితిలో బల్బీర్ లాంటి బలవంతుడితో పంతానికి పోవటం అంత మంచిదికాదని తెలుస్తూనే వుంది. ఆ బండవాడి ముందు తన మొండితనం ప్రదర్శించి ప్రయోజనం వుండదని అర్థం అవుతూనే వుంది.

సో....వెళ్ళగలిగితే అతని కంటపడకుండానే వెళ్ళాలి. కామ్‌గా ఆ ఇంట్లోంచి బయటపడి కాలికి బుద్ధిచెప్పాలి.

అలా అనుకుంటూనే ఒకసారి చూట్టూ చూశాడు శ్యామ్‌సుందర్. బయటపడేందుకు అనువయిన మార్గాన్ని గురించి అన్వేషించాడు.

చూస్తుండగానే అతని దృష్టిని ఆకర్షించింది గది వెనకభాగంలో గ్లాస్‌తో కవర్ చేయబడిన ఇనుపచువ్వల కిటికీ. వెంటనే తనను ఆశ్రయించి బయటపడమని ఆహ్వానిస్తున్నట్టు అనిపించింది.

చిన్నగా నవ్వుతూ చేతిలోని సిగరెట్‌ను యాష్‌ట్రేలో వేసాడు శ్యామ్‌సుందర్. ఎయిర్‌బేగ్‌ను ఎప్పటిలా భుజానికి తగిలించుకుని గ్లాస్‌విండోను సమీపించాడు.

ముందుగా విండో తలుపుల్ని ఓపెన్‌చేసి ఇనుపచువ్వలను పట్టి కదిపాడు. అవకాశం వుంటే వాటిని వంచి అవతలికి పోవాలని అనుకున్నాడు.

బలంగా వున్నాయి ఆ ఇనుపచువ్వలు. వంచటానికి వీలుపడనంత పటిష్టంగా అమర్చబడింది కిటికీ.

వెంటనే ఎయిర్‌బేగ్‌ను ఓపెన్‌చేసి చిన్న గాజుసీసాను బయటికి తీసాడు శ్యామ్‌సుందర్. బాటిల్ ఓపెన్‌చేసి అందులోవున్న సాల్ట్‌లాంటి తెల్లటి పౌడర్‌ని.... ఇనుపచువ్వలకుఅద్ది, వెయిట్ చేయటం ప్రారంభించాడు.

గాలి సోకిన కొద్ది క్షణాలకే కరిగి ద్రవం అయిపోతుంది ఆ పౌడర్. అది

కరగటమే కాకుండా తాకిన ప్రతి వస్తువునూ చెదలు కొరికినట్టు కొరికి బలహీనపరిచే యాసిడ్ లక్షణాలు కలిగి వుందది.

సరిగ్గా నలభై అయిదు సెకన్లు గడవగానే మొదలైంది ఆ పౌడర్‌కి సంబంధించిన కెమికల్ రియాక్షన్. గాలిలోని ఉష్ణోగ్రతను రిసీవ్ చేసుకుంటూ బుసబుస పొంగుతూ ద్రవంగా మారిపోయింది ఆ పౌడర్.

మరో నిముషం ఆగి రెండు చేతులతో రెండు ఇనుపచువ్వలను పట్టుకుని బలంగా పైకెత్తాడు శ్యామ్‌సుందర్. అక్కడ ఏర్పడిన ఖాళీలోంచి బయటికి దూకేశాడు.

పాదాలు నేలను తాకగానే కొండంత బరువు గుండెలమీంచి తొలగిపోయినట్లు తేలికగా వూపిరి పీల్చుకున్నాడు శ్యామ్‌సుందర్. ఇక బల్బీర్ గురించి భయపడవలసిందేమీ లేదనుకుంటూ పక్కకి తిరిగి లాగిపెట్టి ముఖం మీద గుద్దినట్టు అదిరిపడ్డాడు.

ఉరిమిచూస్తూ ఎదురుగా నిలబడి వున్నాడు బల్బీర్.

"నా కళ్ళుగప్పి తప్పించుకోవటం అంత సులువుకాదు మిస్టర్! నా అనుమతి లేకుండా నువ్వీ బంగ్లాలోంచి అడుగు బయటికి వేసే ప్రసక్తిలేదు" అన్నాడు గరగరలాడుతున్న కంఠంతో.

అనటంతో సరిపెట్టుకోలేదు అతను. అలవాటు ప్రకారం అతన్ని ఎత్తి... అతను వచ్చిన కిటికీలోంచే గదిలోకి విసిరేందుకు చేతిని వేగంగా ముందుకు జాచాడు.

తను కంటపడితే అతను చేసే మొట్టమొదట పని అదేనని శ్యామ్‌సుందర్‌కి తెలియటంవల్ల...ముందుకు జాచిన అతని చేతికి అందకుండా వేగంగా రెండు అడుగులు వెనక్కి వేసాడు. తన రెండు చేతులతో అతని చేతిని అందిపుచ్చుకుని బలంగా టెంప్ట్ చేసాడు.

అతనలా చేస్తాడని వూహించని బల్బీర్....మఱ్ఱి మొదలువంటి తన చేయి తడిగుడ్డను పిండినట్టు మెలితిప్పబడేసరికి కంగారుపడిపోయాడు. బాధగా నొసలు చిట్లిస్తూ తన చేతిని విడిపించుకోవాలని ప్రయత్నించాడు.

అతడికి ఆ అవకాశాన్ని యివ్వకుండా చేతిని కత్తిలా బిగించి అతని

మెడమీద బలంగా కొట్టాడు శ్యామ్‌సుందర్. అతన్ని స్పృహ తప్పించి అక్కడే నేలమీద పడుకోబెట్టాడు.

"అయాం సారీ మిస్టర్ బల్బీర్! నీతో హేండ్ టు హేండ్ పోరాడే ఓపికలేక ఇలా చేయాల్సివచ్చింది" అంటూ అతన్ని అక్కడే వదిలి ముందుకు కదిలాడు శ్యామ్‌సుందర్. బంగ్లా ఆవరణను వదిలి బయటికి వెళ్ళిపోయాడు.

అక్కడ నుండి చీకటి సందుల వెంట మొదలయింది అతని ప్రయాణం. ఉదయపూర్ వన్‌టౌన్ ఏరియాలో వున్న ఒక అడ్రస్ వైపు సాగింది.

# 5

**ఢిల్లీ** నుండి వచ్చిన సెక్యూరిటీ ఆఫీసర్ యూసఫ్ ఆలీ అనుచరుల చేతులలో నుండి ప్రాణాలతో తప్పించుకున్నాడట. తనను చంపబోయిన వారిలో కొంతమందిని తీవ్రంగా గాయపరిచి పారిపోయాడట.

ఆ విషయం విన్నప్పటినుండి మనసు మనసులో లేదు వీరూమియాకి. కాళ్ళూ, చేతులు ఆడటంలేదు.

ఆ సెక్యూరిటీ ఆఫీసర్ ఎవరో అతనికి తెలుసు. అతని బ్యాక్‌గ్రౌండ్ ఎటువంటిదో కూడా అతనికి బాగా తెలుసు. తెలిసి తెలిసీ అతని విషయంలో చేయకూడని పొరపాటు చేశాడు. అతను పింక్ సిటీఎక్స్‌ప్రెస్‌లో ఉదయపూర్ వస్తున్నాడన్న సమాచారాన్ని ఢిల్లీ నుంచి సేకరించి లక్ష రూపాయలకు అమ్ముకుని కొరివితో తల గోక్కున్నంత పనిచేశాడు.

ఈ విషయం అతనికి గనక తెలిస్తే, తన అంతు తేలుస్తాడు ఆ సెక్యూరిటీ ఆఫీసర్. తనను ముక్కలు ముక్కలుగా నరికి ఎడారి రాబందులకు విందు చేస్తాడు.

మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తున్న భయాన్ని అదుపు చేసుకునే ప్రయత్నంలో ఒక ఫుల్‌బాటిల్ రమ్ము త్రాగేశాడు వీరూమియా.

అయినా నిషా ఎక్కినట్టు అనిపించలేదు. గుండె దడ కొంచెం కూడా తగ్గలేదు.

ఇక లాభంలేదు...అతను తనను వెదుక్కుంటూ రాకముందే తను

ఉదయపూర్ నుండి అదృశ్యం అయిపోవటమే మంచిది. పరిస్థితులు సద్దుమణిగేదాకా అండర్ గ్రౌండ్ లోకి వెళ్ళిపోవటమే బాగుంటుంది అనుకున్నాడు అతను.

అలా అనుకోగానే కొద్దిగా తేలికపడింది అతని మనసు....గుండె దడ కూడా రవ్వంత ఉపశమించింది.

వెంటనే బేరర్ ను పిలిచి మరో హాఫ్ బాటిల్ ఆర్డర్ చేశాడు వీరూమియా. బేరర్ తెచ్చిన రమ్మును గ్లాసులో ఒంపుకుని గబగబా గుటకలు వేసి, సిగరెట్ పేకెట్‌లోంచి సిగరెట్ నొకదాన్ని పెదవుల మధ్య పెట్టుకుని, అగ్గిపెట్టెకోసం జేబులు వెదుక్కున్నాడు.

అదేసమయంలో ఎదురు సీట్లోంచి ఉన్నట్లుండి వినిపించింది 'చక్' మంటూ అగ్గిపుల్ల వెలిగించిన శబ్దం. మండుతున్న అగ్గిపుల్ల ఆతని సిగరెట్‌కి అందించబడింది.

సిగరెట్ వెలిగించుకోబోతూ ఎందుకనో తలెత్తి ముందుకు చూసి అదిరిపడ్డాడు వీరూమియా. పెదవులమధ్య సిగరెట్ జారి క్రిందపడిపోతుండగా మంచు ముద్దలు మీద పడుతున్నట్టు కూర్చున్న కుర్చీలో బిగుసుకుపోయాడు.

అప్పుడే వెలిగించుకున్న సిగరెట్‌ను దమ్ములాగుతూ సూటిగా అతనివంక చూశాడు ఎదురుగా కూర్చున్న వ్యక్తి. చివరికంటా మండిన అగ్గిపుల్ల చేతివ్రేళ్ళను తాకకముందే నోటితో వూది ఆర్పేసి యాష్ట్రేలో వేశాడు.

"కాల్చుకో వీరూమియా! సిగరెట్ కాల్చుకోకపోతే నీ టెన్షన్ ఎలా తగ్గుతుంది? తాగిన రమ్ము నిషా తలకి ఎలా ఎక్కుతుంది?" అని అడిగాడు ఆ వ్యక్తి.

ఎవరో కాదతను.

ఎవర్ని గురించయితే అదే పనిగా ఆలోచిస్తూ అతిగా ఆందోళన చెందుతున్నాడో...ఎవరికంట పడకముందే వూరు విడిచి పారిపోవాలనుకుంటున్నాడో అతనే వీరూమియాకి ఎదురుగా కూర్చున్న వ్యక్తి–శ్యామ్‌సుందర్.

చాందినీ ఇంట్లోంచి బయటపడిన తరువాత వీరూమియా అడ్రసును గుర్తుచేసుకుంటూ బయలుదేరాడు అతను. తనకు తెలిసిన అడ్రస్ ప్రకారం వన్‌టౌన్ ఏరియాలో అతడుండే పెంకుటింటికి చేరుకున్నాడు.

అతడుండే పెంకుటిల్లు చిన్నసైజు బంగ్లాగా మారటం ఆశ్చర్యాన్ని

కలిగించింది శ్యామ్‌సుందర్‌కు. చుట్టుపక్కల ఉన్నవారిని ఎంక్వయిరీ చేయగా తెలిసింది...వీరూమియా స్థితిలో మార్పు వచ్చిందనీ, రెండు చేతులా డబ్బు సంపాదిస్తున్నాడన్న సంగతి.

క్రిమినల్ సొసైటీని గురించి పూర్తిగా తెలిసినవాడు వీరూమియా. రాజస్థాన్ రాష్ట్రంలో ఎక్కడ, ఎటువంటి క్రిమినల్ యాక్టివిటీస్ మొదలయినా నిముషాల మీద అతని నోటీసుకి వచ్చి చేరుతుంది ఆ వార్త. అలా సేకరించిన సమాచారాన్ని ఎదుటివారి అవసరాన్ని బట్టి, దాని విలువను బట్టి సమయానుకూలంగా సరసమయిన ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటాడు అతను.

అలా విక్రయించే ప్రయత్నంలో ఒక్కోసారి చిక్కులలో పడుతుంటాడు. గతంలో ఒకసారి తలవని తలంపుగా ఒక హత్యానేరం తనమీద పడినప్పుడు... తనను కాపాడమంటూ డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్‌కి వచ్చి, వాత్సవను ఆశ్రయించాడు. అతనితోపాటు ఉదయపూర్ వచ్చి జరిగిన హత్యకూ, అతనికి ఎలాంటి సంబంధం లేదని...కేవలం క్రిమినల్ యాక్టివిటీస్ మీద ఒక కన్నువేసి వుంచటమే అతని వృత్తి అని తెలుసుకున్న తరువాత....అతిప్రయత్నంమీద అతను నిర్దోషి అని నిరూపించి ప్రాబ్లమ్‌ను సాల్వ్ చేశారు వాత్సవ, శ్యామ్ సుందర్‌లు.

"నువ్వు ఎంచుకున్న వృత్తి...సామాన్యులకూ, చట్టానికి సాయపడేటంత వరకూ మంచిదే వీరూమియా. చేపట్టిన వృత్తిలో నిలకడ తగ్గినా, నిజాయితీ లోపించినా చిక్కులలో పడక తప్పదు. ఇకనుంచీ అలా జరగకుండా చూసుకో!" అంటూ హెచ్చరించాడు వాత్సవ.

"ఎప్పుడు వచ్చారు శ్యామ్‌సుందర్ సాబ్! ఇంత శ్రమ తీసుకుని మీరే ఎందుకు వచ్చారు? కాకితో కబురు పంపితే నేనే వచ్చేవాడ్ని కదా'' శ్యామ్‌సుందర్‌ని చూసిన షాక్ నుండి తేరుకుని అన్నాడు వీరూమియా.

"కాలం మారిపోయింది వీరూమియా! కాకులు ఇప్పుడు ఖరీదయిన వాళ్ళ మాటలేగానీ, మన కబుర్లు వినే స్టేజ్‌లో లేవు. అందుకే నిన్ను కలుసుకోటానికి నేనే స్వయంగా వచ్చాను. అన్నట్టు నేను ఉదయపూర్ స్టేషన్‌లో అడుగుపెట్టగానే ఏం జరిగిందో తెలుసా? అయినా నా పిచ్చి కాకపోతే... జరిగిందేమిటో నీకు

తెలియకుండా వుంటుందా?” అన్నాడు శ్యామ్‌సుందర్.

అతని మాటలకు గొంతులో తడారిపోయినట్లు అనిపించింది వీరూమియాకి. అతని రాకను గురించిన సమాచారాన్ని ప్రత్యర్థులకు తను అమ్ముకున్నట్లు అతనికి తెలిసిపోయిందని గ్రహించి బలవంతంగా గుటకలు మింగాడు.

వాత్సవ, శ్యామ్‌సుందర్‌ల గురించి అతనికి బాగా తెలుసు.

వాత్సవ అగ్నిలాంటివాడయితే..శ్యామ్‌సుందర్ చిచ్చరపిడుగులాంటివాడు. పరిస్థితులకు అనుగుణంగా ఆలోచించి నిదానంగా అడుగు ముందుకువేసే అలవాటు వాత్సవకి వున్నంతగా శ్యామ్‌సుందర్‌కి లేదు.

అప్పుడు....వాళ్ళు తన సమస్యను పరిష్కరించి, ఉరికంబం ఎక్కనున్న తనను రక్షించినప్పుడు ప్రత్యక్షంగా చూశాడు వారి శక్తిసామర్థ్యాలను. ఇప్పుడు ఆ సంఘటనలు గుర్తుకురాగానే ఝుల్లుమంది అతని గుండె.

“విన్నాను శ్యామ్‌సుందర్ సాబ్! మూడు రోజుల క్రిందట స్టేషన్ దగ్గర జరిగిన గొడవను గురించి విన్నాను. కానీ గొడవ మీకు సంబంధించిందని మాత్రం అనుకోలేదు'' అన్నాడు వీరూమియా నిబ్బరంగా వుండటానికి ప్రయత్నిస్తూ.

చిన్నగా నవ్వాడు శ్యామ్‌సుందర్. అతని ముందున్న బాటిల్‌లో మిగిలి వున్న రమ్మును గ్లాసులోకి వంపి అతని ముందుంచి, తీసుకోమన్నట్టు సైగలు చేశాడు కళ్ళతో.

నిలదొక్కుకునే స్థితిని దాటిపోయేటంతగా అప్పటికే త్రాగివున్నాడు వీరూమియా. అయినా నిషా తలకెక్కకపోవటంతో అందుకున్నాడు శ్యామ్‌సుందర్ తన ముందుంచిన గ్లాసును.

“ఇటీవల టవర్ క్లాక్ సెంటర్‌లో ఒక హత్య జరిగింది. పబ్లిక్ ప్లేస్‌లో బాంబులు ప్రయోగించి ఓ వ్యక్తిని చంపేశారన్న సంగతి నీకు తెలిసే వుంటుంది. దానికి సంబంధించిన వివరాలు కావాలి నాకు.”

వీరూమియా రమ్ము త్రాగుతుండగా తాపీగా ప్రశ్నించాడు శ్యామ్‌సుందర్.

ఆ ప్రశ్న వింటూనే గతుక్కుమన్నాడు వీరూమియా. వెచ్చగా గొంతులోకి

జారుతున్న రమ్ముకి షడన్‌గా ఏదో అడ్డుపడి వెనక్కి నెట్టినట్టు పొలమారి ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు.

గ్లాసులో మిగిలిన రమ్మును అలాగే వదిలేసి అరిచేత్తో తన నెత్తిన తనే చరుచుకుంటూ స్టడీ అయ్యాడు. అయిదు నిముషాల తర్వాత నిస్సహాయత నిండిన చూపులతో అతని ముఖంలోకి చూస్తూ నీరసంగా నిట్టూర్చాడు.

"క్షమించండి శ్యామ్‌సుందర్ సాబ్! ఇబ్బందుల పాలవటం ఇష్టం లేక ఇతరుల రహస్యాలను అమ్ముకునే వృత్తిని ఈ మధ్యనే వదులుకున్నాను. ఈ విషయంలో మీకు ఏ విధమయిన వివరాలు అందించలేని నా నిస్సహాయతకు చింతిస్తున్నాను!" అన్నాడు.

అంత త్రాగినా కొంతయినా తడబాటు లేకుండా మాట్లాడుతున్న అతని సామర్థ్యానికి అచ్చెరువొందాడు శ్యామ్‌సుందర్. అడగాల్సిన పద్ధతిలో అడిగితే తప్ప అతను దారికిరాడని గ్రహించాడు.

"కహానీలు వినిపించవద్దు వీరూమియా! నీకు ఏది తెలుసో, ఏది తెలియదో నాకు బాగా తెలుసు. వచ్చినపని పూర్తిచేసుకోకుండా నేను వెనక్కి వెళ్ళేరకం కాదని నీకూ తెలుసు! కాబట్టి నీ కట్టుకథలను కట్టిపెట్టి నిజం చెప్పు" అని సిగరెట్ వెలిగించుకుంటూ సీరియస్‌గా అడిగాడు.

అడుగుతూనే రివాల్వర్‌ను తీసి టేబుల్ క్రిందనుంచి అతనికి గురిపెట్టాడు. దాంతోపాటే ఎయిర్‌బేగ్‌లోంచి అయిదువందల రూపాయల నోట్ల కట్టలను తీసి టేబుల్‌మీద అతని ముందు వుంచాడు.

బలవంతంగా గుటకలు మింగుతూ నోట్ల కట్టనూ, శ్యామ్‌సుందర్‌ని మార్చి మార్చి చూశాడు వీరూమియా. క్రిందనుండి ఆకలిగా ఎదురు చూస్తున్న రివాల్వర్‌ను కూడా గమనించాడు.

శ్యామ్‌సుందర్ ఉద్దేశ్యం ఏమిటన్నది అరటిపండు వలిచినంత క్లియర్‌గా అతనికి అర్థం అవుతూనే వుంది.

ఒకటి...డబ్బు తీసుకుని వృత్తిధర్మాన్ని పాటిస్తూ అతనికి కావాల్సిన సమాచారాన్ని అందించాలి. రెండు...చెప్పనని మొండికేసి అతని రివాల్వర్‌కి బలి అయి ప్రాణాలు వదలాలి.

గబగబా ఆలోచించి ఆ రెండింటిలో మొదటిదానివైపే మొగ్గుచూపాడు

వీరూమియా.

ఒక నిర్ణయానికి వచ్చినట్టు ముఖంపెట్టి చిరునవ్వును పెదవులమీదికి తెచ్చుకున్నాడు.

"మీ దెబ్బకు ఆగలేని అర్భకుడ్ని నేను...పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం దేనికి సాబ్! మీకు కావాల్సిన ఖచ్చితమయిన సమాచారాన్ని అందిస్తాను. నా పేరు బయటపడకుండా చూడండి...." అంటూ నోట్ల కట్టను అందుకుని షర్టువెనక జేబులోకి నెట్టాడు.

"డోంట్‌వర్రీ వీరూమియా! నీకొచ్చిన భయమేమీలేదు. అంత అవసరం అనుకుంటే నీ ప్రాణాలకు నా ప్రాణాలు అడ్డువేస్తాను. నిజం చెప్పు!" అన్నాడు శ్యామ్‌సుందర్.

చిన్నగా తలవూపాడు వీరూమియా. గ్లాసులో మిగిలివున్న గుక్కెడు రమ్మును గొంతులో పోసుకుని గుటకలువేస్తూ మోచేతులు టేబుల్‌మీద ఆనించి ముందుకు వంగాడు.

"జాగ్రత్తగా వినండి శ్యామ్‌సుందర్ సాబ్! బజూరీ సరసుమీద కట్టబడిన వంతెనను ఆనుకొని వుంది ఒక శిధిల భవంతి. స్టేషన్ దగ్గర మీపై దాడిచేసిన ఉదయపూర్ రౌడీలు రాత్రిళ్ళు అక్కడే మకాం పెడతారు. పగలంతా ఎక్కడెక్కడ తిరిగినా, చీకటిపడేసరికి అక్కడికివచ్చి చేరతారు. వాళ్ళ నాయకుడు అబ్దుల్లా, టవర్‌క్లాక్ దగ్గర జరిగిన హత్యకు కారకులు వాళ్ళు అని చెప్పాడు.

ఘాటయిన రమ్ము‌వాసన అతని నోట్లోంచి దూసుకువస్తూ నాసికా రంధ్రాలలో జొరబడి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా పట్టించుకోకుండా అతను చెప్పింది శ్రద్ధగా విన్నాడు శ్యామ్‌సుందర్. వామిటింగ్ సెన్సేషన్‌ని అదుపు చేసుకుంటూ తల వూపుతూ టేబిల్‌క్రింద నుండి గురిపెట్టిన రివాల్వర్‌ను వెనక్కి తీసుకుని జేబులో పెట్టుకున్నాడు.

"అచ్ఛా వీరూమియా! వెళ్ళొస్తాను. అవసరం అయితే మళ్ళీ కలుస్తాను" అంటూ లేచి నిలబడ్డాడు.

"అలాగే శ్యామ్‌సుందర్ సాబ్! మళ్ళీ మళ్ళీ నన్ను కలవాల్సిన అవసరం మీకు వుండదనుకుంటాను. జాగ్రత్తగా వెళ్ళిరండి" అంటూ తను కూడా లేచి త్రాగిన రమ్ముకు సొమ్ముచెల్లించి శ్యామ్‌సుందర్‌తోపాటు బార్‌లోంచి బయటకి

వచ్చాడు వీరూమియా.

అతను చూస్తుండగానే ఒక ఆటోఎక్కి అక్కడ్నించి బయలుదేరాడు శ్యామ్‌సుందర్. ఆటో కనుమరుగయ్యేదాకా అక్కడే నిలబడ్డాడు వీరూమియా. సిగరెట్ వెలిగించుకోవాలన్న కోరికను వాయిదా వేసుకుని పరుగులాంటి నడకతోపోయి ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లో దూరాడు.

# 6

**బజూరీ** సరసుమీద కొత్తగా కట్టబడిన వంతెనదగ్గర ఆటో ఆపించి దిగిపోయాడు శ్యామ్‌సుందర్. ఆటోవాలాకి మీటర్‌ఛార్జ్‌ను పేచేసేసి, అతను వెళ్ళిపోయేవరకూ అక్కడే నిలబడి, ఆ తరువాత సిగరెట్ వెలిగించుకుని దమ్ములాగుతూ చుట్టూ చూశాడు.

వంతెనమీద అక్కడొకటి అక్కడొకటి వెలుగుతున్నాయి లైట్లు. బజూరీ సరసు పైనుండి తెరలు తెరలుగా వీస్తోంది చల్లటిగాలి.

వీరూమియా చెప్పిన శిథిల కట్టడం వంతెనకు దగ్గరలోనే వుంది. చుట్టూ చూసిన శ్యామ్‌సుందర్ కంటికి సులువుగా కనిపించింది అది.

సిగరెట్ కాలుస్తూ అటు కదిలాడు శ్యామ్‌సుందర్. పరిసరాలను జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తూ, శిథిల కట్టడాన్నిసమీపించి, లోపలికి వెళ్ళాడు.

అగ్నిప్రమాదానికి గురిఅయినట్టు నల్లబడి అసహ్యంగా కనిపిస్తున్న గోడలతో...యిటుకలు వూడి విశాలమయిన కిటికీలతో....పరమఛండాలంగా వుంది ఆ శిథిలకట్టడం....గాలిలో వ్యాపిస్తున్న గబ్బిలాల కంపుతో ఇంతెత్తు పేరుకున్న దుమ్ముతో రోత పుట్టిస్తోంది.

ఆ కట్టడంలో అడుగుపెట్టి రెండు ద్వారాలు దాటిన శ్యామ్‌సుందర్ ఉన్నట్టుండి ఏదో కాళ్లకి చుట్టుకుంటున్నట్లు ఉలిక్కిపడుతూ పక్కకి దూకాడు. అమితవేగంతో పాంటుజేబులోంచి రివాల్వర్‌ను బయటికి తీసి కనులు చికిలించుకుని క్రిందికి చూశాడు.

అతను చూస్తుండగానే గోడవారగా అవతలికిపోతూ కనిపించింది యింత

లావున్న పందికొక్కు ఒకటి. అతని కదలికలకు అదిరిపోయినట్టు విశాలమయిన ఆ గది కార్నర్‌లో వున్న ఒక బొరియలోకిదూరి అదృశ్యం అయింది.

కంగారుపెట్టి కనుమరుగయిన పందికొక్కును తలుచుకుంటూ తనలో తానే నవ్వుకున్నాడు శ్యామ్‌సుందర్...వీరూమియా మాటలునమ్మి అనవసరంగా అక్కడికి వచ్చానేమో అనుకుంటూ ఒక్కొక్క ద్వారాన్నే దాటి శిథిల కట్టడం వెనుక భాగానికి చేరుకున్నాడు.

అదే సమయంలో ఉన్నట్టుండి వెనకనుండి వినిపించింది మెత్తటి శబ్దం, అతన్ని మరోసారి ఉలికిపడేటట్టు చేసింది.

పందికొక్కు పాకుడికీ, బలయిన పాదాల అడుగుల వత్తిడికీ తేడా తెలిసిన శ్యామ్‌సుందర్ వెంటనే తిరిగాడు ఆ శబ్దం వినిపించిన వైపు. కనులు చికిలించుకుని ముందుకు చూస్తూ ఎవరు ఎదురయినా రివాల్వర్‌తో కవర్ చేయాలని చేతిని పైకెత్తాడు.

అతడి ప్రయత్నం నెరవేరకముందే అతని ముంజేతిని బలంగా తాకింది ఓ యినుపచువ్వ. చేతిలోని రివాల్వర్‌ను ఎగరగొట్టి.... ముంజేతి ఎముక విరిగిపోయినంత బాధను క్రియేట్ చేసింది.

నరాలు జివ్వుమంటుండగా తిమ్మిరెక్కిపోయింది రివాల్వర్‌ను జారవిడిచిన అతని కుడిచేయి....హఠాత్తుగా తనమీద దాడిచేసిన ప్రత్యర్థికోసం పరిశీలనగా ముందుకు చూశాయి అతని కళ్ళు.

చూస్తూండగానే.....యిటుకలు వూడిపోయిన గోడలచాటునుండి అతని ముందు ప్రత్యక్షం అయ్యారు అరడజనుమంది రౌడీలు. రివాల్వర్‌లు, సైకిల్ చైన్‌లూ, యినుపచువ్వలూ, దుడ్డుకర్రలూలాంటి ఆయుధాలు ఎత్తి పట్టుకుని అతన్ని చుట్టుముట్టారు.

చేతిలోని బంగాళాదుంపల చిప్స్‌పొట్లంతో అందరికంటే ఆఖరున ఒక గోడచాటునుండి శ్యామ్‌సుందర్ ముందుకు వచ్చాడు లావుగా, పొట్టిగా వున్న ఒక బోడిగుండు వ్యక్తి. చక్కగా వేయించిన చిప్స్‌ని కరకరా నములుతూ అతన్ని కదలకుండా నిలబెట్టిన తన అనుచరులవంక చూసి మెచ్చుకోలుగా తల వూపాడు.

“ఎవరు నువ్వు? ఎవరూ రావటానికి యిష్టపడని ఈ చోటుకి ఎందుకు

వచ్చావు? గబ్బిలాయిలూ, పందికొక్కులూ సంచరించే ఈ శిథిలకట్టడంలో ఎందుకు తిరుగుతున్నావు.....?" అని అడిగాడు మరో నాలుగు చిప్స్ నోట్లో వేసుకుంటూ.

"నా సంగతి తర్వాత చెబుతాను. ముందు నీ సంగతి చెప్పు.... అబ్దుల్లా అంటే నువ్వేకదూ?" అంటూ అదురు బెదురు లేకుండా ఎదురు ప్రశ్న వేశాడు శ్యామ్‌సుందర్.

ఆ ప్రశ్న వింటూనే ఆశ్చర్యంగా చూశాడు అతని ముఖంలోకి ఆ వ్యక్తి.

"అయితే నా పేరు తెలుసుకునే వచ్చావన్నమాట! అంతమాత్రం చేతనే నిన్ను చూసి వణికిపోతానని అనుకోవద్దు. నీలాంటివాళ్ళను నా సర్వీసులో చాలామందిని చూశాను. మాటిమాటికి మా వెంటపడి వేధించే నీలాంటి వాళ్ళను గతంలో అధోగతిపాలు చేశాను. ఇప్పుడు నీకు కూడా అటువంటి శిక్ష విధించబోతున్నాను."

ఒకపక్క చిప్స్‌ను నములుతూనే తన అనుచరులవంక చూసి కళ్లతో ఏవో సైగలు చేశాడు అబ్దుల్లా.

అతని సైగలు అర్థం చేసుకుంటూనే చేతులలోని ఆయుధాలను వాటంగా పట్టుకుని అడుగులు ముందుకు వేశారు అబ్దుల్లా అనుచరులు. తమ సహచరులలో ఒకతను శ్యామ్‌సుందర్‌ని రివాల్వర్‌తో కవర్ చేస్తుండగా అతన్ని సమీపించి భుజానికి వేలాడుతున్న ఎయిర్‌బేగ్‌ని లాగి అవతల పారేసి, పెడరెక్కలు విరిచి పట్టుకున్నాడు.

"నరకండి! ముందు....వాడి కాళ్ళు నరికేయండి! ఆ తరువాత చేతులు కూడా నరికి బజూరీ సరసులోకి విసిరేయండి" అని అరుస్తూ ఆదేశించి మరో నాలుగు చిప్స్ నోట్లో వేసుకున్నాడు అబ్దుల్లా.

అతని ఆదేశాలను వింటూ వేపాకు నమిలినట్టు చేదుగా తయారయింది శ్యామ్‌సుందర్ నోరు. శరవేగంతో ఆలోచిస్తూ.... వారి ప్రయత్నాన్ని ప్రారంభంలోనే భగ్నం చేసేందుకు దారులు వెదకటం ప్రారంభించింది అతని మస్తిష్కం.

శ్యామ్‌సుందర్ ఆలోచనల్లో సరయిన ఉపాయం చోటుచేసుకోకముందే

చేతులలోని దుడ్డుకర్రలను పక్కన పెట్టి దుస్తులమాటునుండి పదునయిన కైజారులను బయటికి తీశారు ఇద్దరు అనుచరులు. వాటిని రెండు చేతులతో బలంగా పట్టుకుని....అతని కాళ్లు నరికేందుకు ముందుకు వచ్చారు.

అదే సమయంలో జరిగిపోయింది ఎవరూ వూహించని సంఘటన ఒకటి.

అబ్దుల్లా చేతిలో వున్న పొట్లాలలోంచి అతను తీస్తున్నప్పుడు జారిక్రింద పడిపోయాయి కొన్ని చిప్స్.... రుచికరమయిన సువాసనలను గాలిలోకి వ్యాపింపచేసాయి.

పాతాళంలో దాచిపెట్టిన పదార్థం వాసనయినా యిట్టే పసిగట్టే స్మెల్లింగ్ సెన్సేషన్ గలిగిన పందికొక్కు చటుక్కున బొరియలోంచి బయటికి వచ్చింది....నేలమీద చిప్స్ పడిన చోటును అన్వేషిస్తూ మెల్లగా ముందుకు ప్రాకుతూ శ్యామ్‌సుందర్ పాదాలను సమీపించింది.

ఎదురుచూడని విధంగా అరుగుదెంచిన ఆ పందికొక్కు రాకనే తనకు అవకాశంగా మలచుకున్నాడు శ్యామ్‌సుందర్. దానిని మరింత దగ్గరగా రానిచ్చి.... శక్తినంతా కుడిపాదంలో కేంద్రీకరించుకుని ఈడ్చితన్నాడు.

అన్న వస్త్రాలకు పోతే ఉన్న వస్త్రాలు వూడిపోయినట్టు అయింది ఆ పందికొక్కు పరిస్థితి. శ్యామ్‌సుందర్ తన్నిన తన్నుకు కీచుగా అరుస్తూ రబ్బరు బంతిలా గాలిలోకి ఎగిరింది.

దానితోపాటే గాలిలోకి విరజిమ్మబడినట్టు లేచింది....నేల మీద ఇంతెత్తున దట్టంగా పేరుకున్న దుమ్ము. సూటిగా పోయి అబ్దుల్లా ముఖాన్ని తాకి క్రిందపడింది పందికొక్కు. కంగారుగా అటు ఇటు తిరిగి తన బొరియలోకి దూరిపోయింది.

ఆ వెనుకనే గుప్పిళ్ళతో విసిరినట్టు అబ్దుల్లా ముఖంమీద పడింది గాల్లోకి లేచిన దుమ్ము. కళ్ళ లోపలికి పోయి కరకరమనిపించటం ప్రారంభించింది అతనికి.

పందికొక్కుకంటే పదింతల స్థాయిలో కీచుగా అరిచాడు అబ్దుల్లా. చిప్స్ పొట్లాన్ని వదిలేసి వెనక్కి దూకి కళ్ళు నులుముకుంటూ చిందులు వేయటం ప్రారంభించాడు.

కైజారులతో శ్యామ్‌సుందర్ కాళ్ళునునరకబోతున్న రౌడీలు కంగారు

పడుతూ.... తమ ప్రయత్నాన్ని తాత్కాలికంగా ఆపి తలలు తిప్పి చూసారు అబ్దుల్లావంక. ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ఆత్రుతను అదుపులో వుంచుకోలేక... ఆరాటంగా పక్కకి తిరిగారు శ్యామ్‌సుందర్ పెడరెక్కలు విరిచి పట్టుకున్న రౌడీలు.

వారందరితోపాటే హడావుడిగా తలత్రిప్పి చూసాడు రివాల్వర్‌తో శ్యామ్‌సుందర్ని కవర్ చేస్తున్న రౌడీ...ప్రత్యర్థి ప్రమాదకరమయిన వాడన్న సంగతి మరిచిపోయి చేయకూడని పొరపాటు చేశారు.

అందరి అటెన్షన్ డైవర్ట్ అవటంతో లభించిన ఆ అవకాశాన్ని వృథా చేసుకోలేదు శ్యామ్‌సుందర్. రెప్పపాటు కాలాన్ని కూడా వృథాచేయలేదు.

ఉన్నట్టుండి బిగ్గరగా అరుస్తూ, పెడరెక్కలు విరిచిపట్టుకున్న వాళ్ళను విసురుగా ముందుకు లాగి, బలంగా గుద్దాడు వారి ముఖాలమీద. అదే వేగంతో కైజారులు పుచ్చుకున్న వారి తొడలమీద బలంగా తన్ని పడగొట్టాడు.

బాధగా అరుస్తూ తలొకపక్కా పడిపోయారు ఆ నలుగురు. అది గమనించి గబగబా ముందుకు వచ్చి చేతిలోని యినుపచువ్వలతో శ్యామ్‌సుందర్ని నిలువరించటానికి ప్రయత్నించాడు ఒక రౌడీ. రివాల్వర్ ప్రయోగించటానికి రెడీ అయ్యాడు ఇంకొక రౌడీ.

వారి ప్రయత్నాలు కార్యరూపం దాల్చకముందే వేగవంతమయిన తన కదలికలతో కరచరణాలకు పని కల్పించాడు శ్యామ్‌సుందర్. ఆ ఇద్దర్నీ పడగొట్టి, క్రింద పడినవాడి చేతులలోంచి జారిపోయిన ఇనుపచువ్వను చేజిక్కించుకుని విజృంభించాడు.

ఫట్....ఫట్.... వెలువరించటం ప్రారంభించాయి పచ్చికొమ్మలు విరుగుతున్న శబ్దాలు. బాధాకరమయిన అరుపులతో దద్దరిల్లిపోవటం ప్రారంభించింది ఆ శిథిల కట్టడం.

ఇనుపచువ్వను గిరగిరా త్రిప్పుతూ విరగబాదుతున్న శ్యామ్‌సుందర్ ధాటికి తట్టుకోలేక గగ్గోలెత్తిపోయారు ఆ రౌడీలు. తగులుతున్న చువ్వదెబ్బలకు తట్టుకోలేక విలవిలలాడిపోయారు.

ఇద్దరి తలలు చిట్లాయి. మరో ఇద్దరి భుజపుటెముకలు విరిగాయి.

ఇనుపచువ్వ పోట్లకు మిగతా యిద్దరి తొడలమీద అంగుళం లోతున ఏర్పడ్డాయి ఎఱ్ఱటిగాయాలు....

పది నిముషాలు కూడా గడవకముందే పూర్తిగా చెదిరిపోయారు ఆ రౌడీలు. అతనితో పోరాడుతూ అక్కడే వుంటే తమ ఆయుష్షు తీరిపోతుందని భావించి వెంటనే వెనక్కి తగ్గారు. ఒకరితో ఒకరు కూడబలుక్కున్నట్టు అందరూ ఒక్కసారిగా వెనుదిరిగి పిక్కబలం చూపిస్తూ శిథిలకట్టడం బయటికిపోయి, చీకటిలో కలసి అదృశ్యం అయిపోయారు.

తన అనుచరులు తన్నులు తినటం, చువ్వదెబ్బల ధాటికి తట్టుకోలేక పెడబొబ్బలు పెడుతూ పలాయన మంత్రం పఠించటం చూస్తూనేవున్నాడు కళ్ళల్లో పడ్డ దుమ్మును వదిలించుకుని ఒక మూల నిలబడిన అబ్దుల్లా. షడన్‌గా అంతం అయిపోయిన ఆ పోరాటంలో కల్పించుకోవటం ఇష్టంలేనట్టు, చివ్వున పక్కకి తిరిగి తన అనుచరులు వెళుతున్నవైపు పరుగుతీయటం ప్రారంభించాడు.

అతడా ప్రయత్నాన్ని ప్రారంభించగానే వేగంగా కదిలాడు శ్యామ్‌సుందర్ చేతిలోని ఇనుపచువ్వను అబ్దుల్లా కాళ్ళకేసి బలంగా విసిరాడు ముందుకు.

గిరగిరా తిరుగుతూపోయి, పరుగుతీస్తున్న అబ్దుల్లా కాళ్ళకు అడ్డుపడింది యినుపచువ్వ...! ముందుకు తూలి తలక్రిందులయ్యేట్టు చేసింది అతన్ని.

బాధగా అరుస్తూ నేలమీద పడి రెండు పల్టీలు కొట్టాడు అబ్దుల్లా. పడిన వెంటనే లేచి పరుగు అందుకోవాలని అనుకున్నాడు.

అప్పటికే అతన్ని సమీపించాడు శ్యామ్‌సుందర్. బోడిగుండుమీద బొడుపులు కట్టేలా నాలుగు మొట్టికాయలు వేసి, ముళ్ళకంపను ఈడ్చినట్టు లోపలికి ఈడ్చుకుంటూ పోయి వదిలి, అతని అనుచరుల చేతులలోంచి జారిపోయిన కైజారులలో ఒక కైజారు అందుకున్నాడు.

అతడి బాహుబలాన్నీ....విజృంభించి విరగదీయుటంలో అతను కనబరచిన వేగాన్నీ కళ్ళారా చూసిన అబ్దుల్లా భయంతో వణికిపోయాడు. “వద్దు సాబ్! నన్నేమీ చేయవద్దు! నన్ను వదిలేస్తే మీ పేరు చెప్పుకుని బ్రతుకుతాను!” అంటూ ప్రాధేయపడటం ప్రారంభించాడు.

“ఓ.కె.బ్రదర్! నిన్ను చంపి హంతకుడ్ని కావాలన్న కోరిక నాకులేదు.

నిజం చెపితే నిన్ను వదిలేయటానికి నాకు ఎలాంటి అభ్యంతరం లేదు" అన్నాడు శ్యామ్‌సుందర్ సిగరెట్ వెలిగించుకుంటూ.

"అడగండి సాబ్! మీకు కావాల్సిన నిజమేమిటో అడగండి...." అన్నాడు అబ్దుల్లా.

"క్లాక్‌టవర్ దగ్గర జరిగిన హత్య ఎవరు చేశారు? స్టేషన్ దగ్గర నామీద దాడిచేసేందుకు మిమ్మల్ని ఎవరు వుసిగొలిపారు?" అనడిగాడు శ్యామ్‌సుందర్.

అదిరిపడ్డాడు అతని ప్రశ్నలు విని అబ్దుల్లా.

"క్లాక్ టవర్ దగ్గర ఒక హత్య జరిగిందని తెలియటం తప్ప...ఆ హత్యకు మాకూ ఎలాంటి సంబంధంలేదు సాబ్! స్టేషన్ దగ్గర మీ మీద దాడి చేసింది మేముకాదు. నా మాట నమ్మండి" అన్నాడు.

"నమ్మను....నీ మాట నమ్మను! హత్యను గురించి తెలియనివాడివే అయితే ఆ వివరాలు తెలుసుకోటానికి వచ్చిన నా మీద ఎందుకు దాడి చేస్తావు? నా కాళ్ళూ చేతులు నరికిపారేయాలని ఎందుకు ప్రయత్నిస్తావు? నిజం చెప్పు...లేదంటే నువ్వు చేయతలుచుకున్న పనిని నేనే చేస్తాను. నీ కాళ్ళూ చేతులూ నరికి బజూరీ సరసులో పారేస్తాను" అంటూ కైజారును అతని గొంతుమీద వుంచి అడిగాడు శ్యామ్‌సుందర్.

గొంతుమీద కత్తి వుండగానే బలవంతంగా గుటకలు మింగుతూ ఒక్కసారిగా బావురుమన్నాడు అబ్దుల్లా.

"అమాయకులను హడలెత్తించే ఆకు రౌడీలము మేము...డబ్బు కోసం దెబ్బలాటలకు దిగే బేవార్స్‌గాళ్ళం. హత్యలు చేసే హంతకులము కాము...ఇందాక వీరూమియా ఫోన్‌చేసి ఒక మాట చెప్పాడు. బజూరీ సరసు పక్కనున్న ఈ కట్టడంలో ఒక మనిషి తిరుగుతూ వుంటాడనీ, అతని కాళ్ళు చేతులు విరగ్గొట్టి కదలకుండా చేస్తే పాతికవేలు ఇస్తానని చెప్పాడు. అందుకోసమే వచ్చాం. మీ సంగతి తెలీక మీతో తలపడి భంగపడ్డాం" అంటూ దీనంగా చూశాడు అతని ముఖంలోకి.

నెత్తిమీద కుండెడు చన్నీళ్ళు కుమ్మరించినట్లు చల్లారిపోయింది శ్యామ్‌సుందర్ ఆవేశం. అబ్దుల్లా మాటలకు ఎక్కడలేని నీరసం వచ్చేసింది అతనికి.

"నిజమా! నువ్వు చెప్పేది నిజమేనా అబ్దుల్లా?" అనడిగాడు నమ్మలేనట్లు.

"అవునుసార్! వీరూమియా పురమాయించకపోతే... మనుషులు చూడటానికి వీలుకాని ఈ కట్టడంవైపు ఈ సమయంలో మేము ఎందుకు వస్తాం! సొమ్ముకోసం కాకపోతే ఏం విరోధం వుందని మీమీద దాడి చేస్తాం?" అన్నాడు సిన్సియర్గా.

అతని మాటలు శ్రద్ధగా ఆలకించి అసహనంగా తల విదిలించాడు శ్యామ్సుందర్. తప్పతాగినా తడబాటులేని మాటలతో తన్ను నమ్మించి పంపిన వీరూమియా సామర్థ్యాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు.

"అందరూ అమాయకులూ, పిరికివాళ్ళు అయివుంటారని అనుకోవద్దు అబ్దుల్లా. డబ్బుకోసం గడ్డితినే ఇటువంటి పొరపాట్లు ఇకమీదట చేయవద్దు" అంటూ చేతిలోని కైజారును అవతలికి విసిరి ఎయిర్బేగ్లోంచి వందరూపాయల నోట్లకట్టను ఒకదాన్ని తీసి అతని చేతిలోపెట్టాడు.

ఇష్టం వచ్చినట్టు విరగదీసి డబ్బులు ఇస్తున్న అతని వంక అదోలా చూసాడు అబ్దుల్లా....అతన్ని ఏ విధంగా అంచనా వేసుకోవాలో తెలీక తికమక పడిపోయాడు. "నన్ను ప్రాణాలతో వదిలితే చాలు సాబ్! ఈ డబ్బు నాకు వద్దు" అన్నాడు వినయంగా.

"డబ్బుకోసం వచ్చి దారుణంగా తన్నులు తిన్నారు నీ అనుచరులు. తీవ్రంగా గాయపడి తలోపక్కా పారిపోయారు. వెంటనే వెళ్ళి వాళ్ళకి ట్రీట్మెంట్ యిప్పించు" అంటూ మృదువుగా అతని భుజం తట్టాడు శ్యామ్సుందర్. ఎయిర్బేగ్ను భుజానికి తగిలించుకుని, సిగరెట్ వెలిగించుకుని దమ్ములాగుతూ అక్కడ్నించి బయలుదేరాడు.

చేతిలోని వందరూపాయల నోట్ల కట్టను అలాగే పట్టుకుని అతను వెళ్ళినవైపే చూస్తూండిపోయాడు అబ్దుల్లా. అటువంటి దయార్ద్రహృదయుడ్ని, దానకర్ణుడులాంటి వాడ్ని కాళ్ళు, చేతులు నరికిపారేయమని వీరూమియా ఎందుకు ఆదేశించాడో అర్థం చేసుకోవటం సాధ్యంకాలేదు అతనికి.

# 7

**శ్యామ్‌సుందర్** మీదికి రౌడీలను పురమాయించినా మనశ్శాంతిగా వుండలేకపోయాడు వీరూమియా. ఎంత త్రాగినా నిషా తలకి ఎక్కకపోవటంతో త్రాగటం మానేశాడు. ఒక ఆటోలో ఇంటికి చేరుతూనే బెడ్‌రూం లోకి చేరి మంచంమీద వాలిపోయాడు.

ఆందోళనగా పరుగులు దీస్తున్నాయి అతని ఆలోచనలు. ఎంత వద్దనుకున్నా శ్యామ్ సుందర్ విషయంలో భయపడకుండా వుండలేక పోతున్నాడు.

చిరుతపులిలాంటివాడు శ్యామ్‌సుందర్... చిచ్చర పిడుగుకంటే రెండింతలు ఎక్కువ ప్రమాదకరమయినవాడు.

అలాంటివాడ్ని అబ్దుల్లా, అతని అనుచరులు నిలువరించగలరా? కాళ్ళూ చేతులూ నరికి బజూరీ సరసులో పారవేయగలరా?

తను అప్పగించిన పనిని అబ్దుల్లా పూర్తి చేయగలడని నమ్మకంగా అనుకోలేకపోతున్నాడు వీరూమియా. కళ్ళు రెండూ గట్టిగా ముసుకున్నా నిద్రలోకి జారుకోలేకపోతున్నాడు.

కళ్ళుమూసినా, తెరిచినా శ్యామ్‌సుందర్ రూపమే మనసులో కదలాడుతుంటే నిద్ర ఎలా పడుతుంది అతనికి?

అందుకే... ఉదయపూర్‌నుండి తాత్కాలికంగా అదృశ్యం అయిపోవాలని బార్‌లో తను తీసుకున్న తన నిర్ణయాన్ని మరోసారి పునస్సమీక్షించుకున్నాడు వీరూమియా. ప్రస్తుతానికి అంతకంటే గత్యంతరంలేదు గనుక ఆ నిర్ణయానికే కట్టుబడి... వెంటనే బయలుదేరాలి అనుకుంటూ లేచి బీరువా తెరిచి, అందులో వున్న కరెన్సీ నోట్లకట్టలనూ, బట్టలనూ గబగబా ఒక సూట్‌కేస్‌లో సర్దుకుని వచ్చాడు.

అక్కడ్నించి బయటికి వెళ్ళబోతూ ఎందుకనో పక్కకి తిరిగి చూసి లాగిపెట్టి ముఖంమీద గుద్దినట్టు అదిరిపడ్డాడు.

ఎప్పుడు వచ్చాడో శ్యామ్‌సుందర్...ఆ బంగ్లాలో ఎలా.... ఎలా ప్రవేశించాడో... కాలుమీద కాలువేసి ఒకపక్కగా వున్న కుర్చీలో కూర్చుని వున్నాడు.

అతను కంటపడగానే గుండె ఆగినంత పనయింది వీరూమియాకి. పిశాచాన్ని చూసినట్టు కెవ్వుమని అరుస్తూ సూట్‌కేస్‌ను వదిలేసి బయటికి పరుగుదీయబోయాడు.

అతని ప్రయత్నాన్ని పసిగట్టి కూర్చున్న కుర్చీలోంచి చిన్నగాలేచి నిలబడ్డాడు శ్యామ్‌సుందర్. వేగంగా ముందుకుదూకి పరుగుదీసే ప్రయత్నంలో వున్న అతని ముఖంమీద బలంగా గుద్దాడు.

వెర్రికేక పెట్టాడు వీరూమియా.

గుద్దువెంబడే కళ్ళు పచ్చబడుతున్నట్టు అనిపిస్తుండగా వెనక్కి తూలి వెల్లికిలా పడిపోయాడు. పెదవులు చిట్లి చిక్కటి రక్తం వెలువడుతుండగా బాధతో విలవిల్లాడిపోయాడు.

అతని షర్టు పుచ్చుకుని లేవనెత్తి....విసురుగా లాక్కుంటూ వచ్చి తను కూర్చున్న కుర్చీకి ఎదురుగా వున్న మరో కుర్చీలో కూలదోసాడు.

"ఉదయపూర్ స్టేషన్‌లో నాపై జరిగిన దాడికి పరోక్షంగా నువ్వే కారకుడివని వూహించలేని పసివాడ్ని కాను నేను. నా రాకను గురించి చెప్పగలవాడివి యిక్కడ నువ్వు ఒక్కడివేనన్న సంగతి నాకు తెలుసు. అయినా నిన్ను క్షమించాను. నీ వృత్తి ధర్మాన్ని గౌరవించి నాకు కావల్సిన సమాచారంకోసం నీ పద్ధతి ప్రకారం..నువ్వు అడగకుండా డబ్బు కూడా యిచ్చాను. ఇంతచేసినా నువ్వు నన్ను మోసగించటానికే ప్రయత్నించావు. గతాన్ని మరిచి నా మీదికి రౌడీలను అంపకంచేసావు. అందుకు నీకు ఏశిక్ష విధిస్తే బాగుంటుందో నువ్వే నిర్ణయించుకో...." అంటూ ఫాంట్‌జేబులో నుంచి నెయిల్ కట్టర్‌వంటి చిన్న పరికరాన్ని బయటికి తీసాడు శ్యామ్‌సుందర్.

ఆ పరికరాన్ని చూస్తూనే రక్తం ఇంకిపోయినట్టు పాలిపోయింది వీరూమియాకి. రైళ్ళు పరుగెత్తటం ప్రారంభించాయి అతని గుండెల్లో.

చిత్రహింసలు పెట్టడంలో చిత్ర విచిత్రమయిన పద్ధతులు ఉపయోగిస్తాడు శ్యామ్‌సుందర్...ప్రాణాలు తీయకుండా ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తాడు.

ఆ విషయంలో అతను ఉపయోగించిన కొన్ని పద్ధతులను గతంలో చూసాడు వీరూమియా. అతను తలుచుకుంటే రాళ్ళచేత కూడా రాగాలు పలికించగలడని తెలుసుకున్నాడు.

అదంతా గుర్తుచేసుకుంటూనే చెమటలు పట్టేసాయి వీరూమియా శరీరానికి. విపరీతమయిన దాహంతో గొంతు ఎండుకుపోతున్నట్టు అనుభూతి కలిగింది అతనికి.

"ఒద్దు శ్యామ్‌సుందర్ సాబ్! దయచేసి నన్ను హింసించాలన్న ఆలోచనను మీ మనసులోకి రానీయకండి. తప్పు ఒప్పుకుంటున్నాను. నిజం చెప్పి చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటాను" అంటూ చేతులు జోడించి దీనంగా విన్నవించాడు.

"ఆల్‌రైట్ వీరూమియా! తప్పు చేయటం మానవ సహజం...అందుకే నీకు మరో అవకాశమివ్వదలుచుకున్నాను. మరోసారి అబద్ధం చెప్పావంటే బాగుండదు మరి" అన్నాడు తన చేతిలోని పరికరాన్ని తిరిగి జేబులోకి పంపిస్తూ.

తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు వీరూమియా. చిన్నగా గొంతు సవరించుకుంటూ ఏదో చెప్పబోయాడు.

అదే సమయంలో ఏదో సన్నటి శబ్దం గాలివాలున హాల్లోకి దూసుకువచ్చి, శ్యామ్‌సుందర్ చెవుల్లో ప్రవేశించింది. అతని మనసులో అనుమానానికి చోటు కల్పిస్తూ ఆందోళనకు గురిచేసింది.

ఉన్నట్టుండి అతని ముఖంలో మార్పు రావటం గమనించి ఆశ్చర్యపడ్డాడు వీరూమియా. అంతలోనే చిరునవ్వును పెదవులమీదకి తెచ్చుకున్నాడు.

"డోన్ట్‌వర్రీ శ్యామ్‌సుందర్ సాబ్! ప్రమాదాలకే ప్రమాదం. ఐమీన్ మిమ్మల్ని మించిన ప్రమాదం ఏదీ నా ఇంటిఛాయలకు రాలేదు. అనవసరం అయిన ఆందోళనకు గురికాకుండా నేను చెప్పింది శ్రద్ధగా వినండి!" అన్నాడు.

అతను అనటం పూర్తి అవుతుండగానే ఆ హాలుకి కుడివైపున తెరిచి వున్న ఒక కిటికీలోంచి రివ్వున దూసుకుంటూ వచ్చి హాల్లో పడింది టెన్నిస్ బాల్ సైజులో వున్న ఒక నల్లటిబంతి. పడినచోటునుండి మెల్లగా దొర్లుతూ శ్యామ్‌సుందర్, వీరూమియాలు కూర్చున్నచోటుకి రాసాగింది.

అదేమిటో గ్రహిస్తూనే అదిరిపడ్డాడు శ్యామ్‌సుందర్. విపరీతమయిన ఆందోళన మనసును ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా– "గెట్ బేక్ వీరూమియా! తప్పుకో...! అర్జంటుగా ఆ కుర్చీలోంచి తప్పుకో...!" అని గొంతు చించుకుని

హెచ్చరిస్తూ తన కుర్చీతోపాటు వెనక్కి పడిపోయాడు. పడిన వెంటనే ఫ్రాగ్ జంప్‌చేసి హాలు కార్నర్‌కి చేరుకుని...బోర్లాపడుకుని చెవులు రెండూ గట్టిగా మూసుకున్నాడు.

శ్యామ్‌సుందర్ హెచ్చరికల్ని అర్థం చేసుకున్నా, అతను కదిలినంత వేగంగా కదలలేకపోయాడు వీరూమియా. దొర్లుకుంటూ వస్తున్న బంతిని పరిశీలనగా చూడటంతో కొద్దిక్షణాలపాటు చేసాడు చేయకూడని ఆలస్యాన్ని.

దొర్లుకుంటూ అతని సమీపానికి వచ్చిన నల్లటి బంతి అతను కుర్చీలోంచి కదలకముందే చెవులు చిల్లులుపడేట్టు శబ్దంచేస్తూ బ్రద్దలయింది....

కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు ప్రత్యక్షం అయ్యింది అక్కడ. నల్లటి పొగలు సుడులు తిరుగుతూ లేచాయి. రాక్షసహస్తం ఏదో బలంగా కొట్టినట్టు గాలిలోకి ఎగిరి అవతలపడ్డాడు వీరూమియా. ఆరడుగుల లోతున ప్రత్యక్షం అయింది పెద్ద గొయ్యి.

శ్యామ్‌సుందర్ కదిలినంత వేగంగా కదలలేకపోయాడు అతను. బాంబు బ్రద్దలవుతూనే హృదయవిదారకంగా అరిచాడు అతను.

పదునైన కత్తులతో నరికినట్టు ఎక్కడికక్కడ తెగిపోయింది వీరూమియా శరీరం. రక్తపు ముద్దలా మారిపోయింది. అతనితోపాటే ఎత్తి విసిరేసినట్టు ఇంతెత్తున గాలిలోకి లేచి చెల్లాచెదురుగా పడ్డాయి ఆ హాలులోని వస్తువులు. ముక్కలు చెక్కలయిపోయాయి అవన్నీ.

బోర్లాపడుకున్న చోటునుండి రెండు నిమిషాలపాటు కదలకుండా వుండిపోయాడు శ్యామ్‌సుందర్. వంటినిండా పడిన మట్టిని దులుపుకుంటూ వీరూమియా దగ్గిరికి జంప్‌చేసి ఆందోళనగా చూసాడు అతని ముఖంలోకి.

గుర్తుపట్టటానికి వీలులేకుండా మారిపోయింది వీరూమియా ముఖం ఎర్రటి రక్తం వెల్లువలా తన్నుకువస్తూ అతని చుట్టూ మడుగు కడుతోంది.

ఆ స్థితిలో కూడా పెదవులు కదిలించటానికి ప్రయత్నిస్తూ ఏదో చెప్పబోయాడు అతను. సాధ్యం కాకపోవటంతో వెక్కిళ్ళు పెట్టడం ప్రారంభించాడు.

నిముషమో, అరనిముషమో అన్నట్టున్న అతని పరిస్థితికి ఆందోళన చెందుతూ చుట్టూ చూశాడు శ్యామ్‌సుందర్.

అదే సమయంలో బయటనుంచి వినిపించిన మాటలు మరింత అధికం చేసాయి అతని ఆందోళనను.

"చూడండి! లోపలికిపోయి ఆ ఇద్దరూ చచ్చారోలేదో చూడండి!" ఖంగ్‌మంటూ ఆర్డర్ చేసింది ఒక కంఠం.

ఆ వెనువెంటనే వినవచ్చింది బూట్ల శబ్దం.

ఆలోచించటానికిగానీ, ఆలస్యం చేయటానికిగానీ వ్యవధి లేకపోయింది శ్యామ్‌సుందర్‌కి. అక్కడేవుండి లోపలికి వచ్చినవారితో అటోయిటో తేల్చుకోవాలన్న కోరిక కూడా అతని మనసునుండి దూరం అయ్యింది.

ఆ మరుక్షణంలోనే మోకాళ్ళమీదుగా లేచి నిల్చున్నాడు శ్యామ్‌సుందర్. భరింపశక్యంగాని బాధతో మూర్ఛరోగిలా విలవిల కొట్టుకుంటున్న వీరూ మియాను ఎత్తి భుజంమీద వేసుకుని బంగ్లా వెనక భాగం వైపు పరుగు దీసాడు.

అదే సమయంలో రకరకాల ఆయుధాలు చేతబూని ఛాతీలు విరుచుకుంటూ ఒకరి వెనుక ఒకరుగా లోపలికి వచ్చారు కొంతమంది వ్యక్తులు. భుజంమీది వీరూమియాతో బంగ్లా వెనక భాగంవైపు పరుగుదీస్తున్న శ్యామ్ సుందర్ని చూడనే చూశారు.

"చావలేదు ఆ సెక్యూరిటీ ఆఫీసర్. ఇంకా ప్రాణాలతోనే వున్నాడు అతను! పట్టుకోండి....అతన్ని పట్టుకుని ముక్కలు ముక్కలుగా నరకండి" అంటూ కీచుకంఠంతో అరిచాడు ఒక వ్యక్తి.

"వేసేయ్యండి...! వాడ్ని వెంటనే అంతం చేయండి" అని గొంతులు చించుకుని అరుస్తూ ఒకరినొకరు హెచ్చరించుకుంటూ అటు దూకారు అందరూ.

పట్టుబడే ఉద్దేశ్యంగానీ, వాళ్లతో కుస్తీపట్లు పట్టే ఆలోచనగానీ ఎంతమాత్రం లేదు శ్యామ్‌సుందర్‌కి.

అతనికి వున్నది ఒకటే ఉద్దేశం.

వీరూమియా ప్రాణాలు పోకముందే సురక్షితమయిన చోటుకి చేరుకోవాలి. ఎలాగోలా అతన్ని మాట్లాడించి తెలుసుకోవాల్సిన విషయాలు తెలుసుకోవాలి.

అదే ఆలోచనతో బంగ్లా వెనకభాగంనుంచి బయటపడుతూనే తలుపుల్ని మూసి గడియపెట్టేశాడు శ్యామ్‌సుందర్. వెంటపడబోతున్న హీరోలు తలుపుల్ని

పడగొట్టి బయటికి రాకముందే చీకటిలో కలసి ఆ ప్రదేశం నుండి అదృశ్యం అయిపోయాడు.

అదే సమయంలో ఆందోళనగా అరుస్తూ ఆ బంగ్లాముందు గుంపులు గుంపులుగా చేరిపోయారు. చుట్టుపక్కల ఇళ్ళల్లో నివసిస్తున్న పౌరులు. వాళ్ళని చెల్లాచెదురుచేస్తూ ఒకదాని వెనక ఒకటిగా ఆ ప్రదేశానికి వచ్చి చేరాయి పోలీసు వాహనాలు.

తలుపులను పడగొట్టి బయటికివచ్చిన ఆ వ్యక్తులు చుట్టూ వ్యాపించి వున్న చీకటిలో శ్యామ్‌సుందర్ ఎటువైపు వెళ్ళాడో తెలుసుకోలేకపోయారు. సైరన్ మ్రోతలతో పోలీస్ వాహనాలు వచ్చిచేరిన అలికిడి వింటూనే తాత్కాలికంగా తలోవైపు పలాయన మంత్రం పఠించారు.

* * * * *

అక్కడ చీకటిలో అదృశ్యం అయిన శ్యామ్‌సుందర్ ఎక్కడా ఆగకుండా చీకటిదారులను ఆశ్రయిస్తూ అరగంట తర్వాత ఉదయపూర్‌కి ఉత్తరంగా వున్న కొండగుట్టలనుసమీపించాడు. ఒకచోట విపరీతంగా విస్తరించివున్న కాకటస్ పొదల వెనక వీరూమియాను పడుకోబెట్టాడు.

అప్పటికే అంతిమదశకు చేరుకుంది వీరూమియా పరిస్థితి...ఆఖరి ఘడియలు సమీపిస్తున్నాయి అతనికి.

మనసును మబ్బులా కప్పేస్తున్న ఆందోళనను అదిమి వుంచుకుంటూ వీరూమియా తల దగ్గిర మోకరించాడు శ్యామ్‌సుందర్. చేతులతో అతని చెంపలను తడుతూ– “వీరూమియా!వీరూమియా!” అంటూ పిలిచాడు.

చావు బ్రతుకుల మధ్య వుండి కూడా శక్తినంతా కూడదీసుకుని కళ్ళు తెరిచాడు వీరూమియా. బాధగా నొసలు విరుస్తూ, చిన్నగా పెదవులు కదిలించాడు.

“చేపట్టిన వృత్తిలో నిజాయితీ లోపిస్తే చిక్కులలో పడక తప్పదని వాత్సవ సాబ్ అన్న మాటలు అక్షరాలా నిజమని రుజువయింది. అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడేవారి జీవితాలు అర్థాంతరంగా ముగుస్తాయనటానికి నా బ్రతుకే ఉదాహరణ శ్యామ్‌సుందర్ సాబ్! అధికంగా ఆశపడినందుకు నాకు తగిన ఫలితమే లభించింది. ఉదయపూర్‌లో అడుగుపెట్టిన సి.ఐ.డి. ఆఫీసర్‌ని గురించి

విద్రోహులకు ఇన్ఫర్మేషన్ అందించింది నేనే....! నేను....నేను...!' అంటూ చెప్పటానికి శక్తి చాలనట్టు విపరీతమయిన బాధతో మెలికలు తిరిగిపోవడం ప్రారంభించాడు.

ఉన్నట్టుండి అతని నోటివెంట సుడులు తిరుగుతూ తన్నుకురావటం ప్రారంభించింది చిక్కటి రక్తం.

"కమాన్ వీరూమియా! మాట్లాడు! అతన్ని చంపింది ఎవరో చెప్పు" మెలికలు తిరిగిపోతున్న అతన్ని స్టడీగా వుంచటానికి ప్రయత్నిస్తూ అడిగాడు శ్యామ్‌సుందర్.

అతని ప్రశ్నకు సమాధానం చెప్పటానికి శక్తివంచనలేకుండా ప్రయత్నించాడు వీరూమియా. బలవంతంగా పెదవులను కదిలిస్తూ– "పా...షా! ఖ...లీ....ల్..పా...షా!" అంటూ అస్పష్టంగా గొణిగాడు.

గొణుగుతుండగానే మూగబోయింది అతని గొంతు....కంటికి కనిపించని లోకాలకు ఎగిరిపోయాయి అతని ప్రాణాలు.

గాఢంగా నిట్టూరుస్తూ లేచి నిలబడి సిగరెట్ వెలిగించుకున్నాడు శ్యామ్‌సుందర్. మనసును మెలిపెడుతున్న బాధను బలవంతంగా దిగమింగుకుంటూ మరణించిన వీరూమియా ముఖంలోకి చూశాడు.

నీతి తప్పినంత కాలం ఏ చీకూ చింతా లేకుండా హాయిగా జీవిస్తూ వచ్చాడు వీరూమియా. నిజం చెప్పాలని నిశ్చయించుకున్న కొద్ది నిమిషాలకే ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

ఒక విధంగా తన వల్లనే అతను లేకుండా పోయాడన్న ఆలోచన శ్యామ్‌సుందర్‌ని మరింత బాధకు గురిచేసింది. ప్రతీకారం అతని గుండెను దహించివేయటం ప్రారంభించింది.

ఆ బాధ కన్నీళ్ళుగా మారకుండా అదుపులో వుంచుకుని, సిగరెట్ కాలుస్తూ పదినిమిషాలపాటు అక్కడే నిలబడ్డాడు శ్యామ్‌సుందర్. ఆ తరువాత కాకటస్ పొదలను వెదికి ఒక కర్రముక్కను సంపాదించి ఆ మట్టిగుట్టల మధ్య వీరూమియాను పాతిపెట్టేందుకు గోతిని తవ్వటం ప్రారంభించాడు.

గోతిని తవ్వుతున్న పని పూర్తికాకముందే ఉన్నట్టుండి అతని చెవులకు వినిపించింది మెత్తటి అడుగుల శబ్దం.

ఉలిక్కిపడ్డాడు శ్యామ్‌సుందర్.

గోతిని తవ్వే పనిని తాత్కాలికంగా నిలిపివేసి....రివాల్వర్‌ను బయటికి లాగి, చివ్వున తిరిగాడు ఆ అడుగుల శబ్దం వినిపించినవైపు.

ట్రిగ్గర్ నొక్కకముందే దట్టంగా వున్న కాకటస్ పొదల వెనక నుండి అతని ముందు ప్రత్యక్షం అయ్యారు సాయుధులయిన పదిమంది కానిస్టేబుల్స్. రెండేసి అంగల్లో అతన్ని సమీపించి రైఫిళ్ళను గురిపెట్టారు. వారి వెనకనే వచ్చాడు ఒక ఇన్స్‌పెక్టర్.

ఒకదాని వెనుక ఒకటిగా తన వెంటపడుతున్న ఆపదలను గురించి తెలిసి కూడా ఆదమరపుగా వున్నందుకు తనను తాను నిందించుకున్నాడు శ్యామ్‌సుందర్. రివాల్వర్‌ను ప్రయోగించి మరింత గందరగోళాన్ని సృష్టించటం ఇష్టంలేక చేతులు రెండూ గాలిలోకి ఎత్తేశాడు.

వెంటనే స్వాధీనం చేసుకోబడింది అతని చేతిలోని రివాల్వర్. ఎయిర్‌బేగ్ కూడా లాక్కోబడింది.

శవాలను మాయం చేయటంలో చేయి తిరిగిన నీలాంటి హంతకుల్ని చాలామందిని చూశాను. కొమ్ములు తిరిగిన మొనగాళ్ళనే దుమ్ము దులిపి వదిలాను! నీలాంటి కుర్రకుంక నాకో లెక్కకాదు!" అంటూ ఒక కానిస్టేబిల్ చేతిలోని రైఫిల్ లాక్కుని వెనక్కి త్రిప్పి అదేపనిగా విరగబాదటం ప్రారంభించాడు ఆ ఇన్స్‌పెక్టర్.

భుజపుటెముకలు విరిగిపోయేటంత బలంగా వంటిమీద పడుతున్న దెబ్బల్ని ఓర్చుకోటానికి ప్రయత్నిస్తూ, శరవేగంతో ఆలోచిస్తున్నాడు శ్యామ్‌సుందర్....చుట్టుముట్టిన పోలీసులకు స్లిప్ యిచ్చి బయటపడటం ఎలాగా అని దారులు వెదుకుతున్నాడు.

"నావంటి సమర్థుడయిన ఇన్‌స్పెక్టర్ ముందు నీ ఆటలు సాగవు. నా కళ్ళల్లో కారంకొట్టి తప్పించుకోవటం నీకు సాధ్యంకాదు!" వంటిమీద పడుతున్న దెబ్బలకు ఒకింత కూడా చలించకుండా రాయిలా నిలబడి దెబ్బల్ని భరిస్తున్న శ్యామ్‌సుందర్‌ని ఉద్దేశించి రాష్‌గా అన్నాడు ఇన్స్‌పెక్టర్.

అతను అన్న మాటలకు అప్పటికప్పుడు ఒక చక్కటి ఆలోచన ఫ్రేమ్ అయింది శ్యామ్‌సుందర్ మనసులో.

తన కళ్ళలో కారం కొట్టటం సాధ్యంకాదని సవాల్ విసురుతున్నాడు ఇన్స్‌పెక్టర్. తనను తాను అతిగా అంచనా వేసుకుంటున్నాడు.

అదను చిక్కాలేగానీ తప్పించుకోవటానికి కళ్ళల్లో కారమే కొట్టాలా! మట్టికొడితే పని జరగదా?

అవును! ఆ మట్టిగుట్టల మధ్య మట్టికి కొదవేమిటి? దానిని అతని కళ్ళల్లో కొట్టడానికి తనకు అభ్యంతరం ఏముంటుంది?

అలా అనుకుంటూనే సాధ్యాసాధ్యాలను పక్కనపెట్టి...తన ఆలోచనను ఆచరణలో పెట్టేశాడు శ్యామ్‌సుందర్. వంటిమీద పడుతున్న బలమయిన దెబ్బలను ఇక ఓర్చుకోవటం తనకు సాధ్యం కాదన్నట్టు...కీచుగా అరుస్తూ, నేలమీదపడి పొర్లిగింతలు పెట్టడం ప్రారంభించాడు.

"ఆపు! కొంపలు మునిగిపోయినట్టు ఏమిటా అరుపు? ఆపుతావా లేదా?" అనడుగుతూ మరింతగా రెచ్చిపోయి అతని డొక్కల్లో ఈడ్చిమరీ తన్నాడు ఆ ఇన్స్‌స్పెక్టర్.

ముచ్చటగా మూడు తన్నులుదాకా ఆగాడు శ్యామ్‌సుందర్...నాలుగో తన్నుకు కూడా నోరు మెదపకుండా విపరీతమయిన బాధను పంటిబిగువున భరిస్తూ తడిపొడిగా వున్న మట్టిని చేతుల్లోకి తీసుకుని–

"కొట్టకండి ఇన్స్‌పెక్టర్ సాబ్! అదేపనిగా కొట్టి అలిసిపోకండి! మీ బలం ఏమిటో ఇప్పుడు నాకు బాగా తెలిసిపోయింది! ఇక నా సత్తా ఎలాంటిదో సరదాగా రుచి చూడండి!" అంటూ చటుక్కున లేచి నిలబడి, పురిపెట్టి వదిలిన బొంగరంలా గిర్రున తిరుగుతూ విరజిమ్మాడు చేతుల్లోని మట్టిని.

శ్యామ్‌సుందర్‌కి జరుగుతున్న దేహశుద్ధిని గుడ్ల ప్పగించుకుని చూస్తున్నారు కానిస్టేబుల్స్. పట్టుబడిన నేరస్తుడ్ని పనిగట్టుకుని విరగదీస్తున్న తమ ఇన్స్‌పెక్టర్ ఆవేశాన్ని వీక్షిస్తూ వినోదిస్తున్నారు.

వంటిమీద పడుతున్న బలమయిన దెబ్బలకు చాలాసేపు చలించకుండా ఓపిగ్గా నిలబడిన ఆ యువకుడు ఉన్నట్టుండి నేలమీద పడి పొర్లి గింతలు పెడుతూ ఆ విధంగా ఎదురుతిరుగుతాడనిగానీ, ఊహించని విధంగా తమను దెబ్బతీస్తాడనిగానీ ఎంతమాత్రం ఎక్స్‌పెక్ట్ చేయలేదు ఆ కానిస్టేబుల్స్. వేగవంతమయిన అతని కదలికలను కొంచెం కూడా పసిగట్టలేదు.

శ్యామ్‌సుందర్ గుప్పిళ్ళతో విరజిమ్మిన మట్టి విసురుగా వచ్చి కళ్ళల్లో పడేసరికి గొల్లుమన్నారు కానిస్టేబిల్స్. గుండుసూదులు పెట్టి గుచ్చుతున్నట్టు కరకరలాడుతున్న కళ్ళను అదుముకునే ప్రయత్నంలో ఆయుధాలను వదిలేసి, ఇన్స్‌పెక్టర్‌తో సహా చిందులు వేయటం ప్రారంభించారు.

"మైగాడ్! ఓ మైగాడ్! వీడు సామాన్యుడు కాడు....సాక్షాత్తు యమకింకరుడే...! మన కళ్ళల్లో మట్టికొట్టి మటుమాయం అయిపోవాలని చూస్తున్నాడు. పట్టుకోండి ఆ బద్మాష్‌ని...పారిపోకుండా అడ్డుకోండి!" అంటూ చెవి తెగిన మేకలా కేకలువేయటం మొదలుపెట్టాడు ఆ ఇన్స్‌పెక్టర్.

అతని కేకలు విని కంగారుపడిపోలేదు అతడు. కానిస్టేబిల్స్ లాక్కున్న ఎయిర్‌బేగ్‌తో పాటు తన రివాల్వర్‌ను వెంటనే స్వాధీనం చేసుకుని, కానిస్టేబిల్స్ మధ్యగా అవతలికి పరుగుదీశాడు అతను. కబోది పక్షుల్లా తడుముకుంటున్న కానిస్టేబుల్స్ కనులు తెరిచి చూడటానికి అలవాటు పడకముందే వారికి అందనంత దూరం వెళ్ళిపోయాడు శ్యామ్‌సుందర్.

# 8

**అటు** తిరిగి యిటు తిరిగి అర్ధరాత్రి దాటుతున్న సమయంలో సిటీలోకి చేరుకున్నాడు శ్యామ్‌సుందర్. కన్ను మూసేముందు వీరూమియా బయటపెట్టిన ఖలీల్‌పాషాను గురించి తెలుసుకోవటం ఎలాగా అని ఆలోచిస్తూ విశ్రాంతి తీసుకునే ప్రదేశంకోసం అన్వేషిస్తున్నాడు.

చాందినీ బంగ్లాలోంచి బయటపడిన తరువాత పట్టుమని పది నిముషాలు కూడా ఎక్కడా విశ్రాంతి తీసుకోకపోవటంవల్ల చెప్పలేనంత నీరసంగా వుంది అతనికి...దాంతోపాటే ఆకలికూడా మొదలయింది.

ముందుగా ఆత్మారాముడ్ని చల్లార్చి, ఆ తరువాత మిగతా విషయాలను గురించి ఆలోచించాలి అనుకుంటూ ఒక చీకటి సందు చివరికి చేరి నిలబడ్డాడు శ్యామ్‌సుందర్. సిగరెట్ వెలిగించి దమ్ములాగుతూ చుట్టూ చూశాడు.

అతను చూస్తుండగానే కొంతదూరంలో నిర్మానుష్యంగా వున్న రోడ్‌కి అవతలి పక్కనుండి అతని దృష్టిని ఆకర్షించింది ఇంకా క్లోజ్ చేయబడని రెస్టారెంట్.

అక్కడికి వెళితే ఆకలి తీర్చుకోవటంతోపాటు పనిలోపనిగా ఖలీల్ పాషాని గురించి ఎంక్వయిరీ చేయవచ్చుననుకుంటూ వున్నచోటునుండికదలబోయాడు శ్యామ్‌సుందర్.

అడుగు వేయాలని అతను ఎత్తిన పాదం ముందుకు పడలేదు. ఉన్నచోటునుండి అంగుళం కూడా కదల్లేదు అతను.

“మైగాడ్!మళ్ళీ ఏమైంది తన కాళ్ళకి? ఎందుకు కదలనంటున్నాయి అవి? అతిగా ఎగరటంవల్ల, పరుగులుదీయటంవల్ల తనకే తెలియనంత నీరసం ఆవరించుకుందా తన శరీరాన్ని? కాలు కదపలేనంత బలహీనుడైపోయాడా తను? విపరీతమైన ఆశ్చర్యానికి గురి అవుతూ తనను తానే ప్రశ్నించుకున్నాడు శ్యామ్‌సుందర్.

అదేసమయంలో మోయలేని బరువేదో భుజంమీద పడినట్టు ఫీలవుతూ భుజం మీదుగా తలత్రిప్పి వెనక్కి చూశాడు. చూసిన తరువాత ఉలికిపడకుండా వుండలేకపోయాడు.

“పనీ పాటా లేకుండా ఫకీరులా తిరుగుతున్న నన్ను చేరదీసి ఆదరించింది చాందినీ బహెన్. ఆకలిదప్పులతో అలమటించిపోతున్న నాకు ఇంత తిండిపెట్టి ఇంతటివాడ్ని చేసింది. అటువంటి పుణ్యాత్మురాలు కంట తడిపెట్టడం నేను చూడలేను. ఆమె కోరితే ప్రాణాలు ఇవ్వటానికైనా వెనుకాడను.”

కరకరలాడుతున్న కంఠంతో బల్బీర్ అన్న మాటలకు మౌనంగా తలాడించాడు శ్యామ్‌సుందర్.

మనసులోని ఆందోళన ముఖంలో తెలీకుండా జాగ్రత్తపడుతూ చిరునవ్వును బలవంతంగా పెదవులమీదికి తెచ్చుకున్నాడు.

“చాందినీ చక్కదనాల చుక్కేకాదు....వెన్నలాంటి మనసున్న మంచి మనిషి అని నాకు తెలుసు. నీ జాలి గుండెను గురించి కూడా నేనెరుగుదును. అటువంటి మిమ్మల్ని మాయచేసి ఎందుకు బయటపడ్డానో తెలుసా బల్బీర్?” అన్నాడు.

తెలీదన్నట్టు తల అడ్డంగా త్రిప్పాడు బల్బీర్. తెలుసుకోవాలన్న ఆసక్తి తనకు లేనట్టు వెంటనే అతని మాటలకు అడ్డుపడ్డాడు.

"నువ్వు లక్ష కారణాలు చెప్పినా నేను వినిపించుకోను. నీ కారణంగా ఈరోజు చాందినీ బహెన్ కంటతడిపెట్టడం చూసాను. నిన్ను వెంట తీసుకువెళ్ళి ఆమెకు సంతోషం కలిగించేదాకా మరో పని చేయను" అన్నాడు బల్బీర్.

అంటూనే శ్యామ్‌సుందర్ నడుం పట్టుకుని గుడ్డబొమ్మను ఎత్తినట్టు అవలీలగా ఎత్తి భుజంమీద వేసుకున్నాడు. ఆ పని పూర్తి అయిన వెంటనే వెనుదిరిగి వచ్చిన దారినే ఆ చీకటి సందులోంచి అడుగులు వేస్తూ బయలుదేరాడు.

ఆ భారీకాయుడి బారినుండి బయటపడాలని శక్తినంతటినీ కూడదీసుకుని ప్రయత్నించాడు శ్యామ్‌సుందర్. అతడి పట్టునుండి జారిపోవాలని విపరీతంగా పెనుగులాడాడు.

కొంచెం కూడా నెరవేరలేదు అతడి ప్రయత్నం.

శ్యామ్‌సుందర్ చేజారిపోకుండా జాగ్రత్తపడుతూ ఆ సందులోంచి అవతలికి చేరుకున్నాడు బల్బీర్. అక్కడికి సమీపంలో ఒక చెట్టుక్రింద ఆగివున్న జీపు దగ్గరకి తీసుకుపోయి సీటులోపడేలా విసిరి కదలకుండా కట్టేసాడు అతని చేతులను.

తనలో తానే తెగ చికాకు పడిపోయాడు శ్యామ్‌సుందర్. జీపులో స్టడీగా కూర్చుంటూ ఆలోచించటం ప్రారంభించాడు.

కొండంత సమస్యను ముందుంచుకుని చాందినీ దగ్గిరికి వెళ్ళటం ఎంతమాత్రం ఇష్టంలేదు శ్యామ్‌సుందర్‌కి. ఆమె ప్రేమపురాణాన్ని వింటూ కూర్చునే తీరిక కూడా లేదతనికి.

ఆమె దగ్గిరికి వెళ్లకుండా వుండాలంటే ఏదో ఒకటి చేయాలి తను! అర్జంటుగా బల్బీర్‌ను వదిలించుకుని అవతలికి పోవాలి. అదే తన తక్షణ కర్తవ్యం.

"చాందినీ బాధపడుతుందని నీమీద చేయి చేసుకోకుండా ఓపిక పట్టాను. తప్పించుకోవాలని ప్రయత్నిస్తే కాళ్ళూ చేతులు విరిచి మూటకట్టి తీసుకుపోతాను" కనుచివరలనుండి అతడి భావాలను కనిపెట్టినట్టు సీరియస్‌గా హెచ్చరిస్తూ జీపును స్టార్ట్‌చేసి ముందుకు కదిలించబోయాడు బల్బీర్.

"ఆగు బల్బీర్ భాయ్! ఒక్క క్షణం ఆగు! కాళ్ళూ చేతులు విరిచేస్తే నన్ను ఎలా కట్టుకుంటుంది చాందినీ? అవిటివాడిని అయిన తరువాత నాతో కాపురం చేయటానికి ఎందుకు యిష్టపడుతుంది?" అన్నాడు శ్యామ్‌సుందర్.

అప్పటికే చూపుడు్రవేలూ, బొటనవేలు దగ్గిరికి చేర్చి ఎడంచేతికి వున్న రిస్ట్‌వాచ్ కీ రాడ్‌ను బయటకి లాగాడు. బల్బీర్‌కి అనుమానం రాకుండా ఆ మాటలు అన్నాడు.

జీపును స్టార్ట్‌చేసే ప్రయత్నాన్ని తాత్కాలికంగా ఆపి తలత్రిప్పి అతని ముఖంలోకి చూసాడు బల్బీర్. శ్యామ్‌సుందర్ మాటలలోని మతలబును గురించి ఆలోచిస్తూ అనుమానంగా ముడివేసాడు కనుబొమలను.

రిస్ట్‌వాచ్ కీ రాడ్‌తోపాటు మూడు అంగుళాల పొడవున బయటికి వచ్చిన సన్నటి తీగతో తన చేతులను బిగించిన త్రాళ్ళను కట్‌చేసేసాడు శ్యామ్‌సుందర్. బల్బీర్ కళ్ళలో చోటుచేసుకుంటున్న అనుమానం రెట్టింపు కాకముందే జీపులోంచి ఎగిరి దూకి పది అడుగుల దూరంలో పడి అవతలికి దొర్లాడు.

ఎర్రబడ్డ కళ్లతో అతనివంక చూస్తూ పళ్ళు పటపట కొరికాడు బల్బీర్. మరోసారి మాయమాటలతో తనను మోసగించిన అతనికి తగిన విధంగా బుద్ధిచెప్పాలని తలపోస్తూ జీపులోంచి క్రిందికి దిగాడు.

"నిన్ను తీసుకువస్తానని చాందినీకి మాట యిచ్చానుగానీ ఎలా తీసు కొస్తానో చెప్పలేదు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలంటే నీ ఎముకలు విరిచి మూటకట్టి తీసుకుపోక తప్పేట్టులేదు నాకు" అని ఛాతీ విరుచుకుని మర్రి మొదళ్ళవంటి చేతులను జాస్తూ ముందుకు కదిలాడు.

క్రిందపడి అవతలికి దొర్లిన శ్యామ్‌సుందర్ అప్పటికే లేచి నిలుచున్నాడు. అతని చేతికి చిక్కితే అన్నంతపనీ చేస్తాడని తెలిసి వెంటనే పక్కకి తిరిగి పరుగుదీయటం ప్రారంభించాడు.

"ఏయ్ మిస్టర్...ఆగు! నా మాట విను! నువ్వు ఎంత దూరం పోయినా వదిలిపెట్టను నేను. నిన్ను తీసుకు వెళ్ళకుండా చాందినీ బహెన్‌కి నా ముఖం చూపించను" అని గొంతు చించుకుని అరుస్తూ అతని వెంటపడ్డాడు బల్బీర్.

ఆగకుండా అయిదునిమిషాలపాటు పరుగుదీసాడు శ్యామ్‌సుందర్. గాయపడిన కాలు సలుపుతున్నట్టు అనిపించి ఒక వీధి మలుపు దగ్గిర ఆగి, వెనక్కి చూసి అదిరిపడ్డాడు.

బరువులోనూ, బలంలోనూ మాజీ రెజ్లింగ్ యోధుడు కింగ్‌కాంగ్‌కి ఏమాత్రం తీసిపోని భారీకాయుడు బల్బీర్. బకాసురుడివంటి భీకరాకారుడు అతను.

అటువంటి బరువయిన తన శరీరాన్ని ఈడ్చుకుంటూ తనలాటి యువకునితో పోటీపడి పరుగుతీయటం అతనివల్ల అయ్యేపనికాదని అనుకున్నాడు శ్యామ్‌సుందర్. ఆయాసంతో రొప్పుతూ ఎక్కడో ఆగిపోయి వుంటాడని కన్‌ఫర్మ్ చేసుకున్నాడు.

మాటలతో చెప్పలేనంత దారుణంగా చెదిరిపోయింది శ్యామ్‌సుందర్ అంచనా. తన కళ్లను తానే నమ్మలేనంతగా కళ్ళెదుట కనిపించింది ఓ దృశ్యం.

శ్యామ్ సుందర్‌ని పట్టుకోవటమే ప్రధాన ధ్యేయంగా పరుగు పరుగున అటే వస్తూ కనిపించాడు బల్బీర్. అలసటనూ, ఆయాసాన్ని లెక్కచేయటంలేదు అతను.

అతన్ని తక్కువగా అంచనా వేసుకున్నందుకు తనను తానే నిందించు కున్నాడు శ్యామ్‌సుందర్. అతడికి స్లిప్ ఇచ్చే వుపాయాన్ని ఆలోచిస్తూ మళ్ళీ అందుకున్నాడు పరుగు.

మరో పావుగంటసేపు నిరాటంకంగా జరిగింది ఆ పరుగుపందెం. పదకొండో నిముషంలో శ్యామ్‌సుందర్‌కి లభించింది బల్బీర్‌ను వదిలించుకుని బయటపడే అవకాశం.

దానిని వుపయోగించుకోబోతున్నంతలోనే ఎదురైంది మరో ప్రమాదం. అతని మస్తిష్కాన్నే కన్‌ఫ్యూజన్‌లో పడవేస్తూ అత్యంత సమీపానికి వచ్చేసింది.

పట్టువదలని విక్రమార్కుల మాదిరి పట్టుదలగా వీధులన్నీ గాలిస్తున్నారు శ్యామ్‌సుందర్ కోసం, వీరూమియా ఇంటిమీద బాంబులు విసిరిన వీరాధివీరులు. శ్యామ్‌సుందర్ బల్బీర్‌కి స్లిప్ ఇచ్చే ప్రయత్నంలో వుండగానే ఆ వీధిలోకి వచ్చేశారు.

రావటమే కాదు!

తమ కంటపడకుండా తక్షణం వున్నచోటునుండి తప్పుకోవాలని చూస్తున్న శ్యామ్‌సుందర్‌ని చూడనే చూసారు. చూసిన మరుక్షణంలో పట్టలేని ఉత్సాహంతో గొంతులు చించుకుని అరిచారు.

"అతనే....! అక్కడ నిలుచున్నవాడే మన కళ్ళుగప్పి పారిపోయిన వ్యక్తి! కంటపడకుండా తిరుగుతూ మన కాళ్ళకు నొప్పులు వచ్చేలా చేసింది అతనే" అంటూ పరుగుపరుగున రావటం ప్రారంభించారు శ్యామ్‌సుందర్ నిలుచున్నవైపు.

అటు గొయ్యి, ఇటు నుయ్యి అన్నట్లు తయారయిన ఆ పరిస్థితిలో ఎటూ కదలకుండా వుండిపోయాడు శ్యామ్‌సుందర్. వురుకుల పరుగులమీద తనకేసి వస్తున్న ఆ హీరోలవంక చూస్తూ వర్క్ అవుట్ అయ్యే ఉపాయాన్ని గురించి ఆలోచించటం ప్రారంభించాడు.

పదిమందికి పైనే వున్నారు ఆ హీరోలు. అనేక రకాల ఆయుధాలు పట్టుకొని అటోయిటో తేల్చుకోవడానికి సంసిద్ధులయి వస్తున్నారు.

ఎంత తెగింపు వున్నా.....ఎన్ని సులువులు తెలిసినా....వుట్టి చేతులతో ఒంటరిగా వారిని ఎదుర్కోవటం దుస్సాహసమే అవుతుందని గ్రహించాడు శ్యామ్‌సుందర్. ఆ సమయంలో మొండితనాన్ని ప్రదర్శిస్తే...మానుబట్టుతున్న గాయాలు రేగి, మొదటికే మోసం వస్తుందని క్షణాలమీద అర్థం చేసుకున్నాడు.

అందుకే గెలుపు గ్యారంటీ లేని ఆ పరిస్థితులలో ఫైటింగ్ జోలికి పోకూడదని అనుకున్నాడు శ్యామ్‌సుందర్. భుజబలం అక్కరకు రానిచోట బుద్ధికి పదును పెట్టాలని నిశ్చయించుకుని....ఆ హీరోలు మరింత దగ్గిరికి వచ్చేసరికి ఒక ఉపాయాన్ని ఆలోచించాడు.

ఆ ఉపాయం సత్ఫలితాన్ని ఇస్తుందని నమ్ముతూ ఆలస్యం చేయకుండా వెనుదిరిగి తనను తరుముకువస్తున్న బల్బీర్‌కి ఎదురువెళ్ళాడు.

పిక్కబలం చూపిస్తున్నవాడు ఒక్కసారిగా వెనుదిరిగి రావటం చూస్తూనే కనుబొమలు ఆశ్చర్యంగా ముడివేశాడు బల్బీర్. పరుగుదీయటం మాని సీరియస్‌గా చూసాడు అతనివంక.

అసలు విషయం ఏమిటన్నది ఇప్పుడు నీకు వివరంగా చెబుతాను బల్బీర్! నిన్ను ఇలా ముప్పతిప్పలు పెట్టడం వెనుక వున్న గుట్టును నీ ముందుంచుతాను" అన్నాడు శ్యామ్‌సుందర్.

"ఏమిటా అసలు విషయం?" అడిగాడు బల్బీర్.

"కనిపిస్తే ఖతం చేయాలని నాకోసం వీధులలో తిరుగుతున్నారు ఆ రౌడీలు. చాందినీతో నాకు సంబంధం వుందని తెలిస్తే ఆమెకు కూడా ప్రమాదాన్ని తలపెడతారు. ఆ భయంతోనే చాందినీ బంగ్లాలోంచి బయటపడ్డాను. హాయిగా విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో వీధుల వెంబడి తిరుగుతున్నాను" అన్నాడు శ్యామ్‌సుందర్.

మౌనంగా తలాడించాడు బల్బీర్. ఆయాసాన్ని అదుపులో వుంచుకోటానికి ప్రయత్నిస్తూ దృష్టిని ముందుకు సారించాడు.

శ్యామ్‌సుందర్ పరుగుదీయటం మానుకోవటంతో తాపీగా అడుగులు వేస్తూ అటే వస్తున్న హీరోలను గనించాడు బల్బీర్. అతను చెప్పింది అబద్ధం కాదని గ్రహించాడు.

"వాళ్ళ వ్యవహారం సెటిల్ చేస్తాను....సమస్యలు సృష్టించకుండా నాతో వస్తావా? ఆ రౌడీలతోపాటు నిన్ను కూడా ఇక్కడే విరగదీయమంటావా? వెంటనే చెప్పు" అన్నాడు గంభీరంగా.

"నువ్వు అటువంటి సహాయం చేస్తే నీతో రావటానికి నాకు ఎటువంటి అభ్యంతరమూలేదు బల్బీర్‌భాయ్! ప్రస్తుతానికి పారిపోయే ఉద్దేశ్యం కూడా లేదు నాకు" అన్నాడు శ్యామ్‌సుందర్.

అతని మాటలు విని మౌనంగా తలాడించాడు బల్బీర్. శ్యామ్‌సుందర్‌ని పక్కకి తప్పుకోమని చెప్పి, రెండు అడుగులు ముందుకు వేసి, ఆయుధాలతో అరుదెంచిన రౌడీలకు అడ్డంగా నిలబడ్డాడు.

కొండలా తమ ముందుకొచ్చిన కొత్త వ్యక్తిని గమనించి ఎక్కడి వాళ్ళు అక్కడే నిలబడిపోయారు ఆ రౌడీలు. గుండెలు ఝల్లుమనిపిస్తున్న ఆ భారీకాయుడికి భయపడి ఎందుకయినా మంచిదని వెనక్కి తగ్గారు.

పదిమందికి పైగా వున్న ఆ రౌడీలలో ఒకతను ధైర్యంగా ముందుకొచ్చి, "అడ్డు తప్పుకో భాయీ! చేప పిల్లలా మా చేతికి చిక్కకుండా పారిపోతున్న ఆ కుర్రకుంకను మా ముందుకునెట్టి, నీ దారిన నువ్వు వెళ్ళిపో" అంటూ డిమాండ్ చేశాడు.

చేయదల్చుకున్న పనిని మౌనంగా పూర్తిచేయటంతప్ప మాటలతో కాలయాపన చేయటం అలవాటులేదు బల్బీర్‌కి. వాద ప్రతివాదనలంటే ఒళ్ళు మండిపోతుంది అతనికి.

అయినా....సాధ్యమయినంతవరకూ పోరాటానికి ఛాన్స్ ఇవ్వకూడదను కుంటూ మెల్లగా నోరు విప్పాడు– "అతను నాకు కావాలి! తప్పని సరిగా నేను

అతన్ని వెంట తీసుకుపోవాలి. కాబట్టి బుద్ధిగా వచ్చిన దారినే వెళ్ళిపోండి. అతనిపై ఆయుధాలు ప్రయోగించాలన్న ఆలోచనను విరమించుకోండి” అని హెచ్చరించాడు ఖంగ్‌మంటున్న కంఠంతో.

గొల్లున నవ్వారు ఆ రౌడీలు అందరూ.

“నీ ఆకారం చూసి బెదిరిపోతామని భావించకు భాయీ! నీకెంత కండబలమున్నా చేతులలో ఆయుధంలేని నువ్వు మమ్మల్ని ఏమీ చేయలేవని మాకు తెలుసు! మర్యాదగా అతన్ని అప్పగించటం నీకే మంచిది” అన్నాడు ఒక రౌడీ.

అతను అలా అన్న తరువాత ఆలోచించలేదు బల్బీర్. ఆ రౌడీలకు తన సత్తా ఏమిటో చూపించటానికి ఎంతమాత్రం వెనకాడలేదు.

ఉన్నట్టుండి వేగంగా రెండు అడుగులు ముందుకు వేశాడు బల్బీర్. జబ్బలు చరుచుకుంటూ ఎడమచేత్తో ఒక రౌడీ నడుమును పట్టుకుని గడ్డి బొమ్మను ఎత్తినట్టు అవలీలగా గాలిలోకి ఎత్తి అవతలికి విసిరాడు.

శక్తివంతమయిన రాక్షస హస్తం ఏదో తన గొంతును బలవంతంగా నులిమేస్తున్నట్టు బాధగా అరిచాడు ఆ రౌడీ. గాలిలో పల్టీలు కొడుతూ తన సహచరులమీదుగా తేలియాడుతూపోయి, నేలమీద పడ్డాడు.

పడిన వెంటనే లేచి నిలబడి “కొట్టండి...అతన్ని చావగొట్టండి... ఆయుధాలు ఉపయోగించి అతని అంతం చూడండి... ముక్కలు ముక్కలుగా నరికి కాకులకూ, గ్రద్దలకూ వేయండి” అంటూ పెద్ద గొంతుకతో అరవటం ప్రారంభించాడు.

అతని అరుపులు విన్న మిగతా రౌడీలు తమ ఆయుధాలకు పని కల్పించేదాకా ఆగలేదు బల్బీర్. రాజపుత్ర పౌరుషాన్ని తన కదలికలలో ప్రదర్శిస్తూ తొడచరిచి ముందుకు దూకాడు. తనను కమ్ముకోటానికి కట్టుదిట్టంగా సమాయత్తం అవుతున్న ఆ రౌడీల మధ్య నిలబడి అందినవాడ్ని అందినట్లే పిడికిళ్ళతో పొడవడం మొదలుపెట్టాడు.

వీధి పోరాటాలలో వీరంగం చేస్తూ జనాన్ని హడలెత్తించే వీరాధివీరులు ఆ రౌడీలు. కనికరం లేకుండా కత్తులతో తలలు నరకటానికి వెనుకాడని తలారీల

తమ్ముళ్ళు. ఒక్కడంటే ఒక్కడయినా బల్బీర్‌ని ఎదురించి పడగొట్టటానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించారు వాళ్ళు...అవకాశం లభించినప్పుడల్లా ఇనుపచువ్వలతో విరగబాదుతూనే వున్నారు.

అయినా ఎటువంటి ఫలితం దక్కటంలేదు వారికి!అతన్ని పడగొట్టగలమన్న నమ్మకం కొంచెం కూడా చిక్కటంలేదు.

ఒంటిమీద పడుతున్న ఇనుపచువ్వల దెబ్బలకు ఇసుమంతయినా చలించలేదు బల్బీర్. కత్తులతో పొడిచి గాయపరిచే అవకాశాన్ని వారికి ఇవ్వడంలేదు.

ఇక ఆ మహాబలుడ్ని ఎదుర్కోవటం తమవల్ల అయ్యేపని కాదని గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు ఆ రౌడీలకి. మరికొంతసేపు అక్కడే వుంటే తమ కరచరణాలకు గ్యారంటీ వుండదని తెలిసిపోయింది వారికి.

ఆ తరువాత మరో ఆలోచనను మనసులోకి రానీయకుండా వున్నట్టుండి ఒకేసారి వెనుదిరిగి పరుగు అందుకున్నారు వారందరూ. ఒకరితో ఒకరు పోటీపడుతూ చూస్తుండగానే ఆ వీధిలోంచి అదృశ్యం అయిపోయారు.

పారిపోతున్న వాళ్లను పనిగట్టుకుని వెంటాడితే తన వెనక వున్న పెద్దమనిషి మరోవైపు జారుకుంటాడన్న ఉద్దేశ్యంతో అక్కడ్నించి కదలలేదు బల్బీర్. వాళ్ళను తరిమికొట్టగలిగానన్న సంతోషంకంటే ఆశ్చర్యమే ఎక్కువ కలిగింది అతనికి.

"దెబ్బలకు తట్టుకోలేక పెడబొబ్బలు పెట్టే ఈ రౌడీలను చూసి నువ్వెందుకు పారిపోతున్నావో నాకు అర్థంగావటంలేదు. ఇంత పిరికివాడివి నన్ను ఒకే ఒక దెబ్బతో ఎలా స్పృహ తప్పించావో తెలియటంలేదు! అసలు ఎవరు వీళ్ళు? నిన్ను వెదికి మరీ చంపాలని ఎందుకు అనుకుంటున్నారు?" అని అడుగుతూ శ్యామ్‌సుందర్‌వైపు తిరిగాడు.

సమాధానంచెప్పి అతని సందేహాలను తీర్చటానికి శ్యామ్‌సుందర్ అక్కడ వుంటేకదా!

బల్బీర్ ఆ రౌడీలను విరగదీయటం ప్రారంభించినప్పుడు వినోదం చూస్తున్నట్టు అక్కడే నిలబడి వున్నాడు అతను. రౌడీలు అటు పారిపోగానే చల్లగా తను ఇటు జారుకున్నాడు.

# 9

**"బచావ్**.... మురెఖ బచావ్..! రక్షించండి...పుణ్యాత్ములు ఎవరయినా నన్ను కాపాడండి!" ఆ నిశ్శబ్ద నీరవంలో గాలిని చీల్చుకుంటూ వున్నట్టుండి వినవచ్చింది ఒక అబల దీనాలాపం.

వెంట తరుముతున్న బల్బీర్‌ని....తనకోసం వెదుకుతున్న రౌడీల మీదికి తెలివిగా ఉసిగొలిపి తమాషాగా అక్కడ్నించి తప్పుకున్నాడు శ్యామ్‌సుందర్. తీరుబడి చిక్కగానే ఆకలితో అదేపనిగా కేకలు వేస్తున్న ఆత్మారాముడికి వూరట కలిగించేందుకు అక్కడికి నాలుగు ఫర్లాంగుల దూరంలో వున్న స్లమ్ ఏరియాలో ప్రవేశించి తిండిదొరికే ప్రదేశాన్ని గురించి వెదుకుతుండగా అతనికి వినిపించింది ఆ దీనారావం.

ఆకలి సంగతి మర్చిపోయాడు శ్యామ్‌సుందర్. అనవసరం అయిన వ్యవహారాలలో జోక్యం చేసుకోవద్దని చెవిన యిల్లు కట్టుకున్నట్టు పోరుపెట్టే వాసంతి, వాత్సవల హెచ్చరికలను కూడా మరిచిపోయి....అటు పరుగు దీసాడు.

నిద్రాభంగం అయిన స్లమ్ ఏరియా జనాలు అప్పటికే తలుపుతెరుచుకుని విసుగ్గా నొసళ్ళు విరుస్తూ యిళ్ళల్లోంచి బయటపడి వీధులలోకి వచ్చేశారు. హృదయాలను ద్రవింపచేస్తున్న ఆ దీనారావాలను గురించి నిద్ర ముఖాలతో ఒకరినొకరు ఎంక్వయిరీ చేసుకోవటం ప్రారంభించారు.

ఆ అబల అరుపులు దూసుకువస్తున్న దిశకు అభిముఖంగా పరుగుదీస్తూ ముందుకుపోయాడు శ్యామ్‌సుందర్. చీకటిసందును సమీపించి ఆగిపోయిన అరుపుల్ని గురించి చెవులు రిక్కించి అటూ యిటూ చూడనారంభించాడు.

అతడు చూస్తుండగానే ఆ చీకటి సందులోంచి అతని ముందుకు వచ్చేసింది మసి, మట్టి కొట్టుకుపోయినట్టున్న దుస్తులను ధరించిన ఒకామె. నాలుగేళ్ళ పసివాడ్ని గుండెలకు అదుముకుంటూ నీళ్ళు నిండిన కళ్ళతో జాలిగా చూసింది శ్యామ్‌సుందర్ ముఖంలోకి.

విషయం ఏమిటన్నది ఆమెను అడిగి తెలుసుకోకముందే పరుగు పరుగున ఆ సందులోంచి బయటపడ్డారు కైజారుపుచ్చుకున్న కరోడాలవంటి

వ్యక్తులు అరడజనుమంది "ఎక్కడికి పోతావే? మమ్మల్ని వదిలించుకుని ఎంతదూరం పోగలవు?"అని అడుగుతూ అడుగులు ముందుకు వేసారు.

ఆ వ్యక్తులను చూడగానే ఒక్కసారిగా ఎక్కడలేని భయం చోటుచేసుకుంది ఇళ్ళముందు నిలబడి దిక్కులు చూస్తున్న జనాల్లో. ఎదురుచూడని ప్రమాదం ఏదో హఠాత్తుగా తమ మీద విరుచుకుపడినట్లు గాభరాపడిపోతూ ఇళ్ళల్లో దూరి హడావుడిగా తలుపుల్ని మూసేసారు.

రౌడీలరాక మరింత భీతిని గొల్పుతుండగా గజగజ వణికిపోయింది ఆమె. "రక్షించండి భాయీసాబ్! ఈ రాక్షసుల బారినుండి నన్నూ, నా బిడ్డను కాపాడండి!" వీధిగుమ్మాలలో నిలబడిన పౌరులు హఠాత్తుగా ఇళ్ళల్లో దూరి తలుపులు మూసుకోవటంతో కళ్ళెదుట కనిపించిన శ్యామ్‌సుందర్‌ను ఉద్దేశించి దీనాతిదీనంగా అర్థించింది.

అలా అర్థిస్తూనే ఆపేసిన పరుగును మళ్ళీ అందుకోబోయింది ఆమె. కాళ్ళు తడబడి మెలికపడటంతో ముందుకుతూలి క్రిందపడి బాధగా అరిచింది. గుండెలకు అదుముకున్న బిడ్డకు దెబ్బ తగలకుండా జాగ్రత్తపడుతూ వెల్లకిలా తిరిగింది.

బెదిరిపోయిన పసివాడు కెవ్వుమన్నాడు....ఆపద ఏమిటో అర్థం గాకపోయినా ఆరున్నొక్క రాగం అందుకున్నాడు.

వెకిలిగా నవ్వుతూ క్రిందపడిపోయిన ఆమెను సమీపించిన ఆ వ్యక్తులు కదలకుండా యింకా అక్కడే నిలబడి కనురెప్పలు ఆర్పకుండా ఆ దృశ్యాన్ని చూస్తున్న శ్యామ్‌సుందర్‌ని గమనించారు. "వెళ్ళిపో...అర్జంటుగా ఇక్కడ్నించి అవతలికి వెళ్ళిపో!" అంటూ కరుకు కంఠంతో అతన్ని హెచ్చరించాడు వారిలో ఒకడు.

అతను హెచ్చరించినా హెచ్చరించకపోయినా తనకు ఏమాత్రం సంబంధంలేని ఆ వ్యవహారాలలో వ్రేలు పెట్టకూడదనే అనుకున్నాడు శ్యామ్ సుందర్... అతను హెచ్చరించిన తరువాత ఆమె దీనారావాలు తనకు వినిపించనట్టే అక్కడ్నించి అవతలికి వెళ్ళిపోవాలని పక్కకి తిరిగాడు.

తిరుగుతుండగానే అతనికి గుర్తువచ్చింది ఒక విషయం. అతని అడుగు ముందుకు పడకుండా చేసింది.

వాత్సవతో పార్టనర్‌గా చేరి డైనమిక్ సిటీ సెక్యూరిటీ సర్వీసెస్‌ను స్థాపించింది ఆపదలో వున్నవారిని రక్షించడానికే కదా! హోంమినిస్టర్ రిక్వెస్ట్ చేయడంవల్ల తను యింతదూరం వచ్చింది ప్రధానికి ఎదురుకానున్న ప్రమాదాన్ని కనిపెట్టి కాపాడటానికే కదా!

అలాంటప్పుడు ఆ వ్యవహారంతో తనకు సంబంధం లేదని ఎలా అనుకుంటాడు? ఆపదలోవున్న ఒక అబలను ఆదుకోలేని తను...దేశాన్ని పాలించే ప్రధానిని ఎలా కాపాడగలడు?

అటువంటి ఆలోచన రాగానే అక్కడ్నించి అవతలికి వెళ్ళిపోవాలన్న అతని నిర్ణయంలో వెంటనే వచ్చేసింది మార్పు. ఆ కరోడాల బారి నుండి ఆమెను కాపాడాలన్న కొత్త ఆలోచన చోటుచేసుకుంది అతని మస్తిష్కంలో.

"ఏయ్! చెబుతున్నది నీకే! వెళ్ళు....వెళ్ళిపో యిక్కడ్నించి!" కదలకుండా నిలబడిన శ్యామ్‌సుందర్‌ని ఉద్దేశించి కస్సుమంటూ అతని ఛాతీమీద చేయి వేసి అవతలికి నెట్టబోయాడు ఒక వ్యక్తి.

చటుక్కున అతని చేతిని పట్టుకుని తనను వెనక్కి నెట్టకుండా అడ్డుకున్నాడు శ్యామ్‌సుందర్.... ఆ చేతిని అలాగే మెలిత్రిప్పి అతడి భుజం వెనక భాగంలో బలంగా గుద్దాడు పిడికిలి బిగించి.

కెవ్వుమన్నాడు ఆ వ్యక్తి... భుజపుటెముక విరిగిపోయినంతబాధతో విలవిలలాడుతూ ముందుకుతూలి, బోర్లాపడిపోయాడు నేలమీద.

గుండెలకు అదుముకున్న పసివాడితోపాటుగా ఆమెను పొడిచిచంపే ప్రయత్నంలో కత్తులను గాలిలోకి ఎత్తారు ఆ కరోడాలు. తమ సహచరుడు అరిచిన బాధాకరమయిన అరుపు వింటూనే తమ ప్రయత్నాన్ని తాత్కాలికంగా విరమించుకుని శ్యామ్‌సుందర్ వైపు దూకారు.

"మేము ఎవరిమో తెలిసీ మా వాడిమీద చేయి చేసుకున్నావా? ఈ వీధిలో నువ్వు ఒక్కడివే వీరాధివీరుడవని అనుకుంటున్నావా?" అని కరకరలాడుతున్న కంఠంతో ప్రశ్నించాడు ఒక వ్యక్తి.

తను అనుకుంటున్నదేమిటో మాటలతో చెప్పలేదు శ్యామ్‌సుందర్.

ఆ ప్రశ్నలు వేసిన వ్యక్తి ముఖంమీద బలంగా చరిచాడు అరిచేత్తో. పక్కనున్న వాడి పొట్టమీద మోకాలితో పొడిచి వెనక్కి నెట్టాడు.

ఎదురుచూడని అతని దాడికి అదిరిపోయారు ఆ వ్యక్తులు. వెర్రికేకలు వేసి బాధను వ్యక్తంచేస్తూ వెనక్కి తూలి పడిపోయారు.

ఆ వెంటనే రెచ్చిపోయారు మిగతావాళ్ళు...కస్సుబుస్సులాడుతూ కత్తులు దూసారు అతనిమీద.

"చంపండి...చంపిపారేయండి బద్మాష్‌ని! నరికి పోగులు పెట్టండి!" అని ఎవరికివారే గొంతులు చించుకుని అరుస్తూ ఎత్తిపట్టుకున్న కత్తులతో అతన్ని కమ్ముకున్నారు.

పరిస్థితి ఆ విధంగా మారిపోతుందని ముందుగానే ఎక్స్‌పెక్ట్‌చేశాడు శ్యామ్‌సుందర్. ఫైటింగ్‌కి ప్రిపేర్ అయి తొడచరిచి ముందుకు దూకాడు.... దూకుతూనే పిడికిళ్ళు బిగించి ముందున్న వారి ముఖాలు పగిలిపోయేలా బలమయిన దెబ్బలు కొట్టాడు.

చెవులు చిల్లులు పడిపోయేలా అరుస్తూ వెనక్కి తూలి వెల్లికిలా పడిపోయారు ఆ వ్యక్తులు...తలలు నేలకు పొడుచుకుని ఖంగ్‌న శబ్దాలు వెలువరించటంతో చెవితెగిన మేకల్లా కేకలు వేయటం ప్రారంభించారు.

బూటుకాలిని వెనక్కిలాగి క్రిందపడిపోయిన వాళ్ళు లేవకముందే వారి పక్క టెముకలమీద ఎడాపెడా బలంగా తన్నాడు శ్యామ్‌సుందర్. అదే వూపులో వెనక్కి తిరిగి వెనకనుండి సమీపించబోతున్న యిద్దరు వ్యక్తుల మీదకి లంఘించాడు.

క్రింద పడిపోయిన కత్తులను చేతులతో తీసుకోబోతున్నారు ఆ వ్యక్తులు కత్తులు ఉపయోగించి అతన్ని కడతేర్చే ఆలోచనను ఆచరణలో పెట్టబోతున్నారు.

గుండెలనిండా వూపిరి పీల్చుకుంటూ ఎగిరి వారి ఛాతీలమీదతన్నాడు శ్యామ్‌సుందర్. రాక్షస పాదాలతో తన్నినట్టు నాలుగు అడుగుల ఎత్తున ఎగిరి ఎనిమిది అడుగుల దూరంలో వెల్లకిలా పడిపోయారు.

వారి చేతులలోంచి జారిపోయిన కత్తులను ఒకదాని తరువాత ఒకటిగా అందుకుంటూ వరసపెట్టి వారివైపు విసిరాడు శ్యామ్‌సుందర్. తీవ్రంగా గాయపరచి వారిని హడలెత్తించే ప్రయత్నం చేశాడు.

ఆల్‌మోస్ట్ సక్సెస్ అయింది అతడి ప్రయత్నం.

అతడు విసిరిన మొదటి కత్తి సూటిగాపోయి ఒకవ్యక్తి భుజంలో దిగబడింది. మరొకడి తొడను బలంగా గాయపరిచింది రెండోది. ఇంకొకడి ఛాతీమీద అరంగుళం లోతు గాయాన్ని సృష్టించి ఎఱ్రటి రక్తాన్ని కళ్ళ చూసింది మూడోది.

గాయాల బారినపడిన మరుక్షణమే దిగజారిపోయింది వారి గుండె ధైర్యం! గాయపడకుండా మిగిలిన యిద్దరికీ ముచ్చెమటలు పోసేలాచేసింది శ్యామ్‌సుందర్ సాహసం.

"ఈ రాక్షసుడిని ఎదిరించటం మనవల్లకాదురోయ్...!యిక్కడే వుంటే మన ప్రాణాలకు గ్యారంటీ వుండదురోయ్" అని గొంతులు చించుకుని అరుస్తూ పిక్కబలం చూపించటం ప్రారంభించారు గాయపడకుండా తప్పించుకున్న వాళ్ళు.

గాయపడినవాళ్ళు కూడా లేచి వాళ్ళను అనుసరిస్తూ పరుగు అందుకోవడంతో అక్కడ హఠాత్తుగా మొదలయిన గందరగోళం దానంతట అదే సద్దుమణిగిపోయింది.

గాఢంగా నిట్టూరుస్తూ చేతిలో వున్న కత్తిని అవతలికి విసిరేసాడు శ్యామ్‌సుందర్...చెదిరిపోయిన జుత్తును చేతివ్రేళ్ళతో సవరించుకుని సిగరెట్ వెలిగించుకుంటూ ఆమెవంక చూసాడు.

కృతజ్ఞత నిండిన కళ్ళతో అతన్నే చూస్తోంది ఆమె. అతను తన వైపు తిరగ్గానే ఏడుస్తున్న పిల్లవాడ్ని కింద నిలబెట్టి రెండే రెండు అంగల్లో శ్యామ్‌సుందర్ని సమీపించి అతని కాళ్ళకు చుట్టుకుపోయింది.

ఆమె అలా చేస్తుందని ఎంతమాత్రం వూహించలేదు శ్యామ్‌సుందర్. వయసులో తనకంటే పదేళ్ళు పెద్దదానిలా కనిపిస్తున్న ఆమె తన కాళ్ళు పట్టుకోవడంతో సిగ్గుపడిపోయాడతను.

"తప్పమ్మా! అలాంటి పనులు చేయకూడదు! భారత స్త్రీ భర్త పాదాలకు తప్ప అన్యుల పాదాలకు మొక్కకూడదు!" అంటూ వెనక్కి జరిగాడతను.

ఆమె కళ్ళు తుడుచుకుంటూ లేచి నిలబడింది. "సమయానికి దేవుడిలా వచ్చి కాపాడావు భయ్యా! దేవుడి పాదాలను తాకడం పుణ్యమే గానీ, పాపం కానే కాదు" అంటూ ఏడుస్తూ నిలబడిన పసివాడ్ని తిరిగి చంకన వేసుకుందామె.

చిన్నగా నవ్వుతూ ఆమెను ఉద్దేశించి ఏదో అనబోయాడతను.

అదే సమయంలో వేగంగా దూసుకువచ్చి అతని పక్కన ఆగింది పోలీస్ పెట్రోలింగ్ వేన్ ఒకటి...ఆలస్యంగా గమనించిన అతనికి అక్కడ్నించి కదిలే అవకాశం లేకుండా చేసింది.

నలుగురు కానిస్టేబుల్స్‌తోపాటు వేన్‌లోంచి క్రిందకి దిగుతున్న ఇన్స్‌పెక్టర్‌ను చూసి కలవరపడ్డాడతను. వెగటుగా వుండే ఏదో పదార్థాన్ని నమిలినట్టు యిబ్బందిగా ముఖం పెడుతూ పక్కకి తిరిగి పరుగు అందుకోబోయాడు.

“ఉదయపూర్ పోలీసులు వెర్రిపీనుగులుకాదు. పిచ్చి పిచ్చి వేషాలు వేయదలుచుకుంటే, నిలుచున్న చోటనే నిన్ను కాల్చి చంపక తప్పదు” పారిపోయే ప్రయత్నంలో వున్న శ్యామ్‌సుందర్ ఆలోచనలను పసిగట్టినట్టు తీవ్ర స్వరంతో హెచ్చరిస్తూ అతన్ని సమీపించి రివాల్వర్ గురిపెట్టాడు ఆ ఇన్స్‌పెక్టర్.

అడుగు ముందుకు వేయటం ఎటువంటి ఆపదలను సృష్టిస్తుందోనని అనుమానిస్తూ పరుగులు దీసే ఆలోచనను వాయిదా వేసుకుంటూ ఎక్కడి వాడు అక్కడే నిలబడిపోయాడు శ్యామ్‌సుందర్. “పారిపోవటమా? నేనా..ఛ! అలాంటిదేమీ లేదు సార్!” అంటూ చిన్నగా నవ్వాడు.

చిన్నగా తలాడిస్తూ అతని పక్కనే నిలబడిన ఆమె వంక చూసాడు ఆ ఇన్స్‌పెక్టర్. ఆ వయసులో కూడా చెక్కుచెదరని ఆమె అందచందాలను గమనించి విశాలం చేసాడు కనుబొమలు.

“ఎవరు నువ్వు? ఈ వేళప్పుడు ఇతనితో కలిసి ఏం చేస్తున్నావు యిక్కడ?” అని ప్రశ్నించాడు ఆమెనుద్దేశించి.

“ఆపదలో వున్న నన్ను ఆదుకున్నాడు ఈ మహానుభావుడు. నా మానప్రాణాలు మట్టిలో కలిసిపోకుండా నన్ను కాపాడాడు” అని చెప్పింది ఆమె.

ఆమె మాటలు విని కనుబొమలు సీరియస్‌గా ముడివేసాడు ఆ ఇన్స్‌పెక్టర్.

“నీ కట్టుకథలు వినటానికి నేనేమీ చెవిలో పువ్వు పెట్టుకుని రాలేదు. వయసులో వున్న నువ్వు ఒక హంతకుడిచేత రక్షించబడ్డావంటే నమ్మటానికి నేనేం వెర్రివెంగళప్పను కాను” అన్నాడు.

అంటూనే హ్యాండ్ స్టిక్‌ను ఆమె గడ్డం క్రింద ఆనించి ఆమె తలను అటూ ఇటూ త్రిప్పుతూ ఏ యాంగిల్లో ఆమె మరింత అందంగా కనిపిస్తున్నదో పరిశీలించసాగాడు. అంతటితో ఆగకుండా ఆడవాళ్ళు సిగ్గుపడే పదజాలాన్ని ప్రయోగిస్తూ అసభ్యంగా మాట్లాడటం ప్రారంభించాడు.

అభ్యంతరకరమయిన అతని ధోరణిని ఆవగింజంత కూడా లెక్కచేయకుండా, గుచ్చి గుచ్చి చూస్తున్న అతని చూపులను కొంచెం కూడా పట్టించుకోకుండా– "నమ్మను! ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఈ మహానుభావుడు హంతకుడు అంటే నేను నమ్మను..." అంది ఆమె.

హేండ్‌స్టిక్‌ను వెనక్కి తీసుకుని ఈడ్చికొట్టాడు ఆమె చెంపమీద ఆ ఇన్స్‌పెక్టర్. కెవ్వుమంటూ పసివాడితోపాటు పక్కకి తూలిపోయిన ఆమె జుత్తుపుచ్చుకుని క్రింద పడకుండా నిలబెట్టి– "వాడికి సర్టిఫికెట్ ఇస్తున్నావంటే వీరూమియా ఇంటిమీద బాంబులు వేయటంలో నీకూ సంబంధం వుందని నాకు అనిపిస్తుంది... మీ ఇద్దరూ జాయింట్‌గా ఈ పని చేసారని నాకు అనుమానం కలుగుతున్నది. తేలుస్తాను...మీ సంగతి స్టేషన్‌లో తేలుస్తాను" అంటూ ఆమెను అలాగే జుత్తుపుచ్చుకుని లాక్కుపోయి వేన్‌లోకి నెట్టాడు.

కానిస్టేబుల్స్ రైఫిల్స్‌తో తనను చుట్టుముట్టి వుండకపోతే అక్కడికక్కడే ఆ ఇన్స్‌పెక్టర్ సంగతి తేల్చేసేవాడు శ్యామ్‌సుందర్. అందుకు అది సరయిన సమయం కాకపోవడంవల్ల తనను తాను అదుపులో వుంచుకుంటూ మౌనంగా నిలబడిన అతన్ని ఆమె వెనకనే వేన్ ఎక్కించాడు.

# 10

**"నువ్వు** చాలా అదృష్టవంతుడివి తమ్ముడూ! అందమయిన ఆడదాన్ని వెంటబెట్టుకుని తిరగటమే నీకు అంత అదృష్టం పట్టటానికి కారణం"

పొడవాటి పోలీసు లాటీ పట్టుకుని సెల్ దగ్గరికి వచ్చిన కానిస్టేబిల్ అన్న మాటలకు అయోమయంగా చూసాడు శ్యామ్‌సుందర్ "ఏమిటి కానిస్టేబుల్ భాయ్! ఇప్పుడు నువ్వు అన్న మాటలకు అర్థం?" అని అడిగాడు కటకటాల ముందుకు వచ్చి.

"ఆ మాత్రం అర్థం తెలియని నువ్వు ఎలా హత్య చేసావో నాకు అర్థం కావటంలేదు. సాధారణంగా అరెస్ట్ కాబడిన నీవంటి నేరస్థులను స్టేషన్‌కి తీసుకు రాగానే లాకప్‌లో వేసి కుళ్ళబొడుస్తాడు మా ఇన్స్‌పెక్టర్. పులుసులోకి ఎముకలు మిగలకుండా చూర్ణం చేస్తాడు. అలా చేయలేదంటే ఏమిటి అర్థం?" అంటూ వెకిలిగా నవ్వాడు ఆ కానిస్టేబుల్.

సగం అర్థం అయి, సగం అర్థంకాకుండా వుండటంతో అసహనంగా నొసలు విరుస్తూ అతనివంక ప్రశ్నార్థకంగా చూసాడు శ్యామ్‌సుందర్.

"అందమయిన బొమ్మలతో ఆడుకోవటం మహా ఇష్టం మా ఇన్స్‌పెక్టర్ గార్కి. కంటికి నచ్చితే కాటువేయకుండా వదిలిపెట్టడం అలవాటు లేదు అతనికి. నీతోపాటు తీసుకురాబడిన ఆమె అతనికి బాగా నచ్చింది. అందుకే నిన్ను టార్చర్‌చేసే కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని ఆమెను జీప్ ఎక్కించుకుని పోలీస్ గెస్ట్‌హౌస్‌కి తీసుకుపోయాడు. అక్కడే తనివి తీర్చుకుని తెల్లవారిన తరువాత తిరిగి వస్తాడు. అంతవరకూ నీ ఆరోగ్యానికి ఢోకా లేదు" వెకిలిగా పళ్ళికిలిస్తూ చెప్పాడు ఆ కానిస్టేబుల్.

వింటూనే కడుపులో చేయిపెట్టి కెలుకుతున్నట్టు ఫీలయిపోయాడు శ్యామ్‌సుందర్. పదునయిన పిడిబాకుతో గుండెల్లో పొడిచినట్టు విలవిల లాడిపోయాడు.

తను కాపాడకుండా వుంటే ఆమె ప్రాణాలను మాత్రమే పోగొట్టుకుని వుండేది...వీరాధివీరుడిలా రంగంలోకి దూకి కాపాడినందువల్లనే ప్రాణం కంటే విలువయిన మానాన్ని పోగొట్టుకునే పరిస్థితి దాపురించింది ఆమెకి.

"నో! అలా జరగడానికి వీలులేదు. ఆ ఇన్స్‌పెక్టర్ పశువాంఛకు ఆ ఇల్లాలు బలికాకూడదు. ఏదో ఒకటి చేసి ఆమె మానప్రాణాలను రక్షించాలి.

అలా అనుకున్నాడేగానీ...ఏం చేస్తే ఆమెను మరోసారి రక్షించగలడో తెలియలేదు అతనికి. అసలు తను సెల్‌లోంచి బయటపడితేకదా ఆమెను రక్షించేది?

ఆలోచిస్తున్న శ్యామ్‌సుందర్‌కి ఉన్నట్టుండి గుర్తొచ్చింది హోంమినిస్టర్ చెప్పిన ప్రత్యేకమయిన ఫోన్‌నెంబర్. ఆ నెంబర్‌కి గనుక ఫోన్ చేయగలిగితే

వెంటనే లభిస్తుంది తనకు సహాయం. ఆ ఇన్స్‌పెక్టర్ దుర్మార్గానికి తగిన శిక్ష విధించటానికి వీలుపడుతుంది.

అలా అనుకుంటూనే ఆ కానిస్టేబిల్‌ని రిక్వెస్ట్ చేసి ఫోన్ ఉపయోగించేందుకు అనుమతి కోరాలనుకున్నాడు శ్యామ్‌సుందర్. సెల్‌లోంచి బయటపడి పోలీస్ గెస్ట్‌హౌస్ చేరుకోవాలని కూడా ఆశించాడు.

అదే సమయంలో....ఉన్నట్టుండి మ్రోతలు చేయడం ప్రారంభించింది ఇన్స్‌పెక్టర్ టేబుల్‌మీద టెలిఫోన్. ఎవరినయితే అతను అనుమతి కోరాలనుకుంటున్నాడో ఆ కానిస్టేబిల్ సెల్ ముందు నుండి కదిలి టేబుల్ దగ్గరికి వెళ్ళి రిసీవరు ఎత్తాడు.

అతను ఏం మాట్లాడాడో శ్యామ్‌సుందర్‌కి వినిపించలేదు. రిసీవర్ క్రెడిల్ చేసి సెల్ దగ్గరికి వచ్చిన అతని ప్రవర్తన మాత్రం విపరీతమైన ఆశ్యర్యాన్ని కలిగించింది అతనికి.

“భలేపని చేసారు భాయీసాబ్! అసలు విషయం చెప్పకుండా మా పీకలమీదకి తెచ్చారు. వెళ్ళండి సాబ్! హేపీగా ఇకడ్నించి వెళ్ళిపోండి” అంటూ గబగబా లాకప్ తాళం తెరిచాడు.

విపరీతమయిన ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు శ్యామ్‌సుందర్. ఫోన్ చేసింది ఎవరో అడిగి తెలుసుకోవాలన్న ఆత్రుతను బలవంతంగా అదుపులో వుంచుకుంటూ సెల్‌లోంచి బయటికి వచ్చాడు.

శ్యామ్‌సుందర్ అడగకుండానే సమాధానం చెప్పాడు ఆ కానిస్టేబిల్. “మా అసిస్టెంట్ కమీషనర్ అహమ్మద్ బాషాగారికీ, మీకూ విడదీయరాని దోస్తీ వుందని ముందుగానే చెపితే బాగుండేది సాబ్! మీ వెంట వచ్చిన ఆడదానికి కూడా మంచి జరిగేది” అంటూ అతని సందేహాన్ని తీర్చాడు.

తన విడుదలకు కారణం అసిస్టెంట్ కమీషనర్ అన్నమాట వింటూనే మరో మెట్టు పైకి పోయింది శ్యామ్‌సుందర్ ఆశ్చర్యం. ముక్కూ ముఖం తెలియని తనను ఆదుకోవాల్సిన అవసరం అతనికి ఏమొచ్చిందో తెలియలేదు.

ఆ వివరాలను కూడా కానిస్టేబిల్‌ని అడిగితే అతనికి అనుమానాలు రావచ్చునని మౌనంగా వుండిపోయాడు శ్యామ్‌సుందర్. అతడు అందించిన

తన ఎయిర్‌బేగ్‌ను భుజానికి తగిలించుకుంటూ పోలీస్ గెస్ట్‌హౌస్ అడ్రస్ అడిగి తెలుసుకుని స్టేషన్‌లోంచి బయటపడి ఒక దిశలో అడుగులు వేయటం ప్రారంభించాడు.

రకరకాల ప్రశ్నలు అతని మస్తిష్కంలో తలఎత్తుతున్నాయి.

ఉన్నట్టుండి ఆ కానిస్టేబుల్‌లో ఎందుకు అంత మార్పు వచ్చింది? అతనికి ఫోన్ చేసింది ఎవరు? తనను విడిపించాల్సిన అవసరం ఎవరికి వుంది?

తనను ఒక కంట కనిపెట్టి వుంటూ సహాయపడమని హోంమినిస్టర్ గారే తనకు తెలీకుండా ఇంకెవరినైనా నియమించారా?

సమాధానాలు లభించని ఆలోచనలతో సతమతం అవుతూ పోలీస్ గెస్ట్‌హౌస్ వైపు వేగంగా అడుగులు వేస్తున్నాడు శ్యామ్‌సుందర్.

అదేసమయంలో అతన్ని విపరీతమైన ఆశ్చర్యానికి గురిచేస్తూ ఒక చీకటి సందులోనుండి పరుగు పరుగున అక్కడికి వచ్చేసింది చాందినీ. "శ్యామ్ సుందర్....! మైడియర్ శ్యామ్‌సుందర్! నీకేమీ కాలేదుకదా? ఆ ఇన్స్‌పెక్టర్ నీమీద చేయి చేసుకోలేదు కదా?" అని అడుగుతూ... అమాంతం అతన్ని కౌగిలించుకుని ముద్దులతో ముంచెత్తటం ప్రారంభించింది.

ఆశ్చర్యాన్ని అదుపు చేసుకుంటూ ఆమెను వదిలించుకోటానికి అవస్థపడ్డాడు శ్యామ్‌సుందర్. చీకటిగా వుంది కాబట్టి సరిపోయింది... లేదంటే నడివీధిలో కౌగిలింతలు నలుగురికంటా పడి సిగ్గుపోయేది అనుకుంటూ ఆమె కౌగిలినుండి బలవంతంగా బయటపడ్డాడు.

"నన్ను పోలీసులు అరెస్ట్ చేసినట్టు నీకు ఎలా తెలిసింది? నన్ను విడుదల చేసినట్టు ఎవరు చెప్పారు?" అని అడిగాడు శ్యామ్‌సుందర్.

ఆ ప్రశ్నకు సమాధానంగా ఆ సందువైపు చూపించింది చాందినీ. "శ్యామ్‌సుందర్ ఇక్కడే వున్నాడు బల్బీర్! నువ్వు బయటికి రావచ్చు" అంటూ పిలిచింది.

ఆ పిలుపు వింటూనే సర్కస్ ఏనుగులాగ సందులోంచి బయటికి వచ్చాడు బల్బీర్. శ్యామ్‌సుందర్ చేతిలో రెండుసార్లు మోసపోయానన్న కోపాన్ని మనసులో వుంచుకుని ఉక్రోషంగా చూసాడు అతని ముఖంలోకి.

"నిన్ను తీసుకువచ్చి నాకు అప్పగిస్తానన్న మాటకోసం...నిద్రాహారాలు మానుకుని నీకోసం గాలిస్తున్నాడు బల్బీర్. నువ్వు చూపించిన రౌడీలని విరగబాది తరిమివేసిన తరువాత నీకోసం వెతుకుతుండగా ఒక వీధిలో పోలీసులు నిన్నూ, నీతోపాటు ఒకామెను వేన్ ఎక్కించటం అతని కంటపడిందట. ఆ విషయం వెంటనే నాకు ఫోన్‌చేసి చెప్పాడు. నేను అసిస్టెంట్ కమీషనర్ అహ్మద్‌బాషాకి ఫోన్ చేయగానే నీ విడుదలకి ఏర్పాట్లు జరిగిపోయాయి" అంటూ అతని సందేహాలను తీర్చింది చాందినీ.

అసిస్టెంట్ కమీషనర్ అంతటివాడికి ఫోన్‌చేసి ఒప్పించగల ఆమె పలుకుబడికి ఆశ్చర్యం కలిగినా.... ఆమె ఖరీదయిన వేశ్య అని గుర్తొచ్చి ఆ విషయాన్ని గురించి పట్టించుకోవటం మానేశాడు శ్యామ్‌సుందర్.

"నువ్వు అరెస్ట్ కాబడినపుడు ఒక ఆడది నీవెంట వుందట! ఆమె అందంగా కూడా వుందట! ఇంతకీ నాకు పోటీగా తయారైన ఆ ఆడది ఎవరు? ఆమెకు నీకూ సంబంధం ఏమిటి?" శ్యామ్‌సుందర్ ముఖంలోకి అనుమానంగా చూస్తూ ప్రశ్నించింది చాందినీ.

చాందినీకి నచ్చజెప్పి పోలీస్ గెస్ట్‌హౌస్‌కి వెళ్ళే ఆలోచనలో వున్నాడు శ్యామ్‌సుందర్...ఆమెను ఒప్పించే ఉపాయాన్ని గురించి వెదుకుతున్నాడు.

ఉన్నట్టుండి ఆమె అడిగిన ప్రశ్నకు ఆలోచనలనుండి బయటపడుతూ చిన్నగా నవ్వేడు...." అందంగా వున్న ఆడవాళ్ళందరూ నన్ను ప్రేమించి నా వెంటపడతారనుకోవటం పొరపాటు చాందినీ డియర్! నేను ఆపదలోంచి రక్షించిన ఆమె నా కారణంగానే మరో ఆపదలో పడింది... పోలీస్ గెస్ట్‌హౌస్ లో ఒక కామాంధుడయిన ఇన్‌స్పెక్టర్‌కి బలి కాబోతోంది. వెంటనే వెళ్ళి కాపాడకపోతే ఆ అవమానంతో ప్రాణాలు వదులుతుంది" అన్నాడు.

"నథింగ్ డూయింగ్! అవసరం అయితే అహ్మద్ బాషాగారికి మరోసారి ఫోన్‌చేసి ఆమెను విడిపించే ఏర్పాట్లు చేస్తాను...అంతేగానీ పోలీస్‌గెస్ట్‌హౌస్‌కి వెళ్ళి మరో ప్రమాదాన్ని తలమీదికి తెచ్చుకుంటానంటే మాత్రం ఒప్పుకోను...పద వెళదాం..." అంటూ అతని చేయి పుచ్చుకుని అవతల వున్న మరో వీధిలోకి లాక్కుపోయింది చాందినీ.

అక్కడ ఒక చెట్టుక్రింద ఆగి వుంది ఆమె ఎక్కివచ్చిన కారు. శ్యామ్‌సుందర్ చేతికి తన చేతిని పెనవేసి అటు అడుగులు వేయటం ప్రారంభించింది. అడుగులు మెల్లగా వేస్తూ తను వెనక వస్తున్న బల్బీర్ వంక మధ్య మధ్యన తలత్రిప్పి చూస్తూ చాందినీని వదిలించుకునే ఉపాయాన్ని గురించి ఆలోచించాడు శ్యామ్ సుందర్. అడుగులు ముందుకు వేయటం ఆపేసి తలత్రిప్పి ఆమె ముఖంలోకి చూసాడు.

"నీతో ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడాలి చాందినీ డియర్! మనం ప్రయాణించే కారులో బల్బీర్‌ను ఎక్కించుకోకూడదు. అతన్ని పంపెయ్" అన్నాడు కళ్ళనిండా ప్రేమను నింపుకుని ఆమెనే చూస్తూ.

అతనంత ప్రేమగా చూస్తూ, మృదువుగా మాట్లాడుతూ ఏకాంతాన్ని కోరుకునేసరికి వుబ్బితబ్బిబ్బయిపోయింది చాందినీ. వెంటనే బల్బీర్‌ను పిలిచి ఇంటికి వెళ్ళిపొమ్మని ఆదేశించింది.

శ్యామ్‌సుందర్ వంక అనుమానంగా చూసాడు బల్బీర్. చాందినీ ఆదేశాన్ని కాదనలేక అయిష్టంగానే అక్కడ్నించి అవతలికి వెళ్ళిపోయాడు.

అతని నిష్క్రమణతో టెన్షన్ వదిలినట్టు అనిపించింది శ్యామ్‌సుందర్‌కి. ఇక చాందినీ రూపంలో వున్న సమస్య మిగిలింది.

"శ్యామ్‌సుందర్ డార్లింగ్! నాతో ఏదో ముఖ్యమయిన విషయం మాట్లాడాలన్నావు ఏమిటి?" కారును సమీపిస్తూ అడిగింది చాందినీ.

"నేనంటే నీకు ఎంత ప్రేమ వుందో తెలుసుకోవాలని ఆశ పడుతున్నాను డియర్! నీ ప్రేమ నిజమయినదో కాదో తేల్చుకోవాలనుకుంటున్నాను" అన్నాడు శ్యామ్‌సుందర్.

అతని ప్రశ్న వింటూనే విలవిలలాడిపోతున్నట్టు ముఖం పెట్టింది చాందినీ.

"ఎంతమాట అన్నావు డార్లింగ్! నీకోసం సర్వస్వం ధారపోయటానికి సిద్ధంగా వున్న నా ప్రేమను అనుమానించటం నా దురదృష్టం..అడుగు...నా ప్రేమ నిజమైనదేనని నిరూపించుకోటానికి నేనేంచేయాలో వెంటనే చెప్పు" అంది రోషంగా.

"నేనేం చేయమంటే అది చేస్తావా? చెప్పినతర్వాత చేయననవుగా." ఆమెను రెచ్చగొడుతూ అన్నాడు శ్యామ్‌సుందర్.

"ఇప్పటికిప్పుడు నీ కళ్ళముందు ప్రాణాలు విడువమన్నా విడుస్తాను. అని చూడు నీకే తెలుస్తుంది" అంది గంభీరంగా,

"ఆల్‌రైట్! నువ్వు ప్రాణాలు విడువవద్దు గానీ....ఇక్కడే ఈ చెట్టుక్రింద కదలకుండా నిలబడు" అన్నాడు శ్యామ్‌సుందర్.

ఒక్క క్షణం అతని ముఖంలోకి అదోలాచూసి "ఇంతేనా!" అంటూ పక్కన వున్న చెట్టు దగ్గిరికిపోయి చేతులు కట్టుకుని నిలబడింది చాందినీ.

"గుడ్! అలా చేతులు కట్టుకుని నిలబడితే నువ్వు చాలా అందంగా వున్నావు చాందినీ!" మెచ్చుకోలుగా అన్నాడు శ్యామ్‌సుందర్.

అతడి పొగడ్తకు బుగ్గలు ఎర్రబడుతుండగా ముసిముసి నవ్వులు నవ్వుతూ "ఇలా ఎంతసేపు నిలబడాలి? ఎంతసేపు నిలబడితే నా ప్రేమ నిజమవుతుందని నమ్ముతావు?" అనడిగింది చాందినీ.

"నేను చెప్పేటంతవరకూ నిలబడాలి. ఎవరొచ్చి చెప్పినా కదలకూడదు! కదిలావంటే నామీద ప్రేమ లేనట్టే!" అంటూ కారెక్కి స్టార్ట్ చేశాడు శ్యామ్‌సుందర్.

అప్పుడు అర్థం అయింది అతని ప్రేమ పరీక్షలోని మర్మం ఏమిటన్నది చాందినీకి. తనను వదిలించుకోటానికే అతను ఆ ఎత్తు వేశాడని తెలిసిపోయింది.

అయినా అలాగే నిలబడింది. తన కళ్ళముందే అతను కారులో కనుమరుగు అవుతున్నా వున్నచోటునుండి అంగుళం కూడా కదలలేదామె.

# 11

**గెస్ట్‌హౌస్‌లోని** బెడ్‌రూం కార్నర్ లో ముడుచుకుని కూర్చుంది నసీమా. ఎదురుగా వున్న వాల్‌క్లాక్ వంక చూస్తూ తలక్రింద చేతులు పెట్టుకుని మంచంమీద వెల్లికిలా పడుకుని వున్నాడు ఇన్స్‌పెక్టర్.

స్టేషన్ నుంచి ఆమెను, ఆమె కొడుకుతోపాటు గెస్ట్‌హౌస్‌కి తీసుకువచ్చిన అతను పసివాడ్ని హాల్లో పడుకోబెట్టి, ఆమెను బెడ్‌రూంలోకి లాగి తలుపులు మూసేశాడు. "తప్పనిసరి అనుకుంటే తప్ప ఆడదాన్ని బలవంతంగా

అనుభవించటం నాకు అలవాటులేదు. నీకు ఒక అరగంటే టైం యిస్తున్నాను. నీ అంతట నువ్వే లొంగిపో!" అంటూ సిగరెట్ వెలిగించుకుని దమ్ములాగుతూ నిరీక్షించటం ప్రారంభించాడు.

అడుగు అడుగుకి తనను ఆపదలోకి నెడుతున్న తన దురదృష్టానికి తనలో తానే కుమిలిపోయింది నసీమా. తన మానం మంటగలపకుండా కాపాడమని అల్లాని ప్రార్థిస్తూ, మౌనంగా రోదించసాగింది.

‘‘అయిపోయింది! నీకు యిచ్చిన గడువు అయిపోయింది! ఏం నిర్ణయించుకున్నావు?" అని అడుగుతూ మంచం మీంచి లేచి నిల్చున్నాడు ఇన్స్పెక్టర్.

నీళ్ళు నిండిన కళ్ళతో అతనివంక దీనంగా చూస్తూ చేతులు జోడించింది నసీమా. "మీ సోదరిలాంటిదాన్ని ఇన్స్పెక్టర్‌సాబ్! దయచేసి నన్ను వదిలేయండి నన్ను అవమానించాలన్న మీ నిర్ణయం మార్చుకోండి!" అంటూ వేడుకుంది.

వెకిలి మందహాసాన్ని చిందిస్తూ తల అడ్డంగా త్రిప్పాడు ఆ ఇన్స్పెక్టర్.

"ఆశపడిన ఆడదాన్ని అనుభవించకుండా వదలడం నాకు అలవాటు లేదు! ఇచ్చిన గడువు ముగిసిన తరువాత నన్ను ఆపటం ఎవరివల్లాకాదు" అంటూ ముందుకు దూకి ఆమెని తన కౌగిలిలో బంధించబోయాడు ఆ ఇన్స్పెక్టర్.

భయంతో కెవ్వున అరిచింది నసీమా. రెండు చేతులతో అతన్ని వెనక్కి నెట్టి, అందకుండా పక్కకి దూకి తప్పుకోవాలని ప్రయత్నించింది.

ఆ ప్రయత్నాన్ని వమ్ముచేస్తూ ఆమె పైటచెంగును వడిసి పట్టుకున్నాడు ఆ ఇన్స్పెక్టర్. పెద్దగా నవ్వుతూ, బలవంతంగా పైటచెంగుతో పాటు ఆమెను దగ్గిరికి లాక్కోవటం ప్రారంభించాడు.

పైటచెంగుతో పాటు ముందుకు వెళ్ళితే ఆ కామాంధుడి కౌగిట్లో చిక్కుకోవలసి వుంటుందని పైటను రెండు చేతులతో పట్టుకుని ప్రతిఘటించటానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నం నెరవేరకపోవటంతో పైటను వదిలేసి మోచేతులతో ఎదను దాచుకుంటూ నిలుచున్నచోటనే గిరగిరా తిరిగింది.

పూర్తిగా తన చేతులలోకి వచ్చేసిన ఆమె చీరను అవతలికి విసిరేశాడు ఆ ఇన్స్పెక్టర్. వెకిలి నవ్వును పెంచి పెద్దదిచేస్తూ అడుగులు ముందుకు వేయటం ప్రారంభించాడు.

వేటగాడ్ని చూసిన లేడిలా గజగజ వణికిపోతోంది ఆమె. కనికరం చూపమని కళ్ళతోనే అతన్ని అర్థిస్తూ వెనక్కి జరుగుతోంది.

జరిగిజరిగి ఇక చోటు లేకపోవడంతో వెనక వున్న గోడను ఆనుకుందామె. అతను మరింత ముందుకు రావటంతో కెవ్వున అరిచింది.

అదే సమయంలో భళ్ళున శబ్దంచేస్తూ విసురుగా తెరుచుకున్నాయి బెడ్‌రూం తలుపులు... చేతులు ముందుకు జాచి ఆమెను అందుకోబోతున్న ఇన్స్‌పెక్టర్‌ని డిస్టర్బ్ చేసి, అతను తలత్రిప్పి చూసేటట్టు చేశాయి.

వేటను పసిగట్టిన బెంగాల్ టైగర్‌లా లోపలికి వస్తున్న శ్యామ్‌సుందర్‌ని చూసేసరికి విపరీతమయిన ఆశ్చర్యంతో విస్తృతాలయినాయి ఇన్స్‌పెక్టర్ కళ్ళు...నసీమాపై అత్యాచారానికి పూనుకోవాలన్న ఆలోచన అతని మస్తిష్కం నుండి దూరం అయింది.

“నువ్వు... నువ్వు... ఎలా వచ్చావు ఇక్కడికి? లాకప్‌లోంచి ఎలా తప్పించుకున్నావు?” ఆశ్చర్యాన్ని అదుపుచేసుకుంటూ అడిగాడు ఇన్స్‌పెక్టర్.

“పండిన నీ పాపమే నన్ను ఇక్కడికి వచ్చేటట్టు చేసింది! నీలాంటి పొగరుబోతుకు తగిన విధంగా బుద్ధిచెప్పమని ఆదేశించింది'' అంటూ అందుబాటులో కనిపించిన చీరను అందుకుని నసీమా మీదికి విసిరాడు శ్యామ్‌సుందర్.

ఆ వెంటనే ఇన్స్‌పెక్టర్ ఎదురుచూడని విధంగా ముందుకు దూకి, మూసి వుంచిన పిడికిలితో అతని ముఖం పగిలిపోయేటట్లు బలంగా కొట్టాడు.

గావురుమని అరిచి వెనక్కి తూలిపోయాడు ఇన్‌స్పెక్టర్. వెనకవున్న గోడకు కొట్టుకుని తల ఫట్‌మని శబ్దం చేయటంతో... గచ్చునేలమీద చతికిలబడి పోయాడు.

మరోసారి ముందుకు రాబోతున్న శ్యామ్‌సుందర్‌ని గమనిస్తూనే, తలమీద తగిలిన దెబ్బను గురించి పట్టించుకోకుండా వేగంగా లేచి స్టాండ్ దగ్గిరికి దూకాడు ఇన్స్‌పెక్టర్. స్టాండ్‌కి తగిలించిన తన ఫాంటు బెల్ట్‌కున్న హోల్‌స్టర్‌లోంచి బయటికి తీశాడు రివాల్వర్‌ని.

అతడి ప్రయత్నాన్ని పసిగట్టినా అడ్డుకోవడంలో కొద్దిగా ఆలస్యం చేశాడు శ్యామ్‌సుందర్. ఇన్స్‌పెక్టర్ చేతిలోని రివాల్వరు తనకేసి గురిపెట్టగానే... జరిగిన ఆలస్యానికి తనను తానే నిందించుకుంటూ చేతులు పైకెత్తేశాడు.

"నువ్వు లాకప్‌లోంచి తప్పించుకుని వచ్చినా.... నా చేతులలోంచి మాత్రం తప్పించుకోలేవు! నిన్ను చంపి ఎన్‌కౌంటర్‌లో హతమార్చానని వెల్లడిస్తాను...!" అంటూ రివాల్వర్ ట్రిగ్గర్‌మీద చూపుడు వ్రేలును బిగించాడు.

ధన్....మంటూ ఘర్జించింది రివాల్వర్...ఆ గది ప్రతిధ్వనించేటట్లు పెద్ద శబ్దం వెలువరించింది.

ఎగిరి పక్కకి దూకాడు శ్యామ్‌సుందర్. దూసుకువచ్చిన బుల్లెట్ బారినుండి వెంట్రుకవాసిలో తప్పించుకుని, అతనిమీదికి విసిరేందుకు అందుబాటులో ఏదయినా వస్తువు కనిపిస్తుందేమోనని అటూ ఇటూ చూశాడు.

అటువంటి వస్తువు ఏదీ అతని కంటికి అగుపించలేదు....ఇన్స్‌పెక్టర్ ఫైరింగ్‌ను అదుపుచేసే ఉపాయం తట్టలేదు.

"తప్పించుకోలేవు! నువ్వు ప్రాణాలతో తప్పించుకోవటం అసంభవం!" అంటూ మరోసారి రివాల్వర్ ప్రయోగించబోయాడు ఇన్స్‌పెక్టర్.

అదేసమయంలో శ్యామ్‌సుందర్ అందించిన చీర కట్టుకోవటం ముగించి ఇన్స్‌పెక్టర్ వెనక్కి చేరుకుంది నసీమా. తన మానం మంటగలపకుండా అడ్డుకున్న మహానుభావుడి ప్రాణాలకు ముప్పువాటిల్లబోవటం గ్రహించి వెర్రి ఆవేశానికి గురి అవుతూ అటూ ఇటూ చూసింది. అందుబాటులో కనిపించిన కుర్చీ నొకదాన్ని పైకెత్తి ఇన్స్‌పెక్టర్ తలమీద బలంగా మోదింది.

ఫెళ్ళున శబ్దంచేస్తూ పగిలి ముక్కలయింది కుర్చీ. దాంతోపాటే పగిలిపోయింది ఇన్స్‌పెక్టర్ తల. బాధగా అరిచాడు ఇన్స్‌పెక్టర్. ఎర్రటి రక్తం వెల్లువలా వెలుపలికి వస్తుండగా రివాల్వర్‌ను వదిలేసి నిలుచున్నచోటనే నేలకు ఒరిగిపోయాడు.

ఆవేశం పట్టలేక కొట్టడమయితే కొట్టిందిగానీ, పగిలిన తలతో అతడు రక్తపు మడుగులో పడి కదలకుండా వుండటం చూస్తూనే కంగారు పడిపోయింది నసీమా. అతను చచ్చిపోయాడేమోనన్న భయంతో గజగజ వణికిపోవటం ప్రారంభించింది.

అదే సమయంలో గబగబా ముందుకు వచ్చాడు శ్యామ్‌సుందర్. ఇన్స్‌పెక్టర్ పక్కన మోకరించి, అతని శ్వాసని పరీక్షించి తేలిగ్గా నిట్టూర్చాడు.

"డోంట్ వర్రీ బహెన్! ఇటువంటి పాపాత్ముడి ప్రాణాలు అంత సులువుగా పోవు!" అంటూ ఆమెతోపాటు బయటికి వచ్చాడు శ్యామ్‌సుందర్.

హాల్లో వున్న సోఫాలో పడుకోబెట్టబడి వున్నాడు నాలుగేళ్ళ నసీమా కొడుకు. బయటికి రాగానే ఆతృతగా అతన్ని ఎత్తి భుజంమీద వేసుకుంది నసీమా.

అక్కడ టీపాయ్ మీద వున్న టెలిఫోన్ రిసీవర్ ఎత్తి కంట్రోల్ రూంకి ఫోన్‌చేశాడు శ్యామ్‌సుందర్.

"గెస్ట్‌హౌస్‌లో గొడవ జరిగింది....ఒక ఇన్స్‌పెక్టర్, ఇద్దరు కానిస్టేబిల్స్ తీవ్రమయిన గాయాలకు గురి అయ్యారు! వెంటనే అంబులెన్స్ పంపండి!" అంటూ అవతలి వైపునుండి ఆందోళనగా అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రిసీవర్ క్రెడిల్‌మీద పెట్టేశాడు.

నసీమా తన కొడుకుని ఎత్తుకుని యింకా అక్కడే వుంది. ఏం చేయాలో, ఎటు వెళ్ళాలో తోచనట్టు అతని ముఖంలోకి చూడసాగింది.

"మనం ఇక్కడే వుండటం మంచిదికాదు నసీమా! పద వెళదాం" అంటూ బయటికి నడిచాడు శ్యామ్‌సుందర్.

అతన్ని అనుసరిస్తూ బయటికి వచ్చింది నసీమా. వరండాలో గోడకు ఆనుకుని నిద్రపోతున్న ఇద్దరు కానిస్టేబిల్స్‌ని గమనించి ఆందోళనగా చూసింది శ్యామ్‌సుందర్ ముఖంలోకి.

చాందినీ కారులో అక్కడికి చేరుకున్న తరువాత కారును గెస్ట్‌హౌస్ వెనక వున్న ఓ సందులో ఆపి, గోడదూకి లోపలికి వచ్చాడు శ్యామ్‌సుందర్. గోడవారగా చుట్టూ తిరిగి గెస్ట్‌హౌస్ ముందు భాగానికి చేరుకున్నాడు.

సిగిరెట్లు కాలుస్తూ వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు ఇద్దరు కానిస్టేబిల్స్. లోపల వున్న తమ ఇన్స్‌పెక్టర్ వెంట తెచ్చుకున్న ఆమెను ఏం చేస్తున్నారో అన్న విషయంమీద ఆ యిద్దరి మధ్యా జోరుగా సాగుతోంది చర్చ.

పిల్లిలా అడుగులువేస్తూ శ్యామ్‌సుందర్ రూపంలో తమను సమీపిస్తున్న ప్రమాదాన్ని గమనించలేదు వాళ్ళు. గమనించిన తర్వాత జాగ్రత్తపడే అవకాశం లభించలేదు.

తనను గమనించిన ఆ యిద్దరూ ఉలికిపాటు నుండి తేరుకునేలోపే వారి మెడలమీద బలంగా పడ్డాయి టైట్‌గా, స్ట్రయిట్‌గా బిగించబడిన శ్యామ్‌సుందర్ చేతులు. కిక్కురుమనకుండా స్పృహతప్పారు వారిద్దరు.

ఆ ఇద్దరినీ పడిపోయినచోటే గోడలకు ఆనించి కూర్చోబెట్టాడు శ్యామ్‌సుందర్. ఆ పని పూర్తిచేసి చేతులు దులుపుకుంటుండగానే గెస్ట్‌హౌస్‌లోంచి అతనికి వినిపించింది కెవ్వుమంటూ నసీమా వేసిన కేక. మరో ఆలోచన లేకుండా అతడు ముందుకు కదిలేట్టు చేసింది.

శ్యామ్‌సుందర్ నోటివెంట ఆ మాటలు వింటూనే వింతగా చూసింది అతని ముఖంలోకి నసీమా. అతడు సామాన్యుడు కాడని మనసులోనే అనుకుంది.

"ఇక నీకొచ్చిన భయం ఏమీలేదు బహెన్! నీ ఇల్లెక్కడో చెప్పు. నీ వాళ్ళకు నిన్ను అప్పగించి, నా దారిన నేను పోతాను."

పోలీస్ గెస్ట్‌హౌస్‌కి దూరంగా వున్న ఒక రోడ్‌మీదికి అడుగుపెడుతూ నసీమాను ఉద్దేశించి అన్నాడు శ్యామ్‌సుందర్.

"ఇల్లూ, వాకిలీ వున్నా వెళ్ళలేని పరిస్థితి నాది. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బ్రతకాల్సి వస్తోంది!" అంది నసీమా కంటతడిపెడుతూ.

అటువంటి పరిస్థితి ఎందుకు వచ్చిందో ఆమెను అడిగి తెలుసు కోవాలన్న ఆలోచనను బలవంతంగా వాయిదా వేసుకున్నాడు శ్యామ్‌సుందర్. రాత్రంతా నిద్రలేకపోవటంవల్ల మంటపుడుతున్న కళ్లను నులుముకుంటూ అటూ ఇటూ చూశాడు.

ఆ రోడ్ చివరినుండి అతని దృష్టిని ఆకర్షించాయి కొన్ని ఆటోలు. తెల్లవారుఝాము దగ్గిర పడటంతో ఒక్కటొక్కటిగా రోడ్లమీదికి వస్తున్నాయి వాహనాలు.

ఖలీల్‌పాషాను వెతికేందుకు ఖచ్చితమయిన కార్యక్రమాన్ని రూపొందించు కునేంత వరకూ తను వీధులలో తిరగటం అంతమంచిది కాదని పించింది శ్యామ్‌సుందర్‌కి... కొద్దిగంటలపాటు విశ్రాంతి తీసుకుంటే తరిగిపోయిన జవసత్వాలు తిరిగి వస్తాయని అపిపించింది.

ఆ వెంటనే నసీమాను తనతో రమ్మని సైగలు చేసి, ఆటోలు కనిపిస్తున్న వైపు నడిచాడు శ్యామ్‌సుందర్. ఆమెతోపాటు ఆటో ఎక్కి, బజూరీ సరసుమీద

నిర్మించిన వంతెన దగ్గిర దిగిపోయాడు. అక్కడినుంచి అంతకుముందు వీరూమియా పురమాయించిన కిరాయి రౌడీలను కంగారుపెట్టిన శిథిల కట్టడంలోకి చేరుకుని నేలమీద దుమ్మూ ధూళిని లెక్కచేయకుండా ఎయిర్‌బేగ్‌ను తలక్రింద పెట్టుకుని, నేలమీద నడుం వాల్చాడు. నసీమాను కూడా విశ్రాంతి తీసుకోమని కళ్ళతో సైగలు చేస్తూ నిద్రలోకి జారిపోయాడు.

# 12

**ఉదయం** ఆరు గంటలకే మెలకువ వచ్చేసింది శ్యామ్‌సుందర్‌కి. ఆ కొద్దిపాటి విశ్రాంతికే అలసట అంతా తుడిచిపెట్టుకుపోయినట్లు అన్పించింది.

లేచి కూర్చుని బద్దకంగా ఒళ్ళు విరుచుకుంటూ ఏదో గుర్తుకు వచ్చి తలతిప్పి పక్కకి చూశాడు.

నసీమా ఇంకానిద్రపోలేదు. కార్నర్‌లోని ప్రదేశాన్ని కొంతమేరకు శుభ్రం చేసి తన బిడ్డను పడుకోబెట్టింది. అతని పక్కన మోకాళ్ళమీద తల పెట్టుకుని ముడుచుకుని కూర్చుంది.

శ్యామ్‌సుందర్ లేచి కూర్చోవటం గమనిస్తూనే గబగబా లేచి, పార్శిల్ చేయించుకు వచ్చిన రొట్టెలనూ, వాటర్ బాటిల్‌నూ తీసుకువచ్చి అతని ముందుంచింది.

"నసీమా! నువ్వు...నువ్వు నిద్రపోలేదా?" అనడిగాడు శ్యామ్‌సుందర్ ఎర్రబారిన ఆమె కళ్ళలోకి చూస్తూ.

విషాదంగా నవ్వి, తల అడ్డంగా త్రిప్పింది నసీమా.

"లేదు భయ్యా! నన్నెంతో ప్రేమగా చూసుకునే నా భర్త ఆ దుర్మార్గుల చేతులలో పడరాని పాట్లు పడుతున్నాడని తెలిసి నాకు నిద్ర ఎలా పడుతుంది? ఆ సంగతి తరువాత మాట్లాడుకుందాం భయ్యా! ముందు ముఖం కడుక్కుని ఈ రొట్టెలు తిను. ఇవి నీకోసమే తెచ్చాను!" అంది నసీమా.

ఆమె ఇచ్చిన రొట్టెలపొట్లం అందుకుని పక్కన పెట్టేశాడు శ్యామ్‌సుందర్. వాటర్ బాటిల్‌లోని వాటర్‌ని పుక్కిలించి అవతలికి వూసి "ఇవెక్కడివి?" అనడిగాడు.

"రాత్రి నువ్వేమీ తినలేదన్న సంగతి గుర్తొచ్చి...నా బిడ్డ నిద్రలోకి జారుకోగానే వంతెన అవతల వున్న చిన్న హోటల్ దగ్గిరికివెళ్ళి తెచ్చాను" అంది నసీమా.

చిన్నగా తలాడించాడు శ్యామ్‌సుందర్. ఆమె యింకా తననుండి ఏదో సహాయాన్ని ఆశించి తనకు ఉపచారాలు చేయటానికి ప్రయత్నిస్తున్నదని గ్రహించాడు.

"విశ్రాంతి తీసుకోవాలన్న ఉద్దేశంతో రాత్రి నీ వివరాలు అడగలేదు బహెన్! ఇప్పుడు చెప్పు! ఎవరు నువ్వు? రాత్రి ఆ రౌడీలు నిన్ను చంపటానికి ఎందుకు ప్రయత్నించారు?" అడిగాడు సిగిరెట్ వెలిగించుకుంటూ.

ఆ ప్రశ్న కోసమే ఎదురు చూస్తున్నట్టు, అతను అడిగిన వెంటనే తన వివరాలను తెలియచేయటం ప్రారంభించింది నసీమా.

"నా భర్త పేరు నజీర్! ఇక్కడే ఒక ధనవంతుడి దగ్గిర పనిచేస్తున్నారు. మాకు పెళ్ళయి అయిదేళ్ళయింది. ఆయన నన్నెంతో ప్రేమగా చూసుకునేవారు. ఆరునెలల క్రిందటివరకూ నా భర్త కష్టపడి పనిచేస్తూ సంపాదిస్తున్నాడనే అనుకున్నానుగానీ, కానిపనులు చేస్తున్నాడనీ...దేశద్రోహులకు సహాయపడుతూ, అక్రమ మార్గాలద్వారా డబ్బు కూడబెడుతున్నాడనీ నాకు తెలీదు.

ఆ విషయం తెలిసిన తరువాత నా గుండె భగ్గున మండిపోయింది. నా మనసు తల్లడిల్లిపోయింది. దేశద్రోహం మహాపాపమనీ...ఆ పాపం నా బిడ్డకు కూడా చుట్టుకుంటుందనీ...దేశద్రోహానికి పాల్పడుతున్న యజమానుల దగ్గర నౌఖరీ మానేయమనీ, కష్టపడి గంజి త్రాగయినా బ్రతుకుదామని ఎన్నో విధాల నా భర్తకు నచ్చచెప్పాను. ప్రాధేయపడ్డాను. కాళ్ళు పట్టుకుని బ్రతిమలాడాను.

ఆరునెలలనుండీ పోరుపెట్టగా ఈ మధ్యనే నా భర్త తన మనసు మార్చుకున్నాడు. చేస్తున్న పనిని మానుకోటానికి అంగీకరించాడు. కానీ అదంత సులువుకాదనీ...అందుకు కొంత టైంపడుతుందనీ...అంతవరకూ ఓపిక పట్టమని చెప్పాడు.

మొన్నటి రోజున....

ముఖంనిండా కమ్ముకున్న చెమట బిందువులను తుడుచుకుంటూ యింట్లోకి వచ్చాడు నజీర్. రాగానే తలుపులు మూసి గడియవేసి ముందుగదిలో

కూర్చుని బొమ్మలతో ఆడుకుంటున్న కొడుకును కూడా పట్టించుకోకుండా వంటగదిలో వున్న నసీమా దగ్గిరికి వెళ్ళాడు.

నీరసంగా, కంగారుగా కనిపిస్తున్న భర్త ముఖంలోకి చూసి కనుబొమలు ఆందోళనగా ముడివేసింది నసీమా. "ఏం జరిగిందండీ? ఏమిటంత నీరసంగా వున్నారు?" అనడిగింది.

"నీ ప్రశ్నలకు సమాధానం తరువాత చెబుతాను. ముందు నేను చెప్పేది జాగ్రత్తగా విను నసీమా! పాపాత్ములను ఏదో ఒకనాడు అల్లా శిక్షించకపోడు అన్న విషయం నాకు యిప్పుడిప్పుడే అర్థం అవుతుంది. అందుకే ప్రస్తుతం నేను పాపకూపం నుండి బయటపడి, చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకుంటున్నాను. ఇప్పుడే వెళ్ళి నేను ఉద్యోగం మానేస్తున్నానని చెప్పి, నా అకౌంట్ సెటిల్ చేసుకుని వస్తాను. ఆ మాట చెపితే వాళ్ళు నన్ను అంత సులువుగా వదలకపోవచ్చు. ఎందుకయినా మంచిది.... చీకటి పడగానే బాబును వెంటబెట్టుకుని బస్‌స్టేషన్‌కి వెళ్ళి వెయిటింగ్ హాల్లో కూర్చో...రాత్రి పదిగంటలకు వచ్చి నిన్ను కలుసుకుంటాను. మనం అటునుంచి అటే...ఈ దుర్మార్గులకు అందనంత దూరం వెళ్ళిపోదాం" అని చెప్పాడు.

"మానేసే ఉద్దేశం వున్నప్పుడు మళ్ళీ వెళ్ళటం ఎందుకూ? ఇద్దరం కలిసే బస్‌స్టేషన్‌కి వెళదాం" అంది నసీమా.

భార్య మాటలకు తల అడ్డంగా త్రిప్పాడు నజీర్.

"మనం కలిసివెళితే ఎవరికయినా అనుమానం రావచ్చు. అదీ కాకుండా నాకు రావల్సిన డబ్బు నా యజమాని దగ్గర చాలా వుంది. మనం ఎక్కడికయినా వెళ్ళి నిజాయితీగా వ్యాపారం చేసుకోవాలంటే డబ్బుతో అవసరం వుంటుంది. నేను వెళ్ళి ఏదో ఒకటిచెప్పి డబ్బు తీసుకువస్తాను. నువ్వు నేను చెప్పినట్టు చెయ్యి!" అంటూ అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఆ వెంటనే ప్రయాణానికి ఏర్పాట్లు చేసేసింది నసీమా.

ఇంట్లో వున్న డబ్బూ, బట్టలూ పెద్ద సూట్‌కేస్‌లో సర్దుకుని, మిగతా సామానంతా అలాగే వదిలేసి, చీకటిపడగానే తన కొడుకుతోపాటు ఒక ఆటోలో బస్‌స్టేషన్‌కి చేరుకుని భర్త చెప్పినట్టే అతనికోసం ఎదురుచూస్తూ వెయిటింగ్ హాల్లో కూర్చుంది.

రాత్రి పదిగంటలు అవుతున్నా రాలేదు నజీర్...మరో గంట గడిచినా అతను వస్తున్న జాడ కనిపించలేదు ఆమెకి. ఓపిగ్గా మరో అరగంట ఎదురు చూసింది నసీమా. టెన్షన్ భరించలేక కొడుకుతోపాటు ఇంటికి వచ్చేసింది.

నిద్రపోతున్న కొడుకును ఇంట్లో పడుకోబెట్టి, వీధి గుమ్మంలో నిలబడి ఆందోళన నిండిన మనసుతో ఎదురుచూస్తుండగా...ఇంటిముందుకు వచ్చి ఆగింది ఒక జీపు. అందులో కూర్చుని వున్న నలుగురు వ్యక్తులలో యిద్దరు క్రిందకి దిగి ఆమె దగ్గరికి వచ్చారు.

"నసీమా అంటే నువ్వేగా?" అనడిగాడు ఆ యిద్దరిలో ఒకడు.

"అవును!" అంది నసీమా.

"నజీర్ కారు యాక్సిడెంట్ చేశాడు. చావుబ్రతుకుల మధ్య హాస్పిటల్‌లో వుండి నిన్నే కలవరిస్తున్నాడు. నిన్ను తీసుకుని రమ్మని మా యజమాని మమ్మల్ని పంపారు...." అని చెప్పాడు ఆత్రుత నిండిన కంఠంతో.

వింటూనే ఒక్కసారిగా బావురుమంది నసీమా. రెండో ఆలోచన లేకుండా నిద్రపోతున్న కొడుకును భుజాన వేసుకుని వారివెంట జీపులో బయలుదేరింది.

అరగంట తర్వాత ఉదయపూర్‌కి ఉత్తరదిక్కుగా సిటీ మారుమూలన వున్న ఒక పెంకుటింటి ముందుకుపోయి ఆగింది జీపు.

"ఏమిటి యిక్కడికి తీసుకువచ్చారు? ఆయన హాస్పిటల్‌లో వున్నారనికదా చెప్పారు?" జీపులోంచి క్రిందికి దిగుతున్న ఆ వ్యక్తులను ఉద్దేశించి అనుమానంగా అడిగింది నసీమా.

"ఈ ఇంట్లోనే హాస్పిటల్ వుంది. దిగు క్రిందికి" అని గద్దించాడు ఒక వ్యక్తి.

వారిలో వచ్చిన మార్పు గమనించి కలవరపడింది నసీమా...ఏదో మోసం జరిగిందని అనుమానించి, విపరీతమయిన ఆశ్చర్యానికి గురి అవుతూ జీపులోంచి క్రిందికి దిగింది.

ఆమెతోపాటు పెంకుటింటి ముందుకు వెళ్ళి తలుపు తట్టాడు ఒక వ్యక్తి. తలుపులు తెరుచుకోగానే నసీమాను లోపలకు తీసుకుపోయారు.

అక్కడ విశాలంగా వున్న హాలు మధ్యలో కూర్చుని వున్నాడు ఆ వ్యక్తి. అతనుకాక మరో యిద్దరు రౌడీలు వున్నారు అతని పక్కన.

"రా...రా నసీమా! ఎందుకలా భయపడుతున్నావు? నేను నజీర్‌కి స్నేహితుడినే. శత్రువుని కాను!" చిరునవ్వు నవ్వుతూ ఆహ్వానించాడు అతను.

"ఆయన....ఆయన ఏరి?" ఆత్రుత నిండిన కళ్ళతో చుట్టూచూస్తూ ప్రశ్నించింది నసీమా.

"ఎవరూ–నజీరా! క్షేమంగా వున్నాడు. నేను అడిగిన ప్రశ్నలకు నువ్వయినా సమాధానాలు చెపితే క్షేమంగా నీ దగ్గరకు చేరుస్తాను కూడా!" అన్నాడు అతను పాన్‌పరాగ్ పొట్లాన్ని చించి పలుకుల్ని నోట్లో వేసుకుంటూ.

"ప్రశ్నలా! ప్రశ్నలేమిటి? ఆయన యాక్సిడెంట్‌చేసి హాస్పిటల్‌లో వున్నారని చెప్పారుకదా?' అంది నజీమా.

"అదా! నిన్ను యిక్కడికి రప్పించడానికి కావాలనే మా వాళ్ళతో అలా చెప్పించాను. నజీర్‌ను మాత్రం మరో చోట క్షేమంగా వుంచాను..." అన్నాడతను పాన్‌పరాగ్ పలుకుల్ని పటుక్ పటుక్‌మని నములుతూ.

"నన్ను యిక్కడికి రప్పించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇంతకీ ఆయన ఎక్కడున్నారు?"

"చెప్పానుకదా! క్షేమంగా వున్నాడనీ...నువ్వొక నిజం చెబితే అతనికి ఎలాంటి ఆపదా రానీయకుండా నీకు అప్పజెబుతాను" అన్నాడు అతను.

"నిజమేమిటి?" అయోమయంగా చూస్తూ అడిగింది ఆమె.

'మరేమీలేదు నసీమా! యజమానిదగ్గర ఉద్యోగం మానేస్తూ తెలివి తక్కువగా తెలుసుకోకూడని రహస్యం ఒకటి తెలుసుకుని పారిపోయాడు నజీర్....అఫ్‌కోర్స్...ఆ తర్వాత మళ్ళీ చాలాసేపటికి బస్‌స్టేషన్‌లో పట్టు బడ్డాడనుకో. కాని ఎన్నిసార్లు అడిగినా ఆ రహస్యం ఎవరితోనూ చెప్పలేదనే అంటున్నాడు అతను. నేనుమాత్రం అతడు ఆ రహస్యాన్ని ఖచ్చితంగా నీతో చెప్పి వుంటాడని భావిస్తున్నాను. కాబట్టి కాలయాపన చేయకుండా నీ భర్త నీతో చెప్పిన ఆ రహస్యాన్ని నువ్వు నాతో చెబితే బాగుంటుంది" అన్నాడు అతను.

"నన్ను నమ్మండి భాయీసాబ్! నాకు ఏ రహస్యమూ తెలీదు. నా భర్త నాకు ఏమీ చెప్పలేదు" అంది నసీమా.

ఈడ్చికొట్టాడు ఆమె చెంపమీద ఆ వ్యక్తి.

కెవ్వుమంది నసీమా....పక్కనే వున్న టీపాయ్‌ని గుద్దుకుని దానితో పాటే క్రింద పడిపోయింది. జారిక్రిందపడబోతున్న భుజంమీది కొడుకును పడకుండా పట్టుకుంది.

"మొండికేసి చిత్రహింసలు అనుభవిస్తున్నాడు నీ భర్త. నువ్వయినా నిజంచెప్పి అతన్ని కాపాడుకో" అంటూ కటువుగా హెచ్చరించాడు ఆ వ్యక్తి.

"తెలీదు సాబ్! నిజంగానే నాకే రహస్యమూ తెలీదు. నా భర్తను ఏమీ చేయకండి" అంది నసీమా కంటతడిపెడుతూ.

విసుగ్గా తల విదిలించాడు ఆ వ్యక్తి.

"మొండితనంలో నజీర్‌ను మించిపోయింది వాడి పెళ్ళాం. ఈమెకు రహస్యం తెలిసినందువల్ల వచ్చిన నష్టం ఏమీలేదు. ఆమెనూ, ఆమెతో పాటు ఆమె కొడుకును, ఇక్కడే ముక్కలుగా నరికి పారేయండి. ఆ ముక్కలన్నీ మూటగట్టుకునిపోయి నజీర్‌కి చూపించండి..." అని ఖంగుమంటున్న కంఠంతో ఆదేశించాడు ఆ వ్యక్తి.

వెంటనే కత్తులను బయటికి తీసారు అతని పక్కన నిలబడిన ఆ వ్యక్తులు. పాన్‌పరాగ్ నములుతున్న వ్యక్తి ఆదేశాలను అమలుపరచటానికి అడుగులు ముందుకు వేయటం ప్రారంభించారు.

విపరీతమయిన భయంతో బలవంతంగా గుటకలు మింగింది నసీమా. పారిపోయే ఉద్దేశ్యంతో అటూ ఇటూ చూసింది.

తన ముందుకు వచ్చి నిలబడి కత్తులను గాలిలోకి ఎత్తుతున్న ఆ యిద్దరు రౌడీలను గమనిస్తూనే అంతకుముందు తనతోపాటు తలక్రిందులయిన టీపాయ్‌ని ఒక చేత్తో అందుకుంటూ భుజంమీది కొడుక్కి డిస్టర్బ్ కాకుండా చివ్వున లేచి నిలబడింది.

ప్రాణభయంతో ఆమెకు ఎక్కడలేని బలం వచ్చేసింది. తప్పించుకు పోవాలన్న ఆలోచనతో అన్నిటికీ తెగించినదానిలా ఒంటిచేత్తో ఎత్తిన టీపాయ్‌ని కత్తులు పుచ్చుకున్న వాళ్ళమీదికి విసిరింది.

గాల్లో గిరగిరా తిరుగుతూ వచ్చి ఆ ఇద్దరి ముఖాలను తాకింది ఆ టీపాయ్. కత్తులు పుచ్చుకున్న వారిని కెవ్వుమనిపించి క్రిందపడిపోయింది.

ఆ తర్వాత ఏం జరిగిందో చూడలేదు నసీమా. చివ్వున వెనుతిరిగి తన వెనక నిలబడిన నలుగురు రౌడీలను రఫ్‌గా అవతలికి నెట్టి వీధిలోకి పరుగుదీయటం ప్రారంభించింది.

"బాప్‌రేబాప్! పారిపోతోందిరా నజీర్‌గాడి పెళ్ళాం. పట్టుకోండి దాన్ని...పట్టుకొని వెంటనే లాక్కురండి. వీలుపడకపోతే ప్రాణాలు తీసేయండి. పొండిరా.....పొండి..." అంటూ టెన్షన్ గా అరవటం ప్రారంభించాడు.

వెంటనే కత్తులు అందుకుని ఆమె వెంటపడ్డారు అందరూ.

* * * * *

"అదీ భయ్యా నా జాలిగాథ! వాళ్ళ చేతికి చిక్కితే నాతోపాటు నా బిడ్డను కూడా నిర్ధాక్షిణ్యంగా నరికి చంపేస్తారన్న భయంతో వీధులలో పడి పరుగులు తీస్తుండగా నువ్వు కనిపించావు. ఆపద్బాంధవుడిలా నన్ను ఆదుకున్నావు" అంటూ చెప్పటం ముగించి కళ్ళు తుడుచుకుంది నసీమా.

అంతా శ్రద్ధగా ఆలకించి మౌనంగా తలాడించాడు శ్యామ్‌సుందర్. పూర్తిగా కాలిన సిగరెట్‌ను అవతలికి విసిరి ఇంకొక సిగరెట్ వెలిగించుకున్నాడు.

అతని ముఖంలోకి చూస్తూనే వుంది నసీమా, ఉన్నట్టుండి చటుక్కున వంగి అతని పాదాలు పట్టుకుంది.

ఉలికిపడుతూ వెనక్కి జరిగాడు శ్యామ్‌సుందర్. అప్పుడే వెలిగించిన సిగరెట్‌ను అవతలికి విసిరేసి, ఆమె భుజాలు పుచ్చుకుని లేవనెత్తాడు. "ఏమిటి నసీమా ఇది? ఏమిటీ పిచ్చిపని?" అన్నాడు.

"నీకు తెలియదు భయ్యా! నా భర్తను నేను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు తెలియదు. ఆయన దూరం అయితే నేనూ నా బిడ్డ అనాథలం అయిపోతాం. నా ప్రాణాలు కాపాడిన పుణ్యాత్ముడివి. నా భర్తను కూడా నువ్వే కాపాడాలి. మేము దిక్కులేనివాళ్ళం కాకుండా ఆదుకోవాలి" అంటూ వెక్కిళ్ళు పెట్టడం ప్రారంభించింది.

వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు శ్యామ్‌సుందర్.

ఎలా చెబుతాడు? అప్పటికే తనకు పూర్తిగా సంబంధం లేని వ్యవహారంలో వేలుపెట్టి సగానికి పైగా ఇరుక్కుపోయాడతను. నసీమాకి ఇప్పుడు మాట ఇస్తే మొత్తంగా కూరుకుపోవాల్సి వస్తుంది.

ఏది ఏమైనా బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలనుకున్నాడు శ్యామ్‌సుందర్. మరో సిగరెట్ వెలిగించి దమ్ములాగుతూ తన పొజిషన్‌ని అంచనా వేసుకోవటం ప్రారంభించాడు.

నసీమా చెప్పిందాన్నిబట్టి చూస్తే నజీర్ అనబడే ఆమె భర్త ప్రాణాలతో వుండే అవకాశాలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. అసలు ఇంతవరకూ ప్రాణాలతో వుండటమే గొప్ప అనిపిస్తోంది.

ఎందుకంటే ఏ దేశానికి చెందినవారయినా ఈవిల్స్ ఆర్గనైజేషన్స్‌కి కొన్ని ఖచ్చితమయిన కఠిన నియమాలుంటాయి.

అవినీతికే పెద్దపీట వేసి, అక్రమాలూ, దుర్మార్గాలు చేసే ఈవిల్స్ ఆర్గనైజేషన్ వాళ్ళు మనసు మార్చుకుని మంచిగా బ్రతకాలనుకున్నా, గాంగ్ వదిలి దూరంగా పోవాలనుకున్నా, అందుకు అంత సులువుగా అంగీకరించరు వాళ్ళు. గాంగ్‌తో తెగతెంపులు చేసుకోవటం దాదాపు సాధ్యంకాదు.

సాధారణంగా గాంగ్‌తో తెగతెంపులు చేసుకుని వెళ్ళిపోవాలనుకున్న వాళ్ళను మంచి మనసుతోనే సాగనంపుతుంది గాంగ్. ఆ తరువాత వారికి మరణశిక్ష విధించి అదనుచిక్కగా అమలుపరుస్తుంది.

"నీ మౌనం నన్ను మరింత టెన్షన్‌కి గురిచేస్తోంది భయ్యా! నా భర్తను కాపాడతానని మాట యిస్తే తప్ప నిన్ను వదలను."

విషాదం నిండిన కంఠంతో వేడుకుంటూ ఆమె అన్న మాటలకు ఆలోచనల నుండి బయటపడ్డాడు శ్యామ్‌సుందర్. దీనాతి దీనంగా తన ముఖంలోకి చూస్తున్న నసీమా ముఖంలోకి చూస్తూనే ఒక నిర్ణయానికి వచ్చేసాడు.

"ఆల్‌రైట్ నసీమా బహెన్! నీ భర్త ఎక్కడున్నా రక్షించి తీసుకువచ్చి నీకు అప్పగిస్తాను. అంతవరకు వేరే ఇతర కార్యక్రమాన్ని చేపట్టను. అతను ఎక్కడ పని చేసేవాడో చెప్పు" అన్నాడు.

"జియావుద్దీన్ సాహెబ్ దగ్గర పని చేస్తున్నాడు నా భర్త. ఆయన నిర్వహిస్తున్న ఒక ప్రయివేట్ కంపెనీలో డ్రయివర్‌గా వుంటున్నాడు" అని చెప్పింది నసీమా.

జియావుద్దీన్ సాహెబ్ పేరు వింటూనే వింతగా ముడిపడ్డాయి శ్యామ్ సుందర్ కనుబొమలు.

దేశంలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలలో ఒకడు జియావుద్దీన్ సాహెబ్. రాజ్యసభ్యుడిగా నామినేట్ చేసినా సున్నితంగా తిరస్కరించి, రాజకీయాలకు అతీతంగా ప్రజాభిమానాన్ని చూరగొంటున్న వ్యక్తి. భారత ప్రభుత్వంచే అనేక బిరుదులు, సత్కారాలూ పొందిన ఉన్నత దేశభక్తుడు.

అటువంటి ఉన్నతమయిన వ్యక్తి దగ్గిర పని చేస్తున్న నజీర్ అవినీతి కార్యకలాపాలకు పాల్పడటం ఏమిటి? నసీమాని వెంటపడి చంపబోయిన రౌడీలతో జియావుద్దీన్ సాహెబ్‌కి సంబంధం ఏమిటి?

ఒకవేళ అందరూ అనుకుంటున్నంత మంచివాడు కాదేమో అతను. పైకి మంచివాడుగా కనిపిస్తూ జనాన్ని మోసం చేస్తున్నాడేమో? ఎంత ఆలోచించినా అర్థంకాలేదు శ్యామ్‌సుందర్‌కి.

జియావుద్దీన్ సాహెబ్ అసలు రూపం ఏమిటో తెలుసుకోవాలన్నా, అతని దగ్గిర బంధించబడిన నజీర్‌ను విడిపించాలన్నా, అతని భవంతిలోకి ప్రవేశించక తప్పదు అనుకుంటూ ఆ భవంతి అడ్రస్‌ను ఆమెను అడిగి తెలుసుకుంటూ ఎయిర్‌బేగ్‌ను భుజానికి తగిలించుకుని శిథిల కట్టడంలోంచి బయటికి వచ్చాడు.

వస్తూనే ముందుకు చూసి ఉలిక్కిపడ్డాడు శ్యామ్‌సుందర్.

ఎలా వచ్చాడో, తన ఉనికిని ఎలా పసిగట్టాడో, శిథిల కట్టడం బయట కాపలా వాడిలా నిలబడి శ్యామ్‌సుందర్ కోసం దిక్కులు చూస్తున్నాడు బల్బీర్. అతను కనిపించగానే చిరునవ్వు నవ్వుతూ ముందుకు రాబోయాడు.

ఒళ్ళు మండిపోయింది శ్యామ్‌సుందర్‌కి. విపరీతమయిన కోపం ముంచుకు వచ్చింది. వదలకుండా వెంటపడుతున్న అతన్ని వెంటనే వెనక్కి పంపించాలన్న ఆలోచన కూడా వచ్చింది.

"తప్పించుకు తిరుగుతున్నానని నన్ను తక్కువగా అంచనా వేసినట్టున్నావు. తొడకొట్టడం, పడగొట్టడం నీకేకాదు, నాకూ తెలుసు. చూస్తావా నా సత్తా?" అంటూ ఎయిర్‌బేగ్ క్రిందికి జారవిడిచి బిగ్గరగా ఫీట్‌చేస్తూ గాలిలోకి ఎగిరాడు శ్యామ్‌సుందర్.

కంగారుపడ్డాడు బల్బీర్ "ఆగు శ్యామ్‌సుందర్! తొందరపడకు" అని అతన్ని వారిస్తూ పక్కకి దూకబోయాడు.

నెరవేరలేదు అతని ప్రయత్నం. భారీకాయుడు కావటంవల్ల అనుకున్నంత వేగంగా కదలడం సాధ్యం కాలేదతనికి.

గాలిలోకి ఎగురుతూనే కుడికాలితో అతని ఛాతీమీద బలంగా తన్నబోయాడు శ్యామ్‌సుందర్. బల్బీర్ కదలడంవల్ల అతని జబ్బను తాకింది శ్యామ్‌సుందర్ పాదం.

అంతలావు మనిషి ఎత్తి విసిరేసిన సిమ్మెంట్ బస్తాలా ఎగిరి అవతల పడ్డాడు.

"ఆగు శ్యామ్‌సుందర్! నేను నిన్ను బలవంతంగా తీసుకువెళ్ళటానికి రాలేదు. బ్రతిమాలటానికి వచ్చాను. చాందినీ పరిస్థితి ఏమీ బాగాలేదు" అంటూ లేచి నిలుచున్నాడు బల్బీర్.

క్రిందపడినవాడ్ని మరో శక్తివంతమయిన కిక్‌తో లేవకుండా చేయాలని అనుకుంటూ ముందుకు వచ్చేశాడు శ్యామ్‌సుందర్. చాందినీ పేరు చెబుతూ అతను అన్న మాటలకు ఆఖరి క్షణంలో తనను తాను అదుపుచేసుకుంటూ ఆశ్చర్యంగా చూసాడు ముఖంలోకి.

"ఏమయింది చాందినీకి....?" అని అడిగాడు ఆత్రుత నిండిన కంఠంతో.

దిగాలుగా ముఖంపెట్టి అతని దగ్గిరికి వచ్చాడు బల్బీర్. "నీ మాట మీద గౌరవంతో తనను తాను శిక్షించుకుంటోంది చాందినీ. రాత్రి నువ్వు వెళ్ళినప్పటినుండి వున్న చోటునుండి కదలకుండా నిలువుగాళ్ళమీద నిలబడి నీరసించిపోతోంది" అని చెప్పాడు.

అప్పుడు గుర్తువచ్చింది శ్యామ్‌సుందర్‌కి తను చెప్పేదాకా నిలుచున్న చోటునుండి కదలవద్దని చాందినీకి ఆర్డర్ వేసిన సంగతి. కేవలం ఆమెను వదిలించుకోవటానికి అన్న మాటను పట్టుకుని అంత పట్టుదలగా నిలబడు తుందని అనుకోలేదు.

"ఎవరెంత చెప్పినా నిలుచున్న చోటునుండి కదలటంలేదు చాందినీ. జనం చుట్టుచేరి ప్రశ్నలతో విసిగిస్తున్నా ఆ చెట్టు క్రిందనుండి అంగుళం కూడా ఇవతలికి రావటంలేదు. నువ్వొచ్చి చెబితేగాని రాదట. అందుకే నిన్ను వెదుక్కుంటూ బయలుదేరాను. ఒక ఆటో డ్రయివర్ చెప్పిన అడ్రస్ పుచ్చుకుని

ఇటు వచ్చాను. వెంటనే వచ్చి నవ్వులపాలు కాకుండా ఆమెను కాపాడు. చాందినీ నీ ప్రాణాలు నిలబెట్టి నీకు మేలు చేసిందన్న సంగతి మరిచిపోకు" అని అర్థిస్తూ చేతులు జోడించాడు బల్బీర్.

అతని మాటలకు సిగ్గుపడిపోయాడు శ్యామ్‌సుందర్. "ఇలా జరుగుతుందని నేనూ అనుకోలేదు బల్బీర్‌భాయ్! అవసరమయిన పనిమీద వెళ్ళవలసి వచ్చి అలా చేసాను. నువ్వు ఈ నసీమాను తీసుకుని ఇంటికి వెళ్ళు. నేను వెళ్ళి చాందినీ సంగతి చూస్తాను" అన్నాడు.

సంతోషంగా తలాడించాడు బల్బీర్. నసీమాను, ఆమె కొడుకును వెంటబెట్టుకుని అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

మనసును కదిలించిన చాందినీని గురించి ఆలోచిస్తూ ఆమెను వదిలి వచ్చిన వీధిని గుర్తుచేసుకుంటూ బయలుదేరాడు శ్యామ్‌సుందర్. ఆ వీధిలోకి అడుగుపెట్టి ముందుకు చూస్తూనే గొంతులో ఏదో అడ్డుపడినట్టు ఫీలయ్యాడు.

అతను రాత్రి వదిలిన చెట్టుక్రింద అలాగే నిలబడివుంది చాందినీ. చెట్టు చుట్టూ చేరి తలాతోకాలేని ప్రశ్నలతో వేధిస్తున్న జనానికి సమాధానం చెప్పలేక అవస్థపడుతున్నది.

అక్కడేదో ప్రత్యేక ప్రదర్శన జరుగుతున్నట్టు ఉరుకుల పరుగుల మీద అటు పరుగులు దీస్తున్నారు జనం. శ్యామ్‌సుందర్ చూస్తుండగానే పోలీస్ వ్యాన్ ఒకటి వచ్చి అక్కడ ఆగింది. అందులోంచి దిగిన కానిస్టేబుల్స్ జనాన్ని అదుపుచేస్తుండగా ఇన్‌స్పెక్టర్ ఆమె దగ్గిరికి వెళ్ళి ఏదో అడగసాగాడు.

ఆ ఇన్‌స్పెక్టర్‌ను చూడగానే ముందుకు వేస్తున్న అడుగులను వెంటనే ఆపేశాడు శ్యామ్‌సుందర్. ఎందుకయినా మంచిదని ఒక గోడ చాటుకు తప్పుకుని ఆలోచించటం ప్రారంభించాడు.

చాందినీ వాలకం చూస్తుంటే తను వెళ్ళి చెప్పేంతవరకూ అక్కడ నుంచి కదలదని తెలుస్తూనే వుంది. చెప్పటానికి ఆమె దగ్గిరికి వెళితే ఆ ఇన్‌స్పెక్టర్ తనను గుర్తుపడతాడన్నది అర్థం అవుతూనే వుంది.

తొండ ముదిరి వూసరవెల్లి అయినట్టు చాందినీ వ్యవహారం ముదిరి ఎంక్వయిరీలదాకా దారితీయకముందే ఆమెను అక్కడ్నించి అవతలికి తీసుకుపోతే

బాగుంటుందని అనిపించింది. ఆ పని చేయటం ఎలాగ అన్న ప్రశ్న కూడా ఎదురయింది.

ఎలా? పోలీసుల కంటపడకుండా చాందినీని అక్కడ్నించి కదిలించటం ఎలా?

ఎలా అన్న ప్రశ్నకు వెంటనే సమాధానం లభించింది శ్యామ్‌సుందర్‌కి. ఉన్నట్టుండి జిగేళ్‌మనిపిస్తూ సూటిగా వచ్చి అతని కళ్ళలో పడింది ఒక కాంతి.

పట్టపగలు టార్చిలైటును తనమీద ఫోకస్ చేసింది ఎవరో తెలుసుకోటానికి కళ్ళకు చేతిని అడ్డం పెట్టుకుంటూ ఆ కాంతి దూసుకువచ్చిన వైపు చూసాడు. చూస్తూనే చిరునవ్వు నవ్వాడు.

చోళీలకూ, పావడాలకు కుట్టుకునే గుండ్రటి అద్దాలను గుత్తులు, గుత్తులుగా భుజానికి వ్రేలాడదీసుకుని అటే వెళుతూ కనిపించాడు ఆడవారి అలంకరణ వస్తువులు అమ్ముకుంటూ వీధులలో తిరిగే వ్యక్తి ఒకతను. పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేకుండానే అద్భుతమయిన ఉపాయం ఒకటి శ్యామ్‌సుందర్ మస్తిష్కంలో తళుక్కుమని మెరిసేటట్టు చేసాడు.

వెంటనే గోడ చాటునుంచి కదిలి అలంకరణ వస్తువులు అమ్మే వ్యక్తిని వెనక్కి పిలిచాడు శ్యామ్‌సుందర్. అడగకుండానే ఏభైరూపాయల నోటును అతని చేతిలో పెట్టి ఒక అద్దాల తోరణాన్ని తీసుకున్నాడు.

ఆ తోరణంలోంచి పెద్దదిగా వున్న ఒక అద్దాన్ని తీసుకుని మిగిలింది అక్కడే పారేసాడు. అవతలి వీధిలోకిపోయి చాందినీ నిలుచున్న చెట్టుకు అభిముఖంగా వున్న ఒక డాబామీదికి ఎక్కి అద్దాన్ని ఎండలో వుంచి ఆమె కళ్ళలోపడేలా ఫోకస్ చేసాడు.

విసుగ్గా నొసలు విరుస్తూ మొదటిసారి ముఖానికి చేతిని అడ్డం పెట్టుకుంది చాందినీ. ఒళ్ళు మండటంతో రెండోసారి తలెత్తి ఆ కాంతి దూసుకువస్తున్న దిశలో దృష్టిని సారించింది.

ఆమె అటు చూడగానే అద్దాన్ని పక్కన పెట్టేసాడు శ్యామ్‌సుందర్. చేతిని గాలిలో వూపి తన ఉనికిని తెలియచేస్తూ అవతల వీధిలోకి రమ్మన్నట్టు సైగలు చేసాడు.

అతన్ని గుర్తుపడుతూనే వింతగా మెరిశాయి చాందినీ కళ్ళు...వంటిని ఆవరించుకున్న నీరసం ఒక్కసారిగా వదిలిపోయినట్టు అనిపిస్తుండగా తనను చుట్టుముట్టినవారిమీద గయ్‌మంటూ లేచింది.

"మీకసలు బుద్ధుందా? ఎందుకలా విరగబడి చూస్తున్నారు? మనశ్శాంతి కోసం చెట్టుక్రింద నిలబడి ధ్యానం చేసుకోవటం కూడా తప్పేనా? వెళ్ళండి.... అవతలికి వెళ్ళండి" చుట్టుముట్టిన జనాన్ని కసిరికొడుతూ, ప్రొటెక్షన్ ఇస్తున్న పోలీసులను ఆశ్చర్యానికి గురిచేస్తూ ఒక్క పరుగున ఎదురుగా వున్న సందులో జొరబడింది చాందినీ.

అయోమయంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్న పోలీసులు తనను అనుసరించకముందే అవతలి వీధిలోకిపోయి ఒక గోడచాటున నిలబడిన శ్యామ్‌సుందర్ దగ్గిరికి వెళ్ళి అతన్ని అమాంతం కౌగిలించుకుంది.

''అయాం సారీ చాందినీ డియర్! ఇలా జరుగుతుందని నేను వూహించలేదు. నీలో ఇంత పట్టుదల వుందని నేననుకోలేదు'' అన్నాడు శ్యామ్‌సుందర్.

"యు ఆర్ మై లవ్! యు ఆర్ మై లైఫ్! కౌగిలినుండి విడివడి అతని కళ్ళలోకి చూస్తూ అంది చాందినీ.

అంటూనే స్పృహతప్పి నేలకు జారిపోయింది.

క్రిందపడకుండా ఆమెను పట్టుకుని ఆపాడు శ్యామ్‌సుందర్. అటుగా పోతున్న ఒక ఆటోను పిలిచి ఆమెను అందులో ఎక్కించి ఇంటికి చేర్చాడు.

# 13

**"గంటలతరబడి** కదలకుండా నిలబడ్డంవల్ల నీరసంతో నిండి పోయింది నీ శరీరం. నన్ను చూడగానే ఆనందాన్ని తట్టుకోలేక స్పృహ తప్పి పోయింది నీకు. అంతకుమించి ఏమీ జరగలేదు నీకు."

స్పృహలోకి వచ్చి లేచి కూర్చుని అయోమయంగా చూస్తున్న చాందినీని ఉద్దేశించి చెప్పాడు శ్యామ్‌సుందర్. నౌఖరు తెచ్చిన వేడివేడి ఛాయ్‌ని తన చేతులతో ఆమెకి అందించాడు.

ఇంతలో అక్కడికి వచ్చిన నసీమాను గమనించి, అనుమానంగా చూసింది శ్యామ్‌సుందర్ వంక.

"నువ్వు అనుకుంటున్న సంబంధం ఏమీలేదు మా మధ్య. భర్తకు దూరమయింది ఈ అభాగ్యురాలు" అంటూ నసీమా చెప్పిందంతా ఆమెకి వివరించాడు శ్యామ్‌సుందర్.

వింటూనే గాఢంగా నిట్టూర్చింది చాందినీ.

"జియావుద్దీన్ సాహెబ్‌కి అక్రమ వ్యాపారాలతో సంబంధం వుందంటే నేను నమ్మలేకపోతున్నాను. బిజినెస్ సెక్యూరిటీ కోసం...అన్యాయాలను అడ్డుకోవటం కోసం రౌడీలను పోషిస్తున్నమాట నిజమే! కాని నజీర్ చెప్పిందాన్ని బట్టి ఆలోచిస్తే జియావుద్దీన్‌గార్ని అనుమానించక తప్పటంలేదు" అంది.

"ఇట్సాల్‌రైట్ చాందినీ! నజీర్‌ని విడిపించి నసీమాకి అప్పగిస్తానని మాట యిచ్చాను. ఆ తరువాత నేను చేయాల్సిన పనులు చాలా వున్నాయి" అన్నాడు శ్యామ్‌సుందర్.

"అంటే....మళ్ళీ నన్ను వదిలి వెళ్ళిపోతావా?" కంగారుగా అంది చాందినీ.

"నజీర్ ను తీసుకుని ఇక్కడికే వస్తాను. ఆ తరువాత నీతో చాలా విషయాలు మాట్లాడతాను. సరేనా?" అన్నాడు శ్యామ్‌సుందర్.

గాఢంగా నిట్టూరుస్తూ తలాడించింది చాందినీ.

*  *  *  *  *

బాధగా అరిచాడు నజీర్... భరింపరాని బాధతో విలవిల్లాడి పోయాడు.

నగ్నంగా వున్న అతని ఛాతీమీద ప్రత్యక్షం అయినాయి ఎర్రటి వాతలు, చర్మం కాలి కమురుకంపుకొట్టడం ప్రారంభించింది.

విశాలమయిన ఆ హాలులో ఒక కుర్చీకి కట్టివేయబడి వున్నాడు నజీర్. అండర్‌వేర్ తప్ప ఎటువంటి దుస్తులూ లేవు అతని ఒంటిమీద.

ఎర్రటి నిప్పుల్లాకాలిన ఇనప చువ్వలను పుచ్చుకుని అతనికి ఇరువైపులా నిలబడి వున్నారు యిద్దరు రౌడీలు. అసహనం నిండిన మనసుతో అతనికి ఎదురుగా వున్న కుర్చీలో కూర్చుని వున్నాడు యూసఫ్ ఆలీ.

బంధించిన క్షణం నుండి నజీర్‌కి తెలిసిన ఈ రహస్యాన్ని బయట పెట్టించటానికి ప్రయత్నిస్తూనే వున్నాడు అతను...రకరకాల చిత్రహింసలకు అతన్ని గురిచేస్తూనే వున్నాడు.

ఎన్ని విధాల హింసించినా సమాధానం చెప్పటంలేదు నజీర్. నెగిటివ్ రిప్లయ్ తప్ప పాజిటివ్ రెస్పాన్స్ లభించటంలేదు అతనినుండి.

"అనవసరంగా చావును కొనితెచ్చుకోవద్దు నజీర్! ఇంతకాలం నమ్మకంగా వున్నవాడివి ఇప్పుడు వున్నట్టుండి జియావుద్దీన్‌సాబ్ దగ్గర ఉద్యోగం మానుకోవటానికి కారణం ఏమిటి? నువ్వు తెలుసుకున్న ఆ రహస్యాన్ని ఎంతమందికి చెప్పావు....?" కుర్చీలోంచి అతని దగ్గిరికి వచ్చి ముఖంలో ముఖంపెట్టి అడిగాడు యూసఫ్ ఆలీ.

"చెప్పలేదు ఆలీసాబ్! మీ రహస్యాలు ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదు.... ఇకమీదట ఎవరికీ చెప్పను. నా మాట నమ్మండి' అంటూ నీరసంగా చెప్పాడు నజీర్.

అసహనంగా తల విదిలించాడు యూసఫ్ ఆలీ. ఇనుప చువ్వలు పుచ్చుకున్న రౌడీలవంక చూస్తూ ఏదో చెప్పబోయాడు.

అదేసమయంలో మ్రోతలు చేయటం ప్రారంభించింది టెలిఫోన్.

రౌడీలకు ఆదేశాలను జారీచేసే ప్రయత్నాన్ని వాయిదా వేసుకుని వెళ్ళి రిసీవర్ అందుకున్నాడు యూసఫ్ ఆలీ. విసుగు నిండిన కంఠంతో "హలో!" అన్నాడు.

అవతలి నుండి అందిన సమాచారం మరింత అధికం చేసింది అతని లోని అసహనాన్ని...ముఖం ఎర్రగా కందిపోయేటట్లు చేసింది.

రౌడీయిజాన్ని చేపట్టినప్పటినుండీ ఉదయపూర్‌లో ఎదురులేని మొనగాడిలా, తిరుగులేని రౌడీలకు నాయకుడిగా వెలుగొందుతున్నాడు యూసఫ్ ఆలీ....ఎటువంటి కష్టతరమయిన కార్యాన్నయినా సులువుగా సాధించగల సమర్థుడిగా ఘనత వహిస్తున్నాడు.

సరిగ్గా డెబ్బయి రెండు గంటలకి క్రిందట మొదలయినాయి అతనికి అపజయాలు ఎదురుకావటం. ఉదయపూర్ రైల్వేస్టేషన్‌లో అంతమొందించాల్సిన

సెక్యూరిటీ ఆఫీసర్ తమను వెక్కిరించి అడుగు బయట పెట్టటంతో తల క్రిందులవసాగింది అతని జాతకం.

ఆ సెక్యూరిటీ ఆఫీసర్ సిటీలో స్వేచ్ఛగా తిరుగుతున్నా ఏమీ చేయలేకపోవటం అతని అనుచరుల సామర్థ్యానికి చిల్లుపెడుతోంది. అది చాలదన్నట్లు నజీర్ భార్యా బిడ్డలను ఎవరో అనామకుడు రక్షించి తీసుకు పోయాడని తెలియటం పుండుమీద కారం చల్లినట్టు అయింది.

దేశం మొత్తంమీద వ్రేళ్ళమీద ఎన్నదగిన ధనవంతులలో ఒకడయిన జియావుద్దీన్ సాహెబ్ అంతటివాడిచేత ప్రశంసలు పొందిన యూసఫ్ ఆలీకి వరసగా ఎదురవుతున్న అపజయాలను తట్టుకోవటం సాధ్యం కావటంలేదు. మళ్ళీ వరస విజయాలను నమోదు చేసుకోవటం ఎలాగో తెలియటంలేదు.

ఆవేశంలో పూనకం వచ్చినట్టు వూగిపోయాడు యూసఫ్ ఆలీ. అవతలి నుండి వినిపించిన సమాచారం గుండెలను భగ్గుమనిపిస్తుండగా అగ్గిరాముడు అయిపోయాడు.

అవతలి నుండి ఫోన్‌లో తనకు ఆ సమాచారాన్ని అందించినవాడ్ని బండ బూతులు తిట్టాడు. వెంటనే చేయవలసిన దానిని గురించి చక చకా వివరించి పెద్ద శబ్దంతో రిసీవర్ పెట్టేసాడు.

నరాలను మెలిపెడుతున్న బాధను పంటి బిగువున భరిస్తూ జాలిగా అతని వంక చూస్తున్నాడు నజీర్. తన మాటలను నమ్మమని కళ్ళతో అర్థిస్తున్నాడు.

రిసీవర్‌ని క్రెడిల్ చేసిన యూసఫ్ ఆలీ జేబులోంచి పాన్‌పరాగ్ పొట్లాన్ని బయటికి తీసి, పళ్ళతో పట్టి చింపేసాడు పొట్లం కార్నర్‌ని. దాన్ని అలాగే ఎత్తిపట్టుకు నోట్లో వేసుకుని నములుతూ నజీర్ దగ్గిరికి వచ్చాడు.

"దేఖో నజీర్! నువ్వు నిజం చెబుతున్నావంటే, నమ్మటానికి నేనేమీ మూర్ఖుడ్ని కాదు. అన్ని ఏర్పాట్లు చేసుకున్న తరువాతనే నువ్వు ఉద్యోగం మానుకోవాలని అనుకున్నావనటానికి నాకు తగిన ఆధారాలు లభించాయి" అన్నాడు.

అర్థంకానట్లు చూసాడు అతని ముఖంలోకి నజీర్. "ఏమిటి ఆ ఆధారాలు?" అనడిగాడు మెత్తగా.

"నా మనుషుల బారినుండి నీ భార్యా బిడ్డలను రక్షించి తీసుకుపోయాడట నువ్వు ఏర్పాటుచేసిన ఓ అనామకుడు...నా వాళ్ళను తీవ్రంగా గాయపరిచాడట! నీతో ఎలాంటి సంబంధం లేకుండా, నువ్వు పురమాయించకుండా అతను అంత రిస్క్ తీసుకున్నాడంటే నేను నమ్మను. చెప్పు.....ఎవరతను? ఎక్కడ్నించి వచ్చాడు?" పెదవులమీదికి జారుతున్న పాన్‌పరాగ్ వూటను మోచేతితో తుడుచుకుంటూ అడిగాడు యూసఫ్ ఆలీ.

అంత బాధలోనూ తన భార్యా బిడ్డలు రక్షించబడ్డారన్న వార్త ఎంతో సంతోషాన్ని కలిగించింది నజీర్‌కి...ఒంటిమీది గాయాల బాధకు రవ్వంత ఉపశమనం లభించినట్టయింది.

"చెప్పు! నిజం చెప్పు...ఎవరతను? " మళ్ళీ అడిగాడు యూసఫ్ ఆలీ.

"నాకు తెలీదు! ఆ ఆపద్బాంధవుడ్ని నేను ఎరుగను" అన్నాడు నజీర్.

"ఏయ్ బద్మాష్, నిజం చెప్పరా! లేదంటే నీ ప్రాణాలు తీస్తాను" అంటూ గొంతు చించుకుని అరిచాడు యూసఫ్ ఆలీ.

అరుస్తూనే తన అనుచరుడి చేతిలోని ఇనుపచువ్వను అందుకుని నజీర్ భుజం మీద బలంగా పొడిచాడు. అతని భుజంలో దిగబడిన చువ్వను అలాగే వుంచి మెలి త్రిప్పాడు.

హృదయవిదారకంగా అరిచాడు నజీర్.

అదే సమయంలో చీకటిగా వున్న ఒక కారిడార్ గుండా మెల్లగా అడుగులు వేస్తూ ముందుకు వస్తున్నాడు శ్యామ్‌సుందర్. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఉన్నట్లుండి వినిపించిన ఆ ఆర్తనాదాన్ని వింటూనే ఎక్కడివాడు అక్కడే నిలబడిపోయాడు. చెవులు రిక్కించి చుట్టూ చూసాడు.

ఎనిమిది అడుగుల ఎత్తున్న జియావుద్దీన్ సాహెబ్ భవంతి కాంపౌండ్ వాల్‌ను అధిగమించి భవంతి వెనక కాపలా కాస్తున్న రౌడీల కన్నుగప్పి అంతకుముందే లోపలికి ప్రవేశించాడు శ్యామ్‌సుందర్.

ఒక డ్రయినేజ్ పైప్ మీదుగా ఎగబ్రాకి భవంతి రెండో అంతస్థుకి చేరుకుని నిశ్శబ్దంగా వున్న కారిడార్స్‌గుండా అడుగులు వేస్తూ నజీర్‌ను గురించి వెదకటం ప్రారంభించాడు.

నజీర్ వెలువరించిన ఆర్తనాదాన్ని వింటూనే అతన్ని గురించి వెతకాల్సిన అవసరం తీరిపోయింది శ్యామ్‌సుందర్‌కి. అరుపులు వినిపిస్తున్న దిశనుబట్టి అతను ఎక్కడున్నాడో తెలిసిపోయింది.

మనసులో ఎటువంటి అనుమానాలకూ చోటు యివ్వకుండా అటువైపు నడిచాడు శ్యామ్‌సుందర్. కారిడార్ చివరిలో వున్న ఒక హాలును సమీపించి, ఓరగా తెరిచి వున్న సందులోంచి లోపలికి దృష్టి సారించాడు.

దయాదాక్షిణ్యాల సంగతి మరిచిపోయి ఇనుపచువ్వలతో నజీర్ శరీరాన్ని వాతలతో నింపుతున్నాడు యూసఫ్ ఆలీ. ప్రత్యక్ష నరకాన్ని అతని కంటి ముందుంచుతున్నాడు.

రక్తసిక్తమయిన శరీరంతో విలవిలలాడిపోతున్నాడు నజీర్. నిస్సహాయంగా అరుస్తున్నాడు.

అదే సమయంలో టెలిఫోన్ ద్వారా ఎక్కడినుండో ఎమర్జన్సీ ఆదేశాలు అందాయి యూసఫ్ ఆలీకి. చేతిలోని ఇనుపచువ్వను వెంటనే అవతల పారేసేటట్టు చేసాయి.

"ఈ భవంతిలో శత్రువు ప్రవేశించాడట....వెళ్ళండి.....వెంటనే వెళ్ళి అతన్ని వెదికి పట్టుకోండి. కాళ్ళూ, చేతులు కట్టిపారేసి నా దగ్గిరికి లాక్కురండి. ఈలోగా నేను నజీర్‌ను ఖతం చేయాలని సుప్రీం ఆదేశించారు. వెళ్ళండి...." అని ఖంగ్‌మంటున్న కంఠంతో తన అనుచరులకు ఆదేశాలు జారీచేస్తూ వెళ్ళి కుర్చీలో కూలబడి సిగరెట్ వెలిగించుకోవటంలో మునిగిపోయాడు.

విపరీతంగా హింసించబడి నరకయాతనను అనుభవిస్తున్న నజీర్‌ను విడిపించటం ఎలాగా అని బుర్రచించుకుని ఆలోచిస్తున్నాడు శ్యామ్‌సుందర్. యూసఫ్ ఆలీ మాటలు వింటూనే తేళ్ళూ, జెర్రులు శరీరం మీద పడి ప్రాకుతున్నట్లు అనిపించింది. విపరీతమయిన ఆశ్చర్యంతో మనసు ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

చాందినీ యింటి దగ్గిర బయలుదేరి ఎక్కడా ఆగకుండా జియావుద్దీన్ భవంతికి చేరుకున్నాడు అతను. అదృష్టం కలిసివచ్చి ఎవరికంట పడకుండా లోపలికి ప్రవేశించాడు.

మరి తనకంటే ముందుగానే తన రాక వాళ్ళ సుప్రీమ్‌కి తెలిసి పోవటం, ఫోన్‌లో ఆదేశాలు అందటం ఎలా జరిగింది? తన కదలికలను కనిపెట్టి వుండేందుకు ఇంకా ఎవరయినా ప్రత్యేకంగా నియమించబడ్డారా?

ఇంతకీ ఎవరు వాళ్ళ సుప్రీం? జియావుద్దీన్ సాహెబేనా? ఫోన్‌లో ఆదేశాలు అందించింది అతనేనా?

యూసఫ్ ఆలీ అనుచరుడు ఒకతను క్రూరంగా నవ్వుతూ కత్తిని ఒకదాన్ని అందుకుని నజీర్ దగ్గిరికి వెళ్ళటం గమనించేసరికి ఇక ఎంత మాత్రం ఆలస్యం చేయలేదు శ్యామ్‌సుందర్. శత్రువులతో తలపడటంవల్ల ఎదురయ్యే చికాకులను గురించి ఎంతమాత్రం ఆలోచించలేదు.

అటూ ఇటూ చూసి కారిడార్‌లో కనిపించిన ఒక పూలకుండీని అందుకున్నాడు శ్యామ్‌సుందర్. విసురుగా తలుపులు నెట్టుకుని బిగ్గరగా అరుస్తూ గదిలోకి దూకాడు.

చేతిలోని కత్తిని సూటిగా నజీర్ గుండెలలో దింపబోతున్న రౌడీ అదిరిపడ్డాడు ఆ శబ్దం విని. కత్తికి పనికల్పించే కార్యక్రమాన్ని పక్కన పెట్టి అందరితోపాటు తలత్రిప్పి చూసాడు ద్వారంకేసి.

అప్పటికే తను చేయవలసిన పనిని పూర్తిచేసేశాడు శ్యామ్‌సుందర్. చేతిలోని పూలకుండీని విసిరి గదిలో వెలుగుతున్న ట్యూబ్‌లైట్‌ను పగలగొట్టేసాడు.

గలగల శబ్దాన్ని సృష్టిస్తూ పగిలి ముక్కలయింది ట్యూబ్‌లైట్...చిక్కటి చీకటి ఆ హాలునంతటినీ ఆక్రమించుకుంది.

అంచనాలకు కూడా అందనంత వేగంగా జరిగిపోయిన ఆ సంఘటనకు కన్‌ఫ్యూజన్‌లో పడిపోయింది యూసఫ్ ఆలీ బృందం. గొంతులు చించుకుని అరుస్తూ ఒకరినొకరు హెచ్చరించుకుంటూ హాలు అంతటా కలయదిరగటం మొదలుపెట్టింది.

“పట్టుకోండి ఆ బద్మాష్‌ను. పట్టి బంధించండి. ఈ భవంతిలో అడుగుపెట్టి మన గుట్టు తెలుసుకున్నవాడు ప్రాణాలతో బయటికి పోవటానికి వీలులేదు. వెంటనే నరికి ముక్కలుచేయండి వాడ్ని” అని పిచ్చిపట్టినట్టు అరవడం ప్రారంభించాడు యూసఫ్ ఆలీ.

ట్యూబ్‌లైట్‌ను బ్రద్దలుకొట్టిన బద్మాష్ ను పట్టి బంధించే ప్రయత్నాలని అప్పటికే చేపట్టారు యూసఫ్ ఆలీ అనుచరులు. ఆ చీకటిలో ఎవరు ఎవరో తెలియక ఒకరినొకరు ఢీకొంటూ త్రుళ్ళిపడసాగారు.

అరుస్తున్నాడన్న మాటేగాని, ఆందోళనపడకుండా వుండలేకపోతున్నాడు యూసఫ్ ఆలీ. భవంతిలో ప్రవేశించిన శత్రువు సూటిగా ఆ హాలు లోకే అడుగుపెట్టటానికి కారణం ఏమిటో వెంటనే అర్థంకాలేదు అతని అనుచరులకు.

అసలు విషయం వారికి అర్థం అయి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకముందే....నిరాటంకంగా తన పని పూర్తిచేసుకోవటం మొదలుపెట్టాడు శ్యామ్‌సుందర్.

పూలకుండీతో ఆ హాల్లో ప్రవేశిస్తూనే గుర్తుపెట్టుకున్నాడు నజీర్ బంధింపబడిన కుర్చీ వున్న ప్రదేశాన్ని. కుండీ విసిరి ట్యూబ్‌లైట్‌ను ముక్కలుచెక్కలు చేస్తూనే ముందుకు దూకి ఆ కుర్చీని సమీపించి....నజీర్‌తోపాటుగా ఎత్తి నేలకేసి బాదాడు కుర్చీని శ్యామ్‌సుందర్.

ఫెళ్ళున శబ్దం చేస్తూ విరిగి ముక్కలయిందా కుర్చీ. బిగించి కట్టబడిన బంధనాలు వదులైన వెంటనే విముక్తి లభించింది నజీర్‌కి.

ఆ వెంటనే బెల్టుపక్కన అమర్చుకున్న ఆరు అంగుళాల పిడిబాకును బయటికి లాగి పిడికిట్లో ఇముడ్చుకున్నాడు శ్యామ్‌సుందర్. భరింపరాని బాధతో నీరసంగా మూలుగుతున్న నజీర్‌ను ఎత్తి భుజంమీద వేసుకుని వచ్చిన దారి గుర్తుపెట్టుకుంటూ హాలు ఎంట్రన్స్‌కేసి దూకాడు.

అప్పటికి అర్థం అయింది యూసఫ్ ఆలీ అనుచరులకు అతడు అంత హఠాత్తుగా ఆ హాలులో ప్రవేశించటానికి కారణం ఏమిటన్నది. అర్థం అయిన తరువాత రెట్టింపు అయింది శ్యామ్‌సుందర్‌ని పట్టుకోవాలన్న పట్టుదల.

"అడ్డుకోండి అతన్ని. ఎంట్రన్స్‌ని వెంటనే బ్లాక్ చేయండి... పారిపోక ముందే పట్టి బంధించండి. అతను తప్పించుకుపోయాడంటే మిమ్మల్ని చీరేస్తాను. మీ తోళ్ళు వలిచి ఎడారిలో ఎండగడతాను" అని గొంతు చించుకొని అరవటం ప్రారంభించాడు యూసఫ్ ఆలీ.

చెవులకు మ్రోత ఎక్కిస్తోన్న అతని అరుపులను వింటూ అప్పటికే హాలు ఎంట్రన్స్‌ను సమీపించాడు శ్యామ్‌సుందర్. అడ్డురాబోతున్న ఇద్దర్ని స్ప్రింగ్‌నైఫ్‌తో గాయపరిచి అవతలికి నెట్టాడు.

"చచ్చాను బాబోయ్...నేను చచ్చిపోయాను" అని ఎవరికి వారే గొంతు తెగిన మేకల్లా కేకలు వేస్తూ వెనక్కి దూకారు. ఎంట్రన్స్‌ను కవర్ చేసే ఉద్దేశంతో అటు రాబోతున్న తమ అనుచరులను గుద్దుకుని వారితో పాటు క్రిందపడి పోయారు.

వారి కేకలను గురించి గానీ, వారి చావుబ్రతుకులను గురించిగానీ పట్టించుకోకుండా హాల్లోంచి బయటికి దూకాడు శ్యామ్‌సుందర్. వాళ్ళు తన వెంటపడి ఆయుధాలను ప్రయోగించకముందే భవంతిలోంచి బయటికి చేరుకోవాలన్న ఉద్దేశంతో వేగంగా ముందుకు పరుగుదీయటం ప్రారంభించాడు.

అదే సమయంలో పెద్ద పెద్ద పెట్రోమాక్స్ లైట్స్‌తో ఆ గదిలోకి వచ్చారు ఇద్దరు రౌడీలు. విరిగిముక్కలయిన కుర్చీనీ...ఎర్రబడిన యూసఫ్ ఆలీ వదనాన్ని చూసి బలవంతంగా గుటకలు మింగుతూ బొమ్మల్లా నిలబడిపోయారు.

"రోగ్స్....ఇడియట్స్...యూస్‌లెస్ బెగ్గర్స్! ఇంకా యిక్కడే నిలబడ తారేమిరా! పట్టుకోండి! ఆ బద్మాష్‌ని పట్టుకుని నా ముందుకు లాక్కురండి. పట్టి చేతులతో తిరిగివస్తే మీ ఎముకలు విరిచేస్తాను...మీ తలలు నరికేస్తాను."

మతిభ్రమించినవాడిలా కేకలువేస్తూ అందినవాడ్ని అందినట్టే పిడికిళ్ళతో పొడుస్తూ ఆ హాలులోంచి బయటకు తరమటం ప్రారంభించాడు యూసఫ్ ఆలీ.

ఆ హాల్లోంచి గుంపుగా బయటికి వచ్చేశారు రౌడీలు అందరూ... తమ ప్రాణాలకు గ్యారంటీ లేకుండా చేసి నజీర్ ను విడిపించుకుపోయిన ప్రబుద్ధుడిని పట్టి బంధించేందుకు పందెపు గుర్రాల్లా ఒకరితో ఒకరు పోటీ పడుతూ ముందుకు పరుగుదీశారు వారిలో కొంతమంది. భవంతిలో వుండే సెక్యూరిటీ సిబ్బందిని ఎలర్ట్‌చేసే కార్యక్రమాన్ని చేపట్టారు మరికొంతమంది.

హాల్లోంచి బయటపడిన తరువాత భవంతిలోంచి బయటపడే ప్రయత్నం చేయలేదు శ్యామ్‌సుందర్. ఎదురుపడిన ప్రతివాడితో తలపడుతూ తీవ్రమయిన గాయాలతో తన భుజంమీద వున్న నజీర్‌కి మరింత ఇబ్బంది కలిగించటం యిష్టంలేదు అతనికి.

మలుపులు తిరుగుతున్న కారిడార్స్ వెంట పరుగులుదీస్తూనే ఆ భవంతికి కరెంటును సప్లయ్ చేస్తున్న మెయిన్‌బోర్డ్‌ను వెదకడం ప్రారంభించాడు శ్యామ్‌సుందర్.... కంటపడగానే దానిని ధ్వంసంచేసి భవంతి అంతటినీ గాడాంధకారంలో ముంచేశాడు.

గోలగోలగా అరుస్తూ తనకోసం వెదుకుతున్న గార్డులతోపాటు తనూ గొంతు కలిపాడు శ్యామ్‌సుందర్. తాము వెదుకుతున్న వ్యక్తి తమపక్కనే పరుగులు దీస్తున్నాడన్న అనుమానం వారికి రాకముందే భవంతిలోంచి బయటపడి ఆవరణలో కనిపించిన ఒక కారును సొంతం చేసుకుని ఆ పరిసరాల నుంచి అదృశ్యం అయిపోయాడు.

# 14

"**అసలు** నువ్వు యూసఫ్ ఆలీవేనా?"

సువాసనలు వెదజల్లుతున్న ఇంపోర్టెడ్ సెంట్ సిగార్‌ను వాసన చూస్తూ తాపీగా ప్రశ్నించాడు ఆరడుగుల ఆజానుబాహుడు జియావుద్దీన్ సాహెబ్. కూర్చున్న రివాల్వింగ్ కుషన్ ఛైర్లో విలాసంగా వూగుతూ సిగార్‌ను పెదవుల మధ్య పెట్టుకున్నాడు.

జియావుద్దీన్ సాహెబ్‌కి యిరువైపులా నిలబడి వున్నారు విచిత్రమయిన ఖడ్గాలు పుచ్చుకుని నల్లరాతిబొమ్మల్లా కనిపిస్తున్న ఇద్దరు నీగ్రోలు. అప్పుడే ఆయిల్ మర్దనా చేయించుకున్నట్టు నిగనిగలాడుతున్నాయి నల్లటి వారి శరీరాలు.

సెంట్ సిగార్ ను జియావుద్దీన్ పెదవుల మధ్య పెట్టుకున్న మరుక్షణంలో తన చేతిలోని ఖడ్గాన్ని ఎత్తిపట్టుకుని ముందుకు కదిలిన నీగ్రోను చూడగానే ఝల్లుమంది యూసఫ్ ఆలీ శరీరం. రక్తం యింకినట్లు పాలిపోయింది అతని వదనం.

యూసఫ్ ఆలీ భయపడినట్టు అతనిమీద కత్తి దూయలేదు ఆ నీగ్రో తన స్థానం నుండి కదిలి ముందుకు వస్తూనే సిజర్ లైటర్‌తో జియావుద్దీన్ పెదవుల మధ్య వున్న సిగార్‌ను వెలిగించి తిరిగి తన స్థానంలోకి పోయి నిలబడ్డాడు.

వెలిగించిన సిగార్‌ను గుప్పుగుప్పుమని పీల్చి వదులుతూ సూటిగా యూసఫ్ ఆలీ ముఖంలోకి చూసాడు జియావుద్దీన్. అతని నుదుటిమీద ఆవిర్భవిస్తున్న చెమట బిందువులను గమనించి విలాసంగా నవ్వేడు.

"సో...నీ కళ్ళముందే ఆ సెక్యూరిటీ ఆఫీసర్ నజీర్‌ను అవలీలగా విడిపించుకుని అవతలకి తీసుకుపోయాడన్నమాట. ఇంత జరిగినా అతని ఆచూకీ ఆవగింజంతయినా తెలుసుకోలేకపోయారన్నమాట నీ మనుషులు'' అని ప్రశ్నించాడు.

"తెలుసుకుంటారు సాబ్! తప్పకుండా తెలుసుకుంటారు. నా అనుచరులందరూ ఇప్పుడు ఆ ప్రయత్నంలోనే వున్నారు" ఎండి, పూడుకుపోతున్నట్టున్న గొంతును బలవంతంగా పెగల్చుకుంటూ చెప్పాడు యూసఫ్ ఆలీ.

అతని మాటలలో తనకు ఏమాత్రం నమ్మకం కలగనట్టు తల అడ్డంగా ఆడించాడు జియావుద్దీన్ సాహెబ్.

''వీరూమియాను అంతమొందించే ప్రయత్నంలో కూడా అతన్ని బంధించడం సాధ్యంకాక చతికిలబడ్డారు మీ వాళ్ళు. కర్కోటకుడిగా పేరు పొందిన ఖలీల్ పాషాలాంటి వారికి కూడా అతన్ని చంపటం సాధ్యం కాలేదట! అవునా?" మరో ప్రశ్న ఈటెలా దూసుకువచ్చింది.

సమాధానం చెప్పటానికి ఈసారి గొంతు పెగల్లేదు యూసఫ్ఆలీకి వేగంగా కొట్టుకుంటున్న గుండెను అదిమి వుంచుకోవటం కూడా కష్టంగానే వుంది.

ఎంతో అవసరం అనుకుంటే తప్ప తన భవంతిలోంచి బయటికి రావటం అలవాటు లేని జియావుద్దీన్‌కి...ఆ విషయాలన్నీ ఎలా తెలిసాయి? ప్రతి విషయాన్ని కంటితో చూసినంత ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నాడు అతను?

జియావుద్దీన్ సాహెబ్ దగ్గర జీతానికి పనిచేయటంలేదు యూసఫ్ ఆలీ. ఎవరిక్రిందా పనిచేయటం అలవాటులేదు అతనికి.

కబురు పంపినప్పుడు రావటం, చెప్పినపని చేయటం, అడగకుండానే అధిక మొత్తంలో ప్రతిఫలం అందుకోవటం, మళ్ళీ కబురు పంపేటంత వరకూ తన పనులు చేసుకోవటం...అదీ అతని వృత్తి.

ఆ పనిలో మొదటిసారిగా ఫెయిల్ అయ్యాడు....ఆ పని నిమిత్తం అధిక మొత్తంలో ముందుగానే పారితోషికం అందుకోవటంవల్ల తప్పనిసరిగా సంజాయిషీ యిచ్చుకునేందుకు అతని ముందు నిలబడవలసి వచ్చింది.

"నువ్వు నా మనిషివి కాకపోవచ్చు. కానీ నా రహస్యాలు తెలుసుకున్న వాడివి అన్నది అబద్ధం కాదు. ఇప్పుడు చెప్పిన పనిని చేయలేని అసమర్థుడివి కూడా అయ్యావు. కాబట్టి అసమర్థులకు యిక్కడ విధించబడే శిక్ష ఏమిటో నీకు తెలుసుననుకుంటాను?"

యూసఫ్ ఆలీ ఆలోచనలను భంగపరుస్తూ ఖంగ్‌మని ధ్వనించింది జియావుద్దీన్ కంఠం.

అటు తిరిగి, ఇటు తిరిగి తన ప్రాణాలకే ముప్పు వాటిల్లబోయే సరికి సమాధానం చెప్పకుండా వుండలేకపోయాడు యూసఫ్ ఆలీ. నీగ్రోల చేతులలోని ఖడ్గాలు ఏ సమయంలోనయినా కదలవచ్చునన్న అనుమానంతో కంగారుపడుతూ నోరు తెరిచాడు.

"క్షమించండి సాబ్! ఇది మొదటి తప్పుగా భావించి మన్నించండి! అనుకోని విధంగా ఆ సమయంలో కరెంట్ ఫెయిల్ అవటంతో కన్‌ఫ్యూజన్‌లో పడిపోయారు మా వాళ్ళు. అంధకారం అలముకున్న కారణంగా అతన్ని బంధించటంలో ఫెయిల్ అయినారు...." అంటూ సంజాయిషీ యిచ్చాడు.

మరోసారి విలాసంగా నవ్వుతూ తల అడ్డంగా త్రిప్పాడు జియావుద్దీన్.

"యు ఆర్ ఏ ఫూల్ మిస్టర్ యూసఫ్ ఆలీ! నాకు సంబంధించిన ఏ భవంతిలోనూ కరెంట్ ఫెయిల్ అయ్యేట్టుచేసే సాహసం ఉదయపూర్ ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కి లేదు. ముందుగా నజీర్ బంధింపబడిన హాల్లో, ఆ తర్వాత భవంతిలో కరెంట్ ఫెయిల్ అయ్యేట్టు చేసింది అతనే...." అతనే అన్నాడు.

పజిల్ అయినాడు యూసఫ్ ఆలీ. పట్టరాని ఆశ్చర్యంతో జియావుద్దీన్ ముఖంలోకి చూశాడు.

అర్ధరాత్రి సమయంలో జరిగింది ఆ సంఘటన.

పది గంటలకే తన బెడ్‌రూంలోకిపోయి నిద్రలో మునిగిపోయే జియావుద్దీన్ సాహెబ్‌కి ఎలా తెలిసింది ఆ విషయం?

తన అనుచరులలో తనకు తెలీకుండానే అతని మనుషులు ఎవరయినా వున్నారా? ఆయన తనమీద నిఘా లాంటిది ఏదయినా ఏర్పాటు చేశాడా?

సమాధానం లభించని ప్రశ్నలతో సతమతమయిపోయాడు యూసఫ్ ఆలీ. విపరీతమయిన టెన్షన్ ఫీలవుతూ జియావుద్దీన్ ముఖంలోకి చూసాడు.

ఈసారి విలాసంగా నవ్వలేదు జియావుద్దీన్ సాహెబ్. మౌనంగా తలాడిస్తూ కోటుజేబులోంచి రిమోట్ కంట్రోల్ నొకదాన్ని బయటికితీసి ఎదురుగావున్న టెలివిజన్ ఆన్ చేసాడు.

ఆయన చెప్పకుండానే అప్రయత్నంగా అటు మరలాయి యూసఫ్ ఆలీ కనులు. వూపిరి బిగబట్టి టెలివిజన్‌వైపు చూడసాగాడు అతను.

టెలివిజన్ స్క్రీన్ మీద దృశ్యాలు కదలటం ప్రారంభించినాయి. చూస్తున్న యూసఫ్ ఆలీ కనులు విశాలం అయ్యేట్టు, అతని గుండెల్లో రైళ్ళు పరిగెత్తేటట్లు చేసాయి.

నజీర్ బంధించబడిన హాల్లోకి శ్యామ్‌సుందర్ ప్రవేశించటం మొదలుకొని అతను మెయిన్ బోర్డును ధ్వంసం చేయటంవరకూ అంతా క్లియర్‌గా కనిపించింది స్క్రీన్‌మీద.

చెమటలు పట్టేసాయి యూసఫ్ ఆలీ అరిచేతులకు. వెన్నులోంచి మొదలయింది విపరీతమయిన వణుకు.

జియావుద్దీన్ సాహెబ్ ఎంతటి అసాధారణమయిన వ్యక్తో అప్పుడు స్పష్టంగా అర్థంఅయింది అతనికి. రౌడీగా జీవితం ప్రారంభించిన తర్వాత ఎదుటివారి దయాభిక్షను అర్థించవలసిన పరిస్థితి దాపురించింది.

"నా తప్పులన్నీ ఒప్పుకుంటున్నాను. తెలిసి చేసిన తప్పులు కావివి. ప్రత్యర్థి శక్తిసామర్థ్యాలను తక్కువగా అంచనావేసి తగిన ఏర్పాట్లు చేయక పోవటంవల్ల జరిగిన పొరపాట్లు. దయచేసి నన్ను మన్నించండి. మంచి మనసుతో నాకు మరో అవకాశం యిప్పించండి సాబ్!" అంటూ మోకాళ్ళ మీద కూలబడి అర్థించాడు యూసఫ్ ఆలీ.

చిరునవ్వు నవ్వుతూ చిన్నగా తలవూపాడు జియావుద్దీన్.

"మరొక విషయంలో అయితే మన్నింపు ప్రసక్తి వుండేదికాదు మిస్టర్ యూసఫ్ ఆలీ! అసాధారణమయిన శక్తియుక్తులు గలిగిన అతన్ని చిల్లరనేరాలుచేసే

నీలాంటి రౌడీ ఎదుర్కోలేకపోవడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అందుకే నీకు మరో అవకాశం యివ్వదలిచాను. అంతేకాదు...ఇప్పుడు అతను ఎక్కడున్నాడో చెబుతాను. అతన్ని బంధించేందుకు సులువయిన మార్గాన్ని సూచిస్తాను" అన్నాడు.

ఆశ్చర్యాన్ని అదుపుచేసుకుంటూ లేచి నిలుచున్నాడు యూసఫ్ ఆలీ. జియావుద్దీన్ అంతటి వాడిచేత ప్రశంసించబడుతున్న ఆ అసాధారణవ్యక్తి ఎవరో తెలుసుకోవాలన్న ఆత్రుత కనబరుస్తూ అతనివంక ప్రశ్నార్థకంగా చూసాడు.

"హైద్రాబాద్ నగరంలోవుంది డైనమిక్ సిటీ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ. ఆ సంస్థకు సంబంధించిన యిద్దరు పార్టనర్స్‌లో ఒకడు నిన్నూ నీ అనుచరులను ముప్పతిప్పలుపెట్టి మూడుచెరువుల నీళ్ళు తాగిస్తున్న వ్యక్తి శ్యామ్‌సుందర్. అతన్ని మించినవాడు అతని పార్టనర్ వాత్సవ. అతనే గనక శ్యామ్‌సుందర్ స్థానంలో ఉదయపూర్ వచ్చివుంటే ఈపాటికి నీ అనుచరులతోసహా జైపూర్ సెంట్రల్ జైలులో వుండేవాడివి" అన్నాడు జియావుద్దీన్.

బలవంతంగా గుటకలుమింగుతూ అతను చెప్పింది శ్రద్ధగా విన్నాడు యూసఫ్ ఆలీ. నేరప్రపంచాన్ని గడగడలాడిస్తున్న ఆ ఇద్దరిపేర్లూ ఏదో పనిమీద హైద్రాబాద్ వెళ్ళినప్పుడు విన్నాడు. వచ్చినవాడు ఆ యిద్దరిలో ఒకడని వింటూనే చెమట బిందువులు ప్రత్యక్షం అయినాయి అతని నుదుటిమీద.

"డోన్ట్‌వర్రీ మిస్టర్ యూసఫ్ ఆలీ! ఎంతటి శక్తిసామర్థ్యాలుగల వాడయినా ఎక్కడో ఒకచోట తప్పటడుగు వేయకమానడు. ఆ పొరపాటునే మనకు అవకాశంగా మలుచుకోవాలి. అనవసరం అయిన ఆందోళనను మనసులోకి రానీయకుండా నేను చెప్పినట్టు చెయ్యి" అంటూ శ్యామ్‌సుందర్ ఎక్కడ వున్నాడో, అతన్ని చుట్టుముట్టి బంధించటం ఎలాగో వివరించాడు జియావుద్దీన్.

అదురుతున్న గుండెలను అదిమి వుంచుకుంటూ అతను చెప్పింది శ్రద్ధగా విన్నాడు యూసఫ్ ఆలీ. జియావుద్దీన్ సాహెబ్‌కి వంగి వంగి సలాములుచేస్తూ ఆ హాలులోంచి నిష్క్రమించాడు.

"ఈ అసమర్థుడిమీద మాకు నమ్మకం పోయింది. ఇలాంటివారికి పనులు అప్పగించటం అనవసరం అనిపిస్తోంది."

యూసఫ్ ఆలీ బయటకు వెళ్ళగానే మెల్లగా తన అభిప్రాయాన్ని బయటపెట్టాడు ఒక నీగ్రో.

"అవును...." అంటూ అతన్ని సమర్థించాడు రెండో నీగ్రో.

వారి అభిప్రాయాలను గౌరవిస్తున్నట్లు చిన్నగా తలాడించాడు జియావుద్దీన్.

"కొండకు దారంచుట్టి లాగటం అంటారు దీన్నే. దారం తెగిపోయినందు వల్ల మనకు వచ్చిన నష్టం ఏమీలేదు! యూసఫ్ ఆలీ ఫెయిలయితే ఆ పని మీరు చేయాల్సి వుంటుంది. అందుకు రెడీగా వుండండి" అన్నాడు.

గంభీరంగా తలలు ఆడించారు ఆ యిద్దరూ.

* * * * *

"జియావుద్దీన్ సాహెబ్ ఇటువంటి దుష్టుడూ, దుర్మార్గుడూ అంటే నేను ఇప్పటికి కూడా నమ్మలేకపోతున్నాను. ఇంత జరిగిన తర్వాత నమ్మకుండా వుండలేకపోతున్నాను."

ఒక ప్రయివేట్ హాస్పిటల్‌లో గాయాలకు కట్లు కట్టించుకుని, ట్రీట్‌మెంట్ తీసుకుని శ్యామ్‌సుందర్‌తోపాటు బయటికివస్తూ మెల్లగా అన్నాడు నజీర్.

సిగరెట్ వెలిగించుకుంటూ చిన్నగా తలాడించాడు శ్యామ్‌సుందర్. తర్వాత ఒకచోట కారును వదిలేసి, తిరిగి అతన్ని భుజంమీదికి ఎత్తుకుని ఒక దిశలో అడుగులు వేస్తూ నాలుగు వీధులు దాటిన తర్వాత కనిపించిన ఒక హాస్పిటల్‌లోకి తీసుకుపోయాడు.

అతడి గాయాలకు డ్రస్ చేసి కట్టుకట్టాడు డ్యూటీలోవున్న డాక్టర్. అప్పటికప్పుడు నొప్పి తగ్గటానికి రెండు పెయిన్ కిల్లర్ ఇంజక్షన్స్ యిచ్చాడు.

డాక్టర్‌కి బిల్లు చెల్లించి అర్ధగంట తరువాత అక్కడ్నించి బయలుదేరాడు శ్యామ్‌సుందర్. అతన్ని నసీమాకి అప్పగించి, చాందినీకి నచ్చచెప్పి, తన కార్యక్రమాలను ప్రారంభించాలని అనుకుంటూ హాస్పిటల్ ముందు వెయిటింగ్‌లో వున్న ఒక ఆటో ఎక్కాడు.

"జియావుద్దీన్ చేస్తున్న అక్రమ వ్యాపారాలు ఏమిటి....?" ఆటో బయలుదేరుతుండగా అడిగాడు శ్యామ్‌సుందర్.

"ఇదీ అని ఖచ్చితంగా చెప్పలేను. యూసఫ్ ఆలీ అనబడే రౌడీల నాయకుడు ఆ భవంతికి రావటం మొదలుపెట్టిన తరువాత జియావుద్దీన్‌లో

క్రమక్రమంగా మార్పులు మొదలయినాయి. దారుణాలు జరగటం ఎక్కువయింది. ఆ మధ్య ఇరువర్గాలవారి మధ్య యిక్కడ జరిగిన అల్లర్లూ, హత్యల వెనక కూడా జియావుద్దీన్ సాహెబ్ హస్తం వుందని నాకు అనిపించింది. కానీ ఖచ్చితమయిన ఆధారాలులేవు. ఒకరోజు ఖలీల్‌పాషా అనబడే కిరాయి హంతకుడు జియావుద్దీన్ సాహెబ్ భవంతికి రావటంతో నాలో అనుమానం పెరిగి పెద్దదయింది.

జియావుద్దీన్ సాహెబ్ ఒకరోజు ఖలీల్‌పాషాను, మరికొంతమంది రౌడీలనూ వేన్‌లో ఎక్కించుకుని టవర్ క్లాక్ సెంటర్‌కి తీసుకెళ్ళమని ఆదేశించారు. టవర్ క్లాక్ సెంటర్‌లోని ఒక సందుచివర వేన్ ఆపించి, నన్ను అక్కడే వుండమని చెప్పి, ఆ సెంటర్‌లో వున్న దుకాణాల చాటుకుపోయి నిలబడ్డారు అందరూ. నేను సిగరెట్ కాల్చుకుంటూ వేన్‌లో కూర్చుని వెయిట్ చేయటం ప్రారంభించాను.

సరిగ్గా ఒక గంట తరువాత–

ధనేళ్....ధనేళ్....మంటూ బాంబుల శబ్దం వినిపించటంతో అదిరిపడి వేన్‌లోంచి క్రిందికి దిగి కాస్త ముందుకుపోయి చూశాను.

అప్పటికే ఖలీల్ పాషా విసిరిన బాంబుల ధాటికి తీవ్రంగా గాయపడిన శరీరంతో నేలమీద రక్తపుమడుగులోపడి కొట్టుకుంటూ కనిపించాడు ఒక వ్యక్తి.

రాత్రి జియావుద్దీన్ భవంతిలో పార్టీ చేసుకుంటున్న ఖలీల్‌పాషా అనుచరుల మాటలనుబట్టి తెలిసింది...బాంబుల దాడిలో ముక్కలు ముక్కలయి పోయిన శరీరం ఒక సి.ఐ.డి. ఆఫీసర్‌ది అన్న సంగతి.

దాంతో నా మనసు వికలమయిపోయింది. నా భార్య నసీమా చెప్పినట్టు జియావుద్దీన్ సాహెబ్ దగ్గర ఉద్యోగం మానేసి, ఎక్కడికయినా వెళ్ళి నిజాయితీగా బ్రతకాలని నిర్ణయించుకున్నాను. అదే సమయంలో నాకో భయంకరమయిన రహస్యం తెలిసింది...." అంటూ ఆ తరువాత జరిగిన సంఘటనలను కళ్లకు కట్టినట్టు మరింత వివరంగా చెప్పసాగాడు నజీర్.

* * * * *

కొడుకుతో పాటుగా భార్య నసీమాను ఒక స్టేషన్‌లో వెయిట్ చేయమని చెప్పి జియావుద్దీన్ సాహెబ్ భవంతికి వెళ్లాడు నజీర్.

ఆ సమయంలో తన బెడ్‌రూంలో యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషా వంటి కొంతమంది క్రిమినల్స్‌తో సమావేశమయివున్నాడు జియావుద్దీన్. రహస్య మంతనాలు జరుపుతున్నాడు.

ఎటువంటి సమయంలోనయినా జియావుద్దీన్ సాహెబ్‌ను కలుసుకునే చనువుంది నజీర్‌కి. ఆ ఉద్దేశ్యంతోనే అతని బెడ్‌రూంను సమీపించాడు.

అదే సమయంలో లోపలినుండి వినిపించిన మాటలు తలుపుమీద తట్టకుండా చేశాయి అతన్ని. విపరీతమయిన ఆందోళన అతన్ని అక్కడనుండి కదలకుండా కట్టిపడేసింది.

“యస్....మైడియర్ ఫ్రండ్స్! ఉదయపూర్ వచ్చిన ప్రధానిపై మనం జరిపిన హత్యాప్రయత్నం వృధా అయింది! ఆ ప్రయత్నం మరోసారి చేసే అవకాశం మళ్ళీ ఇంత త్వరగా వస్తుందని నేను అనుకోలేదు. అందుకే ఈసారి విఫలం కాని విధంగా ‘ఆపరేషన్ టు ఇన్ వన్’ అనే పథకాన్ని రూపొందించాను. ఈ పథకంలో ఫెయిల్యూర్ అంటూ జరగదు” అన్నాడు జియావుద్దీన్.

“ఏమిటా టు ఇన్ వన్ పథకం?” అక్కడున్న వారి అందరి కంఠాలలో ఆత్రుత ధ్వనించింది.

చెప్పటం ఇష్టంలేనట్టు తల అడ్డంగా తిప్పాడు జియావుద్దీన్ సాహెబ్. “నాట్ నౌ! ఈ పథకాన్ని అతి రహస్యంగా వుంచదలిచాను నేను. అమలు జరపటానికి కొద్దినిముషాలముందు మాత్రమే ఈ పథకం వివరాలు తెలియ చేస్తాను అన్నాడు.

ఆ పథకాన్ని గురించి అతను వివరిస్తాడేమో తెలుసుకుందామని టెన్షన్‌గా ఎదురుచూసిన నజీర్‌కి నిరాశే ఎదురయింది.

యజమాని మాటలు విన్న అతని రక్తం ఉడికిపోయింది. దేశద్రోహానికి పాల్పడబోతున్న వారందర్నీ అక్కడికక్కడే నరికి పోగులు పెట్టాలన్నంత ఆవేశం కూడా వచ్చింది.

కానీ అందుకు తగిన శక్తి లేదన్న విషయం గుర్తువస్తూనే నెత్తి మీంచి కుండెడు చన్నీళ్ళు కుమ్మరించినట్టు చల్లారిపోయింది అతని ఆవేశం. ఇక అక్కడ వుండటం మంచిదికాదన్న ఆలోచన కూడా వచ్చింది.

ముందు తను అక్కడ్నించి బయటపడాలి. ఆ తరువాత పోలీసులకి ఆ విషయాన్ని గురించి తెలియచేయాలి. ఆలస్యం చేయకుండా ఈ దేశద్రోహుల ఆట కట్టించాలి....అనుకుంటూ వెనుదిరిగి ఉలిక్కిపడ్డాడు నజీర్.

జియావుద్దీన్ సాహెబ్‌ను కంటికి రెప్పలా కాపాడే నీగ్రో బాడీగార్డ్‌లలో ఒకతను అతని ఎదురుగా నిలబడి వున్నాడు. అనుమానం నిండిన కళ్లతో అతన్ని చూస్తున్నాడు.

అతని బెల్టుకు వ్రేలాడుతున్న విచిత్రమయిన ఖడ్గాన్ని చూసేసరికి ఎండుకుపోయింది నజీర్ గొంతు. అంతకంటే పదునుగా వున్న అతని చూపులను తట్టుకోవటం అసాధ్యం అయింది.

"హేయ్...యూ నజీర్! ఏం చేస్తున్నావు యిక్కడ? ఏమిటలా గుడ్లు మిటకరించి చూస్తున్నావు?" అని ప్రశ్నించాడు ఆ నీగ్రో.

అతను అప్పుడే వచ్చాడనీ...లోపల వున్నవారి మాటలు వినటం అతను గమనించలేదని గ్రహిస్తూనే కొద్దిగా తేలికపడింది నజీర్ మనసు. మాట్లాడేందుకు ధైర్యం కూడా వచ్చింది.

"ఏమీలేదు నీగ్రో సాబ్! బాస్‌తో ఒక ముఖ్యమయిన విషయం మాట్లాడాలని వచ్చాను....లోపల ఆయన బిజీగా వున్నారని తెలిసి వెళ్ళిపోతున్నాను" అన్నాడు.

"వాట్ మేన్? ముఖ్యమయిన విషయం అయితే ఎంత బిజీగా వున్నా మాట్లాడాల్సిందే కమాన్!" అంటూ అతని చేయి పట్టుకుని చనువుగా లోపలికి లాక్కుపోయాడు.

అప్పటికే పూర్తి అయినాయి లోపల జరుగుతున్న మంతనాలు... గ్లాసులలో ఫారిన్ విస్కీ నింపే కార్యక్రమం కూడా ప్రారంభమయింది.

"మన నజీర్ మీతో ఏదో ముఖ్యమయిన విషయం మాట్లాడాలని వచ్చాడట బాస్! మీరు బిజీగా వున్నారని తెలిసి వెళ్ళిపోతున్నాడట" చెప్పాడు నీగ్రో.

"ఏ సమయంలోనయినా నన్ను కలుసుకునే వీలు నీకు ఇదివరకే కల్పించాను. ఇంకా ఎందుకు సందేహం? ఇంతకీ ఏమిటి ఆ ముఖ్యమయిన విషయం?" అనడిగాడు జియావుద్దీన్ సాహెబ్.

"ఏంలేదు సాబ్! ఈ మధ్య నా ఆరోగ్యం బాగా వుండటం లేదు.... ఇదివరకటిలా సరిగా డ్రయివ్ చేయలేకపోతున్నాను. అందుకని ఉద్యోగం మానేయాలనుకుంటున్నాను!" అంటూ మెల్లగా అసలు విషయాన్ని బయట పెట్టాడు నజీర్.

గ్లాసులో పోసిన విస్కీని కొద్దికొద్దిగా సిప్‌చేస్తున్న జియావుద్దీన్ సాహెబ్ వింతగా చూశాడు అతని ముఖంలోకి...."ఆరోగ్యం బాగాలేకపోతే... కొంతకాలం రెస్ట్‌లో వుండి ట్రీట్‌మెంట్ తీసుకోవాలిగానీ, ఉద్యోగం మానివేయటం ఏమిటి?"

"క్షమించండి సార్! నేను ఉద్యోగం మానేస్తాను! నా అక్కౌంట్ సెటిల్ చేయమని మేనేజర్‌గారికి చెప్పండి! అంతగా అవసరం అనుకుంటే మళ్ళీ మీ దగ్గిరికే వచ్చి చేరతాను!" అన్నాడు నజీర్.

"అసలు నువ్వు ఉద్యోగం మానివేయటానికి కారణం ఏమిటి?" అడిగాడు జియావుద్దీన్.

"ఇంతకుముందే చెప్పానుకదా సాబ్! నా ఆరోగ్యం నేను చేస్తున్న ఉద్యోగానికి అనుకూలించటంలేదు."

"కాదు! అది కారణం కాదు! అసలు కారణం ఏమిటో నేను చెబుతాను!"

ఉన్నట్టుండి నీగ్రో అన్న మాటలకు అందరూ తలలు త్రిప్పి అటు చూశారు. నజీర్ కూడా ఆందోళనగా చూశాడు అతనివంక.

"చెప్పు! ఏమిటా అసలు కారణం?" గంభీరంగా అడిగాడు జియావుద్దీన్.

"మీరు గదిలో చర్చిస్తున్న విషయాన్ని చాటుగా విన్నాడు నజీర్. ఆ రహస్యాన్ని పోలీసులకు చెప్పే ఉద్దేశ్యంతోనే ఉద్యోగం మానేస్తానని అంటున్నాడు. అతను గది ముందు నిలబడి వినటం నేను గమనించాను."

ఉలిక్కిపడ్డాడు ఆ నీగ్రో మాటలకు నజీర్. కంగారును కప్పిపుచ్చుకుంటూ జియావుద్దీన్ ముఖంలోకి చూసాడు. "లేదు సాబ్! అటువంటిదేమీ లేదు. నేనేమీ వినలేదు!" అన్నాడు వణుకుతున్న కంఠంతో.

గ్లాసులోని విస్కీని గొంతులో పోసుకుని గుటకలు వేస్తూ అతని వంక చూసి చిన్నగా నవ్వాడు జియావుద్దీన్. "ఎందుకలా భయపడతావ్? నీ మాటమీద నాకు నమ్మకం వుంది. నువ్వు నాకు ద్రోహం చేయవన్న విశ్వాసం వుంది.నీ ఇష్టప్రకారమే నువ్వు ఉద్యోగం మానెయ్! కానీ వెళ్ళేముందు ఒక చిన్నపని చేసిపెట్టు" అన్నాడు.

తేలికపడ్డ మనసుతో తలాడించాడు నజీర్. అయినా అక్కడ్నించి ఎంత తొందరగా బయటపడితే అంతమంచిది అనుకుంటూ– “చెప్పండి సాబ్ నేనేం చేయాలి?” అనడిగాడు.

“సిటీ లిమిట్స్‌ను ఆనుకుని వున్న కొండగుట్టల దగ్గర మన నీగ్రో ఓ పార్టీని కల్సుకోవాల్సి వుంది! అతన్ని అక్కడికి తీసుకువెళ్ళి, పని పూర్తికాగానే తీసుకురావాలి!” అన్నాడు జియావుద్దీన్.

“అలాగే సాబ్! అలాగే!” అన్నాడు వినయంగా నజీర్.

“నువ్వెళ్ళి కారు సిద్ధంచెయ్యి. నీగ్రో నీ వెనకాలే వస్తాడు.

తలాడించి జియావుద్దీన్ సాహెబ్‌కి వంగి–వంగి సలాములు చేస్తూ అక్కడ్నించి బయటికి వచ్చేశాడు నజీర్. భవంతి ఆవరణలో ఆగి వున్న కార్లలో ఒక కారును తీసుకొచ్చి పోర్టికోలో ఆపి వుంచాడు.

సరిగ్గా అయిదు నిముషాల తరువాత ఒక సూట్‌కేస్‌తో బయటికి వచ్చి కారెక్కి, బేక్‌సీటులో కూర్చున్నాడు నీగ్రో. డోర్ మూసి కారును పోనివ్వమని చెప్పాడు.

కారు స్టార్ట్‌చేసి భవంతి ఆవరణలోంచి బయటికి వచ్చాడు నజీర్.

భవంతి పరిసరాలను వదిలి రోడ్‌మీదకి చేరగానే సిటీ లిమిట్స్‌ను ఆనుకుని వున్న కొండ గుట్టలకేసి పరుగులు దీయించాడు.

నలభై నిముషాల తర్వాత కొండగుట్టలను సమీపించి ఆగింది కారు. వెంటనే క్రిందికి దిగిపోయాడు నీగ్రో!

“సూట్‌కేస్‌ని జాగ్రత్తగా చూస్తూ వుండు. నేను వెళ్ళి పార్టీతో మాట్లాడి నీకు సిగ్నల్ ఇస్తాను. అప్పుడు సూట్‌కేస్ తీసుకురా” అన్నాడు.

నజీర్ అప్పుడప్పుడూ చేసే పనే అది. అందులో అనుమానించటానికి ఏమీ కనిపించకపోవడంతో కేజువల్‌గా తలాడించాడు అతను.

నీగ్రో అక్కడ్నించి వెళ్ళగానే సిగరెట్ వెలిగించి దమ్ములాగుతూ కారు దిగకుండా సీట్లోనే కూర్చున్నాడు.

పెద్ద పెద్ద అంగలు వేస్తూ అక్కడికి కొంతదూరంలో ఉన్న కొండగుట్టల చాటుకి వెళ్ళిపోయాడు నీగ్రో. చూస్తూండగానే కనుమరుగు అయిపోయాడు.

అక్కడికి చేరుకున్న తరువాత రిస్ట్‌వాచ్‌లో టైము చూసుకుంటూ ఒక బండరాతి మీద కూర్చున్నాడు నీగ్రో.

కారులో వదిలిన సూట్‌కేస్‌లో శక్తివంతమైన టైంబాంబులను వదిలి వచ్చాడు నీగ్రో. మరో అయిదు నిముషాలలో బ్రద్దలయ్యేలా టైం సెట్ చేశాడు. ఇంకో మూడు నిముషాలు మాత్రమే వుంది ప్రేలడానికి....

ఆ బాంబు బ్రద్దలవగానే కారుతోపాటు ముక్కలయిపోతాడు నజీర్. గుర్తుపట్టడానికి శవం కూడా మిగలకుండా మంటల్లో మాడి మసి అయిపోతాడు.

నజీర్ అకౌంట్ సెటిల్ చేయటానికి జియావుద్దీన్ నీగ్రో ద్వారా చేసిన ఏర్పాటు అది. తమ రహస్యాలు చాటుగా విన్నవాడికి శిక్ష విధించటానికి అతను వేసిన ఎత్తు.

సిగరెట్ కాలుస్తూ మూడు నిముషాలపాటు ఓపిగ్గా గడిపాడు నీగ్రో. మూడు నిమిషాలకు ఇంకా పది సెకన్లు వుందనగా బండరాతి మీంచి లేచి, కొండగుట్ట చాటునుండి కారువైపు తొంగిచూసాడు.

అతను చూస్తుండగానే పెద్ద శబ్దంతో ప్రేలిపోయింది సూట్‌కేస్‌లో అమర్చిన టైంబాంబు. ఇంతెత్తున గాలిలోకి ఎగిరి గిరగిరా తిరుగుతూ క్రిందపడిపోయింది.

ఆ ప్రేలుడు ధాటికి చెదిరిన కారు భాగాలు గాల్లో విష్ణుచక్రాల్లా తిరుగుతూ చెల్లాచెదురుగా పడ్డాయి. ఎర్రటి మంటలు కారు శేషభాగాన్ని దగ్ధం చేయటం ప్రారంభించాయి. నల్లటి పొగలు సుడులు తిరుగుతూ గాలిలోకి వ్యాపించ సాగాయి.

క్రూరంగా నవ్వుతూ కొండగుట్ట చాటునుంచి ఇవతలికి వచ్చి అటు నడిచాడు నీగ్రో. అతను దగ్ధం అవుతున్న కారును సమీపిస్తుండగానే అక్కడికి వచ్చింది ఒక వేన్. అందులోంచి దిగి,నీగ్రో దగ్గిరికి వచ్చి మెచ్చుకోలుగా చూసారు అతనివంక కొంతమంది రౌడీలు.

"అయిపోయాడు! మన రహస్యాన్ని తెలుసుకున్న నజీర్ కారుతో పాటు కాలి బూడిదయిపోయాడు!" రౌడీల మెచ్చుకోలు చూపులకు పొంగిపోతూ

గర్వంగా అరిచాడు నీగ్రో. పది నిముషాలపాటు అందరూ అక్కడే నిలబడి ఆ విషయాన్ని గర్వంగా జియావుద్దీన్ సాహెబ్‌కి చెప్పేందుకు వేన్‌లో బయలుదేరారు.

వెళుతున్న వేన్ కనుమరుగయ్యేటంతవరకూ ఓపిగ్గా కూర్చుని, ఆ తరువాత ఒక కొండగుట్ట చాటునుండి ఇవతలికి వచ్చాడు నజీర్. ప్రాణాపాయం నుండి బయటపడగలిగినందుకు తేలిగ్గా వూపిరి పీల్చుకుంటూ సిగరెట్ వెలిగించుకుని దమ్ములాగుతూ సిటీకేసి బయలుదేరాడు.

నీగ్రో కొండగుట్టల చాటుకు వెళ్ళిన తరువాత...సిగరెట్ కాలుస్తూ సీట్లోనే కూర్చున్న నజీర్ ఉన్నట్టుండి వులిక్కిపడ్డాడు. టిక్...టిక్...టిక్‌మంటూ ఏదో సన్నటి శబ్దం వినిపిస్తున్నట్టు అనిపించటంతో కాలుస్తున్న సిగరెట్‌ను అవతలికి విసిరేసి, చెవులు రిక్కించాడు.

ఆ శబ్దం కారులోంచే వినిపిస్తున్నదని కన్ఫర్మ్ చేసుకుంటూనే ఫ్రంట్ సీటులోంచి బేక్‌సీటులోకి వంగి సూట్‌కేస్‌ను జాగ్రత్తగా పరిశీలించాడు.

అందులోంచే వెలువడుతోంది ఆ శబ్దం! అదేమిటో గ్రహిస్తూనే చెమటలు పట్టేశాయి అతని ముఖానికి. హార్ట్‌బీట్ అదుపు తప్పినట్టు అనిపించింది.

వెంటనే డోర్ తెరుచుకుని క్రిందికి దిగిపోయాడు నజీర్. కారును చాటుచేసుకుంటూ రెండోవైపున నున్న కొండగుట్టలకేసి పరుగుదీశాడు.

అతను ఒక కొండగుట్ట చాటుకు చేరుకుని ముడుచుకుని కూర్చోవటం...సూట్‌కేస్‌లో అమర్చిన టైంబాంబు భయంకరమైన శబ్దాన్ని వెలువరిస్తూ బ్రద్దలవటం ఒకేసారి జరిగిపోయింది.

ఆ తరువాత వేన్‌లో రౌడీలు అక్కడికి రావటం...పదినిముషాల తరువాత నీగ్రోని ఎక్కించుకుని వెళ్ళటం అంతా చూస్తూనే వున్నాడు నజీర్.

కొండగుట్టల దగ్గర్నుండి బయలుదేరిన అరగంట తరువాత సిటీలోకి ఎంటరయ్యాడు నజీర్. చేయవలసినదాన్ని గురించి ఆలోచిస్తూ ఒక దిశలో అడుగులు వేస్తున్నాడు.

జియావుద్దీన్ సాహెబ్ దృష్టిలో తను మరణించినవాడి క్రింద లెక్క కాబట్టి ఇప్పట్లో తనకు వచ్చిన ప్రమాదం ఏదీలేదు. ఇకపోతే...ప్రధానిని హతమార్చేందుకు వేయబడిన టు-ఇన్-వన్ పథకాన్ని గురించి పోలీసులకి ఫోన్ ద్వారా తెలియచేస్తే

తన బాధ్యత తీరిపోతుంది. ఇంతకాలం జియావుద్దీన్ అక్రమాలకు పరోక్షంగా సహాయపడినందుకు ప్రాయశ్చిత్తం చేసుకున్నట్లు అవుతుంది. ఆ తరువాత తన భార్యా బిడ్డలతో ఎవరికీ కనిపించకుండా వెళ్ళి హాయిగా గడపవచ్చు.

అలా అనుకుంటూనే ఓ పబ్లిక్ టెలిఫోన్ బూత్ దగ్గర ఆగి, ఎ.సి.పి. అహ్మద్ బాషాకి ఫోన్ చేశాడు నజీర్.

ఫోన్‌లో అతను చెప్పింది వింటూనే విపరీతమైన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసాడు ఎ.సి.పి. అహ్మద్‌భాషా...."లుక్ నజీర్! నువ్వు ఇప్పుడు ఎక్కడ్నించి ఫోన్ చేస్తున్నావో చెప్పు. నేను వెంటనే బయలుదేరి అక్కడికి వస్తాను. అంతా వివరంగా చెబుదువుగాని... ఇటువంటి విషయాలు ఫోన్‌లో మాట్లాడుకోవటం మంచిదికాదు" అన్నాడు అవతలినుండి.

"అచ్చా సాబ్! మీకోసం నేను ఇక్కడే వెయిట్ చేస్తుంటాను" అంటూ అడ్రసు చెప్పి రిసీవర్ క్రెడిల్‌చేసి పాంటుజేబులోనుంచి యాభై రూపాయల నోటుతీసి బూత్ అతనికి ఇచ్చాడు నజీర్.

"చిల్లరలేదు సార్! అదిగో...ఆ కనిపిస్తున్న పాన్‌షాపు దగ్గర చిల్లర మార్చి రెండురూపాయలు తెచ్చిఇవ్వండి" అంటూ నోటుని తిరిగి ఇచ్చేశాడు అతను.

ఆ నోటును తీసుకుని రోడ్డును క్రాస్‌చేసి పాన్‌షాప్ దగ్గరికి వెళ్ళాడు నజీర్. ఒక సిగరెట్ పాకెట్ తీసుకుని, ఆ ప్రక్కనే వున్న టీబంక్‌లో టీ త్రాగుతూ అసిస్టెంట్ కమీషనర్ అహ్మద్‌భాషా కోసం వెయిట్ చేయటం ప్రారంభించాడు.

సరిగ్గా ఇరవై నిముషాల తరువాత రాకెట్‌లా ఒకదాని వెనక ఒకటి దూసుకువచ్చాయి రెండు జీపులు. బూత్‌ను సమీపించి ఆగాయి.

అందులోంచి క్రిందకి దిగి బూత్ అతని దగ్గరకు వెళుతున్న రౌడీలను చూస్తూనే లాగిపెట్టి ముఖంమీద కొట్టినట్టు అదిరిపడ్డాడు నజీర్. ఎక్కువసేపు ఆలోచించకుండానే ఎ.సి.పి. వాళ్ళమనిషేనని అర్ధం అవుతుండగా ఆందోళనపడుతూ లేచి టీ బంక్ చాటుకి తప్పుకోబోయాడు.

కానీ అప్పటికే జరిగిపోయింది ఆలస్యం...తన పోలికలుచెప్పి ఎంక్వయిరీ చేసిన రౌడీలకి బంక్ అతను తను వున్న వైపు చూపించటం కూడా పూర్తిఅయింది.

ఆ మరుక్షణం చివ్వున తలలుత్రిప్పి అటు చూసారు అందరూ. టీబంక్ చాటునుంచి అవతలికి తప్పుకోబోతున్న నజీర్‌ను గమనించారు.

“అడుగో నజీర్! అక్కడున్నాడు....పదండి. అటు పదండి...” అని కీచుకంఠంతో అరిచాడు ఒక రౌడీ.

“అందుకోండి ఆయుధాలు....అందుకోండి! ఎందుకయినా మంచిది... బాంబులు విసరండి” అంటూ హుషారు చేసాడు ఇంకో రౌడీ.

అందరూ జీపులలో వున్న ఆయుధాలలో తలొకదాన్ని అందుకుని రోడ్డుకి అడ్డంపడి టీ బంక్‌వైపు కదిలారు. కదులుతూనే గబగబా విసిరారు నాలుగు నాటుబాంబులు.

గాలిలో గిరగిరా తిరుగుతూపోయి టీ బంక్ ముందు పడ్డాయి రెండు బాంబులు. విసరటంలో తేడావచ్చి పక్కనున్న పాన్‌షాప్ ముందు పడింది మరొకటి.

నేలను తాకుతూనే భయంకరమయిన శబ్దాలను వెలువరిస్తూ ప్రేలిపోయాయి ఆ బాంబులు. పడినచోట పెద్ద గోతులను సృష్టించాయి.

తుక్కుతుక్కు అయిపోయింది టీ బంక్. నామరూపాలు లేకుండా నాశనం అయ్యింది పాన్‌షాప్. బాంబు ప్రేలుళ్ళకు అదిరిపడిన జనం కీసరబాసరగా అరుస్తూ చెల్లాచెదురుగా పరుగులుదీయటం ప్రారంభించారు.

బాంబులు నేలను తాకకముందే టీ బంక్ పక్కనుండి కదలటం వల్ల ప్రాణాలు దక్కించుకోగలిగాడు నజీర్. ప్రేలుళ్ళ అదటుకు ఎగిరి నాలుగు అడుగుల దూరంలో బోర్లాపడి, వెంటనేలేచి పరుగు అందుకున్నాడు.

“మైగాడ్! వాడు...నజీర్‌గాడు...ఇంకా ప్రాణాలతోనే వున్నాడు. పట్టుకోండి... పట్టుకోండి” అని గొంతులు చించుకుని అరుస్తూ ఆయుధాలు ఎత్తిపట్టుకుని అతని వెంటపడ్డారు ఆ రౌడీలు.

శక్తినంతా పాదాలలో కేంద్రీకరించుకుని పరుగుదీస్తున్న నజీర్‌కి వందగజాల దూరం పోగానే కంటపడింది ఒక కారు. వెంటనే కారెక్కి స్టార్టు చేసాడు అతను. రౌడీలు ఆ ప్రదేశాన్ని చేరుకునేసరికే ముందుకు ఉరికించాడు ఆ కారును.

సరిగ్గా ఆ ప్రదేశాన్ని సమీపించి ఆగిపోయారు రౌడీలు. మరోసారి అతను అందకుండా పోయాడన్న ఉక్రోషంతో కసిగా నేలనుతన్ని, పళ్ళు పటపట కొరికారు.

ఆ వెంటనే పరుగు పరుగున పోయి బూత్‌ముందు ఆగివున్న తమ జీప్‌లను వేగంగా అక్కడికి తీసుకువచ్చారు యిద్దరు రౌడీలు. జీపులు రన్నింగ్‌లో వుండగానే ఒకరి తరువాత ఒకరుగా వాటిలో ఎక్కేసారు రౌడీలు.

అసిస్టెంట్ కమీషనర్ అహ్మద్ భాషా దేశద్రోహులతో చేతులు కలిపాడన్న విషయం మనసును కలచివేస్తూండగా కారులో బస్‌స్టేషన్‌కి చేరుకున్నాడు నజీర్. కారును బయట వదిలి వెయిటింగ్ హాలులోకిపోయి భార్యా బిడ్డలకోసం వెదకటం ప్రారంభించాడు.

అప్పుడు సమయం రాత్రి రెండుగంటలు కావస్తోంది.

వెయిటింగ్ హాలులో కనిపించలేదు నసీమా...ఎక్కడ వుందో తెలీదు.

పావుగంటసేపు వెదికిన చోటనే వెదికాడు నజీర్. తను రావటం ఆలస్యం అయినందువల్ల విసిగి ఇంటికి వెళ్ళిపోయి వుంటుందనుకుంటూ బస్‌స్టేషన్‌లోంచి బయటికి వచ్చాడు.

అదే సమయంలో జీపులతో అక్కడకి వచ్చేశారు రౌడీలు. ఈసారి తప్పించుకునే అవకాశం అతనికి యివ్వకుండా తలొకతన్నూ తన్నుతూ జుత్తు పుచ్చుకుని లాక్కుపోయి జీపు ఎక్కించారు.

# 15

**"అదీసాబ్** జరిగింది! ఆ అసిస్టెంట్ కమీషనర్ అహ్మద్ భాషా దేశ ద్రోహులతో చేతులు కలపకుండా వుంటే అంతా మంచే జరిగేది..." అంటూ ముగించాడు నజీర్.

అనవసరమయిన విషయాలలో వ్రేలుపెట్టి వున్న సమయాన్ని వృధా చేసుకుంటున్నానేమోనని తనలోతానే బాధపడుతున్నాడు శ్యామ్‌సుందర్. వచ్చినపని ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన వుందని తెగ టెన్షన్ పడి పోతున్నాడు.

నజీర్ చెప్పిందంతా శ్రద్ధగా విన్న తరువాత తీరిపోయింది అతని టెన్షన్. చురుకుగా పనిచేయటం ప్రారంభించింది అతని మస్తిష్కం.

అదే సమయంలో శ్యామ్‌సుందర్ చెప్పిన అడ్రసులో చాందినీ ఇంటి ముందుకు వచ్చి ఆగింది ఆటో. నజీర్‌తోపాటు ఆటో దిగుతూ తలుపు బార్లా తెరిచి వుండటం గమనించి అదిరిపడ్డాడు శ్యామ్‌సుందర్. చేతికి అందిన కరెన్సీ నోటు నొకదాన్ని తీసి డ్రయివర్‌మీదికి విసిరి లోపలికి పరుగుదీసాడు.

హాల్లోకి అడుగుపెట్టిన శ్యామ్‌సుందర్‌కి అక్కడ పరిస్థితిని గమనిస్తూనే ఎక్కడలేని నీరసం వచ్చేసింది. కాళ్ళలో సత్తా లేనట్టు నేలమీద కూలబడిపోయేటట్టు చేసింది.

దున్నపోతులుపడి కుమ్ములాడుకున్నట్టు విరిగి ముక్కలయి వుంది ఆ హాల్లోని ఫర్నిచర్. కార్పోరేషన్ డంపింగ్ గ్రౌండ్‌లా తయారయింది ఇల్లంతా.

చాందినీ బల్బీర్‌లుగానీ, నసీమా ఆమె కొడుకుగానీ ఎక్కడా కనిపించలేదు ఆ బంగ్లాలో.

"ఏమయింది శ్యామ్‌సుందర్ సాబ్! ఏమిటి యిదంతా...నా భార్యాబిడ్డలు ఏరి...?" అడుగులు నీరసంగా వేస్తూ అతని వెనకనే లోపలికి వచ్చాడు నజీర్.

అతనికి సమాధానం చెప్పకుండా లేచి ఒకసారి బంగ్లా అంతా వెతికి వచ్చాడు శ్యామ్‌సుందర్....ఎవరూ కనబడకపోవటంతో టెన్షన్‌గా తల విదిలించాడు.

జియావుద్దీన్ సామాన్యుడు కాదన్న సంగతి స్పష్టంగా అర్థం అయ్యింది శ్యామ్‌సుందర్‌కి. తన కదలికలను అదుపు చేయటానికి చాందినీతోపాటు మిగతావారిని బంధించి తీసుకుపోయే ఏర్పాట్లు చేసాడని తెలిసిపోయింది.

"ఆ దుర్మార్గుడు నా భార్యా బిడ్డలను బ్రతకనీయడు. ఇక నేను దిక్కులేనివాడ్ని అయిపోవాల్సిందే" అంటూ తల బాదుకోసాగాడు నజీర్.

అతన్ని ఉద్దేశించి ఏదో అనబోతున్న శ్యామ్‌సుందర్ చెవులు వున్నట్టుండి రిసీవ్ చేసుకోసాగాయి ఏదో అస్పష్టమయిన శబ్దాన్ని. అదేమిటో అర్థం చేసుకున్న అతని గుండెను ఒక్కసారిగా ఝల్లుమనిపించాయి.

"మైగాడ్! బాంబ్... టైం బాంబ్ సెట్ చేయబడింది ఈ బంగ్లాలో! కమాన్... మూవ్! అంటూ నజీర్ జబ్బ పుచ్చుకుని లేవనెత్తి అతనితో పాటు బయటికి పరుగుదీసాడు శ్యామ్‌సుందర్. బంగ్లాలోంచి బయటపడుతూనే దూరంగా వెళ్ళిపోయాడు.

నజీర్‌తోపాటు అతను సురక్షితమయిన ప్రదేశానికి చేరుకున్న అరనిముషం తర్వాత భూకంపం వస్తున్నట్టు కదిలిపోయింది ఆ ప్రదేశం. భూనభోంతరాళాలు దద్దరిల్లిపోతున్నట్లు సంభవించింది భయంకరమయిన ప్రేలుడు.

చూస్తుండగానే వికృతమయిన శబ్దాలను వెలువరిస్తూ నేలమట్టం అయి పోయింది చాందినీ అందంగా నిర్మించుకున్న బంగ్లా... శ్యామ్‌సుందర్‌కళ్ళముందే రాళ్ళగుట్టగా మారిపోయింది.

ఎర్రటి మంటలు నాల్కలు విరజాస్తూ కనిపించిన ప్రతివస్తువునూ విజృంభించి ఆరగించటం ప్రారంభించాయి. నల్లటి పొగలు సుడులు తిరుగుతూ ఆ పరిసరాలను కమ్ముకున్నాయి.

భయంకరమయిన ఆ ప్రేలుడు చాలా దూరం వినిపించినట్టుంది... నిద్రాభంగం అయిన పౌరులు ఇళ్ళల్లోంచి బయటపడి పరుగు పరుగున అటు రావటం ప్రారంభించారు. చుట్టుపక్కలవాళ్ళు అప్పటికే ఆ ఇంటి ముందుకు చేరి ఆశ్చర్యచకితులయ్యారు.

జనం గుంపులుకట్టి, పోలీసులుకూడా చేరుకునేటంతవరకూ తాము అక్కడ వుండటం మంచిదికాదని, నజీర్‌తోపాటు అక్కడ్నించి బయలుదేరాడు శ్యామ్‌సుందర్.

ఆ స్థితిలో కూడా అతన్ని వెంటాడుతూనే వుంది ఒక సందేహం. సమాధానం చెప్పమని అతన్ని అదేపనిగా వేధిస్తున్నది.

జియావుద్దీన్ సాహెబ్ భవంతిలోంచి నజీర్‌ను విడిపించిన తను చాందినీ ఇంటికివస్తానని శత్రువులకి ఎలా తెలిసింది? బాంబు పెట్టింది తనకోసం కాకపోతే చాందినీని చంపవలసిన అవసరం వారికి ఏముంది?

"ఇక లాభంలేదు సాబ్! జియావుద్దీన్‌లాంటి వాడితో విరోధం పెట్టుకుని నాలాంటి సామాన్యుడు ప్రాణాలు దక్కించుకోవటం అసంభవం. నేను వెళతాను!

జియావుద్దీన్ సాహెబ్ పాదాలమీదపడి క్షమాపణ చెప్పుకుంటాను. మళ్ళీ అతని దగ్గర ఉద్యోగంలో చేరి నా భార్యాబిడ్డలను కాపాడుకుంటాను" పిచ్చివాడిలా అరుస్తూ ఉన్నట్టుండి ఒక దిశలో పరుగుదీయటం ప్రారంభించాడు నజీర్.

ఉలిక్కిపడ్డాడు శ్యామ్‌సుందర్. పారిపోతున్న అతని వెంటపడి పది గజాలదూరంలో పట్టుకుని నిలబెట్టేశాడు.

"వదలండి సాబ్! నన్ను వదలండి! ఈ మానసిక చిత్రవధను నేను భరించలేను. జియావుద్దీన్ సాహెబ్‌ని శరణు వేడితే నా సమస్యలన్నీ తీరిపోతాయి" అని గింజుకుంటూ అతన్ని వదిలించుకోవాలని ప్రయత్నించటం ప్రారంభించాడు నజీర్.

ఓపిక వున్నంతవరకూ అతడి ప్రయత్నాన్ని అడ్డుకుంటూ నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు శ్యామ్‌సుందర్. ఓపిక నశించగానే లాగిపెట్టి చెంపమీద బలంగా కొట్టాడు.

దెబ్బ పడగానే చెంప వూడి చేతిలోకి వచ్చినట్టు అనిపించింది నజీర్‌కి. కళ్లముందు చీకట్లు కమ్ముకున్నట్టు అనిపించటంతో నోటివెంట వస్తున్న అరుపులు ఆగిపోయాయి.

ఆ షాక్‌నుండి తేరుకోడానికి అయిదు నిముషాలు పట్టింది అతనికి. తేరుకుంటూనే ముఖాన్ని రెండు చేతులతో కప్పుకుని బావురుమంటూ మోకాళ్ళమీద నేలకూలిపోయాడు అతను.

ఏడుస్తున్న అతని చేయి పట్టుకుని దగ్గిరలో వున్న ఒక చీకటిసందులోకి లాక్కుపోయాడు శ్యామ్‌సుందర్. గుండె బరువు తగ్గేటంత వరకూ అతన్ని ఏడవనిస్తూ మౌనంగా వుండిపోయాడు.

"వెళ్ళి అడగ్గానే ఎగిరి గంతేసి నీకు ఉద్యోగం యిస్తాడనుకుంటున్నావా జియావుద్దీన్? తన రహస్యాన్ని తెలుసుకున్న నిన్ను ప్రాణాలతో వుండనిస్తాడని భావిస్తున్నావా? నెవ్వర్! నువ్వు కంటపడిన మరుక్షణంలో మరింత సులువయి పోతుంది అతని పని...." అన్నాడు శ్యామ్‌సుందర్.

"అలాగని నా ఒక్కడి ప్రాణం దక్కించుకోవటం కోసం నా భార్యాబిడ్డల్ని వదులుకోమంటారా సాబ్! వాళ్ళు లేకుండా ఒంటరి బ్రతుకు బ్రతకమంటారా?" అన్నాడు గద్గద స్వరంతో.

"నువ్వు కంటపడనంతవరకూ జియావుద్దీన్‌కి బందీలుగా వున్నా, క్షేమంగానే ఉంటారు వాళ్ళు. నీ వివరాలు తెలుసుకోటానికయినా వాళ్ళని ప్రాణాలతోనే వుంచుతాడతను" అన్నాడు శ్యామ్‌సుందర్.

"ఏమో సాబ్...నాకు నమ్మకంలేదు. రక్తం రుచి మరిగిన పులి ఆ జియావుద్దీన్! ఏ క్షణంలోనైనా వాళ్ళని కబళించవచ్చు."

"డోన్ట్‌వర్రీ! నీ భార్యాబిడ్డలను నీ దగ్గిరికి చేర్చే పూచీ నాది! నేను చెప్పినట్టు చెయ్యి" అన్నాడు శ్యామ్‌సుందర్.

కళ్ళు తుడుచుకుంటూ అతనివంక ప్రశ్నార్ధకంగా చూశాడు నజీర్.

"నువ్వు ఈ రాత్రికే ఢిల్లీ వెళ్ళిపో! అక్కడ్నించి నేను ఇచ్చిన అడ్రసు ప్రకారం హైద్రాబాద్ చేరుకుని నేను కలుసుకోమన్నవారిని కలుసుకుని అక్కడే వుండు. సాధ్యమయినంత త్వరలో నీ భార్యాబిడ్డలను నీ దగ్గిరికి చేరుస్తాను. నువ్వు నాతోపాటు వుండటం మంచిదికాదు. నా మాట విను. ఎవరికంటా పడకుండా రైల్వేస్టేషన్‌కి వెళ్ళు" అంటూ ఫాంటుజేబులోంచి కొన్ని కరెన్సీ నోట్లు తీసి అతని చేతిలో పెట్టాడు శ్యామ్‌సుందర్.

అప్పటికప్పుడు వాసంతి పేరుతో ఒక లెటర్ రాసి అతనికి యిచ్చి అతన్ని ఒక ఆటో ఎక్కించి పంపేశాడు.

అతను వెళ్ళిన తరువాత సిగరెట్ వెలిగించుకుని దమ్ము లాగుతూ జియావుద్దీన్ భవంతికేసి బయలుదేరాడు.

చీకటిగా వున్న ఇరుకు దారులవెంట పయనిస్తూ ఒక వీధిలోకి అడుగుపెడుతుండగా చీకటిలోంచి అతని ముందు ప్రత్యక్షం అయ్యారు యూసఫ్ ఆలీ, అతని అనుచరులు. ఆయుధాలతో అతన్ని చుట్టుముట్టారు.

"నీ కారణంగా భరించరాని అవమానాలు భరించాను. జియావుద్దీన్ సాబ్‌తో మాట అనిపించుకున్నాను. అందుకు ప్రతిఫలంగా నిన్ను బంధించి ఆయనకు అప్పగిస్తాను" ఖంగ్‌మంటున్న కంఠంతో అంటూ తన అనుచరులకు సైగ చేశాడు యూసఫ్ ఆలీ.

ఆయుధాలు పుచ్చుకున్న అతని అనుచరులు కదిలి ముందుకు వస్తుండగానే... ఉన్నట్టుండి షోట్‌చేస్తూ తొడ చరిచి వారిమీదికి దూకాడు

శ్యామ్‌సుందర్. బిగించి వుంచిన పిడికిళ్ళతో బలంగా పొడిచాడు వారి ముఖాలమీద.

పరిసరాలు దద్దరిల్లేటట్టు అరిచారు ఆ ఇద్దరూ. ఆయుధాలు వదిలేసి ముఖాలను చేతులతో అదుముకుంటూ నేలమీద చతికిలబడిపోయారు.

అంతమంది మధ్య చిక్కుకుని ఆందోళన పడవలసిన అతను ఆ విధంగా ఎదురుదాడికి దిగుతాడని ఎంతమాత్రం వూహించలేదు యూసఫ్ఆలీ. తన కళ్ళముందే తన అనుచరులు ఇద్దరు మట్టికరవటంతో ఆవేశంతో వూగిపోయాడు అతను.

"కొట్టండి అతన్ని! పట్టుకుని కట్టిపారేయండి. కాళ్ళూచేతులు విరిచేయండి" అని గొంతు చించుకుని అరుస్తూ ఆదేశించాడు మిగతావారిని.

అతని ఆదేశాలను అనుసరించి బిగ్గరగా అరుస్తూ అతని మీదికి లంఘించారు పదిమందికి పైగావున్న రౌడీలు....తమ చేతులలో వున్న రకరకాల ఆయుధాలను గిరగిరా తిప్పుతూ అతని మీదికి విసరటం ప్రారంభించారు.

దెబ్బకు దొరకకుండా తప్పించుకుంటూ ఫాంటు బెల్టును సర్రున లాగాడు శ్యామ్‌సుందర్. చిన్నచిన్న రింగులు తాపడం చేయబడిన ఆ బెల్టును గిరగిరా త్రిప్పుతూ అందినవాడ్ని అందినట్టే విరగబాదటం ప్రారంభించాడు.

అతని ధాటికి తట్టుకోలేక గగ్గోలెత్తిపోయారు యూసఫ్ ఆలీ అనుచరులు. చేతులలో శక్తివంతమయిన ఆయుధాలు వున్నా అతన్ని పడగొట్టడం చేతకాని వారయ్యారు.

పావుగంటసేపు నిర్విరామంగా జరిగింది ఆ పోరాటం. చాటునుండి యూసఫ్ ఆలీ ఒక ఇనుపరాడ్‌ను శ్యామ్‌సుందర్ తలకు గురిపెట్టి విసరటంతో అంతం అయింది.

గాలిలో గిరగిరా తిరుగుతూ వచ్చి, శ్యామ్‌సుందర్ తల వెనుకభాగాన్ని గాయపరిచింది యూసఫ్ ఆలీ విసిరిన ఇనపరాడ్. అతన్ని స్పృహ తప్పించి అచేతనుడ్ని చేసింది

*  *  *  *  *

"వెల్ మిస్టర్ శ్యామ్‌సుందర్! అదృష్టం తలక్రిందులయి ఎంతటి సమర్థులయినా తలలు వంచక తప్పదు. అంతమాత్రానికే చింతించనవసరం లేదు. కళ్ళు తెరువు."

కంచుగంటలా ఖంగ్‌మంటున్న జియావుద్దీన్‌సాహెబ్ గొంతులోంచి వచ్చిన మాటలు సూటిగా చెవులలో దూరేసరికి నొసలు చిట్లిస్తూ తలను అటూ ఇటూ కదిలించాడు శ్యామ్‌సుందర్. ముఖంమీద ఎవరో చల్లటి నీటిని చిలకరించేసరికి ఉలికిపడుతూ స్పృహలోనికి వచ్చి కనులు తెరిచాడు.

తను ఎక్కడున్నాడో అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తూ లేచి నిలబడబోయిన అతన్ని వెంటనే అడ్డుకున్నాయి రెండు చేతులు. లేచే ప్రయత్నంలో వున్న అతన్ని కదలకుండా కూర్చోబెట్టాయి కుర్చీలో.

నిర్భయంగా పదిమంది రౌడీలను ఎదిరించి పోరాడుతున్న తనను వెనక నుండి ఎవరో తలమీద కొట్టడం గుర్తుకువచ్చింది శ్యామ్‌సుందర్‌కి. కొట్టినవాడు ఆ రెండు చేతుల తాలూకు వ్యక్తే ఎందుకు కాకూడదు అనుకుంటూ పిడికిలి బిగించి అతనిమీద ఎటాక్ చేయబోయాడు.

"మైగాడ్!ఆగు....ఆగు మిస్టర్ శ్యామ్‌సుందర్! పోటీకి యిది సమయం కాదు...చోటు అంతకంటే కాదు" అంటూ అతన్ని వారించింది ఒక కంఠం.

ఆ గొంతులో ధ్వనించిన గంభీరత అదుపు చేసింది శ్యామ్‌సుందర్‌ని. ఎత్తిన పిడికిలిని వెంటనే క్రిందికి దించేటట్టు చేసింది.

తనను కుర్చీలోకి నెట్టిన వ్యక్తి ముఖం పగలగొట్టాలన్న ఆలోచనను విరమించుకుంటూనే తలెత్తి ముందుకు చూశాడు శ్యామ్‌సుందర్.

విలాసంగా నవ్వుతూ ఎదురుగా వున్న మరో కుర్చీలో కూర్చుని వున్నాడు జియావుద్దీన్ సాహెబ్. న్యూస్‌పేపర్‌లో ఎన్నోసార్లు అతని ఫొటోను చూసి వుండటంవల్ల చూడగానే పోల్చుకున్నాడు శ్యామ్‌సుందర్. పరిచయం లేకపోయినా పలకరింపుగా నవ్వాడు.

జియావుద్దీన్‌కి ఇరువైపులా విచిత్రమయిన ఖడ్గాలను పుచ్చుకుని వున్న నీగ్రోలనూ, మరికొంత దూరంలో వున్న యూసఫ్ ఆలీని చూశాడు శ్యామ్‌సుందర్. వారి పక్కనే నిలబడి ఉరిమి చూస్తున్న మరో వ్యక్తిని కూడా గుర్తుపట్టాడు.

ఎవరో కాదు అతను!

పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఉదయపూర్ చేరకముందే అతన్ని హతమార్చాలని ప్రయత్నించి దారుణంగా భంగపడి సీటు క్రిందికి దొర్లించబడిన వ్యక్తి...అతనే!

అతనే ఖలీల్‌పాషా అయివుంటాడని గ్రహించటానికి ఎంతో సేపు పట్టలేదు శ్యామ్‌సుందర్‌కి. ఉదయపూర్‌లో అడుగు పెట్టకముందే తనను హతమార్చమని వాళ్ళను ఆదేశించింది జియావుద్దీన్ సాహెబ్ అన్న సంగతి కూడా అతనికి అర్థం అయింది.

అన్ని విషయాలు అర్థం అయినా ఒకే ఒక సందేహం మాత్రం అతని మనసులో అలాగే మిగిలిపోయింది. అదెలా సాధ్యమో తెలియకుండా పోయింది.

"రౌడీలతో పోరాడుతున్న తన తలమీద బలమయిన గాయం అయింది. ఆ తరువాత స్పృహ తప్పిపోవటం కూడా జరిగింది.

కాబట్టి...లెక్కప్రకారం తను కళ్ళు తెరవగానే దిమ్ముగా వుండాలి తల. పలుగులు పెట్టి పొడుస్తున్నట్టు పోటెత్తుతూ విపరీతమయిన బాధను వెలువరించాలి.

ఆనవాలుకయినా అటువంటిబాధ లేకపోవటం...కనీసం కాళ్ళూ చేతులూ బంధించకపోవటం, నీగ్రోల చేతులలో తప్ప తదితరుల చేతుల్లో ఎటువంటి ఆయుధాలు లేకపోవటం, ఒక రివాల్వర్ అయినా తనవైపు గురిపెట్టి వుండకపోవటం విపరీతమయిన ఆశ్యర్యాన్ని కలిగిస్తోంది శ్యామ్‌సుందర్‌కి. లేనిపోని అనుమానాలు పుట్టుకువచ్చేట్టు చేస్తోంది.

అతని ఆలోచనలను పసిగట్టినట్టు మరోసారి విలాసంగా నవ్వాడు జియావుద్దీన్ సాహెబ్.

"మీ డైనమిక్ సిటీ సెక్యూరిటీ సర్వీసెస్ గురించి నాకు తెలుసు వాత్సవతోపాటు నీ శక్తి సామర్థ్యాలను కూడా నేనెరుగుదును. అందుకే ఇంతవరకూ నిన్ను బంధించిన వాళ్ళెవరూ తీసుకోని జాగ్రత్తలు తీసుకున్నాను. మా సుప్రీం అనుమతి లభించేటంతవరకూ నిన్ను చంపకుండా ప్రాణాలతో వుంచుతాను" అంటూ యూసఫ్ ఆలీ వంక చూసాడు.

"ఎవరు మీ సుప్రీం? మీ టు ఇన్ వన్ పథకానికి అర్థం ఏమిటి?" అని ప్రశ్నించాలని అనుకున్నాడు శ్యామ్‌సుందర్. చాందినీ, నసీమాలతోపాటు బల్బీర్‌ని ఏం చేసారో, ఎక్కడ బంధించారో తెలుసుకోవాలని కూడా అతను అను కున్నాడు.

అతను అడగకముందే చప్పట్లు చరిచాడు యూసఫ్ ఆలీ...గర్వంతో కూడిన చిరునవ్వు నవ్వుతూ శ్యామ్‌సుందర్ ముఖంలోకి చూసాడు.

ఆ మరుక్షణంలోనే ఆ హాలును ఆనుకుని వున్న ఒక గదిలోంచి అక్కడికి లాక్కురాబడ్డాడు నజీర్.

శ్యామ్‌సుందర్ మనసును విపరీతమయిన ఆశ్చర్యానికి గురిచేశాడు.

"మైగాడ్! ఎలా జరిగింది...? ఎలా పట్టుబడ్డాడు నజీర్?' అని తనలో తానే అనుకున్నాడు శ్యామ్‌సుందర్.

"ఎదుటివారి సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేస్తే పరిస్థితులు యిలాగే ఎదురు తిరుగుతాయి మిస్టర్ శ్యామ్‌సుందర్. నువ్వు ఎంతో శ్రమపడి విడిపించిన వ్యక్తిని కొద్ది గంటలలోనే బంధించటం నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది కదూ?" అన్నాడు జియావుద్దీన్ వెటకారంగా.

"కొండను తవ్వి ఎలకను పట్టడం అంటారు దీన్నే! ఒక అమాయకుడ్ని, నిస్సహాయుడ్ని బంధించటం గొప్ప అనుకోవటం మీకే చెల్లింది" మరింత వ్యంగ్యంగా అన్నాడు శ్యామ్‌సుందర్.

"అతను అమాయకుడు కావచ్చు, నిస్సహాయుడు కావచ్చు. మా రహస్యాలు తెల్సుకున్న వాళ్ళెవరూ ప్రాణాలతో వుండటానికి వీలులేదు. నీ కళ్ళముందే యితన్ని చిత్రవధ చేస్తారు మావాళ్ళు. చేతనయితే అడ్డుకో" అన్నాడు జియావుద్దీన్.

అతను అనటం పూర్తి అవటం, నీగ్రోలు ముందుకు కదలటం ఒకేసారి జరిగింది. పెడరెక్కలు విరిచికట్టబడిన నజీర్‌ను హింసించటం మొదలయింది.

తన చేతిలోని విచిత్రమయిన ఖడ్గాన్ని ఎత్తి...కత్తి మొనతో నజీర్ ఛాతీమీద క్రాస్ గుర్తు పెట్టాడు ఒక నీగ్రో. తన కత్తి మొనను అతని భుజంలో గుచ్చి మెలిత్రిప్పాడు రెండవ నీగ్రో.

ఆ హాలు దద్దరిల్లిపోయేటట్లు అరిచాడు నజీర్. బాధతో విలవిలలాడి పోయాడు.

ఆ దృశ్యాన్ని కళ్ళారాచూస్తూ తట్టుకోలేకపోయాడు శ్యామ్‌సుందర్. అవకాశం లేదని తెలిసి కూడా తెగించి ముందుకు వురకాలని చివ్వున కుర్చీలోంచి లేవబోయాడు.

దారుణంగా విఫలమయింది అతని ప్రయత్నం.

కూర్చున్న కుర్చీలో అతుక్కుపోయినట్టు పైకి లేవలేకపోయాడు. కాళ్ళూ చేతులను అంగుళం కూడా కదల్చలేకపోయాడు.

"వాటీజ్ దిస్! ఏమయింది తనకు? తను ఎందుకు కదలలేక పోతున్నాడు? అనుకుంటూ మరోసారి కదలాలని ప్రయత్నించి ఫెయిలయ్యాడు.

అతడి అవస్థను గమనించి ఘొల్లున నవ్వారు అక్కడున్నవారు అందరూ.

ఆలోచిస్తున్న శ్యామ్‌సుందర్‌కి అయిదు నిముషాల తరువాత అర్థం అయింది. ఆఫ్రికా దేశంలోని జైళ్ళలోని భయంకరమయిన నేరస్తులను గాయపరచకుండా అదుపాజ్ఞలలో వుంచేందుకు ఉపయోగించే ఒక రకమయిన మెడిసిన్ తన మీద ప్రయోగించబడిందన్న సంగతి. తన కాళ్ళూ చేతులు కదలక పోవటానికి కారణం అదేనన్న సంగతి కూడా అతనికి తెలిసిపోయింది.

ప్రయోగించిన కొద్ది నిముషాలలోనే తన ప్రభావాన్ని చూపిస్తుంది స్టెరాయిడ్ సంబంధం అయిన ఆ మెడిసిన్. కొద్దిగంటలపాటు నరాలను బలహీన పరచి అవయవాల కదలికలను స్థంభింపచేస్తుంది.

మనిషి ఏ పొజిషన్‌లో వుండగా ప్రయోగించబడిందో అదే పొజీషన్‌లో మనిషిని గంటల తరబడి వుంచుతుంది. అంగుళం కూడా కదలలేని పరిస్థితి కల్పిస్తుంది. మనిషి చూడగలడు, మాట్లాడగలడు ఆలోచించగలడు కాని కదలలేడు.

ప్రపంచం మొత్తంమీద ఆ మెడిసిన్ అధికంగా వుపయోగించేవాడు అంతర్జాతీయ ప్రొఫెషనల్ కిల్లర్‌గా పేరు పొందిన రియాజ్‌ఖాన్ ఒక్కడే నని ఒకసారి మాటలమధ్యలో వాత్సవ చెప్పటం గుర్తుకువచ్చింది శ్యామ్‌సుందర్‌కి. అతని అలవాట్లు జియావుద్దీన్‌కి ఎలా అలవడ్డాయో తెలీలేదు.

బాధతో విలవిలలాడుతున్న నజీర్‌ను మరింత క్రూరంగా హింసిస్తూ పైశాచిక ఆనందాన్ని అనుభవించసాగారు నీగ్రోలు.

అది చూసి ఉప్పొంగిపోయాడు జియావుద్దీన్. ఎప్పుడూ చూడనంతగా సంబరపడిపోతున్నాడు.

"వద్దు...ఆ అమాయకుడ్ని ఏమీ చేయవద్దు. కావాలంటే నన్ను హింసించండి" తల కూడా త్రిప్పలేని స్థితిలో జియావుద్దీన్‌ని రిక్వెస్ట్ చేశాడు శ్యామ్‌సుందర్.

అదే సమయంలో జియావుద్దీన్ దగ్గిర వున్న సెల్‌ఫోన్ మ్రోగటం ప్రారంభించింది.

కోటు జేబులోంచి సెల్‌ఫోన్ బయటికితీసి ఎవరితోనో మాట్లాడాడు జియావుద్దీన్.

వెంటనే ఆగిపోయింది నజీర్‌ని హింసించడం. అతను సైగ చేయటంతో వెనక్కి వెళ్ళిపోయారు నీగ్రోలు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడటం ముగించి శ్యామ్‌సుందర్ వైపు చూసి చిన్నగా తల వూపాడు జియావుద్దీన్.

"ప్రస్తుతానికి సుప్రీమ్ నన్ను అర్జంటుగా బయలుదేరి రమ్మనటం వల్ల నువ్వు కోరినట్టే నజీర్‌ని హింసించి చంపే ఆలోచనను వాయిదావేస్తున్నాను మిస్టర్ శ్యామ్‌సుందర్. తిరిగిరాగానే సుప్రీమ్ పర్మిషన్‌తో అతన్ని, నిన్ను ఒకేసారి పరలోకానికి పంపుతాను" అన్నాడు.

అప్పటికి గండం గడిచి గట్టెక్కినందుకు తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు శ్యామ్‌సుందర్. చిత్రహింసలు ఆగిపోయినందుకు నజీర్ కూడా తనలాగే ఫీలవుతాడని అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

అతనికి ఆమాత్రం సంతోషాన్ని కూడా మిగల్చటం యిష్టంలేనట్టు ముందుకు వచ్చాడు ఒకనీగ్రో. "బాస్! ఈ యిద్దర్నీ చంపేస్తే బాగుంటుంది. మళ్ళీ మళ్ళీ యిటువంటి సమస్యలు తలెత్తకుండా వుంటాయి" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

"సుప్రీమ్ ఆదేశాలు లేకుండా మనం ఏమీచేయకూడదు. అందువల్ల వచ్చే కష్టాలను భరించడం మనవల్ల కాదు. యితనికి రెండు గంటలకు ఒకసారి ఆ మెడిసిన్ యివ్వండి. నజీర్ కాళ్ళూ, చేతులు కట్టిపారేయండి" అని ఆదేశించి అక్కడ్నించి వెళ్ళిపోయాడు జియావుద్దీన్.

అతను చెప్పిన విధంగానే యిరుకుగా వున్న ఒక చీకటి గదిలో బంధించబడ్డారు శ్యామ్‌సుందర్, నజీర్‌లు. రెండు గంటల తరువాత అతనికి మెడిసిన్‌ని యింజక్ట్ చేసి వెళ్ళాడు ఖలీల్‌పాషా.

# 16

**"అంతేనా** శ్యామ్‌సుందర్ సాబ్? నా భార్యాబిడ్డలను చూసుకునే యోగం యిక నాకు లేనట్టేనా? మనం వీళ్ళ చేతులలో దిక్కుమాలిన చావు చావాల్సిందేనా?"

ఆలోచిస్తున్న చోటునుండి కదలకుండా మౌనంగా కూర్చున్న శ్యామ్‌సుందర్‌ని ఉద్దేశించి గద్గద స్వరంతో అడిగాడు కాళ్ళూ, చేతులు కట్టివేయబడిన నజీర్.

అవయవాలు సహకరించవని తెలిసినందుకు అతనివంక చూసే ప్రయత్నం చేయలేదు శ్యామ్‌సుందర్. సరయిన అవకాశం వచ్చేటంత వరకు మనం ఈ పరిస్థితిని ఎదుర్కోక తప్పదు నజీర్" అన్నాడు అసహనం నిండిన కంఠంతో.

అలా అన్నాడేగానీ అవకాశం కోసం ఎదురుచూస్తూ కూర్చోవాలన్న ఆలోచన ఎంతమాత్రం లేదతనికి. ఏదో ఒక వుపాయాన్ని ఆలోచించి తప్పించుకోవాలని అనుకున్నాడు శ్యామ్‌సుందర్. అందుకు అనువయినమార్గాలను అన్వేషిస్తూనే వున్నాడు.

బంధింపబడిన గంటతరువాత ఖలీల్‌పాషారూపంలో అతనికి లభించింది ఒక అవకాశం. ఉపయోగించుకుని బయటపడమని హెచ్చరించింది.

లావుపాటి రూళ్ళకర్ర నొకదాన్ని తీసుకుని ఆ గదిలోకి వచ్చాడు ఖలీల్‌పాషా. ఎర్రబడ్డ కళ్ళతో మింగేసేలా చూశాడు శ్యామ్‌సుందర్‌ని.

పింక్ సిటీ ఎక్స్‌ప్రెస్ ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంట్‌లో శ్యామ్‌సుందర్ చేతిలో జరిగిన పరాభవాన్ని అతను యింకా మర్చిపోలేదు. అతన్ని తన చేతులతో చంపాలన్న తన నిర్ణయాన్ని కూడా మార్చుకోలేదు.

ఆ రోజు జరిగిన ఆ ఒకే ఒక్క సంఘటనతో యూసఫ్ ఆలీదగ్గర తన పరువూ, పరపతీ దారుణంగా దెబ్బదీసాడు. సాటివారిలో చెప్పలేనంత చులకన అయిపోయాడతను.

అతనంటే యూసఫ్ ఆలీకి నమ్మకం తగ్గిపోయింది.

యూసఫ్ ఆలీ నిరాదరణ భరించలేకపోతున్నాడు. శ్యామ్‌సుందర్‌ని ముక్కలుముక్కలుగా నరికి పోయిన ప్రతిష్టను పునరుద్ధరించుకోటానికి తహతహలాడుతున్నాడతను.

అయితే అందుకు జియావుద్దీన్ అనుమతి కావాలి. యూసఫ్ ఆలీ పర్మిషన్ యివ్వాలి. కానీ....యిప్పట్లో అది జరిగే పనికాదు.

అందుకే అతన్ని రూళ్ళకర్రతో కసితీరా కొట్టి హింసించటానికి వచ్చాడు ఖలీల్‌పాషా. అతన్ని చంపవద్దు అన్నారేగానీ, హింసించవద్దనలేదుకదా?

అందుకే అందరూ ఎవరి పనులలో వాళ్ళు బిజీగా వుండటంచూసి తన కక్ష తీర్చుకోటానికి ఆ గదిలోకి వచ్చాడతను. గదిలోకి రాగానే తలుపులు మూసి బోల్టులు బిగించాడు.

కందగడ్డలా ఎర్రగా కనిపిస్తున్న అతని ముఖం చూశాడు శ్యామ్‌సుందర్. ఆ ఎర్రదనంలో తనను హతమార్చే లక్షణాలు ఏమయినా వున్నాయేమోనని వెదికాడు.

లేదు! తనను చంపాలన్న ఆలోచన ఖలీల్‌పాషా కళ్ళలో కనిపించలేదు. అతను వచ్చింది కేవలం తనను హింసించి ట్రైన్‌లో జరిగిన దాడికి ప్రతీకారం చెల్లించడానికే అనిపించింది.

అదే సమయంలో ఉన్నట్టుండి గుర్తొచ్చింది ఆ మెడిసిన్ లక్షణాలకు సంబంధించి వాత్సవ చెప్పిన ఒక విషయం.

ఆ 'మూమెంట్ కిల్లర్' ఇంజక్షన్ ప్రభావం మనిషి శరీరం మీద రెండు నుంచి మూడు గంటల సమయం పనిచేస్తుందట. అది కూడ ఇచ్చిన డోస్‌ని బట్టి వుంటుందట ఆ ప్రభావం.

ఆ సమయంలో చలనం స్థంభించిపోయిన అవయవాలను గాయ పరిచినా, ఆ మనిషిని తీవ్రంగా హింసించినా.... 'మూమెంట్ కిల్లర్' ఇంజక్షన్

ప్రభావం అమిత వేగంతో క్షీణించిపోతుందట. ఎంత తక్కువ డోస్ ఇచ్చినా కొద్ది క్షణాలకే అవయవాలు కదలటం మొదలుపెడతాయట.

ఆ విషయం గుర్తుకురావటంతోపాటే చక్కటి ఉపాయం ఒకటి చోటు చేసుకుంది శ్యామ్‌సుందర్ మస్తిష్కంలో. చిరునవ్వు ప్రత్యక్షం అయింది అతని పెదవులమీద.

"ఏంబే....ఖలీల్‌పాషా! ట్రెయిన్‌లో ఇచ్చిన కోటింగ్ సరిపోలేదా? ఇంకో కోటింగ్ ఇవ్వమంటావా?" అన్నాడు అతనివంక వురిమిచూస్తూ.

క్రూరంగా నవ్వాడు ఖలీల్‌పాషా.

"కాలూ, చేయి కదలలేని పరిస్థితి తెచ్చుకున్నా ఇంకా అణగలేదు నీ పొగరు. ఏమీ చేయలేని స్థితిలో కూడా వెక్కిరింతలు మానలేదు. మోసగించి స్పృహ తప్పించటం మొనగాడితనం కాదు. ఇప్పుడు చూపించు నీప్రతాపాన్ని. చేతనయితే నిన్ను నువ్వు రక్షించుకో!" అంటూ రూళ్ళకర్రను ఎత్తిపట్టుకుని ముందుకు వచ్చాడు.

"ఏడిశావులే! నా ఒంటిమీద చేయి వేసేపాటి దమ్ముందా నీకు?" అన్నాడతను రెచ్చగొడుతూ.

రెచ్చిపోయాడు ఖలీల్‌పాషా. పిచ్చికోపంతో మరింతగా ఎర్రబడి పోయింది అతని ముఖం.

"చూడు...నా దమ్ము, ధైర్యం ఎలాంటిదో చూడు. నీకు చేతనయింది చేసుకో!" అంటూ రూళ్ళకర్రతో బలంగా బాదాడు శ్యామ్‌సుందర్ భుజాలమీద.

ఫట్...ఫట్....మంటూ పడ్డాయి వరసగా నాలుగుదెబ్బలు.

చీమ కుట్టినట్టయినా అనిపించలేదు శ్యామ్‌సుందర్‌కి. ఇసుమంతయినా బాధ కలగలేదు.

ఫక్కున నవ్వాడు ఖలీల్‌పాషా ముఖంలోకి చూసి. కన్నుకొట్టి మరింతగా కవ్వించాడు.

ఉక్రోషంగా వూగిపోతూ అతను కూర్చున్న కుర్చీని ఎత్తి అవతలికి విసిరాడు ఖలీల్‌పాషా. వెంట వెంటనే వేశాడు రూళ్ళకర్రతో మరో నాలుగు దెబ్బలు.

కుర్చీతోపాటే క్రిందపడిపోయాడు శ్యామ్‌సుందర్. పెయిన్ మొదలవు తుందేమోనని ఆశించాడు.

రూళ్ళకర్రతో కొట్టినప్పుడుగానీ, కుర్చీతోపాటు క్రింద పడినప్పుడు కానీ ఎటువంటి బాధకు గురికాలేదు అతని శరీరం. సూది గుచ్చుకున్నట్టయినా అనిపించలేదు.

నరాలు జివ్వుమంటే చాలు తీరిపోతుంది శ్యామ్‌సుందర్ సమస్య.... మూమెంట్ కిల్లర్ మెడిసిన్ బారినుండి విముక్తి లభిస్తుంది.

అందుకే అనరాని మాటలతో అతన్ని మరింతగా రెచ్చకొడుతున్నాడు శ్యామ్‌సుందర్. "ఇంతేనా? మూలనున్న ముసలమ్మను కొట్టినట్టు కొట్టి మురిసి పోవటమేనా నీ మొనగాడితనం? నువ్వెంత పనికిమాలినవాడివో నాకు ఇప్పుడు అర్థం అయింది. నీ పనితనం ఏపాటిదో తెలిసిపోయింది" అన్నాడు.

ఏరికోరి శ్యామ్‌సుందర్ విసిరిన ఆ మాటలు ఖలీల్‌పాషా మీద బాగా పనిచేసాయి. అతను కోరుకున్న ఎఫెక్టును తెచ్చిపెట్టాయి.

పళ్లు పట పట కొరుకుతూ ఇష్టం వచ్చినట్టు రూళ్ళకర్రతో అదేపనిగా అతన్ని కొట్టడం ప్రారంభించాడు ఖలీల్‌పాషా. అది చాలదన్నట్టు బూటు కాళ్ళతో ఈడ్చి ఈడ్చి తన్నసాగాడు.

మూమెంట్ కిల్లర్ మెడిసిన్ లక్షణాలు ఎటువంటివో ఖలీల్‌పాషాకి తెలియదు. అందువల్లనే చేయకూడని పొరపాటు చేశాడు అతను. ఇవ్వకూడని ట్రీట్‌మెంట్ ప్రారంభించాడు శ్యామ్‌సుందర్‌కి.

బాధను వ్యకం చేస్తూ శ్యామ్‌సుందర్ ఒక్కసారి కూడా అరవకపోవటం అవమానంగా తోచింది ఖలీల్‌పాషాకి. అతన్ని బాధతో విలవిలలాడిపోయేటట్లు చేయాలన్న పట్టుదలను పెంచింది.

ఆ మరుక్షణంలోనే రూళ్ళకర్రను అవతలికి విసిరి పాంటుజేబులో నుండి స్ప్రింగ్‌నైఫ్‌ను తీసాడు ఖలీల్‌పాషా. కర్కశంగా నవ్వుతూ బలంగా పొడిచాడు అతని తొడలో.

అప్పుడు.... అతడలా పొడిచినపుడు కలిగింది శ్యామ్‌సుందర్ నరాలలో కొద్దిపాటి చలనం. ఖలీల్‌పాషా పట్టుదలకు ముచ్చటపడినట్లు తనపట్టును

సడలించటం ప్రారంభించింది శ్యామ్‌సుందర్ కదలికను స్థంభింపచేసిన మెడిసిన్ ప్రభావం.

మెల్లమెల్లగా బాధకు గురికాసాగాయి శ్యామ్‌సుందర్ అవయవాలు. బాధతోపాటే స్వేచ్ఛ కూడా లభించినట్టు చిన్నగా కదలటం ప్రారంభించాయి.

తన అవయవాలు స్వాధీనంలోకి వచ్చినట్లు గ్రహించగానే చిరునవ్వు ప్రత్యక్షం అయింది శ్యామ్‌సుందర్ పెదవులమీద. ఒక్కసారిగా ఒళ్ళు విరుచుకుంది అతని ఆవేశం.

అతని నవ్వును మరోలా అర్థం చేసుకున్నాడు ఖలీల్‌పాషా. ఆ నవ్వును బాధగా మార్చాలన్న పట్టుదల కొండలా పెరిగిపోయింది అతనిలో.

"నవ్వుతున్నావా? ఇంతగా హింసించినా నన్ను ఇంకా ఎగతాళి చేస్తున్నావా? ఇక నిన్ను ప్రాణాలతో వదలను. జియావుద్దీన్ సాహెబ్ అంగీకరించకపోయినా, యూసఫ్ ఆలీ పర్మిషన్ ఇవ్వకపోయినా నిన్ను ఇప్పుడే ఖతమ్ చేస్తాను. నువ్వు పారిపోయే ప్రయత్నంలో వుండగా చంపాల్సివచ్చిందని చెప్పి నమ్మిస్తాను. చావు..." అంటూ స్ప్రింగ్‌నైఫ్‌ను సూటిగా అతని గుండెలలో దించబోయాడు.

అప్పుడు కదిలాడు శ్యామ్‌సుందర్ కదలగలిగినంత వేగంతో. ఆ గది దద్దరిల్లిపోయేలా గొంతు చించుకుని అరుస్తూ లేచి నిలుచున్నాడు.

అదిరిపడ్డాడు ఖలీల్‌పాషా. మెడిసిన్ ప్రభావం నుండి అతను ఎలా బయటపడ్డాడో అర్థం చేసుకోలేకపోయాడు.

అయినా ఆ విషయానికి ప్రాధాన్యతను ఇవ్వకుండా అతన్ని ఎదుర్కోటానికి సిద్ధపడ్డాడు. అతన్ని ఖతం చేసే ఉద్దేశ్యంతో కత్తి దూసి అతనిమీద కలియబడ్డాడు.

రెండే రెండు పిడికిలిపోట్లతో అతన్ని నెత్తురు కక్కించాడు శ్యామ్‌సుందర్. అతని తలను ఆ గది గోడకేసి బాది స్పృహ తప్పించి క్రింద పడగొట్టాడు.

శ్యామ్‌సుందర్ సాహసాన్ని కళ్ళారా చూసి ఆశ్చర్యంతో బిగుసుకుపోయాడు నజీర్. అంతలో ఉన్నట్టుండి కాలింగ్‌బజర్ మ్రోగటంతో ఆందోళనగా చూసాడు అతని ముఖంలోకి.

శ్యామ్‌సుందర్ మాత్రం ఎటువంటి ఆశ్చర్యాన్ని ప్రదర్శించకుండా నాలుగు అంగలలో ఎంట్రన్స్‌ను సమీపించి ఓపెన్ చేశాడు. పిడికిళ్ళు బిగించి తలుపు చాటున నిశ్శబ్దంగా నిలుచున్నాడు.

"వద్దని చెప్పినా ఈ గదిలోకి ఎందుకు వచ్చావు? నా అనుమతి లేకుండా శ్యామ్‌సుందర్‌ని ఎందుకు హింసిస్తున్నావు?"

ఖలీల్‌పాషాను ఉద్దేశించి సీరియస్‌గా అడుగుతూ తలుపులు నెట్టుకుని విసురుగా లోపలికి వచ్చేశాడు యూసఫ్ ఆలీ.

గదిలో తారుమారై కనిపించిన పరిస్థితిని గమనించి కంగారుపడుతూ చివ్వున వెనుదిరిగాడు.

తిరుగుతుండగా కార్నర్ చేయబడ్డ పులిలా అతన్ని ఎటాక్ చేశాడు శ్యామ్‌సుందర్. బిగించి వుంచిన పిడికిలితో బలంగా కొట్టాడు అతని ముఖం మీద.

కీచుగా అరిచాడు యూసఫ్ ఆలీ. ముక్కూ, ముఖం ఏకమయి ఎర్రటి నెత్తురు ఎగజిమ్ముకు వస్తుండగా గుడ్లు తేలేసాడు అతను.

తప్పించుకోటానికి మరో మార్గం కనిపించక....ధైర్యాన్ని కూడదీసుకుని శ్యామ్‌సుందర్‌ని ఎదుర్కోబోయాడు.

అటువంటి అవకాశం అతనికి ఇవ్వలేదు శ్యామ్‌సుందర్. ఖలీల్ పాషాను స్పృహ తప్పించిన పద్ధతిలోనే అతన్ని కూడా స్పృహ తప్పించాడు. అతని జుత్తు పుచ్చుకుని ఇవతలికి లాగి, పాషా పక్కన కూర్చోబెట్టాడు.

"మీ విషయంలో జియావుద్దీన్ ఎందుకంత ఆందోళనపడ్డాడో నాకు అర్థం అయింది సాబ్! ఈ దేశద్రోహుల బారినుండి ప్రధానిని మీరు రక్షించగలరన్న నమ్మకం చిక్కింది" తన బాధలన్నీ మర్చిపోయినట్టు ఉత్సాహంగా అన్నాడు నజీర్.

సమాధానం చెప్పలేదు శ్యామ్‌సుందర్. చిరునవ్వు నవ్వుతూ అతని బంధనాలు వదిలించకుండానే బయటికి నడిచాడు. అతన్ని విపరీతమయిన ఆశ్చర్యానికి గురిచేస్తూ తలుపులు మూసి అవతలికి వెళ్ళిపోయాడు.

లోపలినుండి నజీర్ అరుస్తున్న అరుపులు శ్యామ్‌సుందర్‌కి వినిపిస్తూనే వున్నాయి.

ఆ అరుపుల్ని పట్టించుకోకుండా అతన్ని ఆ గదిలోనే వదిలి రావటానికి కారణం వుంది.

శ్యామ్‌సుందర్‌తో సమానంగా పరుగుదీసే స్థితిలో లేడు నజీర్ ప్రమాదాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేదు అతని శరీరం.

ఆ భవంతిలో తను చేయదలచుకున్న పనిని పూర్తిచేసేటంత వరకూ అతన్ని సురక్షితమయిన చోట వుంచాలి. నజీర్‌లాంటి నిస్సహాయస్థితిలో వున్నవాడికి బంధింపబడిన చోటుకంటే సురక్షితమయిన చోటు ఇంకేముంటుంది?

తొడమీద ఖలీల్‌పాషా సృష్టించిన గాయంనుండి రక్తం స్రవిస్తున్నా పట్టించుకోకుండా ఒక గదిలోకి వెళ్ళి తలుపులు మూసేశాడు శ్యామ్‌సుందర్. అక్కడ కనిపించిన టెలిఫోన్ రిసీవర్ ఎత్తి హోంమినిస్టర్ గారు బయలు దేరేముందు తనకు యిచ్చిన టెలిఫోన్ నెంబర్‌ని మొట్టమొదటిసారిగా ఉపయోగించి ఆ నెంబర్ డయల్ చేసాడు.

వెంటనే వచ్చింది అవతలినుండి రెస్పాన్స్.

"హలో మిస్టర్ శ్యామ్‌సుందర్! మీరు ఢిల్లీలో పింక్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఎక్కినప్పటినుంచి మీ ఫోన్‌కోసం ఎదురుచూస్తున్నాం. మీరు ఎలాంటి సహాయం కోరినా తక్షణం అందించమని హోంమినిస్టర్ గారి నుండి మాకు ఆదేశాలు అందాయి. చెప్పండి! ఏం కావాలి మీకు?" అని వినయంగా అడిగింది ఒక కంఠం.

తనకు కావాల్సిన సహాయాన్ని గురించి అతనికి అర్థం అయ్యేలా ఒకటికి రెండుసార్లు వివరించి రిసీవర్ క్రెడిల్‌చేసి ఆ గదిలోంచి బయటికి నడిచాడు.

అప్పటికే అర్ధరాత్రి దాటటంవల్ల భవంతిలోని జియావుద్దీన్ అనుచరు లందరూ ఎవరి గదులలో వాళ్ళు నిద్రపోతున్నారు. వంతులవారిగా కాపలా కాసేవాళ్ళు మాత్రం కారిడార్స్‌లో తిరుగుతున్నారు.

వారి కంటపడకుండా భవంతి అంతటా కలియతిరుగుతూ గ్రౌండ్ ఫ్లోర్‌కి చేరుకున్నాడు శ్యామ్‌సుందర్. అక్కడ ఒక గదిముందు మెషిన్ గన్స్‌తో నిలబడిన వ్యక్తులను గమనించి కనుబొమలను ఆశ్చర్యంగా ముడివేసాడు.

భవంతిలో ఎక్కడా లేని కాపలా ప్రత్యేకంగా ఆ గదిముందు ఎందుకు వున్నట్టు? ఏముంది ఆ గదిలో?

రాకూడని అనుమానం రానేవచ్చింది శ్యామ్‌సుందర్‌కి. ఆ గదిలో ఏముందో తెలుసుకోవాలన్న ఆసక్తి పెరిగింది.

అటూ ఇటూ చూసినా, కళ్ళు పెద్దవి చేసుకుని నేలమీద వెదికినా విసరటానికి వీలయిన వస్తువేదీ కనిపించలేదు అతనికి.

క్షణం ఆలోచించి ఎడంకాలు బూటును విప్పి చేతులలోకి తీసుకున్నాడు శ్యామ్‌సుందర్. దానిని గురిచూసి ద్వారానికి యిటుపక్కన నిలబడినవానికి తగిలేలా విసిరాడు.

గాలిలో గిరగిరా తిరుగుతూ పోయి స్టిఫ్‌గా నిలబడిన ఆ వ్యక్తి తలకు తగిలి క్రిందపడింది ఆ బూటు. అతనికి ఆశ్చర్యంతోపాటు ఆగ్రహాన్ని కూడా కలిగించింది.

"ఎవఁడ్రా అది....ఏమిటా పొగరు...?" అంటూ తన సహచరుడిని అక్కడే వుండమని సైగచేసి మెషిన్‌గన్‌ని ఎయిమింగ్ పొజిషన్‌లో పట్టుకుని కారిడార్ మలుపుకేసి అడుగులు వేశాడు.

పిడికిలి బిగించి గోడచాటున నిశ్శబ్దంగా నిలుచున్నాడు శ్యామ్‌సుందర్. మలుపు తిరుగుతుండగానే అతని మీదికి ఎటాక్‌చేసి ఒక పిడిగుద్దుతో స్పృహ తప్పించి గోడచాటుకు ఈడ్చేశాడు. రెండు నిముషాలు ఆగి రెండో బూటును కూడా ఉపయోగించి గదిముందు నిలబడిన రెండో వ్యక్తిని కూడా కన్‌ఫ్యూజ్‌లో పడేసి అటు రప్పించాడు శ్యామ్‌సుందర్. మొదటివాడి మాదిరిగానే అతన్ని కూడా దెబ్బతీసి, చేతులు దులుపుకుంటూ పోయి గదిముందు పడివున్న తన బూట్లను కలెక్ట్‌చేసి తొడుక్కున్నాడు.

ఆ తరువాత తలుపులు తెరిచి...లోపలికిపోయి విపరీతమయిన ఆశ్చర్యానికి గురిఅయ్యాడు. ఆశ్చర్యాన్ని అదుపుచేసుకుంటూ చుట్టూ చూశాడు.

సాదాసీదాగా వున్న ఫర్నిచర్ తప్ప మనుషులెవరూ లేరు ఆ గదిలో. ఖరీదయిన వస్తువులు కానీ, ఐరన్‌సేఫ్‌లవంటివి కానీ కనిపించలేదు ఆ గదిలో.

మరి ఆ గదిముందు ఆ కాపలా ఎందుకూ? గదిలో ఏమీ లేనప్పుడు అంత బిల్డప్ ఎందుకు ఇచ్చినట్టు?

అలాగని సరిపెట్టుకోలేకపోయాడు శ్యామ్‌సుందర్. కంటికి కనిపించని విశేషం ఏదో అక్కడ వుందని అనుకోకుండా వుండలేకపోయాడు.

అటువంటి ఆలోచన రాగానే ఆ గదిలోని ప్రతి వస్తువును కదిలించి చూశాడు. నీట్‌గావున్న గదిగోడల్ని తనిఖీచేయటం ప్రారంభించాడు.

పది నిముషాల తర్వాత లభించింది అతను పడిన శ్రమకు ఫలితం.

గోడవారగా వున్న ఒక గాజు బొమ్మను కదిలించగానే...కిర్‌కిర్ మంటూ వినిపించింది ఒక శబ్దం. గాజు బొమ్మను గుండ్రంగా త్రిప్పగానే దానికి అభిముఖంగా వున్న గోడ కొంతభాగం లోపలికి జరిగింది.

బొమ్మను వదిలి అటువెళ్ళి చూశాడు శ్యామ్‌సుందర్.

లోపలికి జరిగిన గోడభాగానికి ముందునుండి కనిపించాయి అండర్ గ్రౌండ్‌లోకి పోయే మెట్లు.

చెవులు రిక్కించి శబ్దాలను వినటానికి ప్రయత్నిస్తూ మెట్ల మీదుగా క్రిందికి పోయాడు  శ్యామ్‌సుందర్. విశాలమయిన అండర్ గ్రౌండ్‌లోకి ఎంటర్ అయ్యాడు.

అక్కడ కనిపించిన దృశ్యం అతని అంతరంగాన్ని మరింత ఆశ్చర్యానికి గురిచేసింది.

కల కాదది!నిజమే!

ఆ హాలుకి కుడివైపు వుంది పెద్ద కటకటాల గది ఒకటి. ఎన్నడూ చూడని చిత్రాన్ని చూస్తున్నట్టు కటకటాల మధ్యనుండి బయటికి చూస్తూ కనిపించారు కొంతమంది వ్యక్తులు. గెడ్డాలూ, మీసాలు పెరిగి చింపిరిజుత్తులతో చిరాగ్గా కనిపిస్తున్నారు వారందరూ.

వారిలో చాలామంది స్పెషల్ బ్రాంచ్ సి.ఐ.డి.లుగా గుర్తించాడు శ్యామ్‌సుందర్. ఒకే ఒక వ్యక్తిని గుర్తుపట్టి పట్టరాని ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు.

అతడ్ని అంతటి ఆశ్చర్యానికి గురిచేసిన ఆ వ్యక్తి ఎవరో కాదు. జియావుద్దీన్ సాహెబ్!

మరి...మరి విలాసంగా నవ్వుతూ తనతో మాట్లాడిన ఆ ఆజానుబాహుడు ఎవరు?

*　*　*　*　*

"యూ ఆర్ కరెక్ట్ మిస్టర్ శ్యామ్‌సుందర్. దేశభక్తుడిలా పేరు పొంది భారత ప్రభుత్వంచేత సన్మాన సత్కారాలు అందుకున్న అసలు జియావుద్దీన్ సాహెబ్‌ను నేనే....! నా పేరుతో చలామణి అవుతూ దేశద్రోహానికి పాల్పడు తున్నాడు నా సోదరుడు సమీరుద్దీన్‌షా. ముఖ్యమయిన నా బంధువులు, స్నేహితులతో పాటు గత కొంతకాలంగా నన్ను ఇక్కడ బంధించి వుంచింది అతనే. పరిశోధనకోసం ఉదయపూర్ వచ్చిన యీ స్పెషల్ బ్రాంచ్ సి.ఐ.డి.లను కటకటాల వెనక్కి నెట్టింది కూడా ఆ దుర్మార్గుడే".

ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న శ్యామ్‌సుందర్‌ని ఉద్దేశించి చెప్పాడు అండర్‌గ్రౌండ్ సెల్‌లోంచి బయటికి వచ్చిన అసలు జియావుద్దీన్ సాహెబ్.

అతడు చెప్పింది శ్రద్ధగా ఆలకించి మౌనంగా తలాడించాడు శ్యామ్ సుందర్. మనసులో మిగిలిపోయిన మరికొన్ని సందేహాలను గురించి ఆలోచించటం ప్రారంభించాడు.

చిన్నతనం నుండి చెడు అలవాట్లకు బానిస అయ్యి యింటినీ, దేశాన్ని వదిలి విదేశాలకు వెళ్ళిపోయాడు."

"అదిసరే జియావుద్దీన్ సార్! మీ సోదరుడు నీచుడని తెలిసికూడా మీరు అతని ట్రాప్‌లోకి ఎలా వచ్చారు? అసలు అతను మళ్ళీ మీ దగ్గిరికి ఎందుకు వచ్చాడు?" అనడిగాడు శ్యామ్‌సుందర్.

భారంగా నిట్టూర్చి బదులు ఇచ్చాడు జియావుద్దీన్.

"తమ్ముడన్న అభిమానం నాచేత తప్పటడుగు వేయించింది. రక్తపాశం నన్ను వివేకానికి దూరం చేసింది. ఎక్కడున్నాడో తెలియని నా సోదరుడు సుమారు పాతికేళ్ళ తరువాత... ఏడాది క్రిందట నన్ను చూసేందుకు ఎంతో ఆడంబరంగా వచ్చాడు. తను సిరియాలో సెటిల్ అయ్యాననీ, చెడు అలవాట్లు మానుకుని బాగుపడి కోట్లు సంపాదించాననీ, నన్ను చూడాలని పదేపదే మనసు తొందర చేయటంతో వచ్చాననీ...అప్పుడప్పుడు నా గురించి భారతదేశం నుండి వచ్చే న్యూస్ పేపర్లలో, టి.వి.లో వచ్చే వార్తలు వింటున్నాననీ చెప్పాడు.

నేను ఎంతో సంతోషంతో అతన్ని ఆహ్వానించాను. అతను నాతో పాటే కొంతకాలం గడుపుతానని, ఇక్కడ వ్యాపారాలు నచ్చితే సిరియాలో ఆస్తులు

అమ్మేసి ఇక్కడికి వచ్చేస్తానని చెప్పాడు. దానికి కూడా ఎంతో సంతోషంతో అంగీకరించాను.

అయితే అతని విషయంలో ఆ సంతోషం ఎంతోకాలం నిలవలేదు. వచ్చిన రెండు నెలలకే అతని సహజ లక్షణాలు బయటపడ్డాయి. నా పేరును వుపయోగించుకుంటూ తన అక్రమ వ్యాపారాలు కొనసాగించటానికే అతను ఇక్కడికి వచ్చాడన్న విషయం అర్థం అయింది. అయినా సహనం పాటించాను. పరోక్షంగా అతన్ని హెచ్చరిస్తూ మంచిదారికి మళ్ళించాలని శక్తివంచనలేకుండా ప్రయత్నించాను.

అయినా...చిన్నతనంలో లాగానే అతను నన్ను లెక్కచేయలేదు. ఆనాటినుండి అతని ఆగడాలు మితిమీరిపోయాయి ఒకరోజు విదేశాల నుండి భార్యా భర్తలమని చెప్పుకుంటూ ఒక స్త్రీ పురుషుల జంట వచ్చి సమీరుద్దీన్‌ని కలిసింది.

ఆ రాత్రి చివరిసారిగా సమీరుద్దీన్‌ని హెచ్చరించాలని మూడో అంతస్థులో వున్న అతని బెడ్‌రూంకి వెళ్ళాను. అక్కడ కొత్తగా వచ్చిన భార్యాభర్తలతో సమావేశం అయివున్నాడు అతను. వారి మాటలనుబట్టి భర్త అని చెప్పుకుంటున్న అతని పేరు రియాజ్‌ఖాన్ అనీ, భార్యనని చెప్పుకుంటున్న ఆమె పేరు ఆయేషాబేగం అని తెలిసింది."

అదిరిపడ్డాడు ఆ పేర్లు విని శ్యామ్‌సుందర్. విపరీతమయిన ఎగ్జయిట్ మెంట్‌కి గురవుతూ జియావుద్దీన్ ముఖంలోకి చూశాడు.

రియాజ్‌ఖాన్...ఆయేషాబేగం.

ఒకరు అంతర్జాతీయ ప్రొఫెషనల్ కిల్లర్.

ఇంకొకరు లివింగ్‌బాంబ్‌గా పేరుపొందిన...భారత్, పాకిస్థాన్ మధ్య సత్సంబంధాలను తీవ్రంగా వ్యతిరేకించే తీవ్రవాద సంస్థకు సంబంధించిన ఆత్మాహుతిదళంలో అతి ముఖ్యమయిన సభ్యురాలు. ఆ సూసైడ్ గ్రూప్‌కి ఆమె సెకండ్ లీడర్.

ఎటువంటి గొప్పవారి ప్రాణాలనయినా సునాయాసంగా హరించ గలవాడు రియాజ్‌ఖాన్. అనుకున్న దాన్ని సాధించటంలో తిరుగులేని తీవ్రవాది ఆయేషాబేగం.

ఒకరికొకరు సంబంధం లేకుండా ఎక్కడెక్కడో వుండే ఆ ఇద్దరూ ఒక్కటి ఎలా అయ్యారు....పుట్టుకతో భారతీయుడయిన సమీరుద్దీన్‌కి వారికి సంబంధం ఏమిటి? ఆపరేషన్ టు ఇన్ ఒన్‌కి అర్థం ఏమిటి?

“ఇంకా వాళ్ళు ఏం మాట్లాడుకున్నారో మీరు విన్నారా?” సమాధానాలు లభించని ప్రశ్నలను తనలోనే దాచుకుంటూ జియావుద్దీన్‌ని ఉద్దేశించి అడిగాడు శ్యామ్‌సుందర్.

చిన్నగా నిట్టూర్చి తలాడించాడు జియావుద్దీన్.

“భారతదేశంలో అలజడులు సృష్టించటమే వారి ధ్యేయం అట. భారత ప్రధానిని హత్యచేసి, దేశాన్ని అల్లకల్లోలం చేయటం, ఆ సమయంలో సరిహద్దులు దాటి దారుణమారణకాండ సృష్టించటం ఆయేషా బేగం రాకలోని ఆంతర్యం అట. అందుకు అండగా వుంటూ సరికొత్త పథకాన్ని రూపొందించి అమలు జరపటానికే రియాజ్‌ఖాన్ ఆమె వెంట రావటం జరిగిందట.

ఆ విషయం చాటుగా వింటూనే దేశభక్తుడ్నయిన నా ఆవేశం అదుపు తప్పింది. వెంటనే లోపలికి వెళ్ళి నా సోదరుడ్ని నోటికివచ్చినట్లు తిట్టాను. వెంటనే పోలీసులకు ఫోన్‌చేసి వారి బండారం బయటపెడతానని హెచ్చరిస్తూ రిసీవర్ ఎత్తాను. ఆ మరుక్షణంలో నా తల మీద ఏదో బలంగా పడింది. నేను స్పృహ తప్పిపోయాను.

తిరిగి కళ్ళు తెరిచేసరికి యిక్కడ బంధించబడి వున్నాను. ఇంచుమించు నా పోలికలతో వుండే నా సోదరుడు సమీరుద్దీన్....కొద్దిపాటి మార్పుతో తన రూపాన్ని మార్చుకుని పూర్తిగా నాలా మారిపోయాడు” అంటూ చెప్పటం ముగించాడు జియావుద్దీన్.

అంతా విని గాఢంగా నిట్టూర్చాడు శ్యామ్‌సుందర్.

‘ఆపరేషన్ టు ఇన్ ఒన్’ అంటే ఏమిటో అప్పుడు పూర్తిగా అర్థం అయింది అతనికి.

భారతదేశంలో అలజడులు సృష్టించటానికి వచ్చిన ఆయేషా బేగంనూ, మారణకాండకు నాంది పలికేందుకు దిగుమతి అయిన రియాజ్ ఖాన్‌నీ....ఒకే

ఆపరేషన్‌లో ఇన్‌వాల్వ్ చేస్తూ సమీరుద్దీన్ రూపొందించిన పథకమే ‘టు ఇన్ ఒన్’.

“ఏడాదికాలంగా ఈ అండర్ గ్రౌండ్‌లో బందీగావున్న నాకు దేశం లో పరిస్థితులు ఎలా వున్నాయో, ఆ దుర్మార్గులు తమ కార్యక్రమాలను ఎంతవరకూ అమలుపరచగలిగారో  తెలీకుండాపోయింది. చెప్పు మిస్టర్ శ్యామ్‌సుందర్! దేశంలోని శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగలేదు కదా? ప్రధాని క్షేమంగానే వున్నారు కదా?”

అందరితోపాటు అండర్‌గ్రౌండ్‌లోంచి పైకి వస్తూ అడిగాడు జియావుద్దీన్.

అతని ప్రశ్నకు సమాధానంగా....ఒకదాని వెనుక ఒకటిగా దూసుకు వస్తూ ఆ భవంతి ఆవరణలో ప్రవేశిస్తున్న పోలీస్ వాహనాల సైరన్ల మ్రోతలతో దద్దరిల్లిపోసాగాయి  పరిసరాలు.

అది పసిగట్టిన వాళ్ళెవరో భవంతిలోని డేంజర్ అలారం ఆన్ చేశారు. నిద్రపోతున్నవారికి, కాపలా కాస్తున్నవారికి ముంచుకు వచ్చిన ప్రమాదాన్ని గురించి  తెలియచేసారు.

ఆ మరుక్షణంలోనే బిలబిలమంటూ ఆయుధాలతో బయటపడ్డారు సమీరుద్దీన్ అనుచరులు. నేల అదిరిపోయేలా బూట్ల శబ్దంతో లోపలికి దూసుకువచ్చిన పోలీసులూ, స్పెషల్‌ఫోర్స్ గార్డ్‌లూ అత్యాధునికమయిన ఆయుధాలతో వారిమీద విరుచుకుపడ్డారు.

ధన్....ధన్....ధన్....మంటున్న మారణాయుధాలతో, మ్రోతలతో దద్దరిల్లిపోవటం ప్రారంభించింది.

ఆ మ్రోతలతో తనకెలాంటి సంబంధం లేదన్నట్టు జియావుద్దీన్ సాహెబ్‌తో పాటుగా ఖైదీలు అందర్నీ తీసుకుపోయి ఒక గదిలో వుంచి సిగరెట్ కాలుస్తూ తీరుబడిగా కూర్చున్నాడు శ్యామ్‌సుందర్.

అరగంటసేపు నిర్విరామంగా కొనసాగింది భవనంలో ఫైరింగ్. అరుపులతో, ఆర్తనాదాలతో మారుమ్రోగిపోయింది భవంతి.

అరగంట తర్వాత సమీరుద్దీన్ అనుచరులు చేతులు ఎత్తేసి లొంగిపోవటంతో సద్దుమణిగింది. ఆ మరుక్షణమే డాక్టర్ ఒకతన్ని వెంటబెట్టుకు

వచ్చాడు ఫోన్‌లో శ్యామ్‌సుందర్ ఆదేశాలు అందుకుని ఆ భవంతి మీద దాడికి చక చకా ఏర్పాట్లు చేసిన స్పెషల్ ఆఫీసర్.

శ్యామ్‌సుందర్ ఎదుటికి వస్తూనే సెల్యూట్ చేసి చిరునవ్వుతో కరచాలనం చేశాడు.

"వెల్ మిస్టర్ శ్యామ్‌సుందర్! అందరూ లొంగిపోయారు" అని చెప్పాడు.

అదే సమయంలో శ్యామ్‌సుందర్ తొడమీద గాయాన్ని పరిశీలించి "మైగాడ్" అంటూ ముందుకు వచ్చాడు డాక్టర్.

"ఇట్సాల్‌రైట్! నేను డాక్టర్‌ని వెంటబెట్టుకురమ్మన్నది నా కోసం కాదు. నజీర్ నాకంటే తీవ్రంగా గాయపడ్డాడు. ముందు అతనికి చికిత్స చేయండి."

తన గాయానికి కట్టు కట్టబోతున్న డాక్డర్‌ను వుద్దేశించి అన్నాడు శ్యామ్‌సుందర్.

"అతనికి చికిత్స చేయటం ఈపాటికే పూర్తిచేసి వుంటాడు నా వెంట వచ్చిన మరో డాక్డర్! యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషాలు కూడా కస్టడీలోకి తీసుకో బడ్డారు" అని చెప్పాడు ఆ ఆఫీసర్.

చిన్నగా తలాడించి డాక్టర్ కట్టుకట్టడం పూర్తిచేయగానే ఆఫీసర్ భుజంమీద చేయివేసి పక్కకి తీసుకుపోయాడు శ్యామ్‌సుందర్.

కస్టడీలోకి తీసుకోబడిన యూసఫ్ ఆలీ, ఖలీల్ పాషాల విషయంలో అతనికి కొన్ని ప్రత్యేకమయిన సూచనలు యిచ్చాడు.

"మీరు చెప్పింది బాగానేవుంది మిస్టర్ శ్యామ్‌సుందర్. కానీ ఆపని అఫీషియల్‌గానే చేయొచ్చుకదా?" అన్నాడు అతను సందేహంగా.

"ఇటువంటి పనులు అఫీషియల్‌గా చేయాలంటే చాలా అభ్యంతరాలు వుంటాయి. యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషాలకు సంబంధించిన లాయర్లు రంగంలో దిగారంటే...అభ్యంతరాలేకాదు....అధిగమించలేని ఆటంకాలు కూడా ఎదుర వుతాయి...కాబట్టి నేను చెప్పిన ఏర్పాట్లు చేయండి" అన్నాడు శ్యామ్‌సుందర్.

మారు మాట్లాడకుండా తలాడించి డాక్టర్‌తోపాటు అక్కడ్నించి అవతలికి వెళ్ళిపోయాడు ఆ స్పెషల్ ఆఫీసర్.

మరో అయిదు నిముషాల తర్వాత అడుగులు మెల్లగా వేస్తూ ఆ గదిలోకి వచ్చాడు నజీర్ “నా భార్యాబిడ్డలను గురించి ఏమయినా తెలిసిందా శ్యామ్‌సుందర్ సాబ్?” అనడిగాడు.

“తెలుస్తుంది...తప్పకుండా తెలుస్తుంది” అంటూ జియావుద్దీన్ వైపు తిరిగి “జియావుద్దీన్ సాబ్! మీరు నాకో సహాయం చేయగలరా?” అనడిగాడు శ్యామ్‌సుందర్.

“అడుగుతారేమిటి మిస్టర్ శ్యామ్‌సుందర్! ఆజ్ఞాపించండి” అన్నాడు జియావుద్దీన్.

“ఈ నజీర్‌కి నాలుగురోజులపాటు మీ భవంతిలో విశ్రాంతి తీసుకునే అవకాశం ఇవ్వండి” అన్నాడు శ్యామ్‌సుందర్.

“తప్పకుండా! నమ్మకస్తుడయిన డ్రయివరు నజీర్. సమీరుద్దీనే నేను అనుకుని అతను ఆదేశించటంతో తప్పనిసరి అయి పొరపాట్లు చేసి వుండవచ్చు. మారిన మనిషిగా అతన్ని ఆదుకోవటం యజమానిగా నాధర్మం” అన్నాడు జియావుద్దీన్.

నజీర్‌తో రెండు నిమిషాలు మాట్లాడి ఆ తర్వాత అక్కడ్నించి బయలుదేరాడు శ్యామ్‌సుందర్.

* * * * *

చీకటి పడుతుండగా సిటీ శివార్లలో వున్న ఒక భవంతి ముందుకు వచ్చి ఆగింది నీలిరంగు అంబాసిడర్ నోవా!

డోర్ తెరుచుకుని స్పెషల్ ఆఫీసర్ హబీబ్‌తోపాటు క్రిందికి దిగాడు శ్యామ్‌సుందర్. కాలుస్తున్న సిగరెట్‌ను క్రిందవేసి బూటుతో ఆర్పేసి అతన్ని అనుసరిస్తూ బంగ్లాలోకి ఎంటర్ అయ్యాడు.

ఇద్దరూ బంగ్లా వెనకభాగంలో వున్న ఒక గది ముందుకు వెళ్ళారు. అక్కడ ద్వారం ముందు స్టెన్‌గన్స్‌తో నిలబడిన ఇద్దరు గార్డ్‌లు స్పెషల్ ఆఫీసర్ని చూస్తూనే అటెన్షన్‌లో నిలబడి శెల్యూట్ చేసారు.

చిన్నగా తల వూపి తలుపు తెరవమన్నట్లు కళ్ళతో సూచించాడు హబీబ్. డోరు తెరవగానే శ్యామ్‌సుందర్ని వెంటబెట్టుకుని లోపలికి వెళ్ళాడు.

చీకటిగావున్న ఆ గదిలోకి ప్రవేశిస్తూనే గోడకున్న స్విచ్ ఆన్ చేసాడు హబీబ్.

లైటు వెలిగి వెలుతురు చోటుచేసుకుంది ఆ గదిలో....గది మొత్తం చిక్కటి కాంతితో నిండిపోయింది.

అంతవెలుతురును ఒక్కసారిగా భరించలేనట్టు కళ్ళుమూసుకున్నారు గది మధ్యలో కుర్చీలలో కట్టివేయబడిన యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషాలు. రెండు నిమిషాల తర్వాత కళ్ళు తెరిచి స్పెషల్ ఆఫీసర్‌తోపాటు ఎదురుగా నిలబడివున్న శ్యామ్‌సుందర్‌ని గమనించి సీరియస్‌గా ముడివేశారు కనుబొమలు.

"వెల్ మైడియర్ ఫ్రెండ్స్! ఇక్కడ సదుపాయాలన్నీ మీకు నచ్చాయా? ఇంకా ఎగ్‌స్ట్రా అరేంజ్‌మెంట్స్ ఏమయినా చేయమంటారా?" అని అడిగాడు శ్యామ్‌సుందర్.

"బద్మాష్! చాలించు నీ అతిథి మర్యాదలు. అరెస్ట్ చేసిన మమ్మల్ని పోలీస్‌స్టేషనులో కాకుండా ఇక్కడ ఎందుకు బంధించారు? మా లాయర్లకు కబురు పంపకుండా ఏం చేస్తున్నారు?"అని అడిగాడు యూసఫ్ ఆలీ.

"పోలీస్ లాకప్‌లో అయితే మీ ఆరోగ్యాలు చెడిపోతాయి బ్రదర్! చెప్పవలసినవి చెప్పకుండానే చట్టాన్ని అడ్డుపెట్టుకుని మీరు తప్పించుకునే వీలుంటుంది. ఇక్కడ అలాంటి అవకాశం వుండదు. ..బుద్ధిగా నిజాలు చెబితే మీకు బయట ప్రపంచంతో సంబంధాలు కల్పించబడతాయి" అన్నాడు శ్యామ్ సుందర్.

"ఇంకా నిజాలు ఏం కావాలి నీకు? నువ్వు చూసిన జియావుద్దీన్ నకిలీ మనిషి అని తెలిసిపోయిందికదా? నీలాగే మేమూ మోసపోయాం" అన్నాడు ఖలీల్‌పాషా.

చిన్నగా నవ్వాడు శ్యామ్‌సుందర్.

"మీరు ఈ విధంగా ప్లేటు ఫిరాయిస్తారని తెలిసే పోలీస్‌స్టేషన్‌లో కాకుండా మిమ్మల్ని యిక్కడ వుంచటం జరిగింది. మిమ్మల్ని అడిగి కొన్ని ప్రశ్నలకు సమాధానం తెలుసుకోటానికే నేను ఇక్కడికి వచ్చాను."

శ్యామ్‌సుందర్ మాటలకు కనుబొమలు అసహనంగా ముడివేశారు ఆ యిద్దరూ.

"నీకు తెలియని సమాధానాలు మాకు ఎలా తెలుస్తాయి? " అన్నాడు యూసఫ్ ఆలీ.

"మీకు తెలుసని నాకు తెలుసు... దేశద్రోహులుగా ఉరికంబం ఎక్కకూడదనుకుంటే నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పితీరాలి మీరు" అన్నాడు శ్యామ్‌సుందర్ సీరియస్‌గా.

"ఇంతకీ ఏమిటా ప్రశ్నలు?" కేర్‌లెస్‌గా అడిగాడు ఖలీల్‌పాషా.

"సమీరుద్దీన్, రియాజ్‌ఖాన్, ఆయేషాబేగం ప్రస్థుతం ఈ ముగ్గురూ ఎక్కడున్నారో మీరు చెప్పాలి" అడిగాడు శ్యామ్‌సుందర్.

"మాకెలా తెలుస్తుంది? నీతోపాటు మేమూ ఆ భవంతిలోనే వున్నాం కదా?" అన్నాడు యూసఫ్ ఆలీ.

"ఆపరేషన్ టు-ఇన్-ఒన్‌ని ఎలా అమలు జరపబోతున్నారు?" సూటిగా ప్రశ్నించాడు శ్యామ్‌సుందర్.

"అంటే ఏమిటి? అమాయకంగా ముఖాలుపెట్టి ఇద్దరూ ఒకేసారి అడిగారు.

ఇక ఓపిగ్గా అడగటం సాధ్యంకాలేదు శ్యామ్‌సుందర్‌కి.

మరోసారి ప్రశ్నించలేదు.

ఊహించనివిధంగా ముందుకు దూకాడు అతను.

బిగించి వుంచిన పిడికిళ్ళతో బలంగా పొడిచాడు వారి ముఖాలమీద.

ఇద్దరూ ఒకేసారి బావురుమన్నారు. పళ్ళు కదిలి ఎర్రటి రక్తం నోట్లోంచి బయటికి వస్తుండగా ఉక్రోషంగా చూశారు అతనివంక.

"ఇది చట్టవిరుద్ధం. మేము రౌడీలము మాత్రమే...టెర్రరిస్టులం కాము.....మమ్మల్ని కోర్టుకి తీసుకువెళ్ళండి. అక్కడే చెబుతాము నిజం" అని అరిచాడు యూసఫ్ ఆలీ.

"టెర్రరిస్ట్‌లకంటే భయంకరమైన దేశద్రోహులు...కన్నతల్లిని కసాయివారికి అప్పగించే నీచులు" అంటూ బూటుకాలితో ఇద్దరి తొడలమీద తన్నాడు శ్యామ్‌సుందర్.

బాధగా అరిచారు ఆ ఇద్దరూ.

కుర్చీలతోపాటే వెనక్కి పడిపోయారు.

వెంటనే చప్పట్లు చరిచాడు స్పెషల్ ఆఫీసర్ హబీబ్. "కమిన్!" అంటూ పిలిచాడు బయట నిలబడిన గార్డ్‌లను.

ఆ మరుక్షణంలోనే లోపలికి వచ్చారు గార్డ్‌లు. వెనక్కి ఒరిగిపోయిన కుర్చీలను సరిగా నిలబెట్టారు.

"చెప్పండి...ఇప్పటికయినా నిజం చెప్పండి! నేరం అంగీకరించి అప్రూవల్స్‌గా మారితే మీకు శిక్ష తగ్గించే ప్రయత్నం చేస్తాను" అని అన్నాడు శ్యామ్‌సుందర్.

"తెలీదు...మాకేం తెలీదు! అసలు నువ్వు చెబుతున్న ఆ మూడు పేర్లు ఇంతవరకూ మేము వినలేదు" ఇద్దరూ ఒకేసారి అరిచారు.

పట్టరాని ఆవేశంతో పిడికిళ్ళు బిగించి మరోసారి వారి ముఖాలు పగలగొట్టబోతున్న శ్యామ్‌సుందర్‌ని వారించాడు హబీబ్.

"మీ పద్ధతిలో ప్రయత్నిస్తే ప్రయోజనం వుంటుందని నాకు అనిపించటం లేదు! మా పద్ధతిలో మేము ప్రయత్నిస్తాం. మీరు కాసేపు విశ్రాంతి తీసుకోండి" అంటూ అక్కడే వున్న మరో కుర్చీ చూపించాడు.

సిగరెట్ వెలిగించుకుంటూ ఆ కుర్చీలో కూర్చున్నాడు శ్యామ్‌సుందర్. హబీబ్ చేయబోయేదాన్ని గమనించసాగాడు.

"మీరు ఏ పద్ధతిలో అడిగినా మేము చెప్పేది ఒకటే. మాకు ఏమీ తెలియదు" అన్నాడు యూసఫ్ ఆలీ.

సమాధానం చెప్పకుండా గార్డ్‌లవైపు తిరిగి కళ్ళతో ఏవో ఆదేశాలు జారిచేశాడు హబీబ్.

ఆ మరుక్షణంలోనే మొదలయింది అసలయిన పోలీస్ టార్చర్.

చేతులలోని స్టెన్‌గన్స్‌ని పక్కనపెట్టి గది కార్నర్‌లో వున్న లావుపాటి పోలీస్ లాఠీలను అందుకున్నారు గార్డులు.

యూసఫ్‌ఆలీ, ఖలీల్‌పాషాలకు ఇరువైపులా నిలబడి....ఎత్తిన లాఠీలను దించకుండా బాదటం ప్రారంభించారు ఆ ఇద్దర్నీ.

గొంతు తెగిన మేకల్లా కేకలు వేస్తున్న ఆ ఇద్దరి కేకలతో దద్దరిల్లిపోయింది ఆ గది. అరవటం తప్ప నోరు తెరిచి ఒక్క మాటకూడా మాట్లాడకపోవటంతో గార్డ్‌లలో ఓపిక నశించింది.

ఆ వెంటనే లాఠీలు పారేసి మరో పద్ధతిలో దారుణంగా హింసించారు ఆ ఇద్దర్నీ.

నేలమీద పడుకోబెట్టి, లాఠీలను వాళ్ళ తొడలమీద ఆనించి వాటిపైకి ఎక్కి కూర్చున్నారు. ఇంకా రకరకాలుగా హింసించారు.

చివరికి థర్డ్ డిగ్రీ ప్రయోగించినా ప్రయోజనం లేకపోవటంతో అలసిపోయిన గార్డులు నిస్సహాయంగా చూసారు హబీబ్ ముఖంలోకి.

"ఆల్‌రైట్! ఇవాల్టికి ఇది చాలు! కాస్త రెస్ట్ ఇచ్చి మళ్ళీ మొదలు పెట్టవచ్చు" అంటూ పక్కకి తిరిగి శ్యామ్‌సుందర్ వంక చూశాడు హబీబ్.

అసహనం నిండిన మనసుతో చిన్నగా తలాడిస్తూ అతనితోపాటు బయటికివచ్చి హాల్లోవున్న సోఫాలో కూర్చున్నాడు శ్యామ్‌సుందర్.

సిగరెట్ వెలిగించి దమ్ములాగుతూ హబీబ్ ముఖంలోకి చూసాడు.

"వాళ్ళు ఆరితేరిన రౌడీలు! అవసరం అయితే ప్రాణాలు తీయటానికి వెనుకాడని కసాయి హంతకులు. అంత సులువుగా నిజం చెబుతారని నాకు అనిపించటంలేదు" అన్నాడు హబీబ్.

"మీరు కాసేపు ప్రయత్నించండి" అన్నాడు శ్యామ్‌సుందర్.

"నో...మిస్టర్ శ్యామ్‌సుందర్! ఇంతకుమించి టార్చర్‌ని కంటిన్యూ చేస్తే వారి ప్రాణాలుపోయే ప్రమాదం వుంది. మనం తొందరపడకూడదు. వాళ్ళనోళ్ళు తెరిపించటానికి కొంత టైం పట్టవచ్చు" అన్నాడు హబీబ్.

అంతలో అతని కోటుజేబులో వున్న సెల్‌ఫోన్ మ్రోగటం ప్రారంభించింది. దానిని బయటికితీసి చెవి దగ్గర పెట్టుకున్నాడు హబీబ్.

అవతలివైపునుండి వినిపించిన కంఠం వింటూనే కాంతివంతమయింది అతని వదనం. చెప్పలేనంత సంతోషంతో వెలిగిపోయింది.

"హలో వాత్సవ సార్! మీరా? ఎక్కడ్నించి మాట్లాడేది?" అనడిగాడు హుషారుగా.

వాత్సవ పేరు వింటూనే కూర్చున్న సోఫాలో ఇబ్బందిగా కదిలాడు శ్యామ్‌సుందర్. హెడ్‌క్వార్టర్స్ వదిలినప్పటినుండి ఒకసారి కూడా ఫోన్ చేయనందుకు చివాట్లు తినాల్సివస్తుందని చీకాకు పడిపోయాడు.

"బంగ్లా బయటనుంచా? మా గార్డ్‌లు మిమ్మల్ని లోపలికి రానీయటం లేదా?" అంటూ ఒక చూపుతోనే శ్యామ్‌సుందర్‌కి విషయాన్నంతా తెలియచేసి గబగబా బయటికి నడిచాడు హబీబ్.

తన వంటిమీద గాయాలు వాత్సవ కంటపడకుండా దాచుకోవటం ఎలాగా అని ఆలోచిస్తూ అతన్ని అనుసరించాడు శ్యామ్‌సుందర్.

సిగరెట్ కాలుస్తూ బంగ్లా మెయిన్‌గేటు దగ్గిర నిలబడి వున్నాడు వాత్సవ. చిరునవ్వుతో విష్‌చేసిన హబీబ్‌కి చేయి అందించి కరచాలనంచేస్తూ శ్యామ్‌సుందర్‌ని చూసి పలకరింపుగా నవ్వాడు.

"కమాన్ వాత్సవ! సారీ! మీరెవరో తెలీకపోవటంవల్ల మా గార్డ్స్ గేటు దగ్గరే నిలబెట్టేసారు. అయాం సారీ!" అన్నాడు హబీబ్.

"టేకిట్ ఈజీ! డ్యూటీ సక్రమంగా చేయలేనివాళ్ళు చాలామంది వున్నారు మన దేశంలో ....మీ గార్డ్‌లు చేసినదాంట్లో పొరపాటులేదు" అంటూ అతన్ని అనుసరించాడు.

వాత్సవ పలకరింపుతో తను కలవరపడవలసిందేమీ లేదని సంతోషి ంచాడు శ్యామ్‌సుందర్. మాటలద్వారా చురక అంటించి నందుకు ముఖం మాడ్చుకుంటూ ఆ ఇద్దరితోపాటు హాల్లోకి వచ్చి కూర్చున్నాడు.

వాత్సవ సార్! అసలు జరిగిందేమిటంటే....'' అంటూ ఏదో చెప్పబోతున్న" హబీబ్‌ను వారిస్తూ సిగరెట్ వెలిగించుకున్నాడు వాత్సవ.

"జియావుద్దీన్ భవంతిమీద దాడి జరిగిన తరువాత ఫాక్స్ ద్వారా పంపిన వివరాలను హోంమినిస్టర్‌గారు నాకు అందించారు. మళ్ళీ వాటిని రిపీట్ చేయాల్సిన అవసరంలేదు. లోపలవున్న రౌడీ చిలకలను గురించి చెప్పండి" అన్నాడు.

"చెప్పటానికేముంది...అడగవలసిన పద్ధతిలో అడిగాం. ప్రాణాలు తీయటం మినహా చేయవలసిన టార్చర్ అంతా చేసాం. బట్....నో యూజ్!

వాళ్ళచేత ఒక్కనిజాన్ని కూడా బయటపెట్టించలేకపోయాం" హబీబ్ చెప్పకముందే కల్పించుకుని వివరాలు అందించాడు శ్యామ్సుందర్.

సిగరెట్ పొగను గాలిలోకి వదులుతూ చిన్నగా తలాడించాడు వాత్సవ.

"మీకు అభ్యంతరం లేకపోతే నేను ఒకసారి ప్రయత్నిస్తాను" అన్నాడు.

"వైనాట్! కమాన్!" అంటూ ఉత్సాహంగా లేచి నిలుచున్నాడు హబీబ్.

టార్చర్ కంటిన్యూ చేస్తే వారి ప్రాణాలు పోతాయి అన్న హబీబ్, వాత్సవ అడగ్గానే అంగీకరించినందుకు విసుగ్గా చూశాడు శ్యామ్సుందర్. నిజం చెప్పించకపోతే వాత్సవ సామర్థ్యంమీద కూడా అతనికి తేలికభావం ఏర్పడవచ్చునని కలత చెందాడు.

"అన్ని పద్ధతులూ ప్రయోగించామని చెప్పానుకదా! మళ్ళీ నువ్వు పనిగట్టుకుని ప్రయత్నించటం దేనికి?" అతని పక్కకి వస్తూ మెల్లగా గొణిగాడు.

సమాధానం చెప్పలేదు వాత్సవ. అసలు అతని గొణుగుడు తన చెవిన పడనట్టే నటిస్తూ హబీబ్ను అనుసరించాడు.

గాఢంగా నిట్టూరుస్తూ అతని వెనక గదిలోకి అడుగు పెట్టాడు శ్యామ్ సుందర్...."వీళ్ళే నువ్వడిగిన రౌడీ చిలకలు!" అంటూ యూసఫ్ ఆలీ, ఖలీల్పాషాలను చూపించాడు.

చిన్నగా తలవూపుతూ, ఆ ఇద్దరికేసి పరిశీలనగా చూశాడు వాత్సవ.

రక్తం చెమర్చుతున్న గాయాలతో, చెమటలతో తడిసిపోయిన శరీరాలతో అప్పటికే అసహ్యంగా తయారయివుంది వారి పరిస్థితి. తీవ్రంగా హింసించ బడినట్టు తెలుస్తుంది.

అయినా పట్టుదల స్పష్టంగా కనిపిస్తున్నది వారి కళ్ళల్లో. నిర్లక్ష్యం తిష్ట వేసుకుని కూర్చుంది వారి వదనాలలో.

"మమ్మల్ని హింసించటానికి మరో కొత్తమనిషిని తీసుకువచ్చారా? యితనేం పీకుతాడట?" వంటిమీది గాయాల బాధను లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా అన్నాడు యూసఫ్ ఆలీ.

"యూ బ్లడీ యిడియట్! నువ్వు మాట్లాడుతున్నది ఎవరితోనో తెలుసుకో. నీలాంటి కిరాతక రౌడీలకు సింహస్వప్నం అయిన వాత్సవగారు ఇప్పుడు మీ

ముందున్నారని మరిచిపోకు" అంటూ పిడికిళ్ళు బిగించి ఆ ఇద్దరినీ కొట్టేందుకు ముందుకు వెళ్ళబోయాడు హబీబ్.

వెంటనే అతన్ని అడ్డుకున్నాడు వాత్సవ...చిరునవ్వు నవ్వుతూ వెనక్కి రమ్మని సైగ చేశాడు.

వాత్సవ పేరు వినగానే నిజంగానే జల్లుమన్నాయి వారి గుండెలు...ఒక సందర్భంలో అతని గురించి నకిలీ జియావుద్దీన్ చెప్పిన మాటలు గుర్తు వచ్చేసరికి ఎండుకుపోయాయి వారి గొంతులు.

అయినా భయం ముఖాలలో కనిపించకుండా జాగ్రత్తపడుతూ నిబ్బరంగా వుండటానికి ప్రయత్నించారు. అతను ఎన్ని విధాల హింసించినా ఎప్పటిలా మొండివైఖరినే అవలంభించాలని గట్టిగా నిర్ణయించుకున్నారు.

ప్రపంచంలో ఇటువంటి మొండివాళ్ళను నేనెక్కడా చూడలేదు వాత్సవ సార్! అరుదుగా ప్రయోగించే థర్డ్ డిగ్రీ కూడా వీరి విషయంలో వృధా అయింది...ఈ దుర్మార్గులను చంపటంతప్ప మనం చేయగలిగింది ఏమీలేదని అనిపిస్తున్నది" అన్నాడు హబీబ్.

అతని అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్టు చిన్నగా తలాడించాడు వాత్సవ.

"యూ ఆర్ కరెక్ట్! వీళ్ళను చూస్తుంటే మొండివాళ్ళకే మొండివాళ్ళలా కనిపిస్తున్నారు. హింసించటం వేస్ట్" అన్నాడు.

ఆశ్చర్యంగా చూశాడు అతని ముఖంలోకి శ్యామ్‌సుందర్. వాత్సవ లాంటి శక్తిసామర్ధ్యాలు కలవాడు కూడా తమనుండి నిజాలు రాబట్టడం అసంభవం అని ప్రకటించేసరికి తేలికపడ్డాయి యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషా మనసులు.

"అయితే మనం చేయగలిగే పనులు రెండే రెండు వున్నాయి మిస్టర్ వాత్సవ! ఒకటి చట్టప్రకారం వీళ్ళను కోర్టులో హాజరుపరచటం, లేదా మనమే కాల్చి చంపేయటం!" అన్నాడు హబీబ్.

"చంపటమే బెటర్! అది కూడా గిలగిలా తన్నుకు చచ్చేలా చేయగలిగితే మరీ మంచిది" తన అభిప్రాయాన్ని వెల్లడించాడు వాత్సవ.

ఉలికిపడ్డాడు శ్యామ్‌సుందర్. వినకూడని మాటలు వాత్సవ నోటివెంట వచ్చేసరికి ఆశ్చర్యానికి గురిఅయినాడు అతను.

పరిపరి విధాలా పరుగులు దీయటం ప్రారంభించాయి శ్యామ్‌సుందర్ ఆలోచనలు. అలా అనటంలో వాత్సవ ఉద్దేశం ఏమిటో కొంచెం కూడా అంతుచిక్కలేదు.

అదృశ్యం అయిపోయిన ఆపరేషన్ టు ఇన్ ఒన్ సూత్రధారుల పాత్రధారుల ఆచూకీ చెప్పగలవాళ్ళు ఆ యిద్దరే... ఏమయ్యారో తెలియని చాందినీ, నసీమా, బల్బీర్‌లను గురించి చెప్పగలవాళ్ళు వాళ్ళే.

వాళ్ళను చంపేస్తే కథ కంచికి వెళ్ళకుండా ఆగిపోతుంది. వ్యవహారం మళ్ళీ మొదటికి వస్తుంది. వాత్సవలాంటి వాడు అంతదూరం ఆలోచించలేదని ఎలా అనుకోవటం? అతను నిజంగా చంపదలిస్తే ఎలా అడ్డుకోవటం?

అస్తవ్యస్తమయిన ఆలోచనలను ఒక ఆర్డర్‌లో పెట్టటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు శ్యామ్‌సుందర్. వాత్సవ ఉద్దేశం ఏమిటో పూర్తిగా బయట పడేంతవరకూ ఓపికపట్టి, మౌనంగా వుండాలని నిశ్చయించుకున్నాడు.

ఓరకంట అతని భావాలను గమనించి తనలో తానే నవ్వుకుంటూ ఆ ఇద్దరికీ మరింత దగ్గిరగా వెళ్ళాడు వాత్సవ. "హింసించటం నాకు చేత కాదు! అలాగని మీలాంటి దేశద్రోహులను ప్రాణాలతో వదిలిపెట్టడం కుదరదు. మీకు ఒకే ఒక అవకాశం ఇవ్వాలని నాకు అనిపిస్తోంది!" అంటూ కోటుజేబులోంచి ఎర్రగా వున్న రెండు టాబ్లెట్స్‌ని, తెల్లగా వున్న మరో రెండు టాబ్లెట్స్‌ని బయటికి తీశాడు.

వాటివంక వింతగా చూశారు యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషాలు.... అవేమిటో అర్థంగాక ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

వారికే కాదు, హబీబ్, శ్యామ్‌సుందర్‌లకు కూడా అర్థంకాలేదు ఆ టాబ్‌లెట్స్ ఏమిటన్నవి. వాటి వుపయోగం ఏమిటో కొంచెం కూడా తెలియలేదు.

"వెల్...మైడియర్ ఫ్రండ్స్! మీ బ్రతుకులను మీరే నిర్ణయించుకోటానికి ఒక అవకాశం ఇవ్వదలచానని నేను అన్నమాట అబద్దంకాదు. ఈ ఎరుపురంగు టాబ్‌లెట్ ఆఫ్రికన్ అడవులలో సంచరించే ఒక భయంకరమయిన సర్పం తాలూకు విషంతో తయారుచేయబడింది. ఇది గొంతులోంచి కడుపులోకి జారిన

మరుక్షణంలోనే దాని ప్రభావం చూపించటము మొదలుపెడుతుంది. మింగిన వారికి ప్రత్యక్ష నరకం చూపిస్తూ, పదే పది నిముషాలలో ప్రాణాలను హరిస్తుంది. ఇక ఈ వైట్ టాబ్‌లెట్స్ రెడ్ టాబ్‌లెట్స్‌లోని విషానికి విరుగుడన్నమాట. ఎర్ర టాబ్‌లెట్ మింగినవాళ్ళు పదినిముషాలు గడిచేలోగా తెల్ల టాబ్లెట్ మింగితే ప్రాణాపాయం నుండి గ్యారంటీగా బయటపడతారు. సో...మొండివాళ్ళకే మొండివాళ్ళయిన మీరు చావాలో, బ్రతకాలో నిర్ణయించుకోటానికి మీకు వున్న వ్యవధి పది నిముషాలన్నమాట!" అంటూ అక్కడున్న గార్డ్‌లవంక చూసి నీళ్ళు తెమ్మన్నట్టు సైగ చేశాడు వాత్సవ.

ఎప్పుడూ అతితక్కువగా మాట్లాడే మితభాషి అయిన వాత్సవ ఆ టాబ్లెట్స్ గురించి అంత సుదీర్ఘ వివరణ ఎందుకు ఇచ్చాడో అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తూ యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషా ముఖాలలోకి చూశాడు శ్యామ్‌సుందర్. వాత్సవ ఆ లైఫ్ అండ్ డెత్ గేమ్ ఎందుకు ప్రారంభిస్తున్నాడో తనకూ అర్థం కాలేదన్నట్లు పెదవి విరిచాడు హబీబ్.

వాళ్ళ సంగతి ఎలా వున్నా, వాత్సవ వివరణ వింటూనే ఠారెత్తిపోయింది ఆ యిద్దరికీ. కొట్టకుండా, తిట్టకుండా ప్రాణాలకే ఎసరు పెట్ట ప్రయత్నిస్తున్న అతను ఎంతటి ప్రమాదకరమయినవాడో అప్పుడు పూర్తిగా అర్థం అయింది వారికి.

"అన్యాయం....అధర్మం...మా ప్రాణాలు తీసే అధికారం మీకు లేదు!" అంటూ అరిచాడు యూసఫ్ ఈలీ.

ఆ మాట కూడా అనటానికి ధైర్యం చాలనట్టు బలవంతంగా గుటకలు మింగాడు ఖలీల్‌పాషా.

యూసఫ్ ఆలీ మాటలకు అదోలా నవ్వాడు వాత్సవ.

"న్యాయం, ధర్మం ఆలోచిస్తూ కూర్చుంటే పనులు జరగవు మిస్టర్ ఆలీ! ఈ రోజులలో ఎవరి యిష్టం వాళ్ళది!" అంటూ గార్డ్‌లవంక చూశాడు.

వెంటనే యూసఫ్ ఆలీ వెనక నిలబడి అతని తలను బలంగా వెనక్కి వంచాడు ఒక గార్డ్. రెండో గార్డ్ అతని నోటిని బలవంతంగా తెరిచి, లాటీని అడ్డం పెట్టాడు పళ్ళ మధ్య.

ఎర్ర టాబ్లెట్‌ను అతని నోట్లో వేశాడు వాత్సవ. దానిని అతను మింగేటంత వరకూ నోట్లో నీళ్ళుపోస్తూ, అతని ముక్కు గట్టిగా నొక్కి పట్టుకున్నాడు.

ఊపిరి ఆడక వుక్కిరిబిక్కిరి అయిపోయాడు యూసఫ్ ఆలీ. నోట్లో నీటిని బయటికి వూసే అవకాశం లేక బలవంతంగా గుటకలు వేసాడు.

నీళ్ళతోపాటే టాబ్లెట్ అతని గొంతులోకి పోయింది. వరుసగా నాలుగు గుటకలు వేసేసరికి గొంతులోంచి కడుపులోకి జారిపోయింది.

మరో రెండు నిముషాలు ఆగి అతని తలను వదిలేసాడు మొదటి గార్డు. నోటికి అడ్డం పెట్టిన లాటీని తీసేసి వెనక్కి జరిగాడు రెండో గార్డు.

"ఇప్పుడు నీ టైం ప్రారంభమయింది. చావో, బ్రతుకో తేల్చుకోవాల్సి వుంది. పది నిముషాలు గడవకముందే నిజం చెబితే ఈ తెల్లటాబ్లెట్ నీ నోట్లో వేసి నిన్ను రక్షిస్తాను! లేదంటే పది నిముషాల తరువాత నీ శవానికి శ్రద్ధాంజలి ఘటిస్తాను."

ప్రాణభయంతో నల్లగా కమిలిపోయిన యూసఫ్ ఆలీ ముఖంలోకి చూసి అనౌన్స్‌చేసి, రిస్ట్‌వాచ్‌లో టైం నోట్ చేయటం ప్రారంభించాడు వాత్సవ.

ఏదో అనబోతున్న యూసఫ్ ఆలీ శరీరం మీద తన ప్రభావాన్ని చూపించడం ప్రారంభించింది అతని కడుపులోకి పోయిన ఎర్రటాబ్లెట్. అదోరకమయిన అలజడిని సృష్టించింది అతని కడుపులో.

ప్రేగులు తెగిపోతున్నట్టు మొదలయింది విపరీతమయిన పెయిన్. కళ్ళల్లో ప్రాణభయం కొట్టొచ్చినట్టు ప్రత్యక్షం అయింది.

ఊపిరి పీల్చుకోవటం కష్టం అయిపోతోంది యూసఫ్ ఆలీకి....గుండెలు ఒక్కసారిగా బరువెక్కుతున్నట్టు అన్పిస్తోంది.

"టూ మినిట్స్ ఓవర్!" ఉన్నట్టుండి అనౌన్స్ చేసాడు వాత్సవ.

విపరీతమయిన బాధతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాడు యూసఫ్ ఆలీ. అతన్ని చూసి గజగజ వణికిపోతున్నాడు ఖలీల్‌పాషా.

అందరూ టెన్షన్‌గా అతన్నే చూస్తున్నారు.

శ్యామ్‌సుందర్‌కి తెలుసు అటువంటి టెన్షన్ క్రియేట్ చేయటానికే వాత్సవ టాబ్లెట్స్‌ని ఉపయోగించాడని, దాని ఫలితం మరికొంతసేపటిలో బయటపడు తుందని కూడా అతను గ్రహించాడు.

“ఫోర్ మినిట్స్ ఓవర్! కోటు జేబులోంచి తెల్ల టాబ్లెట్ తీసి, యూసఫ్ ఆలీకి కనిపించేలా అరచేతిలో పెట్టుకుంటూ అన్నాడు వాత్సవ.

వేగంగా కొట్టుకుంటున్న హార్ట్‌బీట్‌ను అదుపులో వుంచుకోటానికి ప్రయత్నిస్తూ, తలత్రిప్పి యూసఫ్ ఆలీ ముఖంలోకి చూసి అదిరిపడ్డాడు ఖలీల్‌పాషా. తన వూపిరి స్థంభించిపోతున్నట్టు అనుభూతి చెందాడు.

రక్తం చిమ్ముతున్నట్టు ఎర్రగా కందిపోయింది యూసఫ్ ఆలీ వదనం...తెల్లటి నురుగులు నోటివెంట తన్నుకురావటం కూడా మొదలు అయింది.

“టాబ్లెట్...టాబ్లెట్! నా ప్రాణాలు కడబట్టిపోతున్నాయి. తెల్ల టాబ్లెట్ ఇవ్వండి!”

కుర్చీకి కట్టివేయబడిన కారణంగా కదిలేందుకు వీలులేక వికవికలాడుతూ గొంతుచించుకుని అరిచాడు యూసఫ్ ఆలీ.

సమాధానం చెప్పలేదు వాత్సవ. చేతిలోని టాబ్లెట్‌ను అతనికి ఇవ్వకుండా అలాగే పట్టుకుని రిస్ట్‌వాచ్‌లోకి చూస్తూ– “ఫోర్ మినిట్స్ మోర్! ఇంకా నాలుగే నిముషాల వ్యవధి వుంది. ఆ తరువాత అరసెకను గడిచినా తెల్ల టాబ్లెట్‌వల్ల ప్రయోజనం వుండదు” అన్నాడు.

నోటిలోంచి తన్నుకు వస్తున్న తెల్లటి నురుగలు ఉధృతం అయ్యే సరికి మొండితనం ప్రదర్శించటం సాధ్యంకాలేదు యూసఫ్ ఆలీకి. బ్రతుకు మీద ఆశ చావలేదు.

"చెబుతాను! నిజం చెప్పేస్తాను! మీకు కావాల్సిన వివరాలన్నీ అందిస్తాను. టాబ్లెట్ ఇవ్వండి ప్లీజ్!" అరవటం మాని, ఆందోళన నిండిన కంఠంతో అర్థించాడు యూసఫ్ ఆలీ.

"త్రీ మినిట్స్ మోర్!" అన్నాడు వాత్సవ గంభీరంగా.

ఆ మరుక్షణమే ఊడిపోయింది యూసఫ్ ఆలీ అంతవరకూ నోటికి వేసుకున్న తాళం.

"జై శల్మీర్ పట్టణంలో వున్నారు ఆయేషాబేగం, రియాజ్‌ఖాన్, సమీరుద్దీన్‌లు.... పట్టణపు సరిహద్దులకు పది కిలోమీటర్ల దూరంలో పీఠ భూముల్ని ఆనుకుని వున్న ఒక పురాతన కోటలాంటి కట్టడంలో స్థావరం ఏర్పరుచుకున్నారు వాళ్ళు. ఎంతో అవసరం అయితే తప్ప అన్యులను ఆ స్థావరంలోకి అడుగుపెట్టనివ్వరు. నసీమా, ఆమె కొడుకుతోపాటు ఇక్కడ బంధించినవాళ్ళనందర్నీ అక్కడికి తీసుకుపోయారు" అంటూ ఆన్‌చేసిన టేప్‌రికార్డర్‌లా ఆపకుండా చేప్పేశాడు.

నిముషాలు లెక్కపెట్టడం ఆపి, ఖలీల్‌పాషా వంక చూసాడు వాత్సవ.

"అతను చెప్పిందంతా అక్షరాలా నిజం! అందులో ఆవగింజంత కూడా అబద్ధం లేదు" అంటూ సర్టిఫై చేసాడు ఖలీల్‌పాషా.

"నా ప్రాణాలు కడగట్టిపోతున్నాయి...టాబ్లెట్ ఇవ్వండి...నన్ను రక్షించండి..." సమయం దగ్గర పడుతుండేసరికి మరింత ప్రాణభయంతో అడిగాడు యూసఫ్ ఆలీ.

చిన్నగా నవ్వాడు వాత్సవ.

చేతిలోని టాబ్లెట్ అతనికి ఇవ్వకుండా కోటు జేబులో వేసుకుని అతని దగ్గరికి వెళ్ళాడు.

"డోంట్‌వర్రీ మై ఫ్రెండ్! నువ్వు మింగిన టాబ్లెట్ ప్రాణాలు తీయదు. పది నిముషాలపాటు ప్రాణాలు తీసేటంత హడావుడి చేస్తుంది. ఆ తరువాత పరిస్థితిని మామూలు స్థితికి తెస్తుంది" అన్నాడు.

శ్యామ్‌సుందర్ తప్ప మిగతావారందరూ తెల్లబోయారు అతని మాటలకు.

వాత్సవ మాటలు అసత్యం కాదని నిరూపిస్తున్నట్టు చూస్తుండగానే తగ్గిపోయింది అంతవరకూ యూసఫ్ ఆలీ పడిన అవస్థ. ప్రేగులు తెగిపోయేట్టు మొదలయిన పెయిన్ కూడా దానంతట అదే తగ్గిపోయింది. నోటి నుండి నురుగలు రావటం ఆగిపోయి యధాస్థితికి వచ్చింది అతని శరీరం.

"మైగాడ్! ఆ టాబ్లెట్ ప్రాణాలు తీసే పాయిజన్ టాబ్లెట్ కాదూ?" ఆశ్చర్యాన్ని అదుపుచేసుకోలేక అవస్థపడుతూ పెద్దగా అన్నాడు హబీబ్.

"కాదు మిస్టర్ హబీబ్! ఆ టాబ్లెట్‌కి అటువంటి శక్తిలేదు. చైనా దేశంలోని జానపద కళాకారులు స్టేజ్ ప్రదర్శనలు ఇచ్చేటప్పుడు నటనలో సహజత్వం కోసం ఉపయోగించటం కోసం ప్రత్యేకంగా తయారుచేయబడిన టాబ్లెట్స్. అవి కడుపులోకి వెళ్ళిన తరువాత పది నిముషాలపాటు నిజంగానే ప్రాణాలు హరించేటంత హడావుడి చేస్తాయి" అని నవ్వుతూ చెప్పాడు వాత్సవ.

వింటూనే థ్రిల్ ఫీలయ్యాడు హబీబ్.

"ఎక్సలెంట్! మీ తెలివితేటలు అమోఘం. కొట్టకుండా, నెత్తురు కళ్ళచూడకుండా ఈ రౌడీ చిలకచేత నిజాలను పలికించిన మీ ప్రతిభకు హేట్సాఫ్ మిస్టర్ వాత్సవా!" అంటూ అతన్ని పొగడ్తలతో ముంచెత్తటం ప్రారంభించాడు.

"అన్యాయం...మోసం...దారుణమయిన వంచన. నీలాంటి దుర్మార్గుడ్ని ఈ దేశంలో నేను ఎక్కడా చూడలేదు" అంటూ పిచ్చిపట్టినట్టు అరవటం ప్రారంభించాడు యూసఫ్ ఆలీ.

అతని అరుపులను లెక్కచేయకుండా శ్యామ్‌సుందర్‌కి సైగలుచేసి ఆ గదిలోంచి బయటికి నడిచాడు వాత్సవ.

అతన్ని అనుసరించాడు హబీబ్.

పాడిందే పాటరా అన్నట్టు హింసించటంలో ఇంకా పాత పద్ధతులనే పట్టుకుని వ్రేలాడుతున్న పోలీస్ డిపార్ట్‌మెంట్....అర్జంట్‌గా కొత్త పద్ధతిని ప్రవేశపెడితే ఎలా వుంటుందో అంచనా వేయటానికి ప్రయత్నిస్తూ గదిలోంచి బయటికి వచ్చేసారు గార్డులు. తలుపులు మూసి లాక్ చేసారు.

# 17

"**ఎప్పటికప్పుడు** వాసంతికి ఫోన్ చేయాలనే అనుకున్నాను. నువ్వు సింగపూర్ నుండి వచ్చావో లేదో తెలుసుకోవాలని కూడా అనుకున్నాను. విశ్రాంతి తీసుకునే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా వెంటపడి తరుముతున్న రౌడీల బారినుండి తప్పించుకోటానికే సరిపోతుంది సమయం అంతా. ఇక ఫోన్ చేయటానికి తీరిక ఏది?"

మరోసారి చురక వేయించుకోవటం ఇష్టంలేనట్టు ఆ గదిలోంచి బయటపడి హాల్లోకి వచ్చి కూర్చోగానే వాత్సవను వుద్దేశించి అన్నాడు శ్యామ్‌సుందర్.

సమాధానం చెప్పలేదు వాత్సవ. సిగరెట్ వెలిగించుకుంటూ హబీబ్ ముఖంలోకి చూసాడు.

"వాళ్ళతో అవసరం లేదనుకుంటాను. ఆ ఇద్దర్నీ తీసుకుపోయి పోలీసులకి అప్పగించమంటారా?" అని అడిగాడు వాత్సవ నుద్దేశించి.

యస్ ఆర్ నో చెప్పలేదు వాత్సవ. మీ ఇష్టం అని బాధ్యతనంతా నెత్తిమీద వేయలేదు.

"ఇక మేము బయలుదేరతాం...రేపు ఉదయం పదిగంటలకల్లా ఒక కారు రెడీచేసి మేము బసచేసిన లాడ్జి దగ్గరికి పంపండి..." అంటూ లేచి శ్యామ్‌సుందర్‌తోపాటు బయటికి నడిచాడు.

ఆశ్చర్యపడ్డాడు హబీబ్.

తను అడిగిన ప్రశ్న వాత్సవకి వినిపించలేదా? లేక సమాధానం చెప్పటం యిష్టంలేదా? ఏ సంగతీ చెప్పకుండా వెళ్ళటంలో ఏమిటి అతని ఉద్దేశ్యం? అనుకున్నాడు.

అతను అనుకుంటుండగా వెనుదిరిగి వచ్చాడు శ్యామ్‌సుందర్. ముఖం ముడుచుకుని నిలబడివున్న హబీబ్ వంక చూసి చిన్నగా నవ్వాడు.

"నువ్వు అడిగినదానికి సమాధానం చెప్పనందుకు ఏమీ అనుకోవద్దన్నాడు వాత్సవ. యూసఫ్ ఆలీ, ఖలీల్‌పాషాల వంటి దేశద్రోహులను చంపమని చెప్పటం యిష్టం వుండదట. ఎన్‌కౌంటర్‌లో హతమార్చటం అసలు నచ్చదట. నువ్వు అలాంటిదేదయినా చేస్తావేమోనని తెగ ఫీలయిపోతున్నాడు అతను" అంటూ అతని సమాధానంకోసం ఎదురుచూడకుండా వెనుదిరిగి అవతలికి వెళ్ళిపోయాడు శ్యామ్‌సుందర్.

"దేశద్రోహుల్ని ఎన్‌కౌంటర్‌లో చంపటం వాత్సవకి అసలు నచ్చదట' శ్యామ్‌సుందర్ చెప్పిన ఆ మాటలు తలుచుకోగానే క్రూరమయిన చిరునవ్వు ప్రత్యక్షం అయింది హబీబ్ పెదవులమీద.

"నా కర్తవ్యాన్ని చక్కగా గుర్తుచేసినందుకు నీకు నా కృతజ్ఞతలు మిస్టర్ వాత్సవా! నీకు అసలు నచ్చని పనిని వెంటనే పూర్తిచేస్తాను" అని వాత్సవ నుద్దేశించి తనలో తానే అనుకుంటూ సోఫాలో కూర్చుని గార్డ్‌లను పిలిచి గదిలో బంధించబడిన యిద్దర్నీ తన దగ్గరికి తీసుకురమ్మని చెప్పాడు హబీబ్.

గార్డులు వెళ్ళి ఆ యిద్దర్నీ స్టెన్‌గన్‌తో కవర్‌చేస్తూ తీసుకువచ్చారు అక్కడికి.

"వెల్ మిస్టర్ యూసఫ్ ఆలీ....అండ్ మిస్టర్ ఖలీల్‌పాషా! నిజం చెప్పి నందుకు మిమ్మల్ని ప్రాణాలతో వదిలేయమని వాత్సవ సలహా యిచ్చాడు నాకు. ఇష్టం లేకపోయినా వాత్సవ చెప్పినట్లు వినక తప్పదు నాకు. కమాన్ మూవ్..." అంటూ లేచి ఆ యిద్దరితోపాటు బంగ్లా మెయిన్ గేటు దగ్గరికి వచ్చాడు హబీబ్.

తమను నానా చిత్రహింసలు పెట్టినవాడు పోలీసులకు అప్పగించకుండా తమని ప్రాణాలతో వదిలివేయటం ఆశ్చర్యాన్ని కలిగించింది ఆ యిద్దరికి. అందులో ఏదో కిరికిరి వుందని అనుమానం కూడా వచ్చింది.

"ఏమిటలా చూస్తున్నారు....? ఆడినమాట తప్పటం అలవాటులేదు నాకు. వెళ్ళండి... మా గార్డుల గురికి అందకుండా పారిపోండి. ఇంకా ఇక్కడే వుంటే కాల్చి చంపేస్తారు వాళ్ళు. కమాన్...హరియప్..." అంటూ ఆ యిద్దరి వెన్నులమీద బలంగా చరిచాడు హబీబ్.

ముందుకు తూలి పడబోతూ తమను తాము నిల(దొక్కుకున్నారు ఆ యిద్దరూ. ఒక్క క్షణం హబీబ్ ముఖంలోకి చూసి పరుగుదీయటం (ప్రారంభించారు.

"లుక్! టార్గెట్‌ని చేధించటంలో మీ గురికి ఒక పరీక్ష.... కానీయండి... టార్గెట్స్ మీ కళ్ళముందే పరుగులు తీస్తున్నాయి."

శక్తివంతమయిన సూపర్‌షాట్ గన్స్ పుచ్చుకుని గేటు ముందు నిలబడిన గార్డుల నుద్దేశించి అన్నాడు హబీబ్. ఆ మాటలలోనే తన ఉద్దేశం ఏమిటో వారికి చెప్పకనే చెప్పాడు.

అర్థం చేసుకున్నారు గార్డులు. ఆ వెంటనే షాట్ గన్స్‌ని పారిపోతున్న వారివైపు ఎత్తిపెట్టుకుని గురిచూడటం (ప్రారంభించారు.

వారి ఎయిమ్‌కి అందకుండా పోవాలని (ప్రయత్నిస్తూ అడ్డదిడ్డంగా పరుగులు దీస్తున్నారు ఆ యిద్దరూ. ఆ వీధి మలుపు తిరిగి సురక్షితమయిన (ప్రదేశాలను చేరుకోవాలని ఒకరితో ఒకరు పోటీపడుతున్నారు.

ధన్...ధన్....ఒకదాని తరువాత ఒకటి నిప్పులు కక్కాయి సూపర్ షాట్ గన్స్.

సెక్యూరిటీ ఇవ్వటంలో (ప్రత్యేకమయిన శిక్షణ పొందిన ఆ గార్డుల గురితప్పలేదు. సూటిగాపోయి ఆ యిద్దరి వెన్నుల్లో చొచ్చుకుపోయాయి బుల్లెట్‌లు.

చెవులు చిల్లులు పడేటట్లు ఆర్తనాదాలను వెలువరిస్తూ బోర్లాపడిపోయారు ఆ యిద్దరూ. కాళ్ళూ, చేతులు నేలకేసి బాదుకుంటూ (ప్రాణాలు వదిలేశారు.

గార్డుల ఇద్దరివైపు మెచ్చుకోలుగా చూశాడు హబీబ్. ఆ యిద్దరి శవాలను లాక్కురమ్మని ఆదేశించి సిగరెట్ వెలిగించుకుంటూ బంగ్లాలోకి వెళ్ళిపోయాడు.

* * * * *

"అంతదూరం కారులో (ప్రయాణించే బదులు ఎంచక్కా ఏ (ట్రైన్ లోనో, హెలికాప్టర్‌లోనో వెళితే బాగుంటుంది కదా!"

ఉదయం పదిగంటలకు హబీబ్ అరేంజ్ చేసిన కారులో (ప్రయాణానికి

సిద్ధపడుతూ అన్నాడు శ్యామ్‌సుందర్.

"ప్లాట్‌ఫారం మీద తిరిగే ప్రయాణీకుల్ని గాభరాపెట్టి పరుగులుదీయించే సంఘటనలు జరగవని గ్యారంటీ యిస్తే నీ యిష్టప్రకారమే ట్రైన్‌లో వెళదాం" అన్నాడు వాత్సవ.

గతుక్కుమన్నాడు శ్యామ్‌సుందర్. నోరు తెరిచి దొరికిపోయినందుకు తనను తానే నిందించుకుంటూ మౌనంగా వుండిపోయాడు.

హబీబ్ తీసుకువచ్చిన ఆరంజ్ కలర్ మారుతీని ఒకటికి నాలుగు సార్లు పరిశీలించాడు వాత్సవ. డిక్కీలో స్పేర్ ఆయిల్ నింపివుంచటం గమనించి ప్రశ్నార్థకంగా చూశాడు హబీబ్ ముఖంలోకి.

"జైశల్మీర్‌కి వెళ్ళే హైవేలో చాలా పెట్రోల్‌బంక్‌లున్నాయి. అయినా ఎందుకయినా మంచిదని స్పేర్ టిన్స్‌లో ఆయిల్ అరేంజ్ చేశాను మిస్టర్ వాత్సవా!"

"థాంక్యూ మిస్టర్ హబీబ్...!" అంటూ అతనితో కరచాలనం చేశాడు వాత్సవ.

శ్యామ్‌సుందర్ కూడా హబీబ్‌కి షేక్‌హేండ్ ఇవ్వటం ముగించగానే కారెక్కి కూర్చుని స్టార్ట్ చేశాడు. గేర్‌వేసి ముందుకు పరుగుదీయించటం ప్రారంభించాడు.

అరగంట తరువాత సిటీ లిమిట్స్‌ను దాటి జైశల్మీర్ వెళ్ళే హైవేమీదుగా ప్రయాణించటం ప్రారంభించింది.

వాత్సవ పక్కనే కూర్చున్నాడు శ్యామ్‌సుందర్.... సిగరెట్ కాలుస్తూ, వచ్చేపోయే వాహనాలన్నీ జాగ్రత్తగా పరిశీలించసాగాడు అతను.

సరిగ్గా రెండు గంటల ప్రయాణం తరువాత మొదలయింది ఇసుక ఎడారి! అటూ ఇటూ వున్న ఎడారి మధ్యగా నిర్మించబడి, పాములా మెలికలు తిరుగుతూ ముందుకు పోతున్నది హైవే...మరో పావుగంట ప్రయాణం తరువాత రెండు అడ్డరోడ్‌లు వచ్చి కలిశాయి హైవేలో.

వాత్సవ డ్రయివ్ చేస్తున్న మారుతీ కారు ఆ మూడు రోడ్‌లు కలిసే

చోటును సమీపిస్తుండగా ఇరువైపులనుండి ప్రత్యక్షం అయినాయి రెండు అంబాసిడర్ కారులు. కూడబలుక్కున్నట్లు ఒకదాని వెనక ఒకటిగా మారుతీని వెంబడించటం ప్రారంభించాయి.

అయిదు నిముషాల తరువాత వెనకనుండి వస్తున్న అంబాసిడర్ షడన్‌గా వేగాన్ని పెంచింది. కావాలనే వేగంగా ముందుకువచ్చి మారుతీ వెనుక భాగాన్ని ఢీ కొట్టింది. ఆ తాకిడికి అదుపుతప్పి మెలికలు తిరుగుతున్న మారుతీని కంట్రోల్‌లోకి తెచ్చుకుంటూ శ్యామ్‌సుందర్ వైపు చూశాడు వాత్సవ.

"వెనుక వస్తున్న వాళ్ళకి బాగా తొందరగా వున్నట్టుంది. దారి వదులు దామంటావా?" అతని అడిగాడు.

చిన్నగా తల వూపాడు శ్యామ్‌సుందర్.

"దారి వదులుదాం కాదు. దారి చూపిద్దాం! ఆ తరువాత మన దారిన మనం పోదాం..." అంటూ అంబాసిడర్ ముందు చక్రాలకు గురిపెట్టి రివాల్వర్ ప్రయోగించాడు.

ధన్‌మంటూ గర్జించింది శ్యామ్‌సుందర్ చేతిలోని రివాల్వర్. మొదటి బుల్లెట్ వృధా అయింది. రెండోది ముందు టైర్లలో ఒకదాన్ని చిల్లులు పొడిచింది.

పస్స్స్‌మంటూ పోవటం ప్రారంభించింది గాలి. మెలికలు తిరుగుతూ రోడ్‌పక్కకిపోయి ఇసుకలో కూరుకుపోయింది అంబాసిడర్ కారు.

అందులోంచి హడావుడిగా దిగిన కొంతమంది వ్యక్తులు కారులో వున్న ఆయుధాలను బయటికి లాగకముందే ఆ ప్రదేశాన్ని వదిలి అవతలికి దూసుకుపోయింది మారుతీ.

వంద గజాల దూరం ముందుకుపోయిన తరువాత రియర్ వ్యూమిర్రర్‌లో చూశాడు శ్యామ్‌సుందర్.

మారుతీ వెనక వస్తున్న రెండో అంబాసిడర్....ఇసుకలో కూరుకుపోయిన అంబాసిడర్‌లోంచి దిగిన తమవారికి సహాయంగా వెనక వస్తున్న అంబాసిడర్ కూడా అక్కడ ఆగిపోవటం కనిపించింది.

* * * * *

చీకటిపడేవరకు జైశల్మీర్ పట్టణంలోకి ప్రవేశించింది మారుతీ కారు.

పట్టణం శివార్లలో వున్న రెండు అంతస్థుల హోటల్ ముందుకు పోయి ఆగింది.

డబుల్ రూం బుక్‌చేశాడు వాత్సవ. గదిలోకి రాగానే బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ బెడ్‌మీద మేను వాల్చాడు వాత్సవ. చూస్తుండగానే నిద్రలోకి జారిపోయాడు.

శ్యామ్‌సుందర్ మాత్రం నిద్రపోలేదు.

అప్పుడే నిద్రేమిటి? అనుకుంటూ రూంలోంచి బయటపడి తలుపు దగ్గిరగా మూసి, గ్రౌండ్‌ఫ్లోర్‌లో వున్న రెస్టారెంట్‌లోకి పోయి కూర్చున్నాడు. ఒక ఛాయ్ ఆర్డర్ చేసి, రాగానే త్రాగి, సిగరెట్ వెలిగించుకుని దమ్ములాగుతూ కూర్చున్నాడు.

షడన్‌గా చాందినీ గుర్తుకువచ్చింది అతనికి. తనను బంధించి ఆమెకు అప్పగించాలని అవస్థపడుతూ, పట్టుదలగా తన వెంటపడి తిరిగే బల్బీర్ కళ్ళలో కదిలాడు.

కాటానికి వేశ్య అయినా, మహా పట్టుదలగల మనిషి చాందినీ, ఎలా గయినా ఆమెను విడిపించి, నచ్చజెప్పి ఉదయపూర్ పంపించాలనీ, వాత్సవతో పాటు అక్కడినుండి తనదారిన తాను వెళ్ళిపోవాలని నిర్ణయించు కున్నాడు శ్యామ్‌సుందర్.

అదేసమయంలో అతని ముందువెనుకల వున్న టేబుల్స్‌ను ఆక్రమించు కుని కూర్చున్నారు నలుగురు వ్యక్తులు. శ్యామ్‌సుందర్ ముందున్న కుర్చీలో ప్రత్యక్షం అయినాడు మరో వ్యక్తి.

ఆ ఐదుగురు వ్యక్తులు తనను గుచ్చిగుచ్చి చూడటం గమనించి ఆందోళన పడ్డాడు శ్యామ్‌సుందర్. వారి పరిశీలన ఎంక్వయిరీదాకా రాకముందే అక్కడ్నించి లేచి బయటికి వెళ్ళిపోవాలని అనుకున్నాడు.

అనుకున్నదానిని అతను ఇంకా ఆచరణలో పెట్టకముందే వున్నట్టుండి చిన్నగా దగ్గతూ ఎదురుసీటులో కూర్చున్న వ్యక్తి "కదలొద్దు మిస్టర్ శ్యామ్ సుందర్... కదిలావంటే అనవసరంగా ఖతం అయిపోతావు! రివాల్వర్ బుల్లెట్‌ల

తాకిడికి జల్లెడలా మారిపోతుంది నీ శరీరం!" అని లోగొంతుకతో హెచ్చరించాడు.

ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ అతనివంక చూశాడు శ్యామ్‌సుందర్. పట్టి పరిశీలించాడు అని చేతులను.

ఎటో చూస్తున్నట్టు నటిస్తున్నాడు ఆ వ్యక్తి. అతని చేతిలోని రివాల్వర్ మాత్రం టేబుల్ క్రిందనుండి తనవైపు గురిపెట్టబడి వుండటం గమనించి... కదిలే ఆలోచనను విరమించుకున్నాడు శ్యామ్‌సుందర్.

"గుడ్....! ఇప్పుడు స్నేహితుడిలా నువ్వు మా వెంట రావాలి..అందరం కలిసి వాత్సవ వున్న రూంకి వెళ్ళాలి. అక్కడ మనం మాట్లాడుకోవాల్సిన ముఖ్యమయిన విషయాలు కొన్ని వున్నాయి. అండర్ స్టాండ్?" చిన్నగా పెదవులు కదిలిస్తూ చెప్పాడు ఆ వ్యక్తి.

మౌనంగా తలాడిస్తూ లేచి నిలబడ్డాడు శ్యామ్‌సుందర్. ఊహించని ఎటాక్ ఇచ్చి, అతన్ని పడగొట్టాలన్న ఆలోచన వచ్చింది శ్యామ్‌సుందర్‌కి.

అంతవరకూ బాగానే వుంది. అతన్ని పడగొట్టటం కూడా శ్యామ్‌సుందర్‌కి పెద్ద కష్టం ఏమీకాదు.

కానీ మిగతావాళ్ళ మాటేమిటి?

తను ఎటాక్‌చేసి అతన్ని పడగొడుతుంటే వాళ్ళంతా చేతులు కట్టుకుని కూర్చుంటారా? తమ ఆయుధాలను ప్రయోగించకుండా చోద్యం చూస్తూ నిలబడతారా?

అటువంటి ఆలోచన రాగానే ఎటాక్ చేయాలన్న ఉద్దేశాన్ని వెంటనే విరమించుకుంటూ లేచి నిలుచున్నాడు శ్యామ్‌సుందర్. త్రాగిన ఛాయ్ ప్లేట్లో అయిదు రూపాయల నోటును వుంచి వాళ్ళతో బయలుదేరాడు.

అతని పక్కటెముకలమీద రివాల్వర్‌లు ఆనించి కవర్ చేస్తూ, అతని పక్కనే స్నేహితులమాదిరి అడుగులు వేయటం ప్రారంభించారు.

ఆలోచిస్తున్నాడు శ్యామ్‌సుందర్. వాళ్ళని వాత్సవ గదిలోకి తీసుకుపోకుండా మరో చోటుకి డైవర్ట్ చేస్తే ఎలా వుంటుంది అనుకున్నాడు మనసులో.

"మీరు ఏ రూంలో వుంటున్నారో మాకు బాగా తెలుసు. అనవసరంగా

మమ్మల్ని తప్పుదోవ పట్టించాలనుకుంటే తోలు తీస్తాం!" అతని భావాలను పసిగట్టినట్టు తీవ్రస్వరంతో హెచ్చరించాడు ఒక వ్యక్తి.

ఇక వాళ్లను ఏమార్చటం అంత సులువు కాదని గ్రహించాడు శ్యామ్‌సుందర్. ఏదయితే అదే అవుతుందిలెమ్మని సూటిగా తాము ఉంటున్న గది ముందుకు తీసుకుపోయాడు వారిని.

గదిని సమీపిస్తూనే వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది శ్యామ్‌సుందర్ గుండె. గదిలో బెడ్‌మీద మేనువాల్చి నిద్రపోతున్న వాత్సవ కూడా తనలాగే వాళ్ళకి పట్టుబడితే అనుకోని ఇబ్బందులు ఎదురవుతాయని కలత చెందుతోంది అతని మనసు.

"కమాన్! తలుపు తట్టు! వాత్సవని పిలు!" అతని వెనక నిలబడి వెన్నుమీద రివాల్వర్‌తో పొడుస్తూ లోగొంతుకతో ఆదేశించాడు ఒక వ్యక్తి.

తలుపు తడుతున్నట్లే నటిస్తూ 'మోర్స్‌కోడ్' లో బయటి పరిస్థితిని వివరించాడు శ్యామ్‌సుందర్.

"ఏమిటి ఆలస్యం? తలుపుమీద దబదబ బాదు. గట్టిగా అరిచి పిలు!" గద్దించాడు ఇంకో వ్యక్తి.

చిన్నగా తల వూపి తలుపు తట్టాడు శ్యామ్‌సుందర్. అతని చేయి పడగానే మెల్లగా లోపలికి జరిగింది తలుపు. లోపలి దృశ్యం బయటికి క్లియర్‌గా కనిపించింది.

వారందరితోపాటు లోపలికి ప్రవేశించిన శ్యామ్‌సుందర్, మంచం మీద వాత్సవ లేకపోవటంతో తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు.

ఒకవేళ బాత్‌రూంలో వున్నాడేమో? అనుకున్నాడు మనసులో.

అతని సందేహాన్ని తీర్చటానికే అన్నట్టు రివాల్వర్ పుచ్చుకుని బాత్‌రూం లోకి వెళ్ళాడు ఒక వ్యక్తి "లేదు! ఇక్కడ కూడా లేదు" అంటూ తిరిగి వచ్చాడు.

"మిస్టర్ శ్యామ్‌సుందర్! మీ పార్టనర్ ఎక్కడికి వెళ్ళాడు?" అడిగాడు ఆ వ్యక్తి.

"ఇది మరీ బాగుంది. నేను కూడా రెస్టారెంట్‌లోంచి ఇప్పుడే కదా వచ్చాను!

నాకు మాత్రం ఏం తెలుసు?" అన్నాడు అమాయకంగా ముఖం పెట్టి.

"ఆల్‌రైట్...వాత్సవ ఎంత తెలివయినవాడయినా మా ముందు అతని ఆటలు సాగవు" అన్నాడు వారిలో ఒక వ్యక్తి.

''సాగుతాయో సాగవో అతను వస్తేకదా తెలిసేది'' అన్నాడు శ్యామ్‌సుందర్.

"వస్తాడు. తనంతట తానే అతను మా ముందుకు వస్తాడు. రాక ఎక్కడికి పోతాడు? అతను సరిగ్గా ఒక గంటలోపు మా దగ్గిరికి వస్తే సరి! లేదంటే నిన్ను చంపి నీ శవాన్ని పార్శిల్‌చేసి పంపిస్తాం!" అంటూ తన ఉద్దేశాన్ని ముఖంమీద గుద్దినట్టు చెప్పాడు ఆ వ్యక్తి.

అతని అభిప్రాయంతో ఏకీభవిస్తున్నట్టు తలలు ఆడించారు మిగతావాళ్లు. అతను చెప్పినట్టుగానే ఒక కాగితంమీద వ్రాసి గుండుసూదితో తలగడకు గుచ్చారు.

ఆ తరువాత అతన్ని తీసుకుని వెనకవైపున వున్న మెట్లగుండా హోటల్‌లో నుండి బయటపడ్డారు. అక్కడ చీకటిలో ఆగి వున్న ఒక జీపులో అతన్ని ఎక్కించుకుని అక్కడినుండి బయలుదేరారు.

# 18

జైశల్మీర్ పట్టణానికి ఉత్తరంగా వున్న ఒక పెంకుటింటిముందుకు వచ్చి అటు ఇటు చూశాడు వాత్సవ. తనను ఎవరూ గమనించటంలేదని నిశ్చయించుకుని ద్వారాన్ని సమీపించి ఒక కన్ను మూసి రెండో కంటితో కీహోల్లోంచి లోపలికి చూడసాగాడు.

సరిగ్గా పది నిముషాల క్రిందటే పెడరెక్కలు విరిచి కట్టబడి లోపలికి తీసుకుపోబడ్డాడు శ్యామ్‌సుందర్. ఆ పెంకుటింటి ముందుభాగం హాలులో వున్న ఒక కుర్చీలో కూర్చోబెట్టబడి వున్నాడు.

హోటల్‌లో రూం తీసుకుని బెడ్‌మీద మేను వాల్చిన తరువాత

శ్యామ్‌సుందర్ లేచి ఎక్కడికో వెళ్ళటం కనుచివరలనుండి గమనిస్తూనే వున్నాడు వాత్సవ.

అయిదు నిముషాలు ఆగి, తను కూడా క్రిందికి వచ్చి రెస్టారెంట్‌లోకి వెళ్ళబోతూ ఎంట్రన్స్‌లో ఆగి ముందుకు చూసిన వాత్సవ దృష్టిని అప్రయత్నంగా ఆకర్షించారు శ్యామ్‌సుందర్‌ని రివాల్వర్‌లతో కవర్‌చేస్తూ బెదిరిస్తున్న ఐదుగురు వ్యక్తులు.

లిఫ్ట్ మూమెంట్‌ను బట్టి వాళ్ళు తనకోసం ఎంక్వయిరీ చేస్తున్నారని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు అతనికి.

రెస్టారెంట్‌లో గందరగోళాన్ని సృష్టించి కస్టమర్స్ ప్రశాంతతను పాడుచేయటం ఇష్టంలేక వెనక్కి వచ్చేశాడు వాత్సవ. బయటవున్న ఒక స్థంభం చాటున నిలబడి శ్యామ్‌సుందర్ రాకకోసం ఎదురుచూడసాగాడు.

మరో అయిదు నిముషాల తర్వాత శ్యామ్‌సుందర్‌ని చాటుగా రివాల్వర్‌తో కవర్‌చేస్తూ స్నేహితుల మాదిరి అతనితో పాటు బయటకు వచ్చారు ఆ దుండగులు. వాళ్ళు తన గది వైపు వెళ్ళటం గమనించి వారిని ఫాలో అయ్యాడు వాత్సవ.

అందరూ తన గదిలోకి వెళ్ళటం, తను కనిపించకపోయేసరికి వార్నింగ్ లెటరు తలగడకి గుచ్చి, శ్యామ్‌సుందర్‌ని తమతోపాటు జీపులో తీసుకుపోవటం చూస్తునే వున్నాడు వాత్సవ. జీపు బయలుదేరగానే హోటల్ ముందున్న తమ కారులో బయలుదేరాడు.

కీ హోల్లోంచి చూస్తున్న వాత్సవకి హాలు మధ్యలో కూర్చున్న శ్యామ్ సుందర్, రివాల్వరు గురిపెట్టి అతని చుట్టూ నిలబడిన దుండగులు కనిపిస్తూనే వున్నారు.

ఎవరు వాళ్ళు? శ్యామ్‌సుందర్‌ని ఎందుకు కలుసుకోవాలని అను కొంటున్నారు? వీళ్ళు కూడా ఆ దుష్టత్రయం మనుషులేనా? ఇంకా ఎంతమంది వున్నారు వాళ్ళ మనుషులు?

ఆ ప్రశ్నలకు సమాధానాలను గురించి వాత్సవ ఆలోచిస్తుండగా లోపల

వున్న ఒక వ్యక్తి ద్వారం వైపు రావటం గమనించి ఉలిక్కిపడ్డాడు వాత్సవ. వెంటనే వెనుతిరిగి పెంకుటింటి పక్కనున్న చీకటిలోకి తప్పుకున్నాడు.

ఒకరి తర్వాత ఒకరుగా యిద్దరు వ్యక్తులు బయటికి వచ్చారు. పరిసరాలను జాగ్రత్తగా పరిశీలనగా చూస్తూ రివాల్వర్‌తో యింటి ముందు కాపలా నిలబడ్డారు.

రెండు నిముషాల వ్యవధిలో బయటనుండి వచ్చిన మరో ఇద్దరితో కాపలావాళ్ళ సంఖ్య నాలుగుకి పెరిగింది...ఇక యింటి ముందు నుండి వారి కంటపడకుండా లోపలికి వెళ్ళటం సాధ్యంకాదని అనిపించింది. చీకట్లో నిశ్శబ్దంగా అడుగులు వేస్తూ పెంకుటింటి వెనుక భాగానికి చేరుకుని ఇంటిమీదికి ఎగబ్రాకి...శబ్దం చేయకుండా పెంకుటింటి నడికొప్పుకు చేరుకున్నాడు. పైనున్న నాలుగు పెంకులను తొలగించి క్రిందికి తొంగి చూసాడు. చెవులు రిక్కించి వారి మాటలను వినటం ప్రారంభించాడు.

"మనం లెటరులో వాత్సవకి సూచించిన గడువులో నలభై నిముషాలు గడిచిపోయాయి" ఉన్నట్టుండి అన్నాడు ఒక వ్యక్తి.

"అవును! ఇంతవరకూ వాత్సవ రాలేదు. వస్తాడన్న నమ్మకం నాకు కలగటంలేదు" అసహనంగా ధ్వనిస్తున్న కంఠంతో అన్నాడు మరో వ్యక్తి.

"ఇద్దర్నీ చంపి శవాలుగా మార్చివుంటే రెండు కోట్లరూపాయలు వచ్చి వుండేవి. ఇప్పుడు ఒక కోటి రూపాయలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది. మన పదిమందికీ తలొక పదిలక్షలు వస్తాయి..." నీరసంగా అన్నాడు మూడో వ్యక్తి.

"ఆగు. మనం ఇచ్చిన గడువుకి ఇంకో పదినిముషాలు వ్యవధి వుంది. ఈలోగా ఆ వాత్సవ వచ్చినా రావచ్చు!" అన్నాడు మొదటి వ్యక్తి.

వాళ్ళెవరో, అంత శ్రమ తీసుకుని తనను ఎందుకు బంధించారో అప్పుడు అర్థం అయింది శ్యామ్‌సుందర్‌కి.

అయినా అర్థం కానట్టే నటిస్తూ వాళ్ళని మాటలలోపెట్టి తప్పించుకునే ప్రయత్నం చేయాలని అనుకున్నాడు శ్యామ్‌సుందర్. వాచ్ కీరాడ్‌కి వున్న తీగను బయటికి లాగి వెనక్కి విరిచి కట్టబడిన చేతుల బంధనాలను నిశ్శబ్దంగా కట్

చేసుకోవటం అప్పటికే ప్రారంభించాడు అతను.

"డబ్బు కోసం నాలాంటి అయాయకుల్ని చంపితే మహాపాపం చుట్టుకుంటుంది బ్రదర్. నరకానికిపోతారు మీరంతా" అన్నాడు.

కేర్‌లెస్‌గా నవ్వేరు వారందరూ.

"స్వర్గం అయినా, నరకం అయినా అంతా డబ్బుతోనే ముడిపడి వుంది. డబ్బుగలవారికి ఎదురులేదు ఈ లోకంలో" అన్నాడు వారిలో ఒక వ్యక్తి.

"అయిపోయింది! వాత్సవ ఇక్కడికి రావటానికి మనం ఇచ్చిన గంట టైం గడిచిపోయింది. పుణ్యకాలం కాస్తా పూర్తి అయింది. ఇక ఇతన్ని చంపేద్దాం" అంటూ రివాల్వర్‌ను జేబులో పెట్టుకుంటూ పక్కగదిలోకిపోయి వెడల్పాటి కత్తిని వెంట తెచ్చుకున్నాడు.

ఉలిక్కిపడ్డాడు శ్యామ్‌సుందర్.

అప్పటికి యింకా కట్లను తెగకోయలేదు అతను. బంధ విముక్తుడు కాలేదు.

ఈలోగా అతను తొందరపడితే? తను బంధనాలు వదిలించుకోటానికి "ముందే అతను తన తల నరికితే తన గతేం కావాలి? అని కలతచెందుతూ కట్లు కోసుకోవటం మరింత స్పీడ్ చేసాడు శ్యామ్‌సుందర్.

అదే సమయంలో వెడల్పాటి కత్తిని ఎత్తి పట్టుకుని అతని దగ్గిరికి వచ్చేసాడు ఆ వ్యక్తి. "నీ టైం అయిపోయింది. నీ తల నరికి చూపిస్తేనే మాకు కోటిరూపాయలు వస్తాయి" అంటూ కత్తిని గాలిలోకి ఎత్తాడు ఆ వ్యక్తి.

అదే సమయంలో కటింగ్‌ప్లేయర్ వంటి చిన్న సాధనంతో ఆ పెంకుటింటికి కరెంట్ సప్లయ్ చేస్తున్న తీగను కట్ చేశాడు వాత్సవ. మరో నాలుగు పెంకుల్ని పక్కకి లాగి పైనుండి క్రిందికి దూకేసాడు.

శ్యామ్‌సుందర్ మెడమీద వేటు వేయబోతున్న సమయంలో కరెంట్ పోయినందుకు తెగ చిరాకుపడిపోయాడు ఆ వ్యక్తి. పైనుండి బరువుగా ఏదో పడేసరికి అదిరిపడి కీచుగా అరుస్తూ వెనక్కి దూకాడు.

సరిగ్గా అప్పుడే శ్యామ్‌సుందర్ కట్లు తెగిపోయాయి. బంధనాల నుండి

విముక్తి లభించింది అతని చేతులకు.

కుర్చీలోంచి లేచి నిలబడుతూనే ఎదురుగా కనిపించిన ఆకారాన్ని ముఖం పగిలేలా కొట్టాడతను. దగ్గిరికి వచ్చిన మరో ఆకారాన్ని కాలితో బలంగా తన్ని అవతలికి నెట్టాడు.

"ఈ పని ఇంతకు ముందే చేసుండాల్సింది! వ్యవహారం పీకలమీదికి వచ్చేదాకా ఆగటం నీకు బాగా అలవాటు అయిపోయింది.

అతి సమీపంనుండి వినిపించిన వాత్సవ గొంతును గుర్తుపట్టేసరికి మరింత ఉత్సాహం వచ్చేసింది శ్యామ్‌సుందర్‌కి. వీళ్ళు ఎవరో...మనల్ని ఎందుకు చంపాలనుకుంటున్నారో తెలుసుకోవడానికి ఇంతసేపూ ఓపిక పట్టాను. ఇక ఓపిక పట్టాల్సిన అవసరంలేదు నాకు" అంటూ పిడికిళ్ళతో పొడిచి మరో ఇద్దర్ని పడగొట్టాడు.

ఒకపక్క వాత్సవ, మరోపక్క శ్యామ్‌సుందర్ విజృంభించి విరగదీయటం ప్రారంభించేసరికి చుక్కలు కళ్ళముందు ప్రత్యక్షం అయినాయి వారికి. అక్కడేవుంటే తలలు తెగకపోయినా కాళ్ళూ చేతులకు గ్యారంటీ వుండదనిపించింది.

అటువంటి ఆలోచన వచ్చిన తర్వాత అరనిముషం కూడా ఆలస్యం చేయలేదు ఆ వ్యక్తులు. కోటిరూపాయలు సంపాదించాలన్న ఆలోచన కొండెక్కిపోయిందని గ్రహించి ఒకరి వెనుక ఒకరుగా ఆ పెంకుటింటిలోంచి బయటికి దూకారు ఆ వ్యక్తులు. వెనుతిరిగి చూడకుండా పరుగులు దీయటం ప్రారంభించారు.

అందరికంటే ఆఖరున పిక్కబలం చూపించబోయిన ఒక వ్యక్తిని ద్వారం దాటకముందే అడ్డుకున్నాడు శ్యామ్‌సుందర్. అతని జుత్తు పట్టుకుని ఈడ్చుకువచ్చి కుర్చీల్లో కూర్చోబెట్టాడు. ఆ తర్వాత సిజర్ లైటర్ కాంతిలో ఆ ఇంట్లో వెతికి క్యాండిల్ నొకదాన్ని సంపాదించగలిగాడు.

"చెప్పు బ్రదర్! మా తలలు కోట్లరూపాయల వెలకట్టిన పెద్ద మనుషులు ఎవరు? ఎక్కడున్నారు? " అని అడిగాడు శ్యామ్‌సుందర్.

రెండోసారి అడిగించుకోలేదు ఆ వ్యక్తి. మొండితనం అంటే ఏమిటో

తనకు తెలీదన్నట్లు వెంటనే చెప్పేశాడు సమాధానాన్ని.

క్రిందటిరోజు వారి నాయకుడ్ని కలిసాడట ఒక అపరిచిత వ్యక్తి శ్యామ్‌సుందర్, వాత్సవల పోలికలు కళ్ళకు కట్టినట్టు వివరించి, వాళ్ళను చంపి శవాలను చూపిస్తే, రెండు కోట్ల హార్డ్ క్యాష్ యిస్తానని ఆఫర్ చేశాడట. అయిదు లక్షలు టోకెన్ అడ్వాన్స్‌గా కూడా యిచ్చాడట.

చిల్లర నేరాలుచేస్తూ చింత లేకుండా జీవించే క్రిమినల్స్ గ్రూప్ వారిది. హత్యలు చేయటం ఇదే మొదటిసారి. అది కూడా రెండు కోట్లరూపాయలకు ఆశపడటంవల్లనే ఒప్పుకోవటం జరిగింది.

ఆ వివరాలు విన్న తర్వాత ఇంక అతనితో అవసరం లేదనిపించి అతన్ని వదిలేశారు వాత్సవ, శ్యామ్‌సుందర్‌లు. అక్కడ్నించి బయలుదేరి...వాత్సవ ఒక సందులో వదిలి వచ్చిన కారులో హోటల్‌కి చేరుకున్నారు.

రిసెప్షన్‌హాల్లోకి ప్రవేశించి మెట్లమీదుగా రెండో అంతస్తు చేరుకునే సరికి వారి గది బయట తచ్చట్లాడుతూ కనిపించాడు ఒకవ్యక్తి. ఆ ఇద్దరూ అటు రావటం గమనించగానే పెద్దపులి వెంటపడి తరుముతున్నంత కంగారుగా అక్కడ్నించి కదిలి అవతలికి వెళ్ళిపోయాడు.

కనుబొమలు అసహనంగా ముడివేస్తూ ద్వారాన్ని సమీపించారు పార్టనర్స్ యిద్దరూ.

ఆ వ్యక్తులతో బయలుదేరినప్పుడు తలుపుమూసి తాళం వేశాడు శ్యామ్‌సుందర్. తన దగ్గర వున్న తాళంచెవితో లాక్ రిలీజ్ చేయబోతుండగా రాకూడని అనుమానం వచ్చేసింది వాత్సవకి.

"నో....!డోన్ట్ రిలీజ్ ది లాక్! గెట్ బేక్....గెట్‌బేక్ శ్యామ్‌సుందర్!" అని గొంతు చించుకుని అరుస్తూ ఎగిరి ఒక కార్నర్‌లోకి దూకాడు.

అప్పటికే జరిగిపోయింది ఆలస్యం...లాక్ రిలీజ్‌చేసి తలుపు తెరవటం కూడా అప్పటికే పూర్తిచేశాడు అతను.

అయితే ఉన్నట్టుండి వాత్సవ హెచ్చరించటంవల్ల ముందుకు

వేయబోతున్న అడుగు వెనక్కి లాక్కుని అమిత వేగంతో మరో కార్నర్‌లోకి దూకబోయాడు.

అదే సమయంలో భయంకరమయిన శబ్దాన్ని వెలువరిస్తూ బ్రద్దలయింది డోర్‌కి కనెక్ట్ చేయబడి, ఆ గదిలో అమర్చబడిన శక్తివంతమైన బాంబు.

తుక్కుతుక్కయిపోయింది ఆ గదిలోని ఫర్నిచర్...పూర్తిగా ధ్వంసం అయింది ఆ డబల్ బెడ్‌రూంలోని మధ్యభాగం. ఎర్రటి మంటలు చిటపట శబ్దాలతో విరిగి ముక్కలయిన ఫర్నిచర్‌ను ఆక్రమించుకుని ఆరగించటం ప్రారంభించాయి. నల్లటిపొగలు సుడులు తిరుగుతూ గదిఅంతటా కమ్ముకున్నాయి.

దిక్కులు పిక్కటిల్లేట్లున్న ఆ ప్రేలుడు శబ్దానికి అదిరిపోయారు హోటల్, ఇతర గదులలో విశ్రాంతి తీసుకుంటున్న కస్టమర్స్. హోటల్ స్టాఫ్‌తోసహా అందరూ పరుగు పరుగున రావటం ప్రారంభించారు.

లేచి నిలబడుతూనే శ్యామ్‌సుందర్ వైపు చూశాడు వాత్సవ. ఆఖరి క్షణంలో తన హెచ్చరిక విని ఎలర్ట్ అవటంవల్ల వెంట్రుకవాసిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాడు శ్యామ్‌సుందర్. స్వల్పమయిన గాయాలతో బయటపడ్డాడు.

"ఈ పరిస్థితులలో మనం ఇక్కడ వుండటం మంచిదికాదు. కమాన్! మేక్ ఏ మూవ్! హరియప్" అంటూ అతని చేయి పుచ్చుకుని అవతలికి పరుగు దీసాడు వాత్సవ.

ఫైర్ సర్వీస్‌వాళ్ళు, పోలీసులు అక్కడికి రాకముందే మారుతీకారులో హోటల్ పరిసరాలనుండి అదృశ్యం అయిపోయారు.

* * * * *

జంటపాముల్లా ముందుకు పాకుతున్న వాత్సవ, శ్యామ్‌సుందర్...ఒక్క నిముషం పాకటం ఆపి తలలు పైకెత్తారు. నుదుటిమీంచి కళ్ళల్లోకి జారుతున్న చెమటబిందువులను మోచేతులతో తుడుచుకుంటూ ముందుకు సారించారు దృష్టిని.

జై శల్మీర్ పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో పీఠభూములను ఆనుకుని

వుందా ప్రదేశం. దట్టమయిన కాకటస్ పొదలతో విస్తరించి వుంది.

అక్కడికి అర ఫర్లాంగ్ దూరంనుండి భయంకరమయిన భేతాళుడి ఆకారంలో ...పురాతన కాలంనాటి రాజకోటను పోలిన శిధిల కట్టడం, శక్తివంతమయిన మెషిన్‌గన్స్ పుచ్చుకుని ఆ కట్టడం వెలుపల గస్తీ తిరుగుతున్న గార్డ్‌లు స్పష్టంగా కనిపిస్తున్నారు. బాంబులను ప్రయోగించే బజూకాలను పట్టుకుని కట్టడపు బురుజులమీద నిలబడి వున్నారు మరికొంతమంది గార్డ్‌లు.

హోటల్‌లో బాంబు ప్రేలిన తరువాత ఒక విషయం స్పష్టంగా అర్థం అయింది. జైశల్మీర్‌లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముందే తమ ఇద్దర్నీ హతమార్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు 'ఆపరేషన్ టు ఇన్ ఒన్' సూత్రధారులు.

తమను అడ్డు తొలగించుకుని తమ పథకాన్ని నిరాటంకంగా అమలు పరిచేందుకు లైన్ క్లియర్ చేసే పనిలో నిమగ్నులయిపోయారు.

ఒక ప్లాన్ ప్రకారం 'ఆపరేషన్ టు ఇన్ ఒన్' ని భగ్నం చేయాలని అనుకున్నాడు వాత్సవ. శత్రువులు ఆ విధంగా తమ ప్రయత్నాలను ముమ్మరం చేయటంతో ప్లాన్‌లకూ, పద్ధతులకూ స్వస్తిచెప్పి అటో యిటో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నాడు.

దూరం నుండి కనిపిస్తున్న గార్డ్‌ల కదలికలను జాగ్రత్తగా గమనిస్తూ.. శ్యామ్‌సుందర్‌ని ఒకచోట ఆగమనిచెప్పి తను మరింత ముందుకు వెళ్ళాడు వాత్సవ. కోటలాంటి శిధిల కట్టడం పెద్ద గేటుముందు గస్తీ తిరుగుతున్నవారిని ఒకటినుండి యాభైమందిదాకా లెక్కపెట్టాడు వాత్సవ. ఆ తరువాత లెక్కపెట్టటానికి అతనికి ఓపిక లేకపోయింది.

ఎంత చీకటిగా వున్నా అంతమందిని దాటుకుని ముందుకు పోవటం మామూలుగా వీలుపడదని కాదు. ఏదయినా ప్రత్యేకమయిన టెక్నిక్ ప్రయోగించాలి.

అందరిదృష్టినీ ఒకేసారి డైవర్ట్‌చేసి అవతలికి పంపాలి. తిరిగి వచ్చేలోగానే

కట్టడంలోకి జొరబడాలి.

ఎలా? ఎలా?

ఆలోచిస్తూ వెనక్కి వచ్చేసాడు వాత్సవ. అడగకుండా పరిస్థితిని శ్యామ్‌సుందర్‌కి వివరించాడు.

వెంటనే తన మస్తిష్కానికి పని కల్పించాడు శ్యామ్‌సుందర్. చక చకా ఆలోచించి అప్పటికప్పుడు వర్క్ అవుట్ అయ్యే ఒక చక్కటి పథకాన్ని రూపొందించాడు.

"నువ్వు ఆ పక్కనుండి ఎంట్రన్స్‌ను సమీపించు. నేను గార్డ్ లందర్నీ కంగారుపెట్టి మరోపక్కకి పంపి నేనూ వచ్చేస్తాను" అన్నాడు శ్యామ్‌సుందర్.

'ఎలా?' అని అడగబోతూ ఆఖరి క్షణంలో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని అతను చెప్పిన దిశలో పాకుతూ వెళ్ళిపోయాడు వాత్సవ.

అతను అటు వెళ్ళగానే వచ్చిన దారినే వందగజాల వెనక్కి పాకాడు శ్యామ్‌సుందర్. ఆ తరువాత లేచి నిలబడి అక్కడికి కొంతదూరంలో గుబురుగా, ఎత్తుగా ఎదిగిన కాకటస్ పొదలవెనక వదిలివచ్చిన మారుతీకారు దగ్గరకి ఒక్క పరుగున చేరుకున్నాడు.

కారు డిక్కీ తెరిచి, అందులో వున్న స్పేర్ పెట్రోల్ టిన్‌నొక దాన్ని తీసుకుని.... కట్టడానికి మరోవైపుకి వెళ్ళాడు శ్యామ్‌సుందర్. అక్కడ వత్తుగా వున్న కాకటస్ పొదలమీద పెట్రోల్ కుమ్మరించి సిజర్ లైటర్‌తో వెలిగించాడు.

భగ్గుమంటూనే లేచాయి మంటలు. పచ్చిగా పచ్చగావున్న కాకటస్ పొదలను దగ్ధంచేసే కార్యక్రమాన్ని చేపట్టాయి.

ఉన్నట్టుండి అల్లంతదూరాన వెలుగు ప్రత్యక్షం అయ్యేసరికి ఉలికిపడ్డారు కట్టడం గేటుముందు కాపలా కాస్తున్న గార్డ్‌లు. చుట్టూ తిరుగుతున్న వాళ్ళు కూడా పరుగు పరుగున అక్కడికి వచ్చేశారు.

కాకటస్ పొదలను దగ్ధంచేస్తూ నిట్టనిలువుగా మండుతున్న మంటల్ని గమనించేసరికి మతిపోయినంత పనయింది వారందరికీ...ఆ మంటలు ఎవరు సృష్టించారో అర్థంకాకుండా పోయింది.

అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తూ ఆలస్యం చేయలేదా గార్డ్‌లు. నేల

అదిరిపోయేంత బూట్ల శబ్దంతో ఆ మంటల్ని గురించి ఆరా తీయటానికి అటు పరుగుతీసారు. కాకటస్ పొదలను సమీపించి చుట్టుపక్కల వెదకటం ప్రారంభించారు.

గార్డ్‌లు ఆ గాలింపు పనిలో నిమగ్నులయి వుండగా మరొకవైపు నుండి స్వేచ్ఛగా పురాతన కట్టడంలోకి ప్రవేశించారు వాత్సవ, శ్యామ్‌సుందర్‌లు. ఇద్దరూ ఒకేవైపు కాకుండా బంధింపబడినవారికోసం చెరోవైపు బయలుదేరారు వెదకటానికి.

కవాటాలనూ, గవాక్షాలను చాటుచేసుకుంటూ దుష్టత్రయం కోసం వెదకటం ప్రారంభించాడు వాత్సవ. మాస్క్ హెల్మెట్‌లు ధరించి సివిల్ డ్రస్‌లలో వున్న అనేకమంది మనుషులు అక్కడ తిరుగుతూ కనిపించారు.

ఒక విశాలమయిన హాలులో చకచకా పనిచేస్తున్నాయి కంప్యూటర్స్... యంత్రాలు నిర్విరామంగా పరిశ్రమిస్తున్నాయి. ఎవరికంట పడకుండా గోడలను, దొంతరలుగా వున్న గోనెమూటలనూ, పెద్ద పెద్ద పీపాలను చాటు చేసుకుంటూ గ్రౌండ్ ఫ్లోర్ అంతటా కలయతిరిగాడు వాత్సవ. అనుకోకుండా తన ఉనికిని పసిగట్టిన ఒక మాస్క్ వ్యక్తిని పక్కకి లాగి ఒకే ఒక దెబ్బతో స్పృహ తప్పించాడు.

అతని మాస్క్‌ని, హెల్మెట్‌ని తను తగిలించుకుని అతనిని ఒక ఖాళీ పీపాలోకి నెట్టి మూతపెట్టి పైన మేకులు దిగ్గొట్టాడు. ఆ పని పూర్తి కాగానే దొంగచాటుగా కాకుండా స్వేచ్ఛగా అడుగులువేస్తూ తన అన్వేషణ కొనసాగించాడు.

గ్రౌండ్ ఫ్లోర్ చివరిభాగానికి చేరి ముఖాన్ని కవర్ చేస్తున్న మాస్క్‌ను పైకెత్తి చుట్టూ చూడబోతుండగా వున్నట్టుండి గాలివలన అతని నాసికారంధ్రాలకు సోకింది....ఘాటయిన కెమికల్ వాసన. అతని కనుబొమలు ఆశ్చర్యంగా ముడిపడేట్టు చేసింది.

ముక్కును ఎగబీలుస్తూ రెండు నిముషాల తరువాత ఆ వాసన వస్తున్న దిశను కనుగొన్నాడు వాత్సవ. మాస్క్‌లను యధాప్రకారం ముఖంమీదికి లాక్కుని అటువైపు నడిచాడు.

గ్రౌండ్ ఫ్లోర్ వెనకభాగంలో అతనికి కనిపించింది గోడౌన్ లాంటి హాలు.

ఎత్తివున్న షట్టర్ ముందు నిలబడి ప్లాస్టిక్ బస్తాలను లోపలకి చేరవేస్తూ కనిపించారు మాస్క్ ధరించిన మనుషులు.

ఎటువంటి సంకోచం లేకుండా వారి దగ్గరకు వెళ్ళాడు వాత్సవ. “జాగ్రత్త! జాగ్రత్తగా లోపల వెయ్యండి బస్తాలను! సరుకు నేలపాలు కాకుండా చూడండి. సరిగా లెక్కలు పెడుతున్నారా?” అనడిగాడు.

తలలు వూపారు బస్తాలను చేరవేస్తున్న గార్డ్‌లు. అతను తమపై నియమించిన కొత్త అధికారి అయివుండవచ్చునని భావిస్తూ మరింత శ్రద్ధగా చేరవేయటం ప్రారంభించారు బస్తాలను.

వారాపనిలో వుండగా ఒకపక్కన నిలబడి లోపల వున్న బస్తాలను శ్రద్ధగా పరిశీలించి అదిరిపడ్డాడు వాత్సవ. తన కళ్ళను తానే నమ్మలేనట్లు మరింత పరిశీలనగా చూసాడు.

సందేహం లేదు!

గార్డ్‌లు చేరవేస్తున్న బస్తాలలో వున్నది మామూలు కెమికల్స్ కావు. ప్రేలుడు పదార్థాలలో ప్రధానంగా ఉపయోగించే యురేనియంతో నిండి వున్నాయి కొన్ని బస్తాలు. ఆర్.డి.ఎక్స్‌తో కిక్కిరిసి వున్నాయి మరికొన్ని.

బాంబుల తయారీలోనూ, మరికొన్ని మారణాయుధాలలోను వుప యోగించే ప్రమాదకరమయిన ఆ కెమికల్స్ అంత పెద్ద మొత్తంలో అక్కడ ఎందుకు స్టాకు పెట్టబడుతున్నాయి? ఒకవేళ ఆ కట్టడంలో బాంబులు తయారుచేయటంలేదు కదా!

మొదటి అంతస్థును చేరుతూనే లభించింది అతని మస్తిష్కాన్ని అదేపనిగా సతాయిస్తున్న ఆ ప్రశ్నకు సమాధానం. అక్కడ ఒక విశాలమయిన హాల్లో తయారుచేయబడుతున్నాయి రేడియోలు, క్రికెట్ బాల్సూ, బ్రీఫ్‌కేస్‌లూ, కొబ్బరికాయలూ, ఇండియన్ బ్రాండ్ అగ్గిపెట్టెలూ, సిగరెట్ పెట్టెల రూపాలలో వున్న బాంబులు.

వంచిన తలలు ఎత్తకుండా వాటిని తయారుచేస్తున్నారు బాంబుల

తయారీలో చేయితిరిగిన నిపుణులు.

ఆందోళనతో నిండిపోతున్న మనసును అదుపులో వుంచుకోటానికి ప్రయత్నిస్తూ ఆ హాలులోంచి బయటికి వచ్చేసాడు వాత్సవ.

ఆపరేషన్ టు ఇన్ వన్ ఒక్క ప్రధాని హత్యకు సంబంధించి మాత్రమే కాదు. అది విజయవంతంగా పూర్తి చేయగలిగిన నిముషంలో దేశాన్ని అల్లకల్లోలం చేసేందుకు....భయంకర మారణకాండను సృష్టించి, మనుషుల్ని భీతావహుల్ని చేసేందుకు కూడా రూపొందించబడింది ఆ పథకం. అందుకే దానికి టు ఇన్ ఒన్ అని కూడా పేరు పెట్టబడింది.

అటునుండి భయంకరమయిన నిజాన్ని తెలుసుకున్న తరువాత ఇక ఆలస్యం చేయటం ఇష్టంలేకపోయింది వాత్సవకి. కారిడార్స్‌లో తిరుగుతున్న మాస్క్ హెల్మెట్స్ ధరించిన గార్డ్‌లతోపాటు తనూ తిరుగుతూ టెలిఫోన్ వున్న ఒక గదిలోకి చూసాడు వాత్సవ. ఆ గది తలుపులు మూసి గబగబా వెళ్ళి టెలిఫోన్ రిసీవర్ ఎత్తి ఒక నెంబర్ డయల్ చేసాడు.

అటునుంచి రెస్పాన్స్ రాగానే బాంబులు తయారుచేయబడుతున్న సంగతి తెలియచేసాడు...ఆ పురాతన కోటకు సంబంధించిన వివరాలు అందచేసాడు.

"ఎస్! తయారయిన బాంబులు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా ఇతర రాష్ట్రాలకు చేరకముందే మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోవాలి. నేను చెయ్యాల్సింది చేసాను. మీరు వెంటనే బయలుదేరండి" అంటూ అవతల వైపున వున్న హబీబ్‌తో చెప్పి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు వాత్సవ. మాస్క్‌ను పైకెత్తి సిగరెట్ వెలిగించి దమ్ములాగుతూ గది తలుపులు తెరుచుకుని బయటికి వచ్చాడు. అడుగు ముందుకు వేయబోతూ ఎదురుగా కనిపించిన దుష్టత్రయాన్ని గమనించి ఎక్కడివాడు అక్కడ శిలావిగ్రహంలా బిగుసుకుపోయాడు.

"వెల్...మిస్టర్ వాత్సవా! ఉదయపూర్ సంఘటన తరువాత నువ్వు ఇక్కడికి వస్తావని నేను ముందే వూహించాను. నా అంచనా తప్పుకాలేదు. ఇంతటి సమర్ధుడివి, నీ సామర్ధ్యానికి తగిన విలువలేనిచోట ఎందుకు యిలా పేరు ప్రతిష్టలు లేకుండా జీవిస్తున్నావు? నువ్వూ, నీ పార్టనర్ శ్యామ్‌సుందర్

మాతో చేతులు కలిపితే మిమ్మల్ని అందలం ఎక్కిస్తాను. ముఖ్యంగా ప్రమాదాలతో ఆడుకునే మీ శ్యామ్‌సుందర్ సాహసం అంటే నాకు చాలా యిష్టం. ఐ లైక్ హిమ్ వెరీమచ్” అంది ఆయేషాబేగం.

సమాధానంగా చిరునవ్వు నవ్వాడు వాత్సవ.

“సాహసం అన్నివేళలా జయప్రదం కాదు వాత్సవా! అదృష్టం ఎల్లప్పుడూ నీ వెన్నంటి వుంటుందనుకోవటం పొరపాటు” అన్నాడు నకిలీ జియావుద్దీన్.... సమీరుద్దీన్.

“ఎవరి వృత్తిలో వాళ్ళు గొప్పవాళ్ళు ఇక్కడున్న వాళ్ళందరూ. మనలాంటి వాళ్ళంతా ఒక్కటయితే....ఇంకా ఇలాంటి అనేక విజయాలు సాధించవచ్చు” అన్నాడు ప్రొఫెషనల్ కిల్లర్ రియాజ్‌ఖాన్.

“మనుషుల్ని చంపటం గొప్పతనం కాదు! దేశద్రోహులు సాధించే విజయాలు తాత్కాలికమే” అన్నాడు వాత్సవ.

అతని మాటలకు ముఖం మాడ్చుకున్నాడు రియాజ్‌ఖాన్.

“మనుషుల్ని చంపటం....అందులో ప్రముఖ దేశనాయకుల్ని హత్య చేయటం నువ్వు అనుకుంటున్నంత సులువుకాదు మిస్టర్ వాత్సవా! అదంతా ఒక ప్లాన్ ప్రకారం జరగాలి. అదంతా ఒక ప్రత్యేకమయిన క్రమశిక్షణ కలిగిన నాలాంటి వాడికే సాధ్యం” అన్నాడు రియాజ్‌ఖాన్ గర్వంగా.

“ఇంపాజిబుల్! అన్నిచోట్లా సాగినట్టు నీ ఆటలు ఇక్కడ సాగవు. నీ పాచిక మాదేశంలో పారదు” అన్నాడు వాత్సవ.

“చూస్తావా? నా శక్తిసామర్థ్యాలతో మీ ప్రధానిని ఎలా హత్య చేస్తానో చూస్తావా? చూడదలుచుకుంటే అంతవరకూ నిన్ను ప్రాణాలతో వుంచటానికి మాకెలాంటి అభ్యంతరం లేదు” అన్నాడు రియాజ్‌ఖాన్.

వాత్సవ సమాధానం చెప్పకుండా మౌనం వహించాడు.

“ఎస్....మౌనం అర్థాంగీకారం అంటారు పెద్దలు. మన పని పూర్తి అయ్యేటంతవరకు ఇతన్ని ప్రాణాలతోనే వుంచుదాం...” అంది ఆయేషా బేగం.

మిగతా ఇద్దరూ అంగీకారసూచకంగా తలలు ఆడించారు.

వెంటనే గార్డ్‌లను పిలిచి వాత్సవను బంధించి జాగ్రత్తగా కాపలా కాయమని ఆదేశించింది ఆయేషాబేగం.

దురదృష్టవశాత్తు చివరి క్షణంలో తను పట్టుబడినా శ్యామ్‌సుందర్ ఇంకా పట్టుబడకుండా మిగిలి వున్నందుకు సంతోషించి, గార్డ్‌ల వెంట నడిచాడు వాత్సవ.

అయితే ఎంతోసేపు నిలువలేదు అతని సంతోషం.

రాతిగోడలతో నిర్మించబడి రాజులకాలంనాటి కారాగారంలా వున్న ఒక గదిలోకి అడుగుపెడుతూనే ఆవిరి అయిపోయింది అతని సంతోషం. తనకంటే ముందుగా పట్టుబడి అక్కడ కూర్చున్న శ్యామ్‌సుందర్‌ని చూడగానే విపరీతమయిన నీరసం ముంచుకువచ్చేసింది వాత్సవకి. మనసులోని ఆందోళన అధికం అయింది.

"నేను వెదుకుతూ బయలుదేరినచోట బాంబులు స్టాక్ చేస్తున్న గదులు కనిపించాయి. అందర్నీ వెళ్ళనిచ్చి ఎందుకయినా పనికివస్తాయని సరదాగా రెండు బాంబులను తస్కరించబోయాను. ఆ మాత్రం దానికే కొంపలు మునిగిపోతున్నట్టు నామీద విరుచుకుపడి, నన్ను లాక్కొచ్చి ఇక్కడ పారేశారు. అదిగో...ఆమే నసీమా. నజీర్ భార్య ఆమె... ఆ పక్కన ఆదమరచి నిద్రపోతున్నవాడే ఆమె కొడుకు" అంటూ తనను బంధించిన వైనాన్ని తెలియచేసాడు శ్యామ్‌సుందర్.

ఆ గది కార్నర్‌లో ఒదిగి కూర్చున్న నసీమా వంక చూశాడు వాత్సవ.

అతను తనవైపు చూడగానే వినయంగా నమస్కరించింది నసీమా.

సిగరెట్ వెలిగించి దమ్ములాగుతూ ఆమెనే చూస్తున్న వాత్సవకి ఉన్నట్టుండి గుర్తువచ్చింది ఒక విషయం. "ఏరి? చాందినీ, బల్బీర్‌సింగ్‌లు ఎక్కడా కనిపించరేం? వాళ్ళు కూడా ఈమెతోపాటే బంధింపబడ్డారు కదా?" అనడిగాడు.

"నిజమే! ముందు ఆ ఇద్దర్నీ కూడా ఈ గదిలోనే బంధించారట. చాందినీ అందచందాలకు మురిసిపోయి బంధించిన అరగంటకే ఆమెను బయటికి పిలిపించుకున్నాడట రియాజ్‌ఖాన్. ఆమెతోపాటే ఆమె బాడీగార్డ్ అయిన బల్బీర్‌కి కూడా స్వేచ్ఛనిచ్చి తన దగ్గిర పనిలో పెట్టుకున్నాడట" అని చెప్పాడు శ్యామ్‌సుందర్.

చిన్నగా తలవూపి సిగరెట్ కాల్చుకోవటంలో మునిగిపోయాడు వాత్సవ.

అయినా అతన్ని వదలకుండా వెంటాడుతూనే వున్నాయి ఆలోచనలు. తప్పించుకునే ఉపాయాన్ని కనుగొనమని అదేపనిగా సతాయిస్తున్నాయి.

ఆ గదిలోకి నెట్టకముందే అతని దగ్గిర వున్న చిన్నచిన్న ఆయుధాలన్నీ స్వాధీనం చేసుకున్నారు గార్డ్‌లు. సిగరెట్ పాకెట్ మాత్రం వదిలేశారు. దానివల్ల ఏమిటి ఉపయోగం?

"తప్పించుకోటానికి అంతా సిద్ధంచేసి వుంచాను! నువ్వేమీ బుర్ర చించుకుని ఆలోచించాల్సిన అవసరం లేదు."

ఆలోచననుండి బయటపడుతూ ఆ మాటలు అన్న శ్యామ్‌సుందర్ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు వాత్సవ.

సమాధానం చెప్పకుండా చిరునవ్వు నవ్వుతూ పాంటు బెల్టు వెనుక భాగం నుండి ఇండియన్‌బ్రాండ్ అగ్గిపెట్టెను ఒకదాన్ని బయటికితీసి అతని ముందుంచాడు శ్యామ్‌సుందర్.

దానిని చూస్తూనే వింతగా మెరిశాయి వాత్సవ కనులు.

"వాళ్ళు నన్ను చెక్ చేసినపుడు పైకెత్తేసిన నా చేతులలోని ఒక చేతిలో వుంది ఈ అగ్గిపెట్టె. ఆ విషయం తెలీక క్రికెట్ బాల్స్ రూపంలో వున్న రెండు బాంబులను నా నుండి స్వాధీనం చేసుకున్నారు వాళ్ళు. వెలిగించమంటావా ఈ అగ్గిపెట్టెని?" అనడిగాడు నవ్వుతూ.

తల అడ్డంగా త్రిప్పాడు వాత్సవ. పూర్తి అయిన సిగరెట్‌ను అవతలికి విసిరి ఇంకొక సిగరెట్ వెలిగించుకుని గోడకు జారబడి కళ్ళు మూసుకున్నాడు.

అతని ప్రవర్తనకు ఆశ్చర్యపడకుండా వుండలేకపోయాడు శ్యామ్‌సుందర్.

తప్పించుకునే అవకాశం చేతిలో వున్నా అతడెందుకంత నిరాసక్తత ప్రదర్శిస్తున్నాడో అర్థంకాలేదు అతనికి. ఇలాంటి సమయంలో తనకంటే ముందుండే వాత్సవ. ....ఇప్పుడు ఎందుకు జాప్యం చేస్తున్నాడో తెలియలేదు.

కారణం లేకుండా అతను ఏ పనీ చేయడని తెలిసినవాడు కావటం వల్ల మరోసారి రిపీట్ చేయలేదు తన మాటల్ని. అతనికి మౌనభంగం కలిగించలేదు.

అయినా...నిముషాలు గడుస్తున్న కొద్దీ వాత్సవ మౌనం భరించలేనిదిగా తయారయింది శ్యామ్‌సుందర్‌కి. టెన్షన్ పెరిగిపోవటం ప్రారంభించింది.

సరిగ్గా గంటన్నర తరువాత పైనుండి వినిపించాయి హెలికాప్టర్స్ ఎగురుతున్న శబ్దాలు. అదే సమయంలో గొంతు విప్పింది స్థావరంలోని డేంజర్ అలారం.

అప్పుడు చటుక్కున కళ్ళు తెరిచాడు వాత్సవ. "మనం బయటపడే సమయం వచ్చేసింది శ్యామ్‌సుందర్! దుష్టత్రయం మన నుంచి దూరం కాకముందే అడ్డుకోవాలి...అగ్గిపెట్టె వెలిగించు" అంటూ లేచి నిలుచున్నాడు.

ఉన్నచోటునుండి కదలకుండా గట్టిగా చెవులు మూసుకుని...కొడుకును తన వెనక దాచుకోమని నసీమాకి సైగలుచేస్తూ అగ్గిపెట్టె బాంబును బయటికి తీశాడు శ్యామ్‌సుందర్. ఓ కార్నర్‌లో వున్న సేఫ్టీపిన్‌ను వూడలాగి, అగ్గిపెట్టెను ద్వారంలో పడేలా విసిరి తను మరో కార్నర్‌కి జంప్ చేశాడు.

గిరగిరా తిరుగుతూపోయి ద్వారం దగ్గిర పడింది అగ్గిపెట్టె బాంబు. పడుతూనే చెవులుచిల్లులు పడేట్టు శబ్దాన్ని వెలువరిస్తూ బ్రద్దలయింది.

తుక్కుతుక్కు అయిపోయింది గది ఎంట్రన్స్‌ను కవర్‌చేస్తున్న ఆ ఇనుపడోర్. బాంబు ప్రేలుడికి వంకర్లుపోయి విరిగి అవతల పడింది.

ఆ వెంటనే బయటికి దూకి దుష్టత్రయాన్ని వెదుకుతూ బయలుదేరాడు వాత్సవ. కొడుకును గుండెలకు అదిమిపెట్టుకున్న నసీమా చేయి పుచ్చుకుని అతన్ని అనుసరించాడు శ్యామ్‌సుందర్.

అప్పటికే స్పెషల్ ఫోర్స్ వాహనాలు స్థావరాన్ని చుట్టుముట్టాయి. తూనీగల్లా భవంతి చుట్టూ ఎగురుతున్న హెలికాప్టర్లలోంచి ప్యారాచ్యూట్ ద్వారా క్రిందికి దిగసాగాయి స్పెషల్‌ఫోర్స్‌కి చెందిన అదనపు బలగాలు.

గందరగోళంగా పరుగులు తీస్తున్న గార్డుల బూట్ల శబ్దాలతో, స్పెషల్ ఫోర్స్‌వాళ్ళు ఉపయోగిస్తున్న ఆయుధాల ప్రేలుళ్ళతో దద్దరిల్లిపోయింది ఆ

పురాతన కట్టడం. అరుపులు, ఆర్తనాదాలు మిన్నుముట్టసాగాయి.

రెండో అంతస్థులోని ఒక కారిడార్‌లోకి అడుగుపెడుతూనే ఎదురయినారు వాత్సవకి పలాయనమంత్రం పఠించటానికి సిద్ధంగా వున్న రియాజ్ ఖాన్, సమీరుద్దీన్‌లు. వాత్సవను చూడగానే పట్టరాని ఉక్రోషంతో పళ్ళు పటపట కొరుకుతూ అతనిమీద విరుచుకుపడ్డారు.

నసీమాను ఒక గదిలో వదిలి, వాత్సవతోపాటు వాళ్ళను ఎదుర్కొన్నాడు శ్యామ్‌సుందర్.

సమవుజ్జీలుగా పోరాడుతున్న ఆ నలుగురూ విపరీతమయిన అలసటకు గురయి, వారిపోరాటం అంతిమ దశకు చేరుకుంటుండగా యిద్దరు స్పెషల్‌ఫోర్స్ కమాండర్‌లతో రంగప్రవేశం చేశాడు హబీబ్. పదిమంది స్పెషల్‌ఫోర్స్ గార్డులు శక్తివంతమయిన ఆయుధాలతో చుట్టుముట్టడంతో లొంగిపోక తప్పలేదు రియాజ్‌ఖాన్, సమీరుద్దీన్‌లకి.

అక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చిన తరువాత ఆ పురాతన కట్టడం అంతటా చాందినీ, బల్బీర్‌ల కోసం వెదికి నిరాశగా ముఖం వ్రేలాడేసుకుని వాత్సవ దగ్గిరికి తిరిగి వచ్చాడు శ్యామ్‌సుందర్.

"ఆయేషాబేగం తెలివిగా ఎస్కేప్ అయిందట వాత్సవా! ప్రాణభయంతో బల్బీర్‌ని వెంటబెట్టుకుని పారిపోయిందట" అని చెప్పాడు.

మౌనంగా తలాడించటం తప్ప ఎలాంటి సమాధానం చెప్పలేదు వాత్సవ.

రియాజ్‌ఖాన్, సమీరుద్దీన్‌లు పట్టుబడినా... ఆయేషాబేగం తప్పించుకు పోవటంతో ఆపరేషన్ టు ఇన్ వన్ పూర్తిగా ఫెయిలయిందని అనుకోలేక పోయాడు వాత్సవ. జైశల్మీర్ సిటీనుంచి వెలుపలికి వెళ్ళేందుకు వీలున్న అన్ని మార్గాలను దిగ్బంధనం చేయించి, సిటీలోని ఖరీదయిన హోటళ్ళను, సాధారణమైన లాడ్జిలను స్పెషల్‌ఫోర్స్ గార్డులతో నగరమంతా గాలించటం ప్రారంభించాడు.

మరోపక్క పోలీస్ డిపార్టుమెంట్‌ని ఎలర్ట్‌చేసి, ఆయేషాబేగం కోసం వలలు విసరసాగాడు. వెదకటం ప్రారంభించిన రెండోరోజున ఒక మారుమూల

లాడ్జిలో కనిపించాడు విషప్రయోగం చేయబడి, చావుబ్రతుకుల మధ్య కొట్టు కొంటున్న మహాబలుడు బల్బీర్‌సింగ్.

తన చావుకి కారకురాలు చాందినీ అని అతను చెప్పింది వింటూనే హతాశుడయ్యాడు శ్యామ్‌సుందర్. ఆ మాట చెప్పి తుది శ్వాస విడిచాడు బల్బీర్.

"నాకంతా అయోమయంగా వుంది వాత్సవా. ఎంతో అభిమానించే చాందినీయే యితన్ని చంపడమేమిటి?" అనడిగాడు బాధగా.

"ఆమె ఆయేషాబేగం కాకుండా చాందినీ అయివుంటే నువ్వు ఈ ప్రశ్న అడగాల్సి వచ్చేది కాదేమో?" అన్నాడు వాత్సవ.

అతని మాటలకు మరింత షాక్‌కి గురయ్యాడు శ్యామ్‌సుందర్.


అంతలో వాత్సవ కోటు జేబులో వున్న సెల్‌ఫోన్ మ్రోగింది.

ఫోన్‌లో రెండునిముషాలు ఎవరితోనో మాట్లాడి శ్యామ్‌సుందర్ వైపు తిరిగాడు వాత్సవ.

చాందినీయే ఆయేషాబేగం అని నాకు ముందే తెలుసు. ఈ విషయం హబీబ్‌తో చెప్పాను. మారువేషంలో ఢిల్లీకి వెళ్ళే ట్రైన్ ఎక్కుతూ యింతకుముందే పట్టుబడిందట ఆయేషా. తన బండారం బయటపడేసరికి పాయిజన్ పిల్స్‌ని మింగి ఆత్మహత్య చేసుకుందట. హబీబ్ ఫోన్‌లో చెప్పాడు ఆ విషయాన్ని" అంటూ సెల్‌ఫోన్ కోటుజేబులో పెట్టుకుని లాడ్జిలోంచి బయటికి నడిచాడు.

బాధతో గుండె బరువెక్కుతుండగా భారంగా నిట్టూరుస్తూ అతన్ని అనుసరించాడు శ్యామ్‌సుందర్.

-: శుభం :-


TWO IN ONE
A NOVEL BY
MADHU BAABU
Ph : 2438659
సత్యవాణి పబ్లికేషన్స్
మాచవరం, విజయవాడ-4